మహాత్మా! సర్వేశ్వరుడవైన నీ మాయ జగత్తును పూర్తిగా కప్పివేయును కాని నిన్నుమాత్రము అది తాకజాలదు. అది నీ అధీనములో ఉండునది. నీ తనుశోభలు మంగళకరములు. సర్వదా నీవు యోగీశ్వరులను రక్షించుచుందువు. మహాతపోధనులకు నీవు ప్రభుడవు. నా తాపములు అన్నియును అంతరించునట్లుగా నీ పాదములకడ మోకరిల్లుచున్నాను.

చ. ఎఱుఁగడు వీఁడు నా భటుఁడొకించుకయైన మనంబులోపలం
దెఱకువలేక నీ జనకుఁ దెచ్చె దయం గొనిపొమ్ము ద్రోహమున్
మఱవుము నన్ను నీ భటుని మన్నన సేయుము నీదుసైరణన్
వఱలుదు గాదె యో జనకవత్సల! నిర్మల! భక్తవత్సలా! 958

పరమభక్తులపై నీకుగల వాత్సల్యము సాటిలేనిది. నీ పితృభక్తి నిరుపమానమైనది. నా సేవకుడైన ఇతడు మూర్ఖుడు. ఏ మాత్రమూ వివేకము లేనివాడై మీ తండ్రిని ఇచటికి తీసికొనివచ్చెను. దయతో మా అపరాధములను మన్నించుచు, ఈ మహాత్ముని తీసికొనిపొమ్ము. నేను నీ సేవకుడను, కనికరింపుము. నన్ను క్షమింపుము. నీ అనుగ్రహమువలనే నేను హాయిగా బ్రతుకుదును".

వ. అని యిట్లు పలుకుచున్న వరుణునిం గరుణించి, తండ్రిం దోడ్కొని, హరి తిరిగి వచ్చె. నంత నందుండు తన్ను వెన్నుండు వరుణనగరంబుననుండి విడిపించి తెచ్చిన వృత్తాంతంబంతయు బంధువులకెఱింగించిన, వారలు కృష్ణుండీశ్వరుండని తలంచిరఖిలదర్శనుండయిన యీశ్వరుండును వారల తలంపెఱింగి, వారి కోరిక సఫలంబు సేయుదునని వారి నందఱ బ్రహ్మహ్రదంబున ముంచి యెత్తె. 959

వరుణునివిన్నపములను ఆలకించి, అతనిని కరుణించి, శ్రీహరి తన తండ్రిని (నందుని) తోడ్కొని, బృందావనమునకు చేరెను. శ్రీకృష్ణుడు తనను వరుణలోకమునుండి తీసికొనివచ్చిన విషయమును నందగోపుడు తన బంధువులకు సవిస్తరముగా తెలిపెను. వారు 'శ్రీకృష్ణుడు సాక్షాత్తుగా పరమేశ్వరుడే' అని తలపోసిరి. అంతట సర్వజ్ఞుడైన ఆ ప్రభువు వారితలంపులను ఎఱింగి, 'వారికోరికలను సఫలమొనర్చెదను' అనుచు వారిని 'బ్రహ్మకుండము' నందు (యమునానది యందలి 'బ్రహ్మహ్రదము' అను మడుగులో) ముంచియెత్తెను.

ఆ. ప్రకృతి కామకర్మ పరవశమై యుచ్చనీచగతులఁ బొంది నెఱయ భ్రమసి
తిరుగుచున్న జనము తెలియనేరదు నిజ గతివిశేషమీజగంబునందు. 960

'ఈ జగత్తునందలి జనులు ప్రకృతిసంబంధములైన పెక్కు కోరికలతో కొట్టుమిట్టాడుచు, వాటిని సాధించుకొనుటకై వివిధములగు కర్మలలో మునిగి తేలుచున్నారు. తత్ఫలితముగా వారు దేవమనుష్యాది ఉత్తమజన్మలను, పశుపక్ష్యాది నీచజన్మలను పొందుచున్నారు. 'భార్యాపుత్రులతో గూడిన సంసారమేనిత్యము' అను భ్రమలో పడి నా (పరమేశ్వరుని) యొక్క ఉనికిని గూర్చి తెలియకున్నారు.

మ. అని చింతించి దయాళుఁడైన హరి మాయాదూరమై జ్యోతియై
యనిరూప్యంబయి సత్యమై యెఱుకయై యానందమై బ్రహ్మమై
యనఘాత్మల్ గుణనాశమందుఁగను నిత్యాత్మీయలోకంబు గ్ర
క్కునఁ జూపెం గరుణార్ద్ర చిత్తుఁడగుచున్ గోపాలకశ్రేణికిన్. 961

వ. ఇట్లు హరి మున్నక్రూరుండు పొందినలోకమంతయుం జూపి, బ్రహ్మలోకంబునుం జూపినం జూచి, నందాదులు పరమానందంబునం బొంది, వెఱఁగు పడి, హంసస్వరూపకుండైన కృష్ణునిం బొడగని, పొగడి,పూజించిరంత. 962

అని భావించి, దయాళువైన శ్రీహరి గోపాలురు మొదలగువారందఱిపై కనికరముచూపి, నిత్యమైన తన బ్రహ్మలోకమును (తన వైకుంఠధామమును) వారికి ప్రత్యక్షమొనర్చెను. ఆ లోకము మాయకు అతీతమైనది. జ్యోతిస్స్వరూపమున వెలుగొందుచుండునట్టిది'. అది ఇట్టిది' అని నిర్ధారణగా వివరించుటకు సాధ్యముకానిది, అది జ్ఞానస్వరూపము, సత్యము, ఆనందధామము, దేశకాలవస్తువులకు విభజింపరానిదై, సర్వపరిపూర్ణమైనది. త్రిగుణాతీతులైన పుణ్యాత్ములు మాత్రమే దానిని దర్శింపగలరు. శ్రీకృష్ణునిఅనుగ్రహమున మునుపు అక్రూరుడు ధ్యానమగ్నుడై దర్శించిన బ్రహ్మలోకమును గోపాలాదులును పూర్తిగాగాంచి, పరమానందమును పొందిరి. అంతట వారు ఆశ్చర్యమునకు లోనై హంస (పరమాత్మ) స్వరూపుడైన ఆ ప్రభువును ప్రస్తుతించి పూజించిరి.

చ. కలువలమేలి కందువలు కాముని కయ్యపుఁ బాళెముల్ వియో
గులఁ దలకించు వేళలు చకోరకపంక్తులభోగకాలముల్
చెలువలు పైరణల్ విడిచి చిక్కుతఱుల్ ఘన చంద్ర చంద్రికా
జ్వలితదిశల్ శరన్నిశలు జారకదుర్దశలయ్యెనయ్యెడన్. 963

అంత శరత్కాలరాత్రులు ప్రారంభమాయెను. ఆ రాత్రులయందు కలువలు చక్కగా వికసించి శోభిల్లుచుండును. అవి ప్రణయకలహములకు అనువైనవి, ఆ సమయములందు విరహావస్థలో ఉన్నవారు మిగుల చలించిపోవుచుందురు. చకోరములజంటలు సుఖించెడి కాలములవి. యువతులు ఓపికలు పట్టలేక తమ ప్రియులను చేరు వేళలు, చంద్రుని వెన్నెలతో ఆహ్లాదము గొలిపెడి ఆ రాత్రులు జారులపాలిటి దుర్దశలయ్యెను.

ఆ. కామతంత్రటీక కలువలజోక కందర్పుడాక విటులతాల్మిపోక
చకితచక్రవాక సంప్రీతజనలోక రాక వచ్చె మేలు రాక యగుచు. 964

ఇంతలో నిండుచంద్రునివెన్నెలతోగూడిన పున్నమిరాత్రి ప్రారంభమాయెను. అది కామశాస్త్రపులోతులను వివరించును, కలువలకు సంబరమును కలిగించును, మన్మథునిపరాక్రమమును విజృంభింపజేయును. విటుల ఓర్మిని జార్చివేయును, చక్రవాకముయొక్క ఎదుట చక్రవాకికి (ఆడు చక్రవాకమునకు) భయమును, తొట్రుపాటును కలిగించును. సకల జనులలో ఆనందోత్సాహములను నింపును.

క. పతి తనకరములఁ గుంకుమ, సతి మొగమున నలఁదుభంగి సముదయ వేళాం
చిత కరరాగమున నిశా, పతి రంజించెన్ నరేంద్ర! ప్రాక్సతిమొగమున్. 965

పరీక్షిన్మహారాజా! భర్త తనభార్యముఖమునందు తన చేతులమీదుగా (స్వయముగా) కుంకుమబొట్టును దిద్దునట్లు, చంద్రుడు తాను ఉదయించువేళ తూర్పుదిశయనెడి ముద్దరాలిమొగమును చక్కని తన అరుణకిరణములతో (కరములతో) రంజింపజేసెను.

సీ. విటసేనపై దండు వెడలెడు వలతేని గొల్లెనపై హేమకుంభమనఁగఁ
గాముకధృతివల్లికలు ద్రెంప నెత్తిన శంబరాంతకుచేతి చక్రమనఁగ
మారుండు పాంథులమానాటవులు గాల్పఁ గూర్చిన నిప్పులకుప్ప యనఁగ
విరహిమృగమ్ముల వేఁటాడ మదనుండు తెచ్చిన మోహంపు దీమమనఁగ
ఆ. వింతనునుపు గల్గి వృత్తమై యరుణమై కాంతితోఁ జకోరగణము లుబ్బఁ
బొడుపుఁ గొండ చక్కిఁ బొడిచె రాకాచంద్ర మండలంబు గగనమండలమున. 966

అంతట పున్నమినాటి చంద్రమండలము (చంద్రుడు) తన కాంతివలయమునకు చకోరములు ఎంతయు సంబరపడునట్లుగా తూరుపుకొండపై ఆకాశమండలమున ఉదయించెను. ఆ చంద్రమండలము విటులనెడి సేనపై దండెత్తుటకు సిద్ధముగానున్న మన్మథునియొక్క గుడారముపై విలసిల్లుచున్న నున్నని బంగారుకలశమా అనునట్లు వింతగొలుపుచుండెను, అది కామాతురులధైర్యమనెడి తీగలను త్రెంచివేయుటకై మీదికెత్తిన మన్మథుని చేతియందలి గుండ్రని చక్రమా అనురీతి భాసిల్లుచుండెను, మదనుడు విరహావస్థలోనున్న బాటసారులయొక్క అభిమానములనెడి అడవులను కాల్చివేయుటకై ఏర్పఱచిన ఎఱ్ఱని నిప్పులకుప్పయా అనుభంగి కన్పట్టుచుండెను, విరహాతురులనెడి మృగములను మోసముతో వేటాడుటకై మన్మథుడు తీసికొని వచ్చియుంచిన కాంతిమంతమగు ఎఱతోగూడిన బోను అనునట్లుగా అలరారుచుండెను.

## శరద్రాత్రియందు గానమొనర్చుచున్న కృష్ణునియొక్క సన్నిధికి గోపికలువచ్చుట

వ. ఇట్లు పొడిచి నవకుంకుమాంకిత రమాముఖమండలంబునుం బోలె నఖండంబైన చంద్రమండలంబుం బొడగని, పుండరీకనయనుండు యమునాతటవనంబున జగన్మోహనంబుగ నొక్క గీతంబుఁ బాడిన, విని పరాయత్తచిత్తలై, తత్తఱంబున వ్రేతలేపములకుం జేతులాడకయు, గోవులకుం గ్రేపుల విడువకయు, విడిచి విడిచియీడకయు, నీడి యీడియు నీడినపాలు కాఁపకయుఁ, గాఁచి కాఁచియుఁ గాఁగినపాలు డింపకయు, డించిడించియు డించినపాలు బాలురకుం బోయకయుఁ, బోసి పోసియుఁ బతులకుఁ బరిచర్యలు సేయకయుఁ, జేసి చేసియు నశనంబులు గుడవకయుఁ, గుడిచి కుడిచియుఁ గుసుమంబులు ముడువకయు, ముడిచి ముడిచియుఁ, దొడవులు దొడుగకయుఁ, దొడిగి తొడిగియు గోష్ఠంబులపట్టుల నుండకయుఁ, బాయసంబు నెఱయ వండకయు, నయ్యై యెడల నిలువంబడకయుఁ, గాటుకలు సూటినిడకయుఁ, గురులు సక్కనొత్తకయుఁ, గుచంబుల గంధంబులు గలయ మెత్తకయుఁ, బయ్యెదలు విప్పి కప్పకయు, సఖులకుం జెప్పకయు, సహోదరులు, మగలు, మామలు, మఱందులు, బిడ్డలు, నడ్డంబుచని, నివారింపం దలారింపకయు, సంచలించి, పంచభల్లనిభల్లంబుల మొల్లంపుజల్లుల పెల్లునం దల్లడిల్లి, డిల్లపడి, మొగిళ్ళగమి వెలువడి యుల్లసిల్లు తటిల్లతలపొందున మందగమనలమందగమనంబుల మంద వెలువడి, గోవింద సందర్శనంబునకుం జనిరప్పుడు. 967

ఇట్లు చంద్రుడు ఉదయించిన పిమ్మట అందమైన కుంకుమబొట్టుతో అలంకృతమైన లక్ష్మీదేవి ముఖమండలమువలె శోభిల్లుచు నిండుగానున్న చంద్రమండలమును శ్రీకృష్ణుడు దర్శించెను. పిదప ఆ స్వామి యమునానదీతీరమున గల వనంబునందు జగన్మోహనంబుగా మురళీగానము చేయుచుండెను. ఆ మధురగానము చెవులబడినంతనే గోపికలు పరవశించిపోయినవారై తత్తరపాటుతో త్వరత్వరగా గోవిందుని దర్శించుటకై బయలుదేరిరి. అప్పటి ఆ గోపవనితలతీరు అద్భుతముగా ఉండెను. ఆ గానము చెవి సోకినంతనే ఆ పారవశ్యములో వారికి ఏమి చేయుటకును తోచకుండెను. గోవులకడ పాలు త్రాగుటకై దూడలను విడిచిపెట్టుట మఱచిరి. ఒకవేళ విడిచినవారు పాలు పిండుట విస్మరించిరి. పితికినవారు వాటిని కాచుట మఱచిరి, కాచినవారు ఆ పాలను క్రిందికి దింపకుండిరి. దించినవారు వాటిని పిల్లలకు పోయుట విస్మరించిరి. పిల్లలచే పాలు త్రాగించినవారికి తమ భర్తల పరిచర్యలమాటయే పట్టకుండెను. పతి సేవలొనర్చినవారికి తమ భోజనవిషయమే గుర్తునకు రాకుండెను. భుజించినవారు తమ తలలపై పూవులను ధరించుట మఱచిరి. పూవులను ముడిచినవారికి నగలసంగతి స్మృతికి రాకుండెను. సొమ్ములను ధరించినవారు ఆవులకొట్టములకడకు చేరకుండిరి.

గోపికలు పాయసములను చక్కగా వండకుండిరి. వండినచోట్ల నిలువకుండిరి. కాటుకలను దిద్దుకొనుట, కురులు సవరించుకొనుట, వక్షస్థలములయందు బాగుగా సుగంధములను అద్దుకొనుట, పమిటెలను సరిగా సర్దుకొనుట, సఖులకు

చెప్పుట మొదలగు పనులను చేయకుండిరి. సోదరులు, భర్తలు, మామలు, మఱదులు, పిల్లలు అడ్డమువచ్చి వారించినను వెనుదిరగకుండిరి. వారు మన్మథునిబాణపరంపరలకు తల్లడిల్లుచు, మేఘములమధ్యనుండి వెలువడు మెఱపుతీగెలరీతిగా, త్వరత్వరగా ఆ గొల్లపల్లెనుండి బయటపడి ఆ మురళీకృష్ణుని దర్శనమునకు ముందునకు సాగిరి.

మ. తరుణుల్ కొందఱు మూలగేహముల నడ్డండించి రా రాక త
ద్విరహోగ్నిం బరితాపమొందుచు మనోవీథిన్ విభున్ మాధవుం
బరిరంభంబులు సేసి జారుఁడనుచున్ భావించియుం జొక్కి పొం
దిరి ముక్తిన్ గుణదేహమున్ విడిచి ప్రీతిన్ బంధనిర్ముక్తలై 968

కొందఱు తరుణీమణులు తమ ఇండ్లలో నుండి బయటపడుటకు ధైర్యము చాలక అందే ఉండిపోయిరి. వారు కృష్ణునిసైగల మరులతో పరితపించుచు, శ్రీకృష్ణుని తమ భర్తగా తలపోయుచు మనస్సుల లోపలనే ఆయనను కౌగిలించుకొని, హాయిని పొందిరి. వారు ఆయనను జారునిగా భావించుచునే కౌగిలిసుఖములలో సొక్కియు గుణదేహములస్మృతులులేక సంసారబంధములను వీడి ముక్తిని పొందిరి.

వ. అనిన నరేంద్రుండిట్లనియె. 969

క. జారుఁడని కాని కృష్ణుడు, భూరి పరబ్రహ్మమనియు బుద్ధిఁ దలంపన్
నేరరు గుణమయదేహము, లే రీతిన్ విడిచిరింతులెఱిఁగింపు శుకా! 970

అంతట ఆ మహారాజు శుకయోగిని ఇట్లడిగెను. "మహర్షీ! గోపికలు శ్రీకృష్ణుని దివ్యపరబ్రహ్మముగా (పరమాత్మనుగా) ఎఱుంగక, జారుడు అనియే తలంచిరి గదా! అట్టి స్థితిలో వారికి త్రిగుణాత్మకములైన ఈ దేహములస్మృతి ఎట్లు లేకుండెను? వారు ముక్తిని ఎట్లు పొందిరి?

వ. అనిన శుకుండిట్లనియె. 971

మ. మును నేఁ జెప్పితిఁ జక్రికిం బగతుఁడై మూఢుండు చైద్యుండు పెం
పునఁ గైవల్యపదంబు నొందెఁ బ్రియులై పొందంగ రాకున్న దే
యునఘుండవ్యయుఁ డప్రమేయుఁ డగుణుండైనట్టి గోవిందుమూ
ర్తి నరశ్రేణికి ముక్తి దాయిని సుమీ తెల్లంబు భూవల్లభా! 972

అంతట శుకయోగి ఆ రాజుతో ఇట్లు నుడివెను. "మహారాజా! ఈ విషయమును గూర్చి ఇంతకుపూర్వమే నేను నీకు తెలిపియుంటిని. మూఢుడైన శిశుపాలుడు శ్రీకృష్ణునియెడ శత్రుత్వము వహించియు, ఆ స్వామి అనుగ్రహమువలన మోక్షమును పొందెను. ఆ ప్రభువు పవిత్రాత్ముడు (పరమాత్ముడు), శాశ్వతుడు, ఊహలకు అందనివాడు, త్రిగుణములకు అతీతుడు, అట్టి శ్రీకృష్ణుడు మానవులకు (సకల ప్రాణులకును) అన్నివిధములుగా మోక్షమును ప్రసాదించును. ఇది ముమ్మాటికిని నిజము. ఆ స్వామి అనుగ్రహమునకు పాత్రులైనవారు పొందరానిదే యుండదు.

ఆ. బాంధవమున నైనఁబగనైన వగనైనఁ బ్రీతినైనఁ బ్రాణభీతినయిన
భక్తినైన హరికిఁ బరతంత్రులై యుండు జనులు మోక్షమునకుఁ జనుదురధిప! 973

రాజా! బంధుత్వముతోగాని, వైరభావముతోగాని, విచారముతోనైనను, ప్రేమతోనైనను, ప్రాణభయముతోనైనను, భక్తిపూర్వకముగనైనను శ్రీహరిని స్మరించినవారు తప్పక మోక్షమును పొందుదురు.

వ. అటు గావునఁ బరమపురుషుండును నజుండును యోగీశ్వరుండునునైన హరిని సోఁకిన స్థావరంబయిన ముక్తం బగు, వెఱఁగుపడ వలవదివ్విధంబున 974

క. ఘనమధురగీతనినదము, విని వచ్చిన గోపికలను వీక్షించి నయం
బున మేటి సుగుణి నేర్పరి, తన వాగ్వైభవము మెఱయఁదగ నిట్లనియెన్. 975

పరమాత్ముని అనుగ్రహప్రభావము అట్టిది. ఆ శ్రీహరి పురుషోత్తముడు, జన్మరహితుడు, పరమయోగులకును ప్రభువు. ఆ స్వామిపాదస్పర్శ కలగినంతనే చెట్లు చేమలు మొదలగు స్థావరములు సైతము ముక్తిని పొందును. ఇందులకు ఏమాత్రమూ ఆశ్చర్యపడరాదు. ఈ విధముగా దివ్యము, మధురము ఐన ఆ మురళీనాదమును విని, తన కడకు వచ్చిన గోపికలపై శ్రీకృష్ణుడు తన చల్లని చూపులను ప్రసరింపజేసెను. ఆ ప్రభువు సర్వశ్రేష్ఠుడు, ఉదారగుణము (ఔదార్యము) గలవాడు, చక్కని నేర్పుగలవాడు. అట్టి ఆ స్వామి తన చాతుర్యమును ప్రకటించుచు గోపికలతో మృదువుగా ఇట్లనెను.

శా. మేలా మీకు భయంబు పుట్టదుగదా మీ మందకున్ సింహ శా
ర్దూలానేకప ముఖ్యముల్ దిరిగెడిన్ దూరంబులేతెంతురే
యేలా వచ్చితిరీనిశాసమయమందిచ్చోట వర్తింతురే
చాలుం జాలు లతాంగులార! చనుఁడీ సంప్రీతితో మందకున్. 976

"వనితలారా! మీ అందటికిని కుశలమేగదా! మీ గొల్లపల్లెకు ఎట్టిభయమూ, బాధలును కలుగుటలేదుగదా! సింహములు, పెద్దపులులు, ఏనుగులు మొదలగు భయంకర జంతువులు తిరుగుచుండెడి ఈ సమయమున మీరు ఇంతదూరము రావచ్చునా? ఇంతటి రాత్రివేళ ఇచటికి వచ్చుటకు కారణమేమి? ఇట్టి ప్రదేశమున సంచరింపదగునా? ఐనదేమో ఐనది. ఇంక మీరు హాయిగా మీ నివాసములకు మఱలిపొండు.

శా. మీరేతెంచిన జాడఁ గానక వగన్ మీ తల్లులుం దండ్రులున్
మీరాముల్ మఱఁదుల్ తనూజులు గురుల్ మీ సోదరుల్ బంధువుల్
మేరల్ మీఱిరి లేరు పోయిరనుచున్ మీ ఘోషభూభాగమం
దేరీతిం బరికించిరో తగవులే యీ సాహసోద్యోగముల్. 977

మీరు ఇచటికి వచ్చినట్లు తెలియక మీ తల్లిదండ్రులును, భర్తలును, మఱదులును, కుమారులును, పెద్దవారును, తోబుట్టువులును, బంధువులును విచారపడుచుందురు. 'వీరు అందఱును హద్దు, అదుపు లేక స్వతంత్రించి ఇండ్లనుండి వెళ్ళిపోయిరి' అనుచు వారు అందఱును గొల్లపల్లెలో అంతటను మీకొఱకై ఎట్లు వెదకుచున్నారో! ఏమో? ఇట్లు సాహసకృత్యములకు దిగుట మీకు తగునా?

చ. ఇలువడి సున్నసేసి హృదయేశులసిగ్గులువుచ్చి యత్తమా
మలనెరియించి సోదరులమానము సూఱలు వుచ్చి తల్లిదం
డ్రులఱుచి మాన్చి బంధులకు రోఁతయొనర్చుచు జారవాంఛలన్
వలనటే సత్కులాంగనలు వత్తురె లోకులు సూచి మెత్తురే. 978

సత్కులాంగనలు ఇంటి గౌరవమును మంటగలిపి, మీ భర్తలను సిగ్గులపాలు చేసి, అత్తమామలను బాధపెట్టి, తోబుట్టువుల పరువుదీసి, తల్లిదండ్రులఆశలను వమ్ముగావించి, బంధువులు ఏవగించుకొనునట్లుగా చేసి, జారవాంఛలతో లోకమర్యాదను వీడి, (మీరు) ఇట్లు రాదగునా? ఈ పద్ధతిని నలుగురు (జనులు) మెచ్చుకొనరుగదా!

సీ. ప్రాణేశుఁడెఱిఁగిన బ్రాణంబునకుఁ దెగు దండించు నెఱిఁగిన ధరణివిభుఁడు
మామ యెఱింగిన మనువెల్లఁ జెడిపోవుఁ దలవరి యెఱిఁగినఁ దగులు సేయుఁ
దలిదండ్రులెఱిఁగిన దలలెత్తకుండుదురేరాలెఱింగిన నెత్తిపొడుచు
నాత్మజులెఱిఁగిన నాదరింపరు చూచి బంధువులెఱిఁగిన బహియొనర్తు
ఆ. రితరులెఱిఁగిరేని నెంతయుఁ జుల్కఁగాఁ జూతురిందునందు సుఖము లేదు
యశము లేదు నిర్భయానందమును లేదు జారుఁజేరఁ జనదు చారుముఖికి. 979

గోపికలారా! మీరు ఇట్లు ఇక్కడికి వచ్చినట్లు తెలిసినచో మీ భర్తలు మీ ప్రాణములను తీయుదురు, రాజుగారు దండింతురు. మీ మామలు మండిపడుదురు, సంసారబంధములు తెగిపోవును. తలారివలన చిక్కులు వచ్చును. (తలారి = రాత్రివేళల గస్తీ తిరుగువాడు). తలిదండ్రులు తలలు దించుకొని అవమానముతో క్రుంగిపోదురు. తోడికోడలుదెప్పిపొడుచును. కొడుకులు గౌరవముతో చూడరు. బంధువులు వెలివేయుదురు. ఇతరులందఱును చులకనగా చూతురు. ఇట్టివేళలలో పరపురుషునిజేరిన సుందరికి ఇహపరసుఖములు ఎండమావులు అగును. పేరుప్రతిష్ఠలు దెబ్బతినును. నిర్భయముగా ఆనందించు అవకాశము శూన్యమగును. కనుక తరుణి ఎట్టిపరిస్థితిలోను పరపురుషుని చేరరాదు.

క. నడవడి కొఱగాకున్నను, బడుగైనఁ గురూపి యైనఁ బామరుఁడైనన్
జడుఁడైన రోగి యైనను, విడుచుట మరియాద గాదు విభునంగనకున్. 980

మగని ప్రవర్తన మంచిగాలేకున్నను, అతడు వ్యర్థుడైనను, కురూపియైనను, అజ్ఞానియైనను, మందబుద్ధి ఐనను, రోగగ్రస్తుడైనను, అతనిని విడిచిపెట్టుట భార్యకు ఏ మాత్రమూ తగదు.

చ. ఇది యమునానదీ జలసమేధిత పాదప పల్లవ ప్రసూ
నదళ విరాజితంబగు వనంబు మనంబుల మేరదప్పెనో
పొదిఁగిట నేడ్చు బిడ్డలకుఁ బోయుఁడు పాలు విడుండు లేఁగలన్
మొదవులకున్ నిజేశ్వరుల ముద్దియలార! భజింపుఁడొప్పుగన్. 981

ముదితలారా! ఇది యమునానదీతీరమునందలి వనము. చల్లని జలములు సమృద్ధిగా గలవు. మహావృక్షములు ఏపుగా పెఱిగియున్నవి. అవి చక్కని చిగురుటాకులతో, పూలతో, రేకులతో ఇంపుగొలుపుచున్నవి. మీ మనస్సులు కలతచెందినట్లు కనబడుచున్నవి. (అవి మీ అదుపులో లేనట్లునవి). మీరు మీ ఇండ్లకు వెళ్లి, ఏడ్చుచుండెడి చంటిబిడ్డలకు పాలు త్రాగించుడు, లేగలను ఆవుల (తల్లుల) కడకు విడువుడు. మీ భర్తలకు సేవలొనర్చి వారిని సంతోషపెట్టుడు. దీనివలన మీకు మేలు కలుగును.

చ. వనితలు నన్నుఁగోరి యిట వచ్చితిరింత గొఱంత లేదు మే
లొనరె సమస్త జంతువులు నోలిఁ బ్రియంబులు గావె నాకు నై
నను నిలువంగఁ బోలదు సనాతన ధర్మములాఁడువారికిం
బెనిమిటులన్ భజించుటలు పెద్దలు సెప్పుచునుందురెల్లెడన్. 982

వనితలారా! నా కొఱకై మీరు ఇక్కడికి వచ్చితిరి. మీరు ఇచటికి వచ్చినంత మాత్రమున ఏమియు నష్టముకాదు. మీకు మేలే జరుగును. మీరేగాదు, ఈ లోకమునందలి సకలప్రాణులును నాకు ప్రియమైనవే. ఐనను మీరు ఇక్కడ నిలుచుట (ఉండుట) యుక్తముగాదు. పతులను సేవించుటయే సతులకు పరమధర్మము అని తరతరములుగా పెద్దలు చెప్పుచున్నమాట.

క. ధ్యానాకర్ణన దర్శన, గానంబుల నా తలంపు గలిగినఁ జాలుం
బూనెదరు కృతార్థత్వము, మానవతుల్ చనుఁడు మరలి మందిరములకున్. 983

సాధ్వీమణులారా! నన్ను ధ్యానించుట, నా కథలను వినుట, నన్ను దర్శించుట, నా నామమును కీర్తించుట మున్నగు రీతులలో నాయందు మనస్సును నిలిపిన చాలును. అందువలన మీ జన్మలు ధన్యములగును. కనుక మీరు మీ ఇండ్లకు మరలివెళ్లుడు".

వ. అని పలికిన విని 984

సీ. విరహాగ్నిశిఖలతో వెడలు నిట్టూర్పుల ముమ్మరంబులఁదాఁకి మోము లెండఁ
గన్నుల వెడలెడి కజ్జలధారలు కుచకుంకుమంబుల గ్రొచ్చి పాఱఁ
జెక్కులఁ జేర్చిన చేతుల వేఁడిమి మోముఁదమ్ముల మేలి మురువు డిందఁ
బొరి (బొరిఁ బుంఖానుపుంఖంబులై తాఁకు మదనుకోలల ధైర్యమహిమ సెదర
తే. దుఃఖభరమున మాటలు తొట్రు పడఁగఁ బ్రియములాడని బ్రియుఁజూచి బెగ్గడిల్లి
చరణముల నేల వ్రాయుచు సంభ్రమమునఁ గాంతలెల్లను వగలనాక్రాంత లగుచు. 985

శ్రీకృష్ణుని మాటలను వినిన పిమ్మట ఆ వనితలు తీవ్రమైన వేదనకు గుఱియైరి. విరహాగ్ని జ్వాలల ప్రభావముతో వెలువడుచున్న నిట్టూర్పులవలన వారిముఖములు వెలవెలబోవుచుండెను. (వారి పెదవులు ఎండిపోవుచుండెను) వేదనచే వారియొక్క కాటుకకన్నులనుండి స్రవించుచున్న అశ్రుధారలు వక్షస్థలములపైగల కుంకుమ (పత్ర) రేఖలను చెదరగొట్టుచు సాగిపోవుచుండెను. వారు విచారముతో తమ చేతులను చెక్కిళ్లపై చేర్చగా, ఆ చేతులవేడికి ముఖములయొక్క అందచందములు మాసిపోవుచుండెను. వెంటవెంట వచ్చిపడుచున్న మన్మథునిబాణముల తాకిడికి వారిధైర్యములు సడలిపోవుచుండెను. దుఃఖభారముచే వారి మాటలు తడబడుచుండెను. తమకు ఎంతయు ఇష్టుడైన శ్రీకృష్ణుడు పలికిన అప్రియవచనములకు వారు మిగుల తల్లడిల్లుచుండిరి. అంతట వారు తొట్రుపాటుతో కాలివ్రేళ్లను నేలకు రాయుచు విచారములో మునిగిపోయిరి.

వ. ఇట్లనిరి. 986

మ. అకటా! నమ్మితిమేము క్రూరుఁడన నిన్నర్హంబె మా యిండ్లలో
సకలవ్యాప్తుల డించి నీపదసరోజాతంబులర్చింపఁజొ
క్కక యేతెంచితిమీశుఁడాఢ్యుఁడవు మోక్షాసక్తులం గాచుపో
లికఁగావం దగుఁ గావవే విడువ మేలే కాంతలన్ భ్రాంతలన్. 987

పిమ్మట ఆ గోపకాంతలు శ్రీకృష్ణునితో ఇట్లనిరి. కృష్ణా! అయ్యో! మేము నిన్నే నమ్ముకొని యుంటిమి. నిన్ను క్రూరుడనుట చెల్లదు. మా ఇండ్లలోని పనులనన్నింటిని ప్రక్కనబెట్టి, నీ పాదపద్మములను సేవించుటకై, మాకు అడ్డువచ్చినవారిని తప్పించుకొని వచ్చితిమి. నీవు సర్వేశ్వరుడవు. సర్వసమర్థుడవు. (మహితాత్ముడవు) మోక్షకాంక్ష గలవారిని కాపాడెడి రీతిగా మమ్ములను అనుగ్రహించుము. మేము నీపై భ్రమపెట్టుకొనివచ్చిన ఆడువారము. మమ్ము నిరాదరించుట నీకు తగునా?

మ. పతులన్ బిడ్డల బంధులన్ సతులకుం బాటించుటే ధర్మప
ద్ధతి యౌనంటివి దేహధారిణులకున్ ధర్మజ్ఞ! చింతింపుమా

పతిపుత్రాదిక నామమూర్తి వగుచున్ భాసిల్లు నీ యందుఁద
త్పతి పుత్రాదిక వాంఛలన్ పలిపి సంభావించుటన్యాయమే! 988

ధర్మజ్ఞా! 'భర్తలను, పుత్రులను, బంధువులను ప్రేమతో విచారించుకొనుచు జీవించుచుండుటయే స్త్రీలకు ధర్మము' అని నీవు పలికియుంటివి. అది సరే! లోకమునకు పతివి, పుత్రుడవు, బంధుడవు, గురుడవు - అన్నియు నీవేగదా! అట్టి నీయందు పతిపుత్రాదిక భావములను నెలకొల్పుకొని, ప్రేమతో ఇట్లు నిన్ను చేరుట అధర్మమా?

మత్తకోకిలము. నీపయిన్ రతి సేయుచుందురు నేర్పరుల్ సతత ప్రియో
ద్దీపకుండవు గాన నెవ్వగఁ దెచ్చు నాథ సుతాదులం
జూపనేటికి మన్మహాశలు సుట్టి నీ కడ నుండఁగాఁ
బాప నేల మదీయతాపముఁబాపఁబోలుఁ గృపానిధీ! 989

దయామయా! జ్ఞానులు ఆత్మస్వరూపుడవైన నీ యందే ఆనందించుచుందురు. నీవు నిరంతరము ఎల్లరను ఆనందింపజేయుచుండువాడవు. నీవు చెప్పినరీతిగా 'పతులు, సుతులు మొదలగు వారే సర్వస్వము' అని భావించి వారితోగూడియున్నచో మాకు దుఃఖములే మిగులునుగదా! మా ఆశలనన్నింటిని నీ మీదనే పెట్టుకొని యున్నప్పుడు వాటిని అడియాసలు చేయుచు మమ్ములను పంపివేయుట ఎంతవఱకు సమంజసము? కావున మాపై కృపజూపి, మా సకలతాపములను దూరమొనర్చుము.

సీ. నీ పాదకమలంబు నెమ్మి డగ్గఱ గాని తరలి పోవంగఁ బాదములు రావు
నీ కరాబ్జంబులు నెతి నంటితివఁగానితక్కిన పనికి హస్తములు చొరవు
నీ వాగమృతధార నిండఁ గ్రోలఁగఁ గాని చెవులన్యభాషలఁ జేరి వినవు
నీసుందరాకృతి నియతిఁ జూడగఁగానిచూడవన్యంబులఁ జూడ్కికవలు
ఆ. నిన్నుకాని పలుక నేరవు మా జిహ్వలొల్ల ననుచుఁబలుక నోడవీవు
మా మనంబులెల్ల మఱపించి దొంగిలితేమి సేయువారమింకఁ గృష్ణ! 990

కృష్ణా! భక్తితో నీ పాదపద్మములచెంతకు చేరుటకేగాని, మఱలి వెళ్లుటకు మాకు కాళ్లురావు. నీ కరకమలములను స్పృశించుటకేగాని, ఇతరములగు పనులకు మాకు చేతులాడవు. నీ మధురవచనములను తనివిదీర గ్రోలుటకేగాని, తక్కిన మాటలను వినుటకు మా చెవులు ఒప్పుకొనవు. నీ సౌందర్యమును తృప్తిదీర చూచుటకేగాని ఇతరములను గాంచుటకు మా కన్నులు ఇష్టపడవు. నిన్ను గూర్చి పలుకుటకే (నిన్ను కీర్తించుటకే) మాకు నోరాడునుగాని, ఇతరములైన వాటిని గూర్చి మాట్లాడుటకు మా నాలుకలు ఆసక్తిచూపవు. ఇట్టి మమ్ములను 'చేరదీయను' అని పలుకుటకు వెనుకాడకుంటివి. మా మనస్సులను మోహమున ముంచి దోచుకొంటివి. ఇట్టిస్థితిలో ఇంక మేమేమి చేయగలము?

చ. సిరికినుదారచిహ్నములుసేయు భవచ్చరణారవిందముల్
సరసిజనేత్ర! మా తపము సంపదఁ జేరితిమెట్టకేలకున్
మరలఁగ లేము మా మగలమాటలనొల్లము పద్మగంధముల్
మరగిన తేఁటులన్యకుసుమంబులచెంతను జేరనేర్చునే 991

కమలాక్షా! నీ పాదపద్మములు లోకపావనియైన లక్ష్మీదేవికి శోభలను గూర్చును. అట్టి మహిమాన్వితములైన పాదములను మా తపఃఫలముగా ఎట్టకేలకు చేరగలిగితిమి. నీనుండి మేము తిరిగి వెళ్లజాలము. మా భర్త ఇంక మా పతుల మాటలను వినుటకు మేము ఇష్టపడము. పద్మముల మకరందములను మరగిన తుమ్మెదలు ఇతర పుష్పములజోలికే పోవుగదా!

ఆ. సవతులేక నీవిశాల వక్షస్థలిఁ దులసితోడఁ గూడఁ దోయజాక్షి!
మనుపుమనుచు నెపుడు మాకాంత నీ పాదకమలరజముఁ గోరుఁగాదె కృష్ణ! 992

శ్రీహరీ! (కృష్ణా!) తులసిమాలతోగూడ విలసిల్లెడి నీ విశాలవక్షస్థలమునందు తానును చేరియుండునట్లు కటాక్షింపుమని లక్ష్మీదేవి ఎల్లప్పుడును నీ పాదపద్మముల ధూళిని సేవించుటకు కోరుకొనుచుండును గదా!

ఉ. అత్తలు మామలున్ వగవ నాఱడికోడక నాథులన్ శుగా
యత్తులఁ జేసి యిల్వరుసలాఱడి వోవఁగ నీదునవ్వులన్
మెత్తని మాటలన్ మరుఁడు మేకొని యేఁచిన వచ్చినార మే
పొత్తుల నొల్లమో పురుషభూషణ! దాస్యములిచ్చి కావవే. 993

పురుషోత్తమా! అత్తమామలు నిందించుచున్నను లెక్కచేయక, భర్తలు బాధపడుచున్నను పట్టించుకొనక, ఇంటిగౌరవమునకు భంగము కలుగునని భయపడక ఇచటికి వచ్చితిమి. నీ నవ్వులను, మెత్తని మాటలను బాణములుగా చేసికొని మన్మథుడు మమ్ములను వేధించుచుండగా తాళలేక మేము నీ సన్నిధికి చేరితిమి. ఇంక ఎవరిపొత్తులకును ఇష్టపడము. నీ పాదములసేవించెడి భాగ్యమును అనుగ్రహించి కాపాడుము.

మ. మగువల్ సిక్కరె తొల్లి వల్లభులకున్ మన్నించి తద్వల్లభుల్
మగపంతంబు దలంపరే తగులముల్ మాపాలనే పుట్టెనే
మగవారాడెడు మాటలే తగవు నీ మాటల్ మనోజాగ్నిచేఁ
బొగులం జాలము కౌఁగిలింపుము మముం బుణ్యంబు పుణ్యాత్మకా. 994

పరమాత్మా! పూర్వము కాంతలు తమకు ప్రియమైనవారియెడ మక్కువలు కలిగియుండలేదా? ఆ ప్రియులు వారిని ఆదరించి సంతోషపఱచలేదా? మేము ఇట్లు మరులుగొనుట లోకవిరుద్ధమా? ఇవి పురుషులు పలికెడి మాటలేనా? (పురుషులు ఇట్లు మాట్లాడదగునా?) నీవు ఇట్లు మాట్లాడుట తగదు. మేము ఈ మన్మథతాపమును భరింపజాలము. మాకు నీ ఆలింగనసౌభాగ్యమును ప్రసాదింపుము. నీకు పుణ్యముండును.

ఉ. కుండలదీప్త గండమును గుంచిత కుంతల ఫాలమున్ సుధా
మండిత పల్లవాధరము మంజుల హాసవిలోకనంబునై
యుండెడు నీ ముఖంబుఁ గని యుండగ వచ్చునె మన్మథేక్షుకో
దండ విముక్త బాణముల దాసులమయ్యెద మాదరింపవే. 995

స్వామీ! నీ చెక్కిళ్లు కుండలములకాంతులతో మిఱుమిట్లు గొలుపుచున్నవి. నీ ఫాలభాగము ముంగురుల సొంపులతో ముద్దులొలుకుచున్నది. నీ పెదవులు చిగురుటాకులవలె సుకుమారములైనవి. చిఱునవ్వులతో ఇంపుగానున్న నీ చూపులు మనోజ్ఞముగా ఉన్నవి. ఇట్లు అందములను చిందించుచున్న నీ ముఖారవిందమును గాంచి నిలువగలమా? నిన్ను చూచిన పిమ్మట మేము మన్మథ తాపమునకు లోనై పారవశ్యముతో నిన్ను కోరుకొనుచుంటిమి. కనికరముతో మమ్ము ఆదరింపుము.

సీ. నీ యధరామృత నిర్ఝరంబుల నేఁడు సేరి వాతెఱలపైఁ జిలుకకున్న
నీ విశాలాంచిత నిర్మలవక్షంబుఁ గుచకుట్మలంబులఁ గూర్పకున్న
నీరమ్యతర హస్త నీరజాతంబులు చికురబంధంబులఁ జేర్పకున్న
నీ కృపాలోకననివహంబు మెల్లన నెమ్మొగంబులమీఁద నెఱపకున్న

ఆ. నీ నవీనమాననీయసల్లాపంబు కర్ణరంధ్ర దిశలఁ గప్పకున్న
నెట్లు బ్రదుకువారమెందుఁ జేరెడువారమధిప!వినఁగఁ దగదె యాఁడుకుయులు 996

మనోహరా! నీ అధరామృతపు సోనలను మా పెదవులపై చిలుకరింపుము (మమ్ములను ముద్దాడుము). విశాలమై, నిర్మలమై అనువుగా నున్న నీ వక్షస్థలమున మమ్ముహత్తుకొనుము. మిగుల సుకుమారములైన నీ కరకమలములతో మా కొప్పులను సవరింపుము. నీ కరుణాకటాక్షములను సూటిగా మా ముఖములపై ప్రసరింపజేయుము. ముద్దులొలుకు నీ సరసాలాపములతో మాకు వీనులవిందు గావింపుము. లేనిచో మేము బ్రతుకజాలము, ఎక్కడికని పోగలము? నాథా! ఈ ఆడువారలమొఱలను ఆలకింపుము.

మ. భవదాలోకన హాస గీతజములై భాసిల్లు కామాగ్నులన్
భవదీయాధర పల్లవామృతముచేఁ బాపం దగుం బాపవే
నీ వియోగానల హేతిసంహతులచే నీఱై భవచ్చింతలన్
భవదంఘ్రి ద్వయ వీథిఁ బొందెదము నీ పాదంబులానం బ్రియా! 997

ప్రియమైన కృష్ణా! ఆహ్లాదకరములైన నీ చూపులవలనను, చిఱునవ్వులతోను, మధురగీతములతోను మాలో కామాగ్నులు ప్రజ్వలించి, చెలరేగుచున్నవి. వాటిని తియ్యతియ్యని నీ అధరామృతముచే చల్లార్చుము. అట్లు గానిచో నీ వియోగాగ్ని శిఖలపరంపరతో మేము భస్మమై, నిన్నే స్మరించుచు, నీ పాదద్వయమున వ్రాలెదము. నీ చరణముల సాక్షిగా ఇది నిజము.

క. తరు మృగఖగగోగణములు, కర మొప్పెడు నిన్నుఁగన్న గానము విన్నం
గరఁగి పులకించు నబలలు, కరఁగరె నినుఁగన్న నీదు గానము విన్నన్. 998

నీ దివ్యరూపమును చూచినను, నీ మధురగానమును విన్నను వృక్షములు, మృగములు, పక్షులు, గోవులు సైతము ఆర్ద్రహృదయముతో పులకించిపోవును. ఇక అబలలమైన మా సంగతి వేఱుగా చెప్పనేల?

సీ. ఈ పంచబాణాగ్ని నేమిట నార్తుము నీ మంజువాగ్వృష్టి నెగడదేని
నీ మన్మథాంబోధి నేత్రోవఁ గడతుము నీ దృష్టి నావయై నిలువదేని
నీచిత్తజధ్వాంత మేజాడఁ జెఱుతుము నీ హాసచంద్రిక నిగుడదేని
నీదర్పకజ్వర మేభంగి నడఁతుము నీ నవాధరసుధ నింపవేని
ఆ. నెట్లు నిర్వహింతుమేలాగు మాలాగు కరుణ సేయవేనిఁ గదియవేని
మరుఁడు నిర్దయుండు మననిచ్చునే యశోదాకుమార! యువతిధైర్యహార! 999

మధురమైన నీ సరసాలాపముల వర్షము మాపై కురియనిచో మాలో విజృంభించుచున్న మన్మథతాపమును ఎట్లు చల్లార్చగలము? నీ కృపాదృష్టి అనెడి నావ సహాయములేనిచో అపరిమితమై మా మదనసముద్రమునుండి ఎట్లు బయటపడగలము? నీ చిఱునవ్వులవెన్నెలలు మాపై ప్రసరింపనిచో మా కామాంధకారమును ఎట్లు పాఱద్రోలగలము? నీకెమ్మోవితేనియలు మాచే ఆస్వాదింపజేయనిచో మా మదనజ్వరమును ఎట్లు ఉపశమింపజేయగలము? నీవు కనికరించి, మమ్ములను చేరదీయనిచో మేము ఎట్లు మనగలము? మా గతి ఏమి? యువతుల ధైర్యములను హరించెడి కృష్ణా! నిర్దయుడైన మన్మథుడు మమ్ము బ్రతుకనిచ్చునా?

క. అమరులఁ గాచిన హరిక్రియఁ, గమలేక్షణ! నీవు నేఁడు కరుణనభయహ
స్తము మాయురములశిరములఁ, బ్రమదంబున నిడుము మూర్ఛపాల్పడకుండన్ 1000

కమలనయనా! శ్రీహరి దేవతలను కాపాడినవిధముగా, మేము స్పృహదప్పి పడిపోకుండునట్లుగా, నేడు నీవు కరుణించి నిండు సంతోషముతో నీ అభయహస్తమును మా హృదయములపై, శిరస్సులపై ఉంచుము.

క. కట్టా! తలమునుకలునై, దట్టపు విరహాబ్ధి తెరలు తరుణుల నేఁచ
నెట్లున్ దరిఁజేర్పవయో కట్టిఁడివి గదా కుమార! కరుణోదారా! 1001

గోపకుమారా! దయామయా! అంతులేని విరహము అనెడి సముద్ర తరంగములు మమ్మ ఎంతయు వేధించుచున్నవి. అయ్యో! అందు తలమునకలైయున్న మమ్మలను ఏల దరిచేర్చవు? నీవు ఎంతటి కఠినాత్ముడవయ్యా?"

వ. అని యిట్లు కుసుమశరునిశరపరంపరాపరవశలై, యోపికలులేక పలికిన గోపికలదీనాలాపంబులు విని, నవ్వి యోగీశ్వరేశ్వరుండయిన కృష్ణుండాత్మారాముండై, వారలతో రమించె నప్పుడు. 1002

ఇట్లు నిరంతరముగా మన్మథబాణపరంపరకు గుఱియై విహ్వలలైయున్న గోపికలు పలికిన దీనాలాపములను పరమయోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు ఆలకించెను. పిమ్మట ఆ ప్రభువు చిఱునవ్వుతో ఆత్మారాముడై (అందఱిలోను శ్రీకృష్ణరూపుడై) వారితో రమించెను.

మ. కరుణాలోకములం బటాంచలకచాకర్షంబులన్ మేఖలా
కర బాహుస్తనమర్శనంబుల నఖాంకవ్యాప్తులన్ నర్మవా
క్పరిరంభంబుల మంజులాధర సుధాపానంబులం గొంతలం
గరఁగించెన్ రతికేళిఁ గృష్ణుఁడు కృపం గందర్పుఁ బాలార్చుచున్. 1003

శ్రీకృష్ణుడు వారిపై తన చల్లని చూపులను ప్రసరింపజేయసాగెను. చీరకొంగులను లాగుచు, కొప్పులను సవరించుచు, మేఖలలను (కటిసూత్రములను) చేతులను, బుజములను, వక్షఃస్థలములను స్పృశింప దొడంగెను. నఖక్షతములతో, సరసాలాపములతో, ఆలింగనములతో ముద్దుమురిపెములతో గోపికల కామతాపములను చల్లార్చుచు వారిని రతిక్రీడలలో ముంచెత్తెను.

క. మక్కువ వికసితవదనలు, సక్కఁగఁ దనుఁ గొల్వ హాసచంద్రికతోడన్
మిక్కిలి మెఱసెను గృష్ణుఁడు, చుక్కలగమినడిమి పూర్ణసోమునిభంగిన్. 1004

ప్రేమతో ఆనందమున మునిగితేలుచున్న ఆ గోపికలు తన చుట్టును జేరి సేవించుచుండగా శ్రీకృష్ణుడు వారిపై చిఱునవ్వు వెన్నెలలను ప్రసరింపజేయుచుండెను. అప్పుడు ఆ ప్రభువు చుక్కలనడుమ నిండుచంద్రునివలె భాసిల్లెను.

ఆ. సతులు తన్నుఁబాడ సంప్రీతి నాడుచు నఱుత నున్న వైజయంతితోడ
వనజలోచనుండు వనభూషణుండయ్యె యువతిజనశతంబులోలిఁ గొలువ. 1005

మెడలో వైజయంతిమాలను ధరించియున్న ఆ కృష్ణుడు తనను కీర్తించుచు గోపికలు గీతములను ఆలపించుచుండగా సంతోషముతో నృత్యములొనర్చుచుండెను. అట్లు వందలకొలది తరుణీమణులతోగూడి అంతటను విహరించుచున్న ఆ కమలలోచనుడు ఆ వనమునకే అలంకారమై అలరారుచుండెను.

ఉ. చిక్కక యీశుఁడై యెదిరిఁ జిక్కులఁ బెట్టెడి మాయలానికిం
జిక్కి కృతార్థలై మరునిచిక్కులఁ జొక్కి లతాంగులుండఁగా
మక్కువ శాంతి సేయుటకు మన్ననసేసి ప్రసన్నుఁ డౌటకుం
జిక్కన నా విభుండు గుణశాలి తిరోహితుఁడయ్యె నయ్యెడన్. 1006

ఆ సర్వేశ్వరుడు ఎవ్వరికిని చిక్కక ఎదుటివారిని చిక్కులపాలు చేయును. అట్టి మాయలమారి చేతులకు చిక్కి, ఆ గోపికలు మదనకేళిలో పరవశించి, కృతార్థులైరి. అంతట శుభప్రదుడైన ఆ ప్రభువు వారికామోద్వేగములను శాంతింపజేసి, వారిని అనుగ్రహించుటకై అదృశ్యుడయ్యెను.

వ. ఇట్లు హరి, గనుమొఱంగి చనినతఱిం గానక కరింబాసి తిరుగు కరేణులపెల్లున, నుల్లంబు తల్లడిల్ల, వల్లవకాంతలు తదీయగమన హాసలీలా విలాసవీక్షణవిహారవచన రచనానురాగంబులం జిత్తంబులు గోల్పడి, వివిధచేష్టలకుం బాల్పడి, తదాత్మకత్వంబున నేన నేన కృష్ణుండనని, కృష్ణగుణావేశంబులం జరియించుచు, 1007

క. భూతములలోన వెలిఁ బ్రఖ్యాతుండగునట్టివానిఁ గాంతలు కాళిం
దీతీరవనాంతరముల, బ్రాఁతిన్ వెదకంగఁ జనిరి పాడుచునధిపా! 1008

ఇట్లు శ్రీహరి (కృష్ణుడు) వారి కన్నుగప్పి అదృశ్యుడు కాగా, గోపికలు, మగ ఏనుగు దూరమైనప్పుడు దానికై పరితపించుచు తిరుగాడెడి ఆడు ఏనుగులవలె ఆ ప్రభుదర్శనమునకై తల్లడిల్లసాగిరి. పిదప వారు ఆ స్వామియొక్క నడకలను, చిఱునవ్వులసింగారములను, మనోహరమైన చూపులను, విహారములను, మాటలమధురిమలను, ప్రేమానురాగములను, తలంచుకొనుచు, మనస్సులు పనిచేయక పలుచేష్టలకు పాల్పడిరి. అంతట వారు కృష్ణ తన్మయత్వముతో 'నేనే కృష్ణుడను, నేనే కృష్ణుడను' అని పలవరించుచు ఆ ప్రభువును అనుకరించుచు సంచరింపసాగిరి. రాజా! సకలప్రాణులలోపల, వెలుపల చైతన్యమూర్తియై ఒప్పుచుండెడి పరమాత్మగా ఖ్యాతికెక్కిన ఆ శ్రీకృష్ణుని కీర్తించుచు గోపకాంతలు యమునానదీ తీరములయందలి వనములలో ప్రేమతో వెదకసాగిరి.

సీ. పున్నాగ! కానవే పున్నాగవందితుఁ దిలకంబ! కానవే తిలకనిటలు
మన్మథ! కానవే మన్మథాకారుని వంశంబ! కానవే వంశధరుని
ఘనసార! కానవే ఘనసారశోభితు బంధూక! కానవే బంధుమిత్రుఁ
జందన!కానవే చందనశీతలుఁ గుందంబ! కానవే కుందరదను
తే. నింద్రభూజమ! కానవే యింద్రవిభవుఁ గువలవృక్షమ!కానవే కువలయేశుఁ
బ్రియకపాదప! కానవే ప్రియవిహారు ననుచుఁ గృష్ణుని వెదకిరయ్యబ్జముఖులు. 1009

"పున్నాగవృక్షమా! మా శ్రీకృష్ణుడు సత్పురుషులచే సేవింపబడువాడు, తిలకవృక్షమా! మా స్వామినొసట కస్తూరి తిలకమును ధరించువాడు, మామిడిచెట్టా! మా కృష్ణయ్య మన్మథుని మించిన అందగాడు, వెదురుమొక్కా మా ప్రభువు పిల్లనగ్రోవిని ధరించువాడు, కర్పూరవృక్షమా! మా నందకుమారుడు మిక్కిలి బలపరాక్రమములు గలవాడు, మంకెనచెట్టా! మా యశోదమ్మకొడుకు బంధుమిత్రులను ఆదరించువాడు, చందనవృక్షమా! మా గోపికావల్లభుడు మంచి గంధమువలె చల్లనివాడు, మల్లెతీగా! మా గోపకిశోరుడు మల్లెమొగ్గలవంటి చక్కని పలువరుసగలవాడు, దేవదారువృక్షమా! మా ప్రభువు ఇంద్రవైభవముగలవాడు, రేగుచెట్టా! మా స్వామి గొప్ప మహారాజు, వేగిసచెట్టా! మా కృష్ణయ్య విహారము అతిమనోహరము. అట్టి పరమపురుషుని మీరు దర్శించినారా?" అనుచు ఆ గోపికలు శ్రీకృష్ణుని జాడనుగూర్చి చెట్టుచెట్టును అడుగుచు ఆ ప్రభువుకొఱకై వెదుకసాగిరి.

వ. మఱియును. 1010

ఉ. నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా

జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వలమానధనంబుఁ దెచ్చెనో
మల్లియలార! మీపొదలమాటున లేఁడు గదమ్మ! చెప్పరే. 1011

ఇంకను వారు (గోపికలు) ఇట్లనిరి. 'మల్లియలారా! నల్లనివాడు, కమలములవంటి కన్నులు గలవాడు, ఆ మహాత్ముని చూపులలో కరుణ జాలువారుచుండును. అతని శిరస్సున నెమలిపింఛము తళుకులీనుచుండును. ఆయన ముఖమునందు ఎప్పుడును నవ్వులు పూలు పూయుచుండును. అట్టి ఒక అందగాడు తరుణీమణుల మనస్సులను (మానధనమును) కొల్లగొట్టి ఇటు తీసికొనివచ్చెను. అతడు మీ పొదలచాటున లేడుగదా! ఉన్నచో తెలుపుడు.

ఉ. అంగజునైనఁ జూడ హృదయంగముఁడై కరఁగించువాఁడు శ్రీ
రంగదురంబువాఁడు మధురంబగు వేణురవంబువాఁడు మ
మ్మంగజు పువ్వుఁదూపులకునగ్గము సేసి లవంగలుంగ నా
రంగములార! మీకడకు రాఁడుగదా! కృపయుంచి చూపరే. 1012

లవంగ, మాదీఫల, నారంగ (నారింజ) వృక్షములారా! ఆ సుందరుని చూచినంతమాత్రముననే అతనిఅందచందాలకు మన్మథుడుసైతము ముగ్ధుడగును, ఆతనిహృదయము ఆర్ద్రమగును. లక్ష్మీదేవికి ఆవాసమైన అతని వక్షఃస్థలవైభవములు అపూర్వములు. అతనిమురళీగానమాధుర్యములను వర్ణించుటకు మాటలు చాలవు. ఆ వెన్నెచిన్నెలవాడు మమ్ములను మన్మథునిపూలబాణములపాలుజేసి మీ కడకు వచ్చెనా? దయతో తెలుపుడు.

సీ. మానినీమన్మథు మాధవుఁ గానరే సలలితోదారవత్సకములార!
సలలితోదారవత్సకవైరిఁ గానరే సుందరోన్నతలతార్జునములార!
సుందరోన్నతలతార్జునభంజుఁ గానరే ఘనతరలసదశోకంబులార!
ఘనతరలసదశోకస్ఫూర్తిఁ గానరే నవ్యరుచిరకాంచనంబులార!
ఆ. నవ్యరుచిరకాంచనకిరీటుఁ గానరే గహనపదవికురవకంబులార!
గహనపదవికురవకనివాసిఁ గానరే గణికలార!చారుగణికలార! 1013

మిక్కిలి మనోహరమై, ఎత్తైన కొడిసెచెట్లులారా! యువతులకు మన్మథునివలె మనోహరుడైన శ్రీహరిని చూచితిరా? అందముగను, పొడవుగను ఉన్న మద్దివృక్షములారా! మనోజ్ఞుడును, శ్రేష్ఠుడునుఐ వత్సాసురుని వధించిన శ్రీకృష్ణుని కాంచినారా? మిగుల బలిష్ఠములైన అశోకవృక్షములారా! ఉవ్వెత్తుగా పెటిగి అందముగానున్న కొమ్మలతో ఒప్పెడి రెండు మద్దిచెట్లను కూల్చిన కృష్ణప్రభువును దర్శించినారా? నవనవలాడుచున్న మనోహరమైన సంపెంగలారా! సర్వశ్రేష్ఠుడు, పరమానంద స్వరూపుడు ఐన నందకుమారుని తిలకించినారా? వనప్రదేశములందున్న ఎఱ్ఱగోరంట పొదలారా? మిఱుమిట్లు గొలిపెడి కాంతులతో విరాజిల్లుచున్న బంగారు కిరీటము ధరించిన కృష్ణయ్యను చూచినారా? అందమైన అడవిమొల్లలారా! నెల్లిచెట్టులారా! బృందావనమునందలి ఎఱ్ఱగోరంట పొదలమధ్య విహరించెడి గోపాలచూడామణిని దర్శించినారా? కృపతో తెలుపుడు.

సీ. అదె నందనందనుండంతర్హితుండయ్యెఁ బాటలీతరులార! పట్టరమ్మ
హేలావతులఁ గృష్ణ! యేల పాసితివని యైలేయలతలార! యడుగరమ్మ!
వనజాక్షుఁ డిచటికి వచ్చి డాఁగఁడు గదా చూతమంజరులార! చూడరమ్మ!
మానినీమదనుతో మా రాక యెఱిఁగించి మాధవీలతలార! మనుపరమ్మ!
ఆ. జాతిసతులఁ బాయ నీతియె హరికని జాతులార దిశలఁ జాటరమ్మ!
కదళులార! పోయి కదలించి శిఖిపింఛ జూటుఁ దెచ్చి కరుణఁ జూపరమ్మ! 1014

ఇదిగో! నందకుమారుడు చూచుచుండనే మాయమైనాడు. కలిగొట్టు చెట్టులారా! కనబడినచో పట్టుకొనుడు. ఏలకి తీగెలారా! కృష్ణుడు కంటబడినచో తరుణీమణులను ఎందులకు విడిచిపెట్టి వచ్చితివని నిలదీయుడు. మామిడిగుత్తులారా! కమలనయనుడు ఇచటికి వచ్చి దాగికొనినాడా? దయతో చూడుడు. పూలగురివెందలతలారా! యువతులపాలిటి మన్మథుడైన శ్రీకృష్ణునకు మారాకను తెలిపి మమ్ములను ఆదుకొనుడు. జాజితీగెలారా! గోపసతులను వీడివచ్చుట శ్రీహరికి నీతిగాదని నలుదిక్కులయందును చాటుడు. అరటిచెట్టులారా! మీరు వెళ్ళి, నెమలిపింఛమును శిరమునదాల్చిన శ్రీకృష్ణుని పట్టుకొనివచ్చి కృపతో మాయెదుట నిలుపుడు.

క. హరిచరణములకుఁ బ్రియవై, హరి నిను మన్నింప భద్రమందెడు తులసీ
హరి నీ దెస రాఁడు గదా! హరిచొప్పెఱిఁగించి శుభములందింపఁగదే. 1015

తులసీ! శ్రీహరిచరణములనిన నీకు ప్రాణములు. ఆస్వామిపాదములకు నీవు ఎంతయు ప్రీతిపాత్రురాలవు. ఆ హరికరుణవలన నీవు సకలశుభములతో వర్ధిల్లుచుందువు. అయితే ఒక్కమాట. ఆ హరి (శ్రీకృష్ణుడు) నీ వైపునకు వచ్చినాడా? వచ్చినచో ఆయనజాడను దెలిపి, మమ్ములను సంతోషపెట్టుము.

తే. పొగడఁదగువానిఁగానరె పొగడలార! యీడెఱుంగని విభుఁజూపుఁ డీడలార!
మొల్లమగు కీర్తివాఁడేడి మొల్లలార! శుకనిగదితునిఁ జెపుడు కింశుకములార! 1016

పొగడలారా! నిరంతరము కీర్తింపదగిన ఆ శ్రీహరిని మీరు చూచినారా! తియ్యనిమ్మచెట్టులారా! శ్రీకృష్ణుడు సాటిలేని అందగాడు. ఆ ప్రభువును జూచినారా? మొల్లలారా! నిష్కలంకమైన కీర్తిగల శ్రీకృష్ణుడు ఎక్కడ? మోదుగచెట్టులారా! శుకయోగిచే ప్రస్తుతింపబడిన కృష్ణప్రభువును గాంచినారా! మమ్ము కనికరించి తెలుపుడు.

క. తరుణీకుచకుంకుమయుత, హరికందర దామగంధమడరెడుఁ జూడ్కిన్
హరిఁ గనినపగిదిఁ దనరెడి, హరిణీ! హరిజాడఁ బుణ్యమయ్యెడిఁ జెపుమా. 1017

హరిణీ (ఆడులేడీ!) తరుణీమణులు తమ వక్షస్థలములయందు కుంకుమరేఖలను దిద్దుకొనుచుందురు. శ్రీకృష్ణుడు వారిని తనహృదయమునకు హత్తుకొనినప్పుడు, ఆస్వామి కంఠమున సుగంధములతో ఒప్పెడి పూలమాల, కుంకుమలతోగూడి దర్శనీయముగా ఉండును. అట్టి శ్రీకృష్ణుని గాంచి ఆనందించినట్లు నీ చూపులు తెలుపుచున్నవి. కనుక ఆ ప్రభువు జాడను తెలిపి నీవు పుణ్యమును గట్టుకొనుము.

క. కిటియై కౌఁగిటఁ జేర్చెను, వటుఁడై వర్ధిల్లి కొలిచె వడిఁ గృష్ణుండై
యిటఁ బదచిహ్నములిడెఁ గ్రిందటి బాముున నేమి నోఁచితమ్మ! ధరిత్రీ! 1018

అమ్మా! భూదేవీ!పూర్వము శ్రీహరి వరాహావతారమున నీకు తన కౌగిలి సుఖములను ప్రసాదించియుండెను. వామనావతారమున త్రివిక్రముడై నిన్ను కొలిచినాడు. ఇప్పుడు (కృష్ణావతారమున) ఆ స్వామి తన పాదముద్రలతో నిన్ను పునీతమొనర్చినాడు. పూర్వజన్మలలో నీవు ఎట్టి నోములను నోచితివో ఏమో?"

వ. అనుచు మదనోన్మాదచిత్తలై, తదాత్మకత్వంబునఁ గృష్ణలీలలననుకరించుచు. 1019

ఇట్లు ప్రస్తావించుచు ఆ గోపికలు కామపరవశత్వమున తమనే కృష్ణునిగా భావించుకొనుచు ఆ స్వామి లీలలను అనుకరింపసాగిరి.

సీ. పూతనయై యొక్క పాలఁతి చరింపంగ శౌరియై యొక కాంత చన్ను గుడుచు
బాలుఁడైయొక భామ పాలకు నేడ్చుచో బండి నేనను లేమ బాఱఁదన్ను
సుడిగాలినని యొక్క సుందరి గొనిపోవ హరినని వర్తించు నబ్జముఖియు
బకుఁడ నేనని యొక్కపడఁతి సంరంభింపఁ బద్మాక్షుఁడను కొమ్మ పరిభవించు
ఆ. నెలమి రామకృష్ణులింతులిద్దఱు గాఁగ గోపవత్సగణము కొందఱగుదు
రసురవైరి ననుచు నబల యొక్కతె చీరుఁ బసులమనెడి సతుల భరతముఖ్య! 1020

పరీక్షిన్మహారాజా! ఒక గోపిక పూతనగా నటించుచుండగా, మఱియొకతె బాలకృష్ణుడై ఆమెచనుబాలు త్రాగసాగెను. ఒక యువతి బాలుని (బాలకృష్ణుని) భావముతో పాలకొఱకై ఏడ్చుచు బండిగా నటించుచున్న మఱియొకతెను కాలితో తన్నెను. ఒక సుందరి సుడిగాలిగా (తృణావర్తునిగా) ప్రవర్తించుచుండగా, వేఱొకగోపిక 'నేనే కృష్ణుడను' అనుచు ఆమెను ఎత్తుకొని పోయెను. 'నేనే బకాసురుడను' అనుచు ఒక తరుణి విజృంభింపగా, ఇంకొక కాంత 'నేనే శ్రీకృష్ణుడను' అని ఆమెను పరాభవించెను. ఒక ఇద్దఱు గోపికలు బలరామకృష్ణులైరి, కొందఱు గోపకాంతలు గోపాలురుగా, ఆవుదూడలుగా నటింపసాగిరి. 'మేమే గోవులము' అనుచున్న వారిని, ఒక గోపిక నేనే రాక్షసులను హతమార్చిన శ్రీకృష్ణుడను' అని పిలువదొడంగెను.

ఆ. లోకమెల్లఁ గుక్షిలోపలనున్నది మాధవుండ నేను మాతవీవు
చూడుమనుచు నొక్క సుందరి యొకతెకు ముఖముఁదెఱచి చూపు ముఖ్యచరిత! 1021

ఉత్తమచరిత్రగల మహారాజా! 'నేను శ్రీకృష్ణుడను; లోకములన్నియును నా కడుపులోనే ఉన్నవి చూడుము. నీవు యశోదామాతవు. చూడుము' అని పలుకుచు ఒక సుందరి నోరు తెఱచి మఱియొక వనితకు చూపెను.

క. వెన్నలు దొంగిలి తినియెడి, వెన్నుఁడనని యొకతె నుడువ వేఱొక్కతె చే
సన్నల యశోదనంచును, గ్రన్నన కుసుమములదండఁ గట్టునిలేశా! 1022

మహారాజా! నేను నవనీతచోరుడను, కృష్ణుడను' అని ఒక కాంత పలుకగా మఱియొక భామిని 'నేను యశోదను' అని సంజ్ఞ చేయుచు ఆమెను ఒక పూలదండతో బంధించెను.

క. కాళియఫణి యిది వీరలు, కాళియఫణిసతులు మ్రొక్కఁ గడఁగిరి నే గో
పాలకుమారుఁడ ననుచును, లీలాగతినాడు నొక్క లేమ నరేంద్రా! 1023

పరీక్షిన్మహారాజా! 'నేను గోపాలబాలుడను. ఈమె కాళియసర్పము. వీరందఱును కాళియునిభార్యలు. నాకు ప్రణమిల్లుచున్నారు' అని పలుకుచు ఒక గోపిక నృత్యము చేయసాగెను.

క. తరుణులు గోపకులందఱు, హరిహయుఁడిదె వాన గురిసె హరి నేనని భా
సుర చేలాంచల మొక్క తె, గిరి నెత్తెద ననుచు నెత్తుఁ గెంగేల నృపా! 1024

రాజా! ఈ తరుణీమణులు అందఱును గోపాలురు ఇదిగో! ఈమె ఇంద్రుడు జడివానను కురిపించుచున్నాడు. నేను శ్రీకృష్ణుడను. 'గోవర్ధనగిరి'ని ఎత్తుచున్నాను' అనుచు ఒక గోపిక తనచీర చెంగును పైకెత్తి పట్టుకొనెను.

క. మీరలు గోపకులే నను, రారిని దావాగ్ని వచ్చె నటు సూడకుఁడీ
వారించెద నని యొక్కతె, సేరి బయల్ కబళనంబు సేయు నరేంద్రా! 1025

రాజా! మీరు అందఱును గోపాలురు. నేను రాక్షసులను సంహరించినవాడను, కృష్ణుడను. ఇదిగో దావాగ్ని, విజృంభించి ఇటే వచ్చుచున్నది. అటు చూడరాదు. దానిని నేను అదుపు చేసెదను' అనుచు ఒక గోపిక నోఱుతెఱచి ఆకాశమును కబళించుచున్నట్లు అభినయించెను.

వ. ఇట్లు తన్మయత్వంబున గోపసుందరులు బృందావనంబునంగల తరులతాదుల హరినడుగుచు, దుర్గమంబు లయిన విపినమార్గంబుల సరోజాత కేతన హల కులిశకలశాంకుశాది శుభ లక్షణలక్షితంబులయి, మనోహరంబులయిన హరిచరణంబులచొప్పుఁగని, తప్పక చెప్పికొనుచుఁదమలో నిట్లనిరి. 1026

ఈవిధముగా అందచందాలగోపికలు తన్మయత్వముతో బృందావనమునందు కృష్ణునిజాడనుగూర్చి తరువులను, లతలను అడుగుచు అంతటను తిరుగాడిరి. చొచ్చుటకు వీలుగాని ఆవనమార్గములయందు వారికి అక్కడక్కడ కమలము, ధ్వజము, నాగలి, వజ్రము, కలశము, అంకుశము మొదలగు చిహ్నములతో ఒప్పుచున్న మనోహరములైన పాదముద్రలు గనబడెను. ఆ శుభచిహ్నములను బట్టి అవి శ్రీకృష్ణునిపాదములగుర్తులే అను నిశ్చయముతో వారు తమలో తాము ఇట్లనుకొనసాగిరి.

సీ. కొమ్మకుఁ బువ్వులు కోసినాఁడిక్కడ మొనసి పాదాగ్రంబు మోపినాఁడు
పతినెత్తుకొని వేడ్క జరిగినాఁ డిక్కడఁ దృణములో ఁదోఁపదు తెలవజాడ
ప్రియకు ధమ్మిల్లంబు వెట్టినాఁడిక్కడఁ గూర్చున్న చోటిదె కొమరుమిగులు
నింతికిఁ గెమ్మోవి యిచ్చినాఁడిక్కడ వెలఁది నిక్కినగతి విశదమయ్యె
ఆ. సుదతితోడ నీరు సొచ్చినాఁడిక్కడఁ జొచ్చి తా వెడలినచోటులమరెఁ
దరుణిఁ గామకేళిఁ దనిపినాఁ డిక్కడ, నవఁగి పెనఁగి యున్న యందమొప్పె. 1027

శ్రీకృష్ణుడు ఇక్కడ పాదాగ్రములపై నిలబడి ఒక కోమలికి పూవులు కోసి యిచ్చినట్లున్నది. ఈ పచ్చికలపై ఆ నందకుమారుడు ప్రేమతో ఒక రమణిని ఎత్తుకొని ఒయ్యారాలు పోయినట్లున్నది. ఏలనన ఇచట ఆయనపాదముల గుర్తులు మాత్రమే గోచరించుచున్నవి. ఇచట ఆ లీలాప్రభువు ఒక ప్రియురాలి కేశములను సవరించినట్లున్నది. ఏలనన వారు ఇద్దరు ఇచ్చట కూర్చున్న జాడలు గోచరించుచున్నవి. ఇక్కడ ఒక తరుణి నిక్కినిక్కి నిలబడిన గుర్తులు కనబడుటనుబట్టి ఆ చిలిపికృష్ణుడు ఒక యువతిని ముద్దాడినట్లు అనిపించుచున్నది. ఆ ప్రభువు ఈ సరస్సులో ఒకసుదతితో జలక్రీడను ఆడినట్లున్నది. ఏలనన ఆ ఇరువురును జలములనుండి బయటికి వచ్చిన చరణములజాడలు కనబడుచున్నవి. ఆ అందగాడు ఇక్కడ ఒక తరుణితోఁగూడి కామకేళి జరిపినట్లున్నది. ఏలనన ఇచట ఇరువురును పెనగుచు పొరలాడిన గుర్తులు గోచరమగుచున్నవి.

సీ. ఒక యెలనాఁగచే యూఁదినాఁడిక్కడ సరసనున్నవి నాల్గుచరణములును
నొక నీలవేణితో నాదిఁగినాఁడిక్కడ మగజాడలో నిదె మగువజాడ
యొకలేమ మ్రొక్కిన నురివినాఁడిక్కడ రమణి మ్రొక్కినచొప్పు రమ్యమయ్యె
నొకయింతి కెదురుగా నొలసినాఁడిక్కడ నన్యోన్యముఖములై యంఘ్రులొప్పె
ఆ. నొకతె వెంటఁ దగులనుండక యేఁగినాఁడడుగుమీదఁ దరుణి యడుగులమరె
నబలలిరుగెలంకులందు రాఁ దిరిగినాఁ డాఱుపదములున్నవమ్మ! యిచట. 1028

కృష్ణుడు ఈ ప్రదేశమున ఒక తరుణియొక్క చేయి పట్టుకొని నడచినాడో ఏమో? ప్రక్కప్రక్కన నాలుగు పాదచిహ్నములు కనబడుచున్నవి. ఆ స్వామి అందాలకురులుగల ఒక యువతి కౌగిలిలో ఒదిగినట్లున్నది. ఏలనన

మగవానిజాడలో మగువజాడగూడ కన్పించుచున్నది. ఒక కాంత తనకు మ్రొక్కగా ఆస్వామి ఆమెను విడిచిపెట్టి తొలగిపోయినట్లున్నది. ఏలనన ఆ రమణిమ్రొక్కిన తీరు చక్కగా కనబడుచున్నది. ఆ ప్రభువు ఇచట ఒకభామినికి అభిముఖముగా నిలిచినట్లున్నది. అందువలననే కాబోలు వారిపాదములు ఎదురెదురుగా కనబడుచున్నవి. ఒక భామ తనవెంటబడగా ఆ స్వామి అచట నిలబడక ముందుకేగినట్లు తోచుచున్నది. ఏలనన ఆయన పాదచిహ్నములమీద ఆ తరుణి పాదములగుర్తులు కనబడుచున్నవి. ఆ కృష్ణుడు ఇరుప్రక్కలను యువతులను చేర్చుకొని విహరించినాడు కాబోలు. ఏలనన ప్రక్కప్రక్కన అఱుపాదములగుర్తులు కన్పట్టుచున్నవి.

సీ. ఈచరణంబులే యిందునిభానన! సనకాదిముని యోగసరణి నొప్పు
నీపాదతలములే యెలనాఁగ శ్రుతివధూ సీమంతవీథులఁ జెన్ను మిగులు
నీ పదాబ్జంబులే యిభకులోత్తమయాన పాలేటిరాచూలి పట్టుఁగొమ్మ
లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ ముక్తికాంతా మనోమోహనంబు
ఆ. లీ యడుగులరజమె యింతి బ్రహ్మేశాది, దివిజవరులు మౌళిదిశలఁ దాల్తు
రనుచుఁ గొందఱబలలబ్జాక్షుఁ డేఁగిన క్రమముఁ గనియు వతనిఁ గానరైరి 1029

అప్పుడు గోపికలు తమలోతాము ఇట్లు అనుకొనిరి. 'చంద్రముఖీ! ఈ స్వామియొక్క చరణములు సనకుడు మొదలగు మహాయోగులధ్యాన సమయమున ఆరాధింపబడుచుండును. వనితా! ఈ పాదములే వేదములనెడి కాంతలయొక్క సీమంతము[1]లయందు అందములు చిందుచుండును. మదగజమువలె గంభీరముగా నడచెడి ఓ రమణీ! ఈ పాదాబ్జములే శ్రీమహాలక్ష్మికి పట్టుగొమ్మలు. కమలలోచనా! అందములొలికెడి ఈ అడుగులే ముక్తియనెడి కాంతయొక్క మనస్సును మోహింపజేయును. తరుణీ! ఈ పాదములధూళులనే బ్రహ్మ, ఈశ్వరుడు మొదలగు ప్రముఖ దేవతలు తమ శిరస్సులపై ధరించుచుందురు" అనుకొనుచు కొందఱు గోపికలు శ్రీకృష్ణుని అడుగుజాడలనుబట్టి ఆ స్వామి నడయాడిన మార్గమును జూచియు ఆ స్వామిని దర్శింపలేకపోయిరి.

వ. అప్పుడు. 1030

సీ. పతులదైన్యంబును భామలక్రౌర్యంబుఁ జూపుచు విభుఁడొక్క సుదతితోడ
విహరింపనదియెల్ల వెలఁదుల వర్జించి నా యొద్దనున్నాడు నాథుఁడనుచు
గర్వించి రాఁ జాలఁ గమలాక్ష మూఁపున నిడుకొను మనుఁడునయ్యీశ్వరుండు
మొఱఁగి పోయినఁ దాపమునుబొంది యో కృష్ణ! యెక్కడఁ జనితి ప్రాణేశ రమణ
తే. నీకు వరవుడనయ్యెద నిలువుమనుచు వగవఁ గొందఱు కాంతలావనితఁ జూచి
వరుఁడు మన్నింప గర్వించి వనజనేత్ర, చిక్కె నేఁడని వెఱఁగును జెందిరపుడు. 1031

ఆ సమయమున 'తమను సంతోషపెట్టుటకై తమ భార్యలకడ దైన్యముతో పతులు ప్రాధేయపడుచుండు రీతులను, బింకములను జూపుచు సతులు చూపెడి కోపతాపములను ప్రదర్శింపదలచి, శ్రీకృష్ణుడు ఒక సుదతితో విహరింపసాగెను. అప్పుడు ఆ రమణి జగన్నాథుడు కాంతలను అందఱనుకాదని తనయొద్దనే ఉన్నాడని గర్వించెను. అంతట ఆ మానిని 'కమలాక్షా! నేను నీతో నడచి రాజాలను, నన్ను నీ మీపుపై చేర్చుకొని పొమ్ము' అనెను. ఆమె అట్లు పలికినంతనే ఆ సర్వేశ్వరుడు అదృశ్యమాయెను. అంతట ఆ భామిని మిగుల పరితాపమునకు లోనై 'కృష్ణా! ప్రాణేశ్వరా! మనోరమణా! ఎక్కడికి వెళ్లితివి? నేను నీకు దాసిని అయ్యెదను' అనుచు మిగుల పశ్చాత్తాపపడసాగెను. అప్పుడు కొందఱు గోపకాంతలు

1. సీమంతము = పాపట

ఆ వనితను గాంచి, ఈమె నాథుడు ఆదరింపగా ఎంతయు గర్వించినది. ఆ కారణమున నేడు చిక్కులపాలైనది' అనుచు ఆశ్చర్యపడిరి.

మ. మఱియును. 1032

సీ. ఈ పొదరింటిలో నిందాఁకఁ గృష్ణుండు నాతోడ మన్మథనటనమాడె
నియ్యోలమగుచోట నిందాఁకఁ జెలువుండు గాఢంబుగా నన్నుఁ గౌఁగిలించె
నీ మహీజమునీడ నిందాఁక సుభగుండు చిట్టంటు చేఁతల సిగ్గుగొనియె
నీ పుష్పలతపొంత నిందాఁక దయితుండు నను డాసి యధరపానంబు సేసె
ఆ. నీ ప్రసూనవేది నిందాఁక రమణుండు కుసుమదామములను గొప్పుఁ దీర్చె
ననుచుఁ గొందఱతివలంభోజనయనుని పూర్వలీలఁ దలఁచి పొగడిరధిప. 1033

పరీక్షిన్మహారాజా! ఇంకను కొందఱు అతివలు మునుపు కృష్ణప్రభువు తమతోగూడి ఒనర్చిన కేళీవిలాసములను తలంచుకొనుచు ఆ స్వామిని ఇట్లు కొనియాడిరి. "ఇంతవఱకును కృష్ణుడు ఈ పొదరింటియందు నాతోగూడి కామకేళి సలిపెను. ఈ మఱుగుచోటున ఆ అందగాడు నన్ను గాఢమైన కౌగిలిసుఖములో ముంచెత్తెను. ఈ చెట్టునీడలో ఆ సుందరుడు నఖక్షతాలతో, దంతక్షతాలతో నా సిగ్గు దీసెను. ఈ పూలతీగె సమీపమున నా ప్రియుడు నన్ను జేరి ముద్దులతో మురిపించెను. ఈ పూలవేదికపై నారమణుడు నా కొప్పుపై పూలమాలలను తీర్చిదిద్దినాడు".

మ. అని యిబ్భంగి లతాంగులందఱును బృందారణ్యమందీశ్వరున్
వనజాక్షుం బరికించి కానక విభున్ వర్ణించుచుం బాడుచున్
మనముల్ మాటలుఁ జేష్టలుం గ్రియలు నమ్మానాథుపైఁ జేర్చి వే
చనిరయ్యామునసైకతాగ్రమునకున్ సంత్యక్తగేహేచ్ఛలై 1034

వ. చని గోపికలు హరి నుద్దేశించి యిట్లనిరి. 1035

ఈవిధముగా ఆ గోపికలు అందఱును కమలనయనుడైన శ్రీకృష్ణప్రభువును బృందావనమునందు అంతటను ఎంతగానో వెదకిరి. ఐనను ఎచ్చటను కనబడకపోవుటచే ఆ స్వామిని వర్ణించుచు, పాటలు పాడసాగిరి. క్రమముగా వారు మనస్సులను, మాటలను, క్రియలను ఆ కృష్ణునిపరముగావించి, తమ తమ ఇండ్లకు వెళ్ళవలయునను ఇచ్ఛలేక యమునాతీరమునగల ఇసుకతిన్నెలపై చేరిరి. పిమ్మట శ్రీహరిని ఉద్దేశించి ఇట్లు వచించిరి.

## గోపికాగీతలు

క. నీవు జనించిన కతమున, నో వల్లభ లక్ష్మి మంద నొప్పె నధికమై
నీవెంటనె ప్రాణములిడి! నీ వారరసెదరు చూపు నీ రూపంబున్. 1036

ప్రభూ! నీవు అవతరించుటచే వ్రేపల్లె అంతయును సిరిసంపదలతో కలకలలాడినది. ఇక నీ వారమైన మేము నీపైననే ప్రాణములను నిలుపుకొని, నీ కొఱకై వెదకుచున్నాము. దయతో నీ దర్శనమును కలిగింపుము.

క. శారద కమలోదర రుచి, చోరకమగు చూపువలన సుందర మిమ్ముం
గోరి వెల యీని దాసుల, ధీరత నొప్పించుటిది వధించుట గాదే. 1037

సౌందర్యనిధీ! శరత్కాలమందలి పద్మములశోభ నీ సింగారపు చూపులముందు దిగదుడుపే. నిన్నుగోరి, జీతబత్తెములులేని దాసులమైతిమి. అట్టి మా యెడ జాలిచూపక వేధించుట, నిజముగా మమ్ము వధించుటయేగదా!

ఆ. విషజలంబువలన విషధరదానవు, వలన జాలవానవలన వహ్ని
వలన నున్నవానివలనను రక్షించి కుసుమశరుని బారిఁ గూల్పఁదగునె. 1038

దేవా! కాళియునికారణముగా విషపూరితములైన యమునానదీజలములనుండియు, సర్పాకృతిలో వచ్చిన అఘాసురుని నుండియు, ఇంద్రుడు కురిపించిన వడగండ్ల వాననుండియు, దావాగ్నినుండియు, ఇంకను పెక్కు ప్రమాదములనుండియు మమ్ము రక్షించితివి. కాని ఇప్పుడు ఈ విధముగా మన్మథబాణములపాలు చేయుట నీకు పాడియా?

ఉ. నీవు యశోద బిడ్డఁడవె నీరజనేత్ర సమస్త జంతు చే
తో విదితాత్మవీశుఁడవు తొల్లి విరించి తలంచి లోక ర
క్షావిధమాచరింపుమని సన్నుతి సేయఁగ సత్కులంబునన్
భూవలయంబుఁ గావనిటు పుట్టితి గాదె మనోహరాకృతిన్. 1039

పద్మనేత్రా! కేవలము నీవు యశోదాతనయుడవు మాత్రమేగాదు. సకలప్రాణులలో ఆత్మస్వరూపుడవై వెలుగొందెడివాడవు; సర్వేశ్వరుడవు. పూర్వము బ్రహ్మదేవుడు నిన్ను ధ్యానించి, 'లోకములను రక్షింపుము' అనుచు ప్రార్థింపగా భూమండలమును కాపాడుటకై, పవిత్రమైన ఈ యదువంశమునందు అద్భుతమైన సౌందర్యమూర్తివై అవతరించితివి.

ఆ. చరణసేవకులకు సంసారభయమును బాపి శ్రీకరంబు పట్టు గలిగి
కామదాయి యైన కరసరోజంబు మా, మస్తకముల నునిచి మనుపుమీశ! 1040

నాథా! నీ కరకమలము, నీ పాదములను సేవించువారియొక్క సంసారబాధలను రూపుమాపునట్టిది. లక్ష్మీదేవి పాణిని గ్రహించునది. అర్థులకోర్కెలను తీర్చెడి కల్పవృక్షము. అట్టి నీ అమృతహస్తమును మా శిరములపై చేర్చి మమ్ము బ్రోవుము.

ఉ. గోవులవెంటఁ ద్రిమ్మరుచుఁ గొల్చినవారలపాపసంఘముల్
ద్రోవఁగఁ జాలి శ్రీఁ దనరి దుష్టభుజంగ ఫణాలతాగ్ర సం
భావితమైన నీ చరణపద్మము చన్నులమీఁద మోపి త
ద్భావజ పుష్ప భల్లభవబాధ హరింపు వరింపు మాధవా! 1041

మాధవా! ఆవులను మేపుచు సంచరించెడి, నీ పవిత్ర పాదములు నిన్ను సేవించెడివారి పాపములను అన్నింటిని తొలగించును. అవి దుష్టుడైన కాళియుని యొక్క పడగలపై నడయాడినవి. ఎంతేని శుభప్రదములు. అట్టి నీ పాదపద్మములను మా హృదయములపై చేర్చి (హృదయములయందు నిలిపి) మన్మథునిపూలబాణముల తాపమును తొలగించి మమ్ము స్వీకరింపుము.

క. బుధరంజనియును సూక్తయు, మధురయు నగునీదువాణి మరగించెను నీ
యధరామృతసంసేవన, విధి నంగజతాపమెల్ల విడిపింపఁగదే. 1042

చక్కని నీ మధురవచనములు దేవతలను, పండితులను సైతము రంజింపజేయునవి. అట్టి నీ తియ్యని పలుకులు మాలో నీపై మరులు నింపినవి. నీ అధరామృతమును సేవించెడి భాగ్యమును మాకు కల్పించి, మా మదనతాపమును హరింపుము.

క. మగువలయెడ నీ క్రౌర్యము, తగునే నిజభక్తభీతిదమనుఁడ వకటా!
తగదు భవద్దాసులకును నగు మొగముం జూపి కావు నళినదళాక్షా! 1043

కమలాక్షా! నీవు భక్తుల (నిన్ను సేవించెడివారి) భయములను తొలగించువాడవు గదా! ఇక అబలలమైన మాపై ఇట్లు క్రౌర్యమును చూపదగునా? అట్లు చేయుట నీకు ఏమాత్రమూ న్యాయముగాదు. మేము నీకు దాసులము. నీ నగుమోమును జూపి మమ్ము కాపాడుము.

మ. ఘన లక్ష్మీయుతమై మహాశుభదమై కామాది విధ్వంసియై
సనకాదిస్తుతమై నిరంతరతపస్సంతప్త పున్నాగ జీ
వనమై యెప్పుడు నీ కథామృతము ద్రావంగల్గునే భూరి దా
న నిరూఢత్వములేని వారలకు మానారీమనోహారకా ! 1044

లక్ష్మీదేవి మనస్సును రంజింపజేయు శ్రీహరీ! (కృష్ణా!) నీ కథామృతమును గ్రోలినవారికి అది సిరిసంపదలను గూర్చును, శుభములను కొల్లలుగా ప్రసాదించును, కామము, క్రోధము, మొదలగు అరిషడ్వర్గమును రూపుమాపును. సనకాదియోగీశ్వరులచే ప్రస్తుతింపబడుచుండును. నిరంతరము తీవ్రమైన తపస్సులలో మునిగియుండు మహాత్ములకు జీవనమై (ప్రాణప్రదమై) విరాజిల్లుచుండును. అట్టి నీ కథామృతమును ప్రశస్తములైన దానధర్మములను చేయనివారు గ్రోలజాలరు.

క. నీ నగవులు నీ చూడ్కులు, నీ నానావిహరణములు నీ ధ్యానంబుల్
నీ నర్మాలాపంబులు, మానసముల నాటి నేఁడు మగుడవు కృష్ణా ! 1045

కృష్ణా! అందమైన నీ చిఱునవ్వులు, మధురములైన నీ చూపులు, ఆకర్షణీయములైన నీ విహారములు, మైమఱపించు నీ ధ్యానములు సంతోషమును ఉప్పొంగజేయు నీ సరసాలాపములు మా మనస్సులను కట్టిపడవేసినవి. (మా మనస్సులలో స్థిరముగా నిలిచియున్నవి.) అవి ఎన్నటికిని మా నుండి తొలగిపోయెడివి కావు. దయజూడుము.

ఆ. ఘోషభూమి వెడలి గోవుల మేపంగ, నీరజాభమైన నీ పదములు
కసవు శిలలు దాఁకి కడునొచ్చునో యని కలఁగు మా మనములు కమలనయన! 1046

కమలనయనా! నీవు గొల్లపల్లెనుండి బయల్వెడలి, గోవులను మేపుచు తిరుగుచుందువు. అప్పుడు పద్మములవలె సుతిమెత్తనైన నీ పాదములకు గడ్డిగాదముల వలనను, ఱాయిఱప్పలవలనను, నొప్పి కలుగునేమో? అని మా మనస్సులు తల్లడిల్లుచుండును.

ఉ. మాపటివేళ నీవు వనమధ్యము వెల్వడి వచ్చి గోష్పద
ప్రాపిత ధూళిధూసరిత భాసితకుంతలమై సరోరుహో
ద్దీపితమైన నీ మొగము ధీరజనోత్తమ మాకు వేడ్కతోఁ
జూపి మనంబులన్ మరునిఁ జూపుదు గాదె క్రమక్రమంబునన్. 1047

ధీరుడవైన మహాత్మా! నీవు సంధ్యాసమయమున గోవులతోగూడి తిరిగివచ్చునప్పుడు నీ మోముపైగల ముంగురులు ఆ ఆవుల గిట్టల తాకిడికి పైకి లేచిన దుమ్ములతో నిండి బూడిదవర్ణము కలిగియుండును. కమలమువలె శోభిల్లుచుండెడి నీ ముఖమును వేడుకతో మాకు చూపి, క్రమక్రమముగా మా మనస్సులలో నీ వలపులను నింపుము.

ఆ. భక్తకామదంబు బ్రహ్మాసేవిత మిలా, మండనంబు దుఃఖమర్దనంబు
భద్రకరమునైన భవదంఘ్రియుగము మా, యురములందు రమణ యునుపఁదగదె. 1048

రమణా! నీ పాదద్వయము భక్తులపాలిటి కల్పవృక్షము, నిరంతరము బ్రహ్మదేవునిచే సేవింపబడుచుండును. ఆ పాదములజంట ఈ భూమండలమునకే వన్నెను గూర్చును, ఆర్తులదుఃఖములను రూపుమాపి, శుభములను చేకూర్చును. అట్టి నీ పాదపద్మములు మా హృదయములయందు నిలుపదగదా?

ఆ. సురతవర్ధనంబు శోకాపహరణంబు స్వరితవంశనాళసంగతంబు
నన్యరాగజయము నయిన నీ మధురాధరామృతమునఁ దాపమార్పు మీశ! 1049

కృష్ణప్రభూ! తియ్యతియ్యని నీ అధరామృతము కామవాంఛలను పెంపొందింపజేయును. విరహబాధను తొలగించును. మధురగానమును ప్రసరింపజేసెడి పిల్లనగ్రోవికి ముద్దుముచ్చటలను దీర్చుచుండును. అసాధారణమైన ప్రేమానురాగములను వృద్ధిచేయును. అట్టి నీ అధరామృతమును గ్రోలజేసి, మా తాపములను చల్లార్చుము.

ఉ. నీవడవిం బగల్ దిరుగ నీకుటిలాలకలాలితాస్యమి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనుం
గావున రాత్రులైన నినుఁ గన్నుల నెప్పుడుఁ జూడకుండ ల
క్ష్మీవర! ఱెప్పలడ్డముగఁ జేసెనిదేల విధాత క్రూరుఁడై. 1050

లక్ష్మీనాథా! (శ్రీకృష్ణా!) నీవు పగటిపూట గోవులను మేపుటకై వనములలో తిరుగుచుందువు. అందువలన అప్పుడు ముద్దులొలికెడి ముంగురులతో అలరారుచుండెడి నీ ప్రసన్నముఖమును గాంచెడి భాగ్యము లేకుండుటచే మాకు క్షణమొకయుగముగా తోచుచున్నది. కావున రాత్రులయందైనను నిన్ను తనివితీరగాంచి ఆనందించుటకు మేము ఎంతగా ఉబలాటపడుచున్నను ఆవిధాత మా కనులకు ఱెప్పలను అడ్డముగా పెట్టినాడు. అతడెంతటి క్రూరుడోగదా!

ఉ. అక్కట! బంధులున్ మగలు నన్నలుఁ దమ్ములుఁ బుత్రకాదులున్
వెక్కొని రాత్రిఁ బోకుఁడన నీ మృదు గీతరవంబు వీనులన్
వెక్కసమైన వచ్చితిమి వేగమె మోహమునొంది నాథ నీ
వెక్కడఁ బోయితో యెఱుఁగమీక్రియ నిర్దయుఁ డెందుఁ గల్గనే. 1051

స్వామీ! రాత్రివేళ మధురమైన నీ మురళీనాదము చెవులబడినంతనే మేము మోహపరవశలమై, నిన్ను దర్శించుటకు బయలుదేఱితిమి. 'ఇట్టి సమయమున మీరు బయటికి వెళ్లరాదు' అనుచు మా భర్తలు, అన్నదమ్ములు, పుత్రులు, బంధువులు మున్నగువారు ఎంతగానో మమ్ము ఆపుటకు ప్రయత్నించిరి. ఐనను వారిమాటలను పాటింపక నిన్ను గాంచుటకై వచ్చితిమి. ఇంతకును నీవు ఎక్కడికి వెళ్లితివో తెలియుటలేదు. ఏమాత్రమూ కనికరములేని నీ వంటివాడు ఎవ్వడైనను ఉండునా?

తే. మదనుఁ దార్చంగ నీ వాడుమంతనములు నవరసాలోకనంబగు నగుమొగంబు
కమలకిరవైన మహిత వక్షస్స్థలంబు, మా మనంబుల లోఁగొని మఱపెఁ గృష్ణ! 1052

కృష్ణా! ఏకాంతసమయమున మాలో మరులు నింపెడి నీ సరసాలాపములు, శృంగారాది నవరసములను[1] ఒలికించెడి నీ చిఱునవ్వుముఖము, లక్ష్మీదేవికి నిలయమైన (మనోహరమైన) నీ విశాలవక్షఃస్థలము మా మనస్సులను దోచుకొని, మమ్ములను పరవశింపజేయుచుండును.

1. శ్లో॥ శృంగారవీరకరుణాద్భుత హాస్య భయానకాః ।
బీభత్సరౌద్రశాంతాశ్చ రసా నవ ప్రకీర్తితాః ॥
నవరసములు - శృంగారము, వీరము, కరుణము, అద్భుతము, హాస్యము, భయానకము, బీభత్సము, రౌద్రము, శాంతము.

మ. అరవిందంబులకంటెఁ గోమలములై యందంబులై యున్న నీ
చరణంబుల్ కఠినంబులై మొనయు మా చన్నుంగవల్ మోవఁగా
నెరియం బోలు నటంచుఁ బొక్కుదుము నీ యీ కర్కశారణ్య భూ
పరిసంచారము కృష్ణ! నీ ప్రియలకుం బ్రాణవ్యథం జేయదే. 1053

ప్రభూ! అందములను చిందించెడి నీ పాదములు పద్మములకంటెను మృదువైనవి. వాటిని కఠినమైన మా వక్షఃస్థలములయందు ఉంచినప్పుడు ఆచరణములు మిక్కిలి కందిపోవునేమోయని మేము వేదన పడుచుందుము. అరణ్యములయందలి కటికనేలలపై సుతిమెత్తని అడుగులతో నీవు సంచరించునప్పుడు నీ ప్రియలమైనమాకు ప్రాణాంతకముగా తోచుచుండును.

క. కట్టా! మన్మథుకోలలు, నెట్టన నోనాట బెగడి నీ పాదంబుల్
వట్టికొనఁగ వచ్చిన మము, నట్టడవిని డించి పోవ నాయమె కృష్ణా! 1054

కృష్ణా! అయ్యో! మన్మథునిబాణములు మాలో నాటుకొని, ఎంతయు బాధించుచుండగా భీతిల్లి (తాళలేక) నీ పాదములను ఆశ్రయించుటకై వచ్చితిమి. అట్టి మమ్ము నీవు ఈ విధముగా అడవులపాలుచేసి పోవుట న్యాయమా!

క. హృదయేశ్వర! మా హృదయము, మృదుతరముగఁజేసి తొల్లి మిక్కిలి కడ నీ
హృదయము కఠినము చేసెను, మదీయ సౌభాగ్య మిట్టి మందము గలదే. 1055

ప్రాణనాథా! మునుపు నీ లీలావిలాసములతో 'మా హృదయములను ద్రవింపజేసితివి. కాని ఇప్పుడు నీవు కఠిన హృదయుడవైతివి. ఇట్టిస్థితికి లోనైన మేము ఎంతటి మందభాగ్యలమోగదా!

ఉ. క్రమ్మి నిశాచరుల్ సురనికాయములన్ వడిఁ దాఁకి వీఁక వా
లమ్ముల తెట్టెముల్ వఱప నడ్డము వచ్చి జయింతువండ్రు ని
న్నమ్మిన ముగ్ధలన్ రహితనాథల నక్కట నేఁడు రెండుమూఁ
డమ్ముల యేటుకాఁ డెగువ నడ్డము రాఁదగదే కృపానిధీ 1056

దయానిధీ! లోగడ రాకాసిమూకలు విజృంభించి, దేవతలపై వాడియైన బాణములను ఎడతెరపిలేక ప్రయోగించుచున్నప్పుడు నీవు దేవతలకు అండగాజేరి, రాక్షసులను రూపుమాపితివట. ఇప్పుడు అబలలమైన మేము నిన్నే నమ్ముకొనివచ్చితిమి. మమ్ములను మన్మథుడు తన పూలబాణములతో వేధించుచున్నాడు. దిక్కులేనివారమైన మమ్మ ఆ మదనునిబారినుండి రక్షింపదగదా?

క. తియ్యవిలుకాఁడు డీకొని, వ్రయ్యలుగాఁ దూఱనేసె వనితలమనముల్
వియ్యాన నింత నయినం, గు య్యాలింపం గదయ్యఁ! గోవింద! హరీ! 1057

గోవిందా!శ్రీహరీ! చెఱకుగడ విల్లుగాగల కాముడు తన తీవ్రమైన శరములతో మా హృదయములను చీల్చిచెండాడుచున్నాడు' ఇప్పటికైనను నీవు ప్రేమతో మా మొఱలాలకింపుము".

మ. అని యిట్లంగన లంచితస్వరముతో నంకించుచుం బాడుచుం
దను రావే యని చీరి యేడువ జగత్త్రాణుండు త్రైలోక్య మో
హనుఁడై మన్మథమన్మథుం డయి మనోజ్ఞాకారియై హారియై
ఘన పీతాంబరధారియై పొడమెఁ దత్కాంతాసమీపంబునన్. 1058

ఈ విధముగా ఆ గోపికలు దైన్యస్వరముతో (జాలిగొలిపెడి మాటలతో) శ్రీకృష్ణుని పొగడుచు, కీర్తించుచు 'జగన్నాథా! రమ్ము' అని పిలుచుచు ఏడువసాగిరి. ఆ శ్రీహరి (కృష్ణుడు) మన్మథుని మించిన సుందరుడు, తన అందచందములతో ముల్లోకములను మోహింపజేయగలవాడు. ఆ స్వామి ఆకారము ఎంతయు ఆహ్లాదకరము. హారములతో, పట్టుపీతాంబరములతో విరాజిల్లుచున్న ఆ జగద్రక్షకుడు వెంటనే ఆ గోపకాంతలయెదుట ప్రత్యక్షమాయెను.

క. వచ్చిన వల్లభుఁ గనుఁగొని, విచ్చేసె నటంచు సతులు వికసితముఖులై
యచ్చుగ ప్రాణము లొడలికి, వచ్చిన నిలుచుండు నవయవంబుల భంగిన్. 1059

జగద్వల్లభుడైన శ్రీకృష్ణునిరాకతో ఆ రమణీమణులు ఎంతయు సంతసించిరి. పోయిన ప్రాణములు తిరిగివచ్చినప్పుడు అవయవములు అన్నియును చైతన్యవంతములై విలసిల్లినట్లుగా వారు వికసితముఖులైరి.

సీ. అబల యొక్కతె భక్తి నంజలి గావించి ప్రాణేశుకెంగేలు వట్టికొనియె
నింతి యొక్కతె జీవితేశ్వరుబాహువు మూఁపున నిడికొని ముదమునొందె
వనిత యొక్కతె తన వల్లభు తాంబూల చర్వితమాత్మహస్తమునఁ దాల్చెఁ
బడఁతి యొక్కతె ప్రియుపదములు విరహాగ్నితప్తకుచంబులఁ దాఁపుకొనియె
ఆ. భామ యొకతె భ్రుకుటిబంధంబు గావించి ప్రణయభంగరోషభాషణమున
దష్టదశన యగుచు దండించు కైవడి వాఁడి చూడ్కిగముల వరునిఁ జూచె. 1060

అంతట ఒక గోపిక భక్తితో అంజలిఘటించి, శ్రీకృష్ణుని యొక్కసుకుమారమైన చేతిని పట్టుకొనెను. మఱియొక వనిత ఆ ప్రభువుయొక్క బాహువును తన వీపుపై చేర్చుకొని మిగుల మురిసిపోయెను. ఇంకొకసుందరి ఆ స్వామియొక్క నోటిలోని తాంబూలమును తన చేతితో లాగికొనెను. వేఱొకయువతి తనకు ప్రియుడైన శ్రీకృష్ణుని పాదములను విరహాగ్నిచే వేడెక్కిన తన వక్షఃస్థలముపై చేర్చుకొనెను. మఱియొక భామ బొమముడివైచి, ప్రణయకోపముతో, పరుషములాడుచు, పండ్లు పటపట కొఱకుచు, దండింపబోవుచున్నట్లుగా, వాడియైన చూపులతో ఆ ప్రభువువైపు చూచెను.

క. హరిముఖకమలముఁ జూచుచుఁ, దరుణి యొకతె ఱెప్పలిడక తనియక యుండెన్
హరిపదకమలముఁ జూచుచు, మరగి తనివిలేని సుజనుమాడ్కి నరేంద్రా! 1061

మహారాజా! శ్రీహరియొక్క పాదపద్మములను గాంచుచు (సేవించుచు) ఎంతకును తృప్తినిపొందని సత్పురుషుని (పరమభక్తుని) వలె, ఒక సుందరి శ్రీకృష్ణుని ముఖకమలమును తదేకధ్యాసతో కన్నులప్పగించి దర్శించుచున్నను ఆమెకు తనివిదీరకుండెను.

ఉ. ఒక్కలతాంగి మాధవుని యుజ్జ్వలరూపము చూడ్కి తీవలం
జిక్కఁగఁ బట్టి హృద్గతముఁ జేసి వెలిం జనకుండ నేత్రముల్
గ్రక్కున మూసి మేనఁ బులకంబులు గ్రమ్మఁగ గౌఁగిలించుచుం
జొక్కములైన లోచవులఁ జొక్కుచు నుండెను యోగికైవడిన్. 1062

ఒకానొక రమణి ఉజ్జ్వలమైన శ్రీకృష్ణునిరూపమును తన చూపులనెడి తీవలతో బంధించెను. పిదప మనోజ్ఞమైన ఆ రూపము బయటికిపోకుండ (తన మనస్సున చెదరిపోకుండ) వెనువెంటనే కనులు మూసికొనెను. అనంతరము ఆ భామిని (ఆ కృష్ణప్రభువు తన చెంతనే యున్నట్లు భావించుచుండుటచే) పరవశించి, తన తనువున పులకలెత్తునట్లుగా ఆ మూర్తిని గాఢముగా కౌగిలించుకొనెను. ఫలితముగా ఆమె యోగివలె నిర్మలమైన మానసికానందముతో చొక్కి సొలిపోసాగెను.

సీ. ఎలయించి ప్రాణేశ! యెందుఁ బోయితివని తోరంపుటలుకతో దూఱె నొకతె
జలజాక్ష! ననుఁబాసి చనఁగ నీ పాదంబులెట్లాడెననివగనెయిదె నొకతె
నాథ! నీ వరిగిన నా ప్రాణమున్నది కూర్మియే యిది యని కుందె నొకతె
యీశ్వర! నను నిన్ను నిందాఁకఁ బాపెనే పాపపు విధి యని పలికె నొకతె
ఆ. తలఁగి పోవునట్టి తప్పేమి సేసితి నధిప! పలుకు ధర్మమనియె నొకతె
యేమి నోముఫలమొ హృదయేశ! నీ మోము మరలఁ గంటిననుచు మసలె నొకతె 1063

అంతట ఒక గోపిక 'ప్రాణేశా! నన్ను చేరినట్లే చేరి ఎక్కడికి పోయితివి?' అనుచు తీవ్రమైన కోపముతో నిందింపసాగెను. మఱియొక భామ 'కమలనయనా! నన్ను విడిచిపెట్టి వెళ్లుటకు నీకు కాళ్లు ఎట్లాడెను?' అని పరుషములాడుచు తీరని విచారముతో అటనుండి వెడలిపోసాగెను. ఇంకొకకాంత 'నాథా! నీవు నాకు దూరముగా వెళ్లినప్పటికిని నా ప్రాణములు ఇంకను నిలిచియే యున్నవి. నీవు ఇట్లు చేయుట న్యాయమేనా?' అని మిగుల దుఃఖించెను. వేఱొక గోపిక 'ప్రభూ! ఆ పాపపువిధి మనకు ఇట్లు ఎడబాటు కల్పించెను' అని దైవమును నిందించుచు పలికెను. వేఱొక వనిత 'స్వామీ! నీవు నాకు దూరముగా వెళ్లిపోవునంతటి తప్పును నేనేమి చేసితిని. ఇట్లు చేయుట నీకు ధర్మమా?' అని నుడివెను. మఱియొక కాంత 'ప్రాణేశ్వరా! నా నోములపంటగా నీ ప్రసన్నముఖమును మఱల చూడగలిగితిని' అని వచించుచు అచట మసలెను.

క. పలికినఁ బ్రతిజ్ఞఁ దప్పెడిఁ, బలికించినఁ గాని రమణుఁ బలుక నటంచుం
గలకంఠి యొకతె చెలితోఁ, బలుకులనమృతములు గురియు పగిదిం బలికెన్. 1064

వేఱొక తరుణి 'నా కాంతుడే ముందుగా నాతో మాట్లాడిననేగాని నేను ఆయనతో పలుకను. నేనే ముందుగా ఆయనను పలుకరించినచో నా ప్రతిజ్ఞ భంగమగును' అనుచు తన మాటలలో అమృతము ఒలుకునట్లుగా తన చెలితో వచించెను.

క. పట్టినఁ గాని మనోవిభుఁ, బట్టఁగదా యంచు నొక్క బాలిక సఖిచే
పట్టుకొని చెప్పె ధైర్యము, పట్టెల్లను మరునిటెంకిపట్టుగ నధిపా! 1065

రాజా! అంతట ఒక కన్య 'నా ప్రభువు నన్ను చేరదీయనిచో నేను ఆయనను తాకనే తాకను' అది యనుచు తన చెలికత్తెచేతిని పట్టుకొని చెప్పెను. ప్రణయవిషయములో ధైర్యము ఎంతవఱకు నిలుచును? (మన్మథుని ప్రభావమున ధైర్యము సన్నగిల్లుట సహజమేగదా!)

క. చెలువుఁడు సెప్పకపోయిన, సొలపున నొకముగ్ధ మున్ను చూడ ననుచు నొఁ
దల వంచి యుండఁ జాలక, దల యెత్తెను లోన మరుఁడు తలయెత్త నృపా! 1066

పరీక్షిన్మహారాజా! 'నా ప్రాణప్రియుడు నాకు మాటమాత్రము చెప్పకుండా వెళ్లినాడు. కాబట్టి నేను ముందుగా ఆయనవైపే చూడను' అనుచు ఒక ముద్దరాలు పారవశ్యముతో పలికి తలవంచుకొనియుండెను. కాని శ్రీకృష్ణునిపై తనకుగల మరులు తొందరపెట్టుటతో ఆమె తలపైకెత్తెను.

వ. ఇ వ్విధంబున. 1067

క. హరిసురుచిర లలితాకృతిఁ, దరుణులు గని ముక్తవిరహతాపజ్వరలై
పరమోత్సవంబు సలిపిరి, పరమేశ్వరుఁ గనిన ముక్తబంధులభంగిన్. 1068

ఈవిధముగా తరుణీమణులు మిగుల అందములొలికెడి శ్రీకృష్ణుని సుకుమార (మనోహర) రూపమును చూచినంతనే వారి విరహతాపములు అన్నియును మటుమాయమయ్యెను. అంతట వారు పరమేశ్వరుని దర్శించుటచే భవబంధములనుండి విముక్తులైనవారివలె పరమానందముతో ఉత్సవములను జేసికొనిరి.

వ. అంత నక్కాంతుండు కాంతాజనపరిక్రాంతుండై, వనాంతరంబున శక్తినికరసంయుక్తుండైన పరమపురుషుండునుం బోలె, వారలం దోడ్కొని, మందార కుంద కుసుమ పరిమళ మిళిత పవమాన మానిత మధుకర నికర ఝుంకార సుకుమారంబును, శరత్కాల చంద్రకిరణ సందోహ సందళితాంధకారంబును, యమునా తరంగ సంగత కోమల వాలుకా స్ఫారంబునునై, యమలినంబైన పులినంబు ప్రవేశించె, వారును జ్ఞానకాండంబున నీశ్వరుం గని శ్రుతులు ప్రమోదంబునం గామానుబంధంబులు విడిచిన విధంబున, హరిం గని, విరహావేదనలు విడిచి, పరిపూర్ణమనోరథలై. 1069

అంతట ఆ శ్రీకృష్ణుడు గోపకాంతలు తనచుట్టును చేరియుండగా వనమధ్యమున శక్తి మొదలగు ఆయుధములతో గూడిన శ్రీమహావిష్ణువువలె వారలను వెంటనిడికొని, యమునానదీతీరమునందు నిర్మలముగా నున్న ఇసుకతిన్నెపై చేరెను. అచట మందారపుష్పములు, మల్లెపూవులు సువాసనలను వెదజల్లుచుండెను. ఆ కుసుమములమీదుగా వీచుచున్న వాయువులు అంతటను పరిమళములను వ్యాపింపజేయుచుండెను. ఆ గాలుల గుబాళింపులచే ఆకర్షింపబడిన తుమ్మెదలయొక్క ఝుంకారములు వీనులవిందుగావించుచుండెను. శరత్కాల చంద్రునియొక్క వెన్నెలకాంతులకు చీకట్లు తొలగిపోయెను. యమునానదీ తరంగములస్పర్శప్రభావమున మనోహరమై ఒప్పుచున్న ఇసుకతిన్నెల తెల్లని కాంతులు చూడముచ్చట గొల్పుచుండెను. శ్రుతులు జ్ఞానవిభాగముచే [1] (ఉపనిషద్విజ్ఞానముచే) పరాత్పరునిదర్శించి, మిక్కిలి సంతోషముతో కర్మకాండమును ప్రక్కనబెట్టిన రీతిగా, శ్రీకృష్ణునిదర్శనము అగుటచే ఆ గోపికలును విరహవేదనలను విడిచిపెట్టి సంపూర్ణ మనోరథలైరి.

క. పాఠీనయనలెల్లన, కాఠిన్య పటాంచలములఁ గౌతుకములు హృ
త్పీఠముల సందడింపఁగఁ, బీఠము గల్పించిరంతఁ బ్రియునకు నధిపా! 1070

రాజా! మత్స్యములవలె తళుకులీనెడి నేత్రములుగల ఆ గోపికలు అందఱును మనస్సులలో వేడుకలు ఉరకలెత్తుచుండగా మృదువైన తమ చీరచెరగులతో ఎంతయు ఇష్టుడైన శ్రీకృష్ణునకు ఆసనములను ఏర్పఱచిరి.

ఆ. పరమ యోగిహృదయ భద్రపీఠంబుల నుండు మేటి వ్రజవధూత్తరీయ
పీఠమున వసించి పెంపారెఁ ద్రిభువన దివ్యలక్ష్మి మేనఁ దేజరిల్ల. 1071

శ్రీకృష్ణుడు పరమయోగీశ్వరులయొక్క హృదయములనెడి సింహాసనములపై వసించుచుండెడి పరమాత్మ. సకలలోక దివ్యసౌందర్యములతో శోభిల్లుచుండెడి ఆ ప్రభువు గోపకాంతలు తమ పమిటెలతో ఏర్పఱచిన ఆసనములపై అధిష్ఠించెను.

మ. మదనోద్దీకుఁడైన నాథునికి సమ్మానంబు గావించుచున్
ముదితల్ హాస విలోక విభ్రమములన్ మోదించుచున్ జేరి త
త్పదముల్ హస్తతలంబులం బిసుకుచుం బైముట్టుచున్ దూఱుచుం
జదురుల్ పల్కుచుఁ గూర్మి నిట్లనిరి యీషత్కోపదీప్తాస్యలై. 1072

అంతట ఆ గోపికలు తమలో మరులను రేకెత్తింపజేసెడి ఆ స్వామిని గౌరవాదరములతో సమ్మానించుచు తమ చిఱునవ్వులతో, ఒయ్యారపు చూపులతో మురిపింపజేయసాగిరి. పిదప వారు ఆనందనందనుని సమీపించి, తమ సుతిమెత్తని

1. జ్ఞానకాండము అనునది వేదములలోని ఒక విభాగము. ఆ విభాగములోనివే ఉపనిషత్తులు. ఉపనిషద్విజ్ఞానమును పొందిన యోగులు కర్మకాండమును ప్రక్కనబెట్టి, జ్ఞానసాధనలతో పరమాత్మని దర్శింపగలుగుదురు. అప్పుడు వారికి బ్రహ్మానందానుభూతి కలుగును. అట్లే శ్రుతులఅంశలతో జన్మించిన గోపికలును శ్రీకృష్ణదర్శనముతో కనువిప్పు గలిగి, లౌకికములైన విరహావేదనలను అధిగమించి, పరమానందమును పొందిరి.

చేతులతో సుకుమారములైన ఆయనపాదములను ఒత్తుచు, మీదిమీదికి చేరుచు, నిందించుచు, చతురోక్తులాడుచు (సరసములాడుచు) చిఱుకోపములను ప్రకటించుచు, ప్రేమపూర్వకముగా ఇట్లనిరి.

క. కొలిచినఁ గొలుతురు కొందఱు, కొలుతురు దముఁ గొలువకున్నఁ గొందఱు పతులం,
గొలిచినను గొలువకున్నను, గొలువరు మఱికొందఱెలమి గోపకుమారా! 1073

"గోపకుమారా! కొందఱు స్త్రీలు తమ భర్తలు తమను మెచ్చుకొనినచో వారిని సేవింతురు. మఱికొందఱు తమపతులు తమను ప్రశంసింపకున్నను వారికి సేవలు సలుపుదురు. ఇంకను కొందఱు తమ భర్తలుప్రేమతో తమను మెచ్చుకొనినను, మెచ్చుకొనకున్నను వారిని సేవింపరు".

వ. అని తన్నుద్దేశించి రహస్యంబుగాఁ బలికిన సుందరులపలుకులు విని గోపాలసుందరుం డిట్లనియె.1074

అని ఈ విధముగా ఆ సుందరీమణులు తనను ఉద్దేశించి, గోప్యముగా పలికిన మాటలను వినిన పిదప సుందరుడైన ఆ గోపబాలుడు వారితో ఇట్లు నుడివెను.

సీ. కొలిచినఁ గొలుతురు కొందఱు పశువుల భజనముభంగిని ఫలము కొఱకు
నై సఖ్యధర్మములందు సిద్ధింపవు కొందఱు తండ్రుల గుణముఁ దాల్చి
దయగలవారలు దగిన సుహృత్తులు గొలువనివారలఁ గొల్తురెపుడు
ధర్మకామంబులు తవరంగఁ గొందఱు కొలువని వారిని గొలుచువారిఁ
ఆ. గొలుచు తలఁపు లేమిఁ గొలువరాత్మారాము లాప్తకాములజ్ఞులతి కఠినులు
వారియందుఁ బిదపవానిఁగాఁ జింతించియే లతాంగులార! యిట్టు లనుట 1075

"వనితలారా! కొందఱు పాలు మొదలగువానిని ఆశించుచు పశువులను పోషించునట్లు, ప్రతిఫలాపేక్షగలవారై తమకు మేలు చేసెడివారినే సేవింతురు. ఇందు మైత్రికిగాని, ధర్మమునకు చోటులేదు. స్వార్థబుద్ధియే ఉండును. ఇంక దయాస్వభావముగల కొందఱు తలిదండ్రులు తమ తనయులనువలె నిస్వార్థభావముతో ధర్మదృష్టితో తమను కొలువని వారినిగూడ సేవింతురు. వీరు చక్కని సుహృద్భావముగల వారు. కొందఱు ఎవ్వరినీ సేవించెడి తలంపు లేకుండుటచే తమను సేవించినవారిని, సేవింపనివారినిగూడ కొలువరు. వీరిలో ఆత్మారాములు, (ఆత్మయందే రమించువారు) కోరికలు అన్నియును నెఱవేఱినవారు (భోగేచ్ఛలేనివారు) కృతఘ్నులు, కఠినాత్ములు ఐనవారిలో ఎవ్వరైన కావచ్చును. వారిలో నన్ను చివరివానినిగా (కఠినాత్మునిగా) భావించి మీరు ఇట్లు పలికితిరా?

క. ఏనిందెవ్వఁడ నయినం, గానంగనలార! పరమకారుణికుండన్
మానసబంధుఁడ నిత్య, ధ్యానము మీ కొసఁగవలసి తలఁగితిఁ జుండీ. 1076

కాంతలారా! నేను వీరిలో ఎవ్వడనూ గాను, మిక్కిలి కనికరముగలవాడను, ఆత్మబంధువుడను. మీరు నిరంతరము నన్ను ధ్యానించుటకొఱకే మీకు అదృశ్యుడనైయుంటిని. ఇది నిజము సుమా!

మ. నను సేవించుచునున్న వారలకు నే నా రూపముం జూపఁ జూ
చివఁ జాలించి మదించి వారు మఱి నన్ సేవింపరో యంచు ని
ర్ధనికుం డాత్మధనంబు సెడ్డ నెపుడుం దత్పారవశ్యంబుఁ దా
ల్చినభంగిన్ ననుఁ బాసి మత్ప్రియుఁడు దాఁ జింతించు నారూపమున్. 1077

నన్ను సేవించుచుండెడివారికి నా రూపమును చూపను. నేను అట్టివారికి దర్శనమియ్యను. నా దర్శనము లభ్బినచో వారు అంతటితో తృప్తిపడి, గర్వితులై నన్ను ధ్యానించుట మానివేయుదురు. అది ఎట్లనగా తనయొక్క సంపదలను కోల్పోయిన నిర్ధనుడు నిరంతరము తన ధనమును గూర్చియే చింతించుచుండును. అట్లే నేను కనబడకున్నచో నా భక్తుడు నన్నే (నా రూపమునే) అనవరతము ధ్యానించుచుండును.

తరలము. తగవు ధర్మముఁ జూడ నొల్లక తల్లిదండ్రుల బంధులన్
మగల బిడ్డలఁ బాసి వచ్చిన మన్నిషక్తల మిమ్ము నేఁ
దగదు పాసితిఁ దప్పు సైఁపుడు తద్వియోగభరంబునన్
వగలఁ బొందుచు మీరలాడిన వాక్యముల్ వినుచుండితిన్. 1078

గోపవనితలారా! మీరు మంచిచెడ్డలను మఱచి, (వెనుకముందులు ఆలోచింపక) తల్లిదండ్రులను, పతులను, బంధువులను, సంతానమును వీడి, నాయందే మనస్సు నిల్పి, నాకడకు వచ్చితిరి. అట్టి మీకు కనుమఱుగగుట ఏ మాత్రమూ తగదు. నా తప్పును మన్నింపుడు. తీవ్రమైన నా యెడబాటుతో కుమిలిపోవుచు మీరు పలికినమాటలను నేను ఆలకించుచునే యుంటిని.

ఉ. పాయని గేహశృంఖలలఁ బాసి నిరంతర మత్పరత్వముం
జేయుచు నన్న మీకుఁ బ్రతిసేయ యుగంబులనైన నేర నన్
బాయక కొల్చు మానసము ప్రత్యుపకారముగాఁ దలంచి నా
పాయుట తప్పుగాఁగొనక భామినులార! కృపన్ శమింపరే. 1079

భామినులారా! సంసారపు సంకెళ్లను వదిలించుకొనుట అసాధ్యము. ఐనను వాటిని ప్రక్కకునెట్టి (ఛేదించుకొని) మనస్సులను నాయందే నిలుపుచు మీరు నా దరిచేరితిరి. అట్టి మీకు ఎన్నియుగములకైనను తగిన ప్రత్యుపకారమును చేయజాలను. నిరంతరము నన్ను సేవించెడి మనస్సును మీకు ఒసంగెదను. దీనినే నేనొర్చెడి ప్రత్యుపకారముగా భావించుడు. నేను మీకు దూరమగుటను తప్పుగా తలంపక కృపతో నన్ను మన్నింపుడు.

క. చక్కగ హరి యిటు పలికిన, చక్కని వాక్యముల నతనిసంగమమున లో
నిక్కిన వియోగతాపము, లొక్కట విడిచిరి లతాంగులుర్వీనాథా! 1080

పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడు మిగుల ప్రీతికరముగా పలికిన మధురవచనములు ఆ గోపకాంతలలో ఎంతయు సంతోషమునునింపెను. అతనిసాన్నిధ్యమునకు చేరుటతో వారి విరహతాపములు అన్నియు ఒక్కసారిగా మటుమాయమయ్యెను.

## రాసక్రీడాభివర్ణనము

ఉ. ఆ సమయంబునన్ విభుఁడనంతుఁడు కృష్ణుఁడు చిత్రమూర్తియై
చేసెను మండల భ్రమణ శీల పరస్పర బద్ధ బాహు కాం
తాసువిలాసమున్ బహువిధ స్ఫురితానన హస్త పాద వి
న్యాసము రాసముం గృతవియచ్చరనేత్రమనోవికాసమున్. 1081

అంతట ఆ శరద్రాత్రియందు అనంతుడైన శ్రీకృష్ణుడు చిత్రమగురీతిలో పలు ఆకారములను దాల్చెను. (పెక్కుమంది కృష్ణులుగా మాఱెను.) పిదప ఆ స్వామి మండలాకారములో నిలిచియున్న గోపకాంతల మధ్య చేరి, చెట్టపట్టాలు వేసికొని

(ఒకరి బుజములపై మఱియొకరు చేతులు వేసికొని) విలాసముగా రాసలీలలను నెఱపెను. ఆ రాసలీలలు గోపికాకృష్ణులయొక్క పలువిధములగు ముఖభంగిమలతో హస్తవిన్యాసములతో, పాదవిక్షేపములతో వైభవోపేతముగా విరాజిల్లెను. ఆ మధుర దృశ్యములు ఆకాశమున నిలిచి తిలకించుచున్న దేవతలకు కనువిందు గావించెను. వారి మనస్సులను రంజింపజేసెను.

వ. ఇట్లు బహుగతులందిరుగ నేర్పరి యగు హరి దర్పించి, తన యిరుగెలంకుల నలంకృతలై, కళంక రహిత చంద్రవదనలిద్దఱు ముద్దియలుద్దిగొని, వీణలందుకొని, వీణలం బ్రవీణలై, సొంపు మెఱసి, యింపుగ వాయించుచు, నానందలహరీ నిధానంబగు గానంబు సేయ, నవిరళంబై తరళంబు గాని వేడుక సరళంబగు మురళంబు లీలం గేలనందుకొని, మధురంబగు నధరంబునం గదియించి, మించి కామినీజన కబరికా సౌగంధిక గంధబంధుర కరాంగుళీ కిసలయంబులు యతిలయంబులం గూడి వివరంబుగ మురళీవివరంబుల సారించి, పూరించుచు, సరిలేని భంగిం ద్రిభంగియై, కమలకర్ణికాకారంబున నడుమ నిలిచి, మఱియు గోపసుందరులెందఱందఱకు నందఱయి, సుందరులకవలియెడలం దానును, దనకవలియెడల సుందరులును దేజరిల్ల, నృత్తవిద్యా మహార్ణవ వేలావలయ వలయితంబై విస్మితాఖండలంబైన రాసమండలంబుఁ గల్పించి, వేల్పులు హర్షంబునం గుసుమవర్షంబులు కురియ, నందుఁ బ్రసూనమంజరీ సహచరంబులైన చంచరీకంబులమించు ప్రకటించుచు, సువర్ణమణిమధ్యగంబులైన మహేంద్రనీలంబులతెఱంగు నెఱపుచుఁ, గరిణీవిహారబంధురంబులై సింధురంబులచెలువుఁ గైకొనుచుఁ, బల్లవితకుసుమిత లతానుకూలంబులైన తమాలంబులసొబగు నెగడించుచు, మెఱపుఁదీవల నెడనెడం బెడంగడరు నల్లమొగిళ్లపెల్లు సూపుచు, తరంగిణీ సంగతంబులైన రోహణాచలశృంగంబులబాగులాలించుచు, జగన్మోహనుండై యుండి, రక్త కమలారుణంబులును, జంద్రశకలనిర్మల నఖర సంస్ఫురణంబులును శ్రుతిసీమంతినీ సీమంత వీధికాలంకరణంబులును, సనక సనందనాది యోగీంద్ర మానసాభరణంబులునునయినచరణంబులుగదియ నిడి, సమస్థితినంజలి పుటంబులంబుష్పంబులుల్లసిల్లఁజల్లి, సల్లలిత కమలప్రశస్తంబులయిన హస్తంబులు వల్లవీజనులకంఠంబులపై నిడి, తాను గీతానుసారంబుగ విచిత్రపాద సంచారంబులు సలుపుచు, వర్తులాకారరాసబంధంబులనర్తనంబునం బ్రవర్తించి, వెండియు వ్రేతలుం, దానును, శంఖ పద్మవజ్రకందుక చతుర్ముఖ చక్రవాళ చతుర్భద్ర సౌభద్ర నాగ నంద్యావర్త కుండలీకరణ ఖురరీబంధ ప్రముఖంబులైన విశేష రాసబంధంబులకుం జొచ్చి, యేకపాద సమపాద వినివర్తిత గతాగత వలిత వైశాఖమండల త్రిభంగి ప్రముఖంబు లైన తానకంబుల నిలుచుచుఁ, గనక కింకిణీ మంజుల మంజీర శింజనంబులు జగజ్జన కర్ణరంజనంబులై చెలంగ, ఘటిత మర్దిత పార్శ్వగ ప్రముఖంబులైన పాదకర్మ భేదంబులు సేయుచు, సమపాద శకట వదనమత్తల్లీ శుక్తిప్రముఖంబులైన పార్థివచారివిశేషంబులును, నపక్రాంత డోలాపాదసూచీప్రముఖంబులైన వ్యోమచారివిశేషంబులంజూపుచు, సురేంద్రశాఖి శాఖామనోహరంబులును, నపహసితదిక్కరీంద్ర కరంబులును, ద్రిలోక క్షేమంకరంబులును, నగు కరంబులందిరంబులగు రత్న కటకంబులమెఱుంగులు నింగి చెఱంగులం దఱచుకొన, నర్ధచంద్ర కర్తరీ ముఖకపిత్థ కటకాముఖ శుకతుండ లాంగూల పద్మకోశ పతాకప్రముఖంబులైన స్వస్వభావసూచక నానావిధకరభావంబులాచరించుచుఁ గటినిబద్ధ సువర్ణ వర్ణ చేలాంచలప్రభానికరంబులు సుకరంబులై దిశాంగనా ముఖంబులకు హరిద్రా లేపన ముద్రాలంకారంబులొసంగుచు, నాస్కందిత భ్రమర శకటాసన ప్రముఖంబులైన జానుమండల భేదంబులును, నలాత, దండలాత లలిత విచిత్ర ప్రముఖంబులైన దైవమండలంబులు నొనర్చుచుఁ, గమనీయకంబుకంఠాభిరామంబులు, నుద్దామ తేజస్తోమంబులు నైన నీల మౌక్తిక వజ్ర వైడూర్య దామంబులరుచులిందిరాసుందరీ మందిరంబులయి, సుందరంబులైన యురంబులం

దిరుగుడువడి కలయంబడ, నంగాంతర వాహ్యలకు చ్ఛత్ర ప్రముఖంబు లైన భ్రమణ విశేషంబుల విలసించుచు, నిద్దంబులగు చెక్కుటద్దంబుల ముద్దవిడిందద్దయుం బ్రభాసిత చంద్ర మండలంబులగు కుండలంబు మెఱుంగు మొత్తంబులు నృత్యంబులొనరింపఁ, గటిభ్రాంత దండరచిత లలాట తిలక మయూర లలిత చక్రమండల నికుంచిత గంగావతరణ ప్రముఖంబులైన కరణంబులెఱింగించుచు, వెలిదమ్మి విరులసిరులఁ జెన్ను మిగులు కన్నులవలన దీనజవ దైన్యకర్కశంబులై తనరు కటాక్షదర్శన జాలంబులు జాలంబులై కామినీజన నయనమీనంబుల నావరింప, లలిత, కుంచిత వికాస ముకుళ ప్రముఖంబులైన చూడ్కులం దేజరిల్లుచు, ననేక పరిపూర్ణ చంద్ర సౌభాగ్య సదనంబులగు వదనంబులఁ బ్రసన్న రాగంబులు ప్రకటించుచు, నుదంచిత పింఛమాలికా మయూఖంబులకాల శక్రచాపంబుల సొంపు సంపాదింప, నికుంచితాకుంచిత కంపితాకంపిత పరివాహిత పరావృత్త ప్రముఖంబులైన శిరోభావంబులు నెఱపుచు, మృగనాభితిలకంబులు గల నిటలఫలకంబులఁ జికురంబుల నికరంబులు గప్ప, నపరాజిత సూచికావిద్ధ పరిచ్ఛిన్న విష్కంభ రేచిత ప్రముఖంబులగు నంగహారంబుల విలసిల్లుచుఁ, జరణ కటి కర కంఠ రేచకంబులాచరించుచు నొప్పె నప్పుడా రాసంబు సంజనిత సకలజన మానసోల్లాసకరంబై, సుధార్ణవంబునుం బోలెనుజ్జ్వల రసాభిరామంబై, రామరాజ్యంబునుం బోలె రాగ పరిపూర్ణంబై, పూర్ణ చంద్ర మండలంబునుం బోలెఁ గువలయానందంబై, నందనవనంబునుం బోలె భ్రమర విరాజమానంబై, మానధనుచిత్తంబునుం బోలెఁ బ్రధాన వృద్ధిసమర్థంబై, సమర్థ కవివిలసనంబునుం బోలె బహుప్రబంధ భాసురంబై, సురలోకంబునుం బోలె వసుదేవనందన విశిష్టం బై, శిష్టచరితంబునుం బోలె ధరణిగగన మండల సుందరంబై, సుందరీరత్నంబునుం బోలె నంగహార మనోహరంబై, హారవధూ నిలయంబునుం బోలె ననేక చారి సుకుమారంబై, సుకుమారవృత్తంబునుం బోలె నుద్దీపిత వంశంబై యుండె నందు, 1082

ఈవిధముగా పలురీతుల లీలావిలాసములనునెఱపగల శ్రీకృష్ణుడు ఉత్సాహముతో రాసలీలలను ప్రదర్శింపసాగెను. మచ్చలేని (నిండు) చంద్రునివలె ఆహ్లాదకరములైన ముఖములుగలవారు, వీణావాదనము నందు నేర్పరులు ఐన ఇద్దఱుకాంతలు వివిధములగు అలంకారములతో విరాజిల్లుచు వీణలను చేబూని, వీనులవిందుగా వాయించుచుండిరి. వారు ఆనందతరంగములు వెల్లివిరియునట్లు మధురముగా గానాలాపనలు గావించుచుండిరి. కృష్ణుడు ఏమాత్రము సడలని, చక్కని కుతూహలముతో మురళిని విలాసముగా చేబూని, దానిని మధురైన తన కెమ్మోవిపై (అధరముపై) చేర్చుకొనెను. గోపకాంతలయొక్క కొప్పులపై (సిగలపై) అలంకృతములైన కలువపూలవాసనలతో గుబాళించుచు[1] సుకుమారములై ఒప్పుచున్న (చిగురుటాకులవలె మృదువైన) తన చేతివ్రేళ్లతో ఆ ప్రభువు తాళబద్ధముగా, వీణానాదములకు అనుగుణముగా మధురముగా మురళిని మ్రోగింపసాగెను. ఆ స్వామి సాటిలేని రీతిగా త్రిభంగియై (పాదములను వ్యత్యస్తముగా నుంచినవాడై) తామరపూవులోని దుద్దువలె, అతడు మండలాకారములోనున్న ఆ గోపికలనడుమ విరాజిల్లెను. మఱియు కృష్ణుడు గోపికలసంఖ్యకు అనుగుణముగ తన (కృష్ణ) రూపములతో అలరారుచు, వారికి ఇరుప్రక్కల విలసిల్లుచు,[2] రాసమండలమును కల్పించెను. అప్పుడు అది (ఆ రాసమండలము) నాట్యశాస్త్రమనెడి మహాసముద్రమునకు చెలియలికట్టయా అనునట్లు ఆశ్చర్యకరముగా ఒప్పుచుండెను.

1. కేళీవిలాసములలో భాగముగా కృష్ణుడు కలువపూల వాసనలతో గుబాళించుచున్న గోపికల సిగలపై తన సుకుమారములైన చేతులతో (చేతివేళ్లతో) నిమిరినాడనుట.
2. ఈ దృశ్యమును లీలాశుకుడు 'కృష్ణకర్ణామృతము'నందు ఇట్లు వర్ణించెను.

శ్లో॥ అంగనామంగనామంతరే మాధవో ।
మాధవం మాధవం చాంతరేణాఽంగనా ॥

అప్పుడు దేవతలు మిక్కిలి సంతోషముతో పుష్పవర్షములను కురిపింపసాగిరి. అంతట కృష్ణరూపములు పూలగుత్తులమధ్య తిరుగాడు తుమ్మెదల సోయగములను విరజిమ్ముచుండెను. అట్లే బంగారముపై చెక్కబడిన మణులమధ్యగల ఇంద్రనీలమణులవలె మెఱయుచుండెను, హాయిగా విహరించుచున్న ఆడుఏనుగులమధ్యగల మగ ఏనుగుల రీతిగా భాసిల్లుచుండెను. చక్కని పూవులతో, పుష్పములతో విరాజిల్లుచున్న లతలతో శోభిల్లుచుండెడి తమాల (కానుగ) వృక్షముల సొగసులను నెఱపుచుండెను. మెఱుపుతీగలమధ్య రంజిల్లెడి మేఘముల తీరుతెన్నులను ప్రకటించుచుండెను. జలప్రవాహములమధ్య శోభిల్లుచున్న రోహణపర్వతముయొక్క శిఖరముల కాంతులను మించి అలరారుచుండెను.

కృష్ణుడు ఇట్టి వివిధరూపముల వైభవములతో తేజరిల్లుచు జగన్మోహనమూర్తియై శోభిల్లుచుండెను. ఆ ప్రభువు కెందామరలవలె అరుణశోభలతో రంజిల్లుచున్న తనపాదములను యథాప్రకారము సమముగా చేర్చెను. ఆ స్వామియొక్క చరణములవ్రేళ్ల గోళ్లకాంతులు స్వచ్ఛములైన చంద్రకిరణముల కాంతులను స్ఫురింపజేయుచుండెను. అవి వేదములనెడి కాంతలపాపిటల వరుసలకు వన్నె చిన్నెలను దిద్దునట్టివి. (వైభవోపేతములైన ఆ ప్రభుని పాదకమలములు సకలలోకములకును శిరోధార్యములని వేదములు ప్రశంసించుచున్నవి.) ఇంకను అవి సనకసనందనాది యోగీంద్రుల హృదయములకు ఆభరణములైనట్టివి. (అవి సనకాదిమునీంద్రుల హృదయములలో నిరంతరము ధ్యానింపబడుచుండును) గోపికలకు ఇరుప్రక్కల చేరియున్న కృష్ణులు తమ దోసిళ్లలో పూవులను నింపుకొని ఆ కాంతలందఱిపై సమముగా చల్లుచు, కమలములవలె మిగుల లలితములైన తమ చేతులను విలాసముగా వారిమెడలపై చేర్చిరి. (వివిధ మూర్తులతో విలసిల్లుచున్న ఆ గోపబాలుడే తన లీలలను ఇట్లు ప్రకటించెను.) ఆ స్వామి గోపికలగానములకు తగినట్లు చిత్రముగా పాదవిన్యాసములను గావించుచు, వలయాకారములో అంతటను నృత్యములనొనర్చుచు రాసబంధములను నెఱపుచుండెను.

శ్రీకృష్ణుడును, గోపకాంతలును కలిసి, శంఖము, పద్మము, వజ్రము, కందుకము (బంతి) చతుర్ముఖము, చక్రవాళము, చతుర్భద్రము, సౌభద్రము, నాగము, నంద్యావర్తము, కుండలీకరణము, కురదీబంధము మొదలగు విశేషరాసబంధములను ప్రవర్తిల్లజేసిరి. మఱియును వారు ఏకపాదము, సమపాదము, వినివర్తితము, గతాగతము, వలితము, వైశాఖము, మండలము, త్రిభంగి మొదలగు భంగిమలలో విలసిల్లిరి. వారు నృత్యములొనర్చునప్పుడు బంగారు అందెల చిఱుగజ్జెల సవ్వడులు మనోహరములై, జగత్తునందలి సకలజనులకు వీనులవిందు గావించుచుండెను.

వారు (కృష్ణులు, గోపికలు) ఘటితము, మర్దితము, పార్శ్వగము మొదలగు వివిధములైన పాదవిన్యాసములను నెఱపిరి. ఇంకను వారు సమపాదము, శకటవదనము, మతల్లి, శుక్తి మునగు భూతల సంచార విశేషములను, అపక్రాంతము, డోలాపాదము, సూచి మొదలగు వ్యోమవిన్యాసములను (భూమిని తాకకుండా చేసెడి విన్యాసములను) ప్రవర్తిల్లజేసిరి. వారి హస్తములు కల్పవృక్షముయొక్క కొమ్మలవలె మనోహరములు; దిగ్గజముల తొండముల శోభలను మించి విరాజిల్లుచున్నట్టివి, ముల్లోకవాసులకును క్షేమమును గూర్చునట్టివి. వారు హస్తములయందు ధరించిన, చెక్కుచెదరని రత్నకంకణములకాంతులు పట్టములై ఆకాశపుటంచులవఱకు వ్యాపించుచుండెను. అట్టి కరములతో వారు అర్ధచంద్రము, కర్తరీముఖము, కపిత్థము, కటకాముఖము, శుకతుండము, లాంగూలము, పద్మకోశము, పతాకము మొదలగు హస్తముద్రలను ఆయాభావములకు అనుగుణముగా అభినయించిరి. వారు కటిభాగమున ధరించిన బంగారువన్నెగల పట్టువస్త్రములఅంచులకాంతులు మనోహరములై, దిక్కులనెడి వనితలముఖములకు పసుపువన్నెలను దిద్దుచుండెను. వారు ఆస్కందితము, భ్రమరము, శకటాసనము మున్నగు జానుమండల భేదములను, అలాతము, దండలాతము, లలితము, విచిత్రము మొదలైన దైవమండల విశేషములను గావించుచుండిరి. నీలమణులతో, ముత్యాలతో,

వజ్రవైడూర్యములతో కూర్చిన హారములను వారు తమ మెడలలో ధరించియుండిరి. అవి అద్భుతములైన తేజస్సులతో విరాజిల్లుచుండెను. ఆ హారములకాంతులు రమ్యములైన శంఖములవంటి వారికఠముల శోభలను ఇనుమడింపజేయుచుండెను. ఇంకను అందాలరాశియైన లక్ష్మీదేవికి నివాసస్థానములై (ఆహ్లాదకరముగా విశాలములై) ఒంపుసొంపులను చిందించుచున్న వక్షఃస్థలములయందు ఆ హారములు, వారియొక్క అంగాంతరము, వాహ్యాలగ్నము, ఛత్రము మొదలగు భ్రమణవిశేషముల కారణమున అటునిటు కదలుచు చిక్కుపడుచుండెను.

వారికుండలములకాంతులు, చంద్రమండలశోభలను మించి ప్రకాశించుచు, అద్దములవలె స్వచ్ఛములై నునుపుదేలియున్న వారిచెక్కిళ్లపై ప్రతిఫలించుచు నృత్యములు చేయుచుండెను. వారు కటిభ్రాంతము, దండరచితము, లలాటము, తిలకము, మయూరము, లలితము, చక్రమండలము, నికుంచితము, గంగావతరణము మొదలుగాగల నృత్యవిన్యాసములను గావించుచుండిరి. శ్రీకృష్ణునినేత్రములు తెల్లదామరలయొక్క అందచందాలను క్రిందుగావించుచు శోభిల్లుచుండెను. అవి దీనజనులయొక్క దైన్యములను పాఱద్రోలునవి. ఆ స్వామి మనోహరమైన తన క్రీగంటి చూపులనెడి వలలతో గోపకాంతలయొక్క కన్నులనెడి చేపలను ఆకర్షించుచు, లలితములు (చక్కనిభ్రూవిలాసములు గలవి) కుంచితములు (అర్ధనిమీలితములు) వికాసములు (బాగుగా తెఱవబడినవి) ముకుళములు (మూసికొనబడినవి) మున్నగు నేత్రభంగిమలను ప్రదర్శించెను. పెక్కు నిండు చంద్రులశోభలకు నిలయములైన ముఖములందు (ఆ కృష్ణులు) ప్రసన్నమైన అనురాగములను ప్రకటించుచుండిరి. ఆ కృష్ణులశిరములపై పలువన్నెల కాంతులతో విలసిల్లుచున్న నెమలి పింఛములశోభలు అకాలమునందు ఏర్పడిన ఇంద్రధనుస్సుల సొంపులను తలపింపజేయుచుండగా శిరస్సులు నికుంచితములు, ఆకుంచితములు, కంపితములు, అకంపితములు, పరివాహితములు, పరావృత్తములు మొదలగు భావములను ప్రకటించుచుండెను. కస్తూరీతిలకములతో విరాజిల్లుచున్న ఫాలభాగములపైగల ముంగురులు ఇంపులొలుకుచుండగా వారు అపరాజితము, సూచికావిద్ధము, పరిచ్ఛిన్నము, విష్కంభము, రేచితము మున్నగు అంగవిక్షేపములను ప్రదర్శించుచుండిరి. ఈ విధముగా వారు పాదములతో, నడుములతో, హస్తములతో, మెడలతో వివిధములగు నృత్యవిన్యాసములను గావించిరి.

అప్పుడు ఆ రాసక్రీడ జనులందఱి మనస్సులను ఉత్సాహమును ఇనుమడింపజేయుచు పాలసముద్రమువలె ఉజ్జ్వలరసాభిరామమై అలరారినది. (శృంగారాది రసములతో అలరారినది రాసక్రీడ, పరవళ్లు ద్రొక్కుచున్న స్వచ్ఛములైన క్షీరములతో పరిపూర్ణమైనది పాలసముద్రము) అది రాగపరిపూర్ణమై రామరాజ్యమువలె విరాజిల్లినది. (వివిధములగు మోహనరాగాదులతో ఒప్పినది రాసక్రీడ, ప్రజానురాగముతో పరిఢవిల్లినది రామరాజ్యము.) అది నిండైన చంద్రమండలమువలె కువలయానందకరమై తేజరిల్లినది. (భూమండలమునకు ఆనందమును గూర్చునది రాసక్రీడ, కలువలను వికసింపజేయునది చంద్రమండలము.) అది నందన (ఇంద్రుని) వనమువలె భ్రమర విరాజమానమై రంజిల్లినది. (భ్రమరము అను హస్తాభినయముతో విలసిల్లునది రాసక్రీడ, పూదేనెలకై చేరిన తుమ్మెదలతో శోభిల్లునట్టిది నందనవనము.) అది ప్రధాన వృత్తిసమర్థమై మానధనుని చిత్తమువలె రంజిల్లినది. (నాట్యకళా విన్యాసములతో నిండారినది రాసక్రీడ, అభిమానమే ధనముగా గలవాడు తన వృత్తియందు పూర్తి గౌరవభావమును కలిగియుండును.) అది బహు ప్రబంధభాసురమై సమర్థకవి విలాసమువలె తేజరిల్లెను. (పెక్కు నాట్యబంధములతో విరాజిల్లినది రాసక్రీడ, బహువిధములైన ప్రబంధములతో (కావ్యములలో) భాసిల్లునట్టివి సమర్థులైన కవులయొక్క కవితా వైభవములు.) అది వసుదేవనందన విలసితమై సురలోకమువలె అలరారినది. (వసుదేవునియొక్క కుమారుడైన శ్రీకృష్ణునితో రంజిల్లినట్టిది రాసక్రీడ, అష్టవసువులతో, సకలదేవతలతో, నందన (ఇంద్ర) వనముతో శోభిల్లుచుంటినట్టిది సురలోకము.) అది శిష్టపురుషచరితమువలె భూలోకమునందును, గగనతలమునందును వ్యాపించి ఖ్యాతి వహించినది. అది అంగహారమనోహరమై సుందరీమణివలె

విరాజిల్లినది. (అంగవిన్యాసములతో మనస్సులను దోచుకొనుచు హృదయంగమమైనది రాసక్రీడ, అన్ని అంగములయందును సువర్ణమణిహారములతో శోభిల్లుచుండునది సుందరీమణి.) అది అనేకచారి సుకుమారంబై కైలాసమువలె తేజరిల్లినది. (పెక్కుమంది కృష్ణులతో, గోపికలతో అలరారినది రాసక్రీడ, పలువురు దేవతలు విహారములతో ఆహ్లాదకరమైనది కైలాసము (హిమాలయము). అది ఉద్దీపితవంశమై సుకుమారవృత్తమువలె భాసిల్లినది. (మధురనాదములను ప్రసరింపజేయు పిల్లనగ్రోవులుగలది రాసక్రీడ, వంశమునకు వన్నె దెచ్చునట్టిది గుణవంతుడైన కుమారుని ప్రవర్తన.)

చ. నడుములు వీఁగియాడఁ జిఱునవ్వులు నివ్వటిలంగ హారముల్
సుడివడ మేఖలల్ వదలఁ జొక్కి మెఱుంగులు పర్వ ఘర్మముల్
వొడమఁ గురుల్ చలింప శ్రుతిభూషణముల్ మెఱయన్ సకృష్ణ లై
పడఁతుకలాడుచుం జెలఁగి పాడిరి మేఘతటిల్లతా ప్రభన్. 1083

అంతట గోపవనితలు కృష్ణునితోగూడి మేఘమధ్యమునగల మెఱుపుతీగెలను తలపింపజేయుచు ఉత్సాహముతో ఆటపాటలను నెఱపిరి. అప్పుడు వారి నడుములు అటునిటు కదలుచు ఒయ్యారములు పోయెను, చిఱునవ్వులు వెల్లివిరిసెను. హారములు చిక్కులు పడెను, కటిసూత్రములు సడలెను, చూపులలో మెఱుపులు చిందెను. శరీరములు అన్నియును చెమర్చెను. కేశములు చెదరెను. చెవుల ఆభరణములు మిఱుమిట్లు గొలిపెను.

క. అంకరహితేందువదనలు, పంకజలోచనునిఁ గూడి పరఁగ నటింపం
గింకిణుల నూపురంబుల, కంకణముల మ్రోఁతలెసఁగెఁ గర్ణోత్సవమై. 1084

మచ్చలేని (నిండు) చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖములుగల గోపికలు కమలనయనుడైన శ్రీకృష్ణునితో జేరి నృత్యములు ఒనర్చుచుండగా వడ్డాణములయందలి చిఱుగజ్జెలసవ్వడులు, కాలిఅందెలరవళులు, కంకణములమ్రోతలు వీనులవిందుగావించెను.

క. హరిణీనయనలతోడను, హరి రాసక్రీడ సేయ నంబరవీథిన్
సురనాథులు భార్యలతో, సొరిది విమానంబులెక్కి చూచిరిలేశా! 1085

పరీక్షిన్మహారాజా! ఆడులేళ్లకువలె అందమైన చూపులుగల గోపభామినులతోగూడి శ్రీకృష్ణుడు రమ్యముగా రాసక్రీడ సలుపుచుండగా ఇంద్రాదిదేవతలు భార్యలతోగూడి వరుసగా విమానములయందు నిలిచి ఆనందముతో తిలకింపసాగిరి.

క. కురిసెం బువ్వులవానలు, మొరసెన్ దుందుభులు మింట ముదితలు తారున్
సరసన్ గంధర్వపతుల్, వరుసన్ హరిఁ బాడిరపుడు వసుధాధీశా! 1086

రాజా! రాసక్రీడ కనులపండువుగా సాగుచుండగా ఆకాశమునుండి పూలవానలు కురిసెను, దుందుభులు మ్రోగెను. గంధర్వులును, వారి సతులును వరుసగా శ్రీకృష్ణునియొక్క ఉదాత్తగుణములు మధురముగా కీర్తించిరి.

క. రామలతోడను రాసము, రామానుజుఁడాడఁ జూచి రాగిల్లి మనో
రాములమీఁద వియచ్చర, రాములు మూర్ఛిల్లి పడిరి రాజకులేంద్రా 1087

మహారాజా! శ్రీకృష్ణప్రభువు గోపకాంతలతో నెఱపుచున్న రాసక్రీడావైభవమును గాంచి, దివ్యభామినులు పరవశించిపోవుచు స్పృహదప్పి తమ ప్రియులమీద వాలిపోయిరి.

క. తారాధిపనిభవదనలు, తారాధిపవంశ్యుఁ గూడి తారు నటింపం
దారలతోడ సుధాంశుఁడుఁ, దారును వీక్షింప రేయి తడవుగ జరగెన్. 1088

చంద్రముఖులైన గోపయువతులు చంద్రవంశమునందు అవతరించిన శ్రీకృష్ణునితోగూడి (తాము) నృత్యములొనర్చుచుండగా చంద్రుడు తారలతోజేరి వీక్షించుచుండుటవలన ఆ రాత్రి నెమ్మదిగా గడచెను.

మ. యమునాకంకణచారియై వనజపుష్పామోదసంచారియై
రమణీ ఘర్మనివారియై మదవతీ రాస శ్రమోత్తారియై
ప్రమదామానస నవ్య భవ్య సుఖసంపత్కారియై చేరి యా
కమలాక్షుండలరంగ గాలి విసరెం గల్యాణభావంబునన్. 1089

అప్పుడు మందమారుతము యమునానదీజలములను స్పృశించుచు, ఆ జలములలో ఒప్పాఱుచున్న కమలముల పరిమళములను అంతటను వ్యాపింపజేయుచు ఎల్లరకును హాయిని గొలుపుచువీచెను. అంతట ఆ రమణీమణుల చెమటబిందువులు ఆరిపోయెను, రాసక్రీడలో వారు పొందిన అలసటలు తొలగిపోయెను. ఆ గోపకామినుల మనస్సులలో నవ్యోత్సాహములు, సుఖభావనలు వెల్లివిరిసెను. మంగళకరములైన ఆ వాయుప్రసారమున శ్రీకృష్ణుడు అమందానందమును పొందెను.

వ. అప్పుడు. 1090

చ. ప్రమద యొకర్తు మాధవుఁడు పాడ విపంచి ధరించి కేల సం
భ్రమమునఁ దంత్రి మీటుచుఁ దిరంబుగ గానము సేసి, యొక్క రా
గము దగ నాలపించి సుభగ స్వరజాతులు వేఱు వేఱ కా
నమరఁగఁ బాడెఁ దన్ రమణుఁడౌనన దారువులంకురింపఁగన్ 1091

అప్పుడు శ్రీకృష్ణుడు ఆనందమున పాడుచుండగా ఒక తరుణీమణి వెంటనే వీణను చేబూని, ఒయ్యారముగా తంత్రులను మీటుచుండెను. రమణుడు (కృష్ణుడు) భళీ! భళీ!! అని మెచ్చుకొనుచుండగా ఆమె కమ్మగా గానమొనర్చుచు ఒకరాగమును ఆలపించెను. ఆమె పాటలో వేర్వేఱు స్వర, రాగలయలు సమముగా (మనోహరమై అలరారెను. మహితమైన ఆ గానప్రభావమునకు మోడులు చిగిర్చెను.

క. ఆడుచుఁ బాడుచు నందొక, చేడియ మంజీర మంజు శింజితమమరం
గూడి హరికరము చనుఁగవ, పైడాయఁగఁ దిగిచె జఘనభారాలసయై. 1092

వారిలో ఒక తరుణి కాలిఅందెలు ఘల్లుఘల్లున మ్రోగుచుండగా ఆడుచు, పాడుచు, పిఱుదులబరువునకు అలసిపోయినదై, శ్రీకృష్ణుని కరమును పట్టుకొని, లాగి తనవక్షఃస్థలముపై చేర్చుకొనెను.

క. చందనలిప్తంబై యుర, విందామోదమున నొప్పు, విపులభుజము గో
విందుఁడొక తరుణిమూఁపునఁ, బొందించిన నది తెమల్చి పులకించె నృపా! 1093

రాజా! శ్రీకృష్ణుడు మంచిగంధముచే లిప్తమై (పూయబడి) పద్మపరిమళములను వెదజల్లుచున్న విశాలమగు (దృఢమైన) తన బాహువును ఒక యువతివీపుపై వేసెను. అంతట ఆ తరుణిమేను చలించి పులకించిపోయెను.

సీ. చెలువ యొక్కతె చెక్కుఁ జెక్కుతో మోపిన విభుఁడు తాంబూలచర్వితము పెట్టె
నాడుచు నొకలేమ యలసినఁ బ్రాణేశుఁడున్నత దోఃస్తంభమూఁత చేసెఁ

జెమరించి యొకబాల చేరినఁ గొనగోరఁ జతురుఁడు కుచఘర్మజలము వాపె.
నలకంబులొకయింతి కళిక చిత్రక రేఖ, నంటినఁ బ్రియుఁడు పాయంగ ద్రువ్వెఁ
ఆ. బడఁతి యొకతె పాటపాడి డస్సిన నధరామృతమున నాథుఁ డాదరించె
హారమొక్క సతికినంసావృతంబైనఁ గాంతుఁ డురముఁ జేర్చి కౌఁగిలించె. 1094

ఒక అందాలరాశి శ్రీకృష్ణునిచెక్కిలిపై తన చెక్కిలిని చేర్చగా అతడు తన నోటిలోని తాంబులచర్వణమును ఆమె నోటిలో ఉంచెను. ఒక భామ నృత్యమొనర్చుచు అలసిపోగా ఆ స్వామి తన బాహువును ఆమెకు ఊతగా జేసెను. ఆటపాటలలో చెమటపట్టిన ఒక కన్య ఆ ప్రభువును చేరగా అతడు తన కొనగోళ్లతో ఆమె వక్షస్థలముపైగల స్వేదబిందువులను తొలగించెను. ఒక ఇంతియొక్క ముంగురులు ఆమె నొసట తీర్చిదిద్దబడిన కుంకుమరేఖపై బడగా ప్రియుడు (శ్రీకృష్ణుడు) వాటిని (ఆ కురులను) తొలగించుచు దువ్వెను. ఒక పడతి పాటపాడి అలసిపోగా ఆ ప్రభువు తన అధరామృతముతో (ఆమెను చక్కగా ముద్దాడి) ఆమెను ఆదరించెను. ఒక భామకు ఒక హారము భుజమునకు చుట్టుకొనగా కాంతుడు (కృష్ణుడు) ఆమెను తన అక్కున చేర్చుకొనెను.

క. హాసంబులఁ గరతల వి, న్యాసంబుల దర్శనముల నాలాపములన్
రాసశ్రాంతల నా హరి, సేసెన్ మన్ననలు కరుణసేసి నరేంద్రా! 1095

రాజా! రాసక్రీడలో అలసిపోయిన ఆ కాంతలను శ్రీకృష్ణుడు చిఱునవ్వుతో, ముఱిపించుచు, అరచేతులతో నిమురుచు, కలికిచూపులతో సంతోషపెట్టుచు, సరసాలాపములతో ఉత్సాహపఱచుచు, కనికరమును చూపుచు, మన్ననలతో ఆదరించుచు ఊరడించెను.

క. హరితనుసంగసుఖంబునఁ, బరవశలై వ్రేతలెల్ల బయ్యెదలు నిజాం
బరములు నెఱుఁగమి చోద్యమె, సురసతులీక్షించి కరఁగి చొక్కిరి మింటన్. 1096

మిగులహాయిని గూర్చెడి కృష్ణప్రభువుయొక్క తను స్పర్శతో గోపభామినులందఱును పరవశలైరి. అప్పుడు వారు తమ పమిటెలు జారిపోవుటను, వస్త్రములు సడలుటను ఎఱుంగకుండిరి. అట్లగుటలో ఆశ్చర్యమేమున్నది? అంతట ఆకాశమునందున్న దివ్యాంగనలు ఆ దృశ్యమును జూచి, మోహమున మునింగిరి.

వ. ఇట్లు భగవంతుండైన కృష్ణుండాత్మారాముండయ్యును, గోపసతులెందఱందఱకు నందఱై, నిజ ప్రతిబింబంబులతోడం గ్రీడించు బాలురపోలిక రాసకేళిసలిపిన. 1097

పరమాత్ముడైన శ్రీకృష్ణుడు ఆత్మారాముడు అయ్యును, ఈవిధముగా గోపికలందఱితోడను తన ప్రతిబింబములతో క్రీడించు బాలునివలె రాసకేళి నెఱపెను.

క. తగఁ గూడియాడి మనముల, నగఁ జూచెం బలికె నందనందనుఁ డనుచున్
మగువలు పెద్దఱికముతోఁ, బొగడిరి తమ పూర్వజన్మ పుణ్య శ్రేణిన్. 1098

'నందకుమారుడైన శ్రీకృష్ణుడు మనతోకూడి ఆడుచు తన చిఱునవ్వులతో, చూపులతో, పలుకులతో మనలను ఆనందమున ఓలలాడించెను. ఇది మనము పూర్వజన్మలలో చేసికొనిన సుకృతములఫలము' అనుచు గోపికలు తమ మనస్సులలో పొంగిపోయిరి.

## జలక్రీడాభివర్ణనము

వ. ఇట్లు హరి రాసకేళి సాలించి, కరకాంచితలగు తటిల్లతలచెలువున ఘర్మ సలిల కణాక్రాంతలగు కాంతలం గూడి, జలక్రీడా కుతూహలుండై, యమునా జలంబులు సొర, నందు ముందర సుందరులు సొచ్చి, పదప్రమాణంబు జానుదఘ్నంబు, కటిద్వయసంబు, మధ్యమాత్రంబు, కుచంబులబంటి, యని పలుకుచుం గుచనయన నాభివివరకుంతలంబులు చక్రవాకజలచరావర్తశైవాలంబులచందంబున నందంబుగ నీడు వొందిన యేఱులని, కళిందనందన కరంబులు సాఁచి, పరిరంభములకు నారంభించు కైవడి నెదురు చనుదెంచి తాఁకు తరంగంబులకు నులుకుచు, సారసంబులకుం గరంబులు సాఁచుచు, మరాళంబులం జోపుచుఁజెన్ను మిగిలిన యన్నుల చన్నుల యెత్తువత్తుమను నెపంబులం దపంబుల నీటఁ గావించు మాడ్కిని సంచరించు చక్రవాకంబులం దోలుచు, నితాంత కాంతిసదనంబులగు వదనంబులకు నోడి, వ్రీడం జెంది, కంది, చందురుండు చలంబుడిగి, జలంబునంబడి, కంపించు కరణి, నిజ కరచలిత జలప్రతిబింబితుండై కదలు చంద్రునిం గని మెచ్చి సోలుచు, సలిలావగాహ సమయ సముచ్ఛలిత వారిశీకర పరంపరలవలన మకరందపాన మత్త మధుకర పక్షవిక్షేపణ సంజాతవాత సముద్ధూత కుముదాది పరాగపటలంబులం జేఱుచు, మోముఁదమ్ముల కమ్మఁదనంబులకు మూఁగి, ఝుమ్మురను తుమ్మెదలకు వెఱచుచుఁ, గరంబుల నీరెగయం జఱచుచు, నీల నీరద నిపతిత పయోబిందు సందోహంబులం దడియు పువ్వుదీవియలబాగునఁ గృష్ణకరద్వయతోయంబులం బెక్కు తోయంబులం దడియుచుఁ గ్రందుకొని సుడియుచు, ననమబాణుని పులుగడిగిన కుసుమబాణంబులపగిది మేనులు మెఱవ, సలిలావగాహన పరాయత్త చిత్తలగుచు, మొత్తంబులై సరసభాషణంబులం ద్రుళ్లుచు, గరంబుల నీరు నించి హరిమీఁద జల్లుచుఁ, జల్లునెడం దడఁబడ దాఁటుచు, దాఁటి చనక నిలువరించుచు, వినోదింప హరియుఁ గరేణుకర వికీర్ణ నీరధారాభిషిక్తంబగు శుండాలంబులీల నాభీర కామినీ కరసముజి త జలాసారంబులం దోఁగుచు,వ్రజ వధూజన హస్తప్రయుక్త కల్హార కైరవ పరాగపటలంబువలన భూతిభూషణు సిరి వహించుచు, గోపికాజన పాణి కిసలయ సమున్ముక్త కమలదళంబువలన సహస్రనయనుని రూపుఁ జూపుచు, గోపాలబాలికా కుచకలశ కుంకుమపంకంబువలనఁ బ్రభాతబాలభానునిభంగి భాసిల్లుచు, ఘోషయోషా కటాక్షవిక్షేపణంబువలవ మధుపపరివృత హరిచందన సౌందర్యంబు నొందుచు, వల్లవీ హాసరుచులవలనఁ జంద్రికాప్రభా భాసిత నీలశైలంబుక్రియ నమరె నంత. 1099

ఈవిధముగా శ్రీకృష్ణుడు రాసకేళిని ముగించుకొని, వడగండ్లతోగూడిన మెఱపుతీగెలవలె ఒప్పుచున్న చెమటబిందువులతో విలసిల్లుచున్న గోపకాంతలతోగూడి, జలక్రీడలయందలి కుతూహలముతో యమునానదీజలములలో ప్రవేశించెను. అంతట ఆ సుందరీమణులు ఆ ప్రభువుకంటెను ముందుగా దిగి, ఇచ్చట గిలకలలోతు, ఇక్కడ మోకాళ్లలోతు, ఈ ప్రదేశమున మొలలోతు, ఈ స్థలమున నడుములోతు, ఇక్కడ రొమ్ములలోతు అని అనుకొనుచు అందు ప్రవేశించిరి. అంతట యమునానది వారిని జూచి, వారికుచములు తన యందలి చక్రవాకములను, నేత్రములు, మీనములను, నాభిరంధ్రములు సుడులను, కుంతలములు (కురులు) నాచును పోలి అందములను చిందించుచుండుటచే వారును తనవంటి వారేయని భావించుచు, కౌగిలించుకొనుటకై తహతహపడుచు చేతులు చాచి వచ్చుచున్నరీతిగా ఆ నదీతరంగములు వచ్చి వారిని తాకినవి.

అంతట గోపికలు అలలతాకిడికి ఉలిక్కిపడుచు బెగ్గురుపక్షులను పట్టుకొనుటకై చేతులు చాచుచుండిరి. హంసలను పాఱద్రోలుచుండిరి. అందలి చక్రవాకములు గోపభామినులయొక్క స్తనములతో సరితూగుటకై నీటిలో జేరి తపస్సు చేయుచున్నవా? అనునట్లు మసలుకొనుచుండెను. అట్టి జక్కవ పక్షులను వారు అటునిటు తోలుచుండిరి. మనోహరమైన

ఆ తరుణీమణులయొక్క ముఖశోభావైభవములకు జంకి, సిగ్గుతో కాంతిని కోల్పోయి, పట్టుదలను వీడి నీళ్లలో దూరి వణకిపోవుచున్నాడా? అనునట్లుగా, ఆ యువతులు తమ చేతులతో తెప్పలేర్పడునట్లు జలములను కొట్టుచుండగా అందలి చంద్రునియొక్క బింబము అటునిటు కదలాడుచుండెను. అట్టి చంద్రబింబదృశ్యములను గాంచి, వారు ప్రశంసించుచు పరవశించి పోవుచుండిరి.

తనివిదీర పూదేనెలను త్రాగి మత్తిల్లియున్న తుమ్మెదలు వారు జలక్రీడలు ఆడుచున్న సమయమున పైకెగిరిన నీటి తుంపరలు తెఱపిలేకుండా తాకుచుండుటచే టెక్కలను అల్లార్చుచు పైకి లేచినవి. ఆ టెక్కలగాలులకు పైకిలేచుచున్న కలువలు మొదలగువాటి పుప్పొడులు నీళ్లపై వారిచుట్టును వ్యాపించెను. ఆ గోపికల ముఖారవిందములసువాసనలకు మూగి, భ్రమరములు చేయుచున్న ఝుంకారములకు వెఱచి వారు వాటిని పాఱద్రోలుటకై నీటిపై చఱచుచుండిరి. నల్లని మేఘములు వర్షించుచున్న జలధారలకు తడియుచున్న పూలతీగెలవలె, శ్రీకృష్ణుడు దోసిళ్లతో చల్లుచున్న జలములకు వారు పలురీతుల తడిసి తడిసి పోవుచుండిరి. గుంపుగాగూడి సోలిపోవుచు స్వచ్ఛములైన మన్మథునిపూలబాణములవలె మేనులు మెఱయుచుండగా వారు నీళ్లలో మునుగుటకు ఆరాటపడుచుండిరి. ఆ గోపికలు అందఱును గుంపుగాచేరి, సరసాలాపములతో త్రుళ్లిపడుచు, దోసిళ్లలో నీరునింపుకొని శ్రీహరి (కృష్ణుని) మీద చల్లుచుండిరి. ఆ సమయమున కాళ్లు తడబడుచుండగా వారు ముందునకు సాగుచు, వెళ్లలేక ఆ స్వామిని నిలువరించుచు వినోదించుచుండిరి.

అంతట శ్రీకృష్ణుడును ఆడు ఏనుగుల తుండములచే చల్లబడిన నీటిధారలచే తడిసిన మదపుటేనుగువలె ఆ గోపికలచేతులతో ఎగురగొట్టబడిన జలములధారలకు తడిసి ముద్దయ్యెను. గోపకాంతలు తమ చేతులతో ఎఱ్ఱని, తెల్లనికలువలను విసరగా వాటి పుప్పొడులు శ్రీకృష్ణుడు ముంచివేసెను. అప్పుడు ఆ స్వామి భస్మముచే విరాజిల్లుచున్న పరమశివునివలె భాసిల్లెను. ఇంకను ఆ వనితలు చిగురుటాకులవలె సుకుమారములైన తమ చేతులతో తామరరేకులను చల్లగా ఆ ప్రభువు సహస్రాక్షుని (దేవేంద్రుని)వలె విరాజిల్లెను. గోపకన్యలను కౌగిలించుకొనుటచే వారి వక్షస్థలములయందలి కుంకుమపత్రరేఖలు శరీరమునకు అంటుకొనగా ఆ స్వామి ప్రాతఃకాలమునందలి బాలభానునివలె తేజరిల్లెను. గోపకాంతలు తమ క్రీగంటి చూపులను ప్రసరింపజేయగా ఆ ప్రభువు తుమ్మెదలు ముసురుకొనిన హరిచందనవృక్ష శోభలతో విలసిల్లెను. ఆ తరుణీమణుల చిఱునవ్వుల సింగారములు అలముకొనుటవలన ఆ నందనందనుడు వెన్నెలకాంతులతో నిండి వెలుగొందుచున్న అంజనాద్రివలె అలరారెను.

మ. సతులుం దానును నీటిలో వెడలి భూషాగంధ చేలాద్యలం
కృతుఁడై కుంభి కరేణు యూథములతోఁ గ్రీడించు చందంబువన్
లతలందుం దరులందుఁ బుష్పమయ లీలాశయ్యలందున్ సుఖో
న్నతుఁడై కృష్ణుఁడు క్రీడలం దనిపె నా నారీలలామంబులన్. 1100

శ్రీకృష్ణుడు ఆ గోపభామలతోగూడి యమునానదీజలములనుండి తీరమునకు చేరెను. అనంతరము ఆ ప్రభువు గంధములతోడను, వస్త్రాభరణములతోను అలంకృతుడయ్యెను, మగఏనుగు ఆడు ఏనుగులతో క్రీడించునట్లు, శ్రీకృష్ణుడు లతలయందును, తరువులయందును, పుష్పములతోనిండినవవిలాసశయ్యలపైనను ఆ తరుణీమణులతోగూడి సుఖములలో ఓలలాడుచు క్రీడించి వారికి సంతృప్తిని గూర్చెను.

వ. ఇట్లు శరత్కాలంబున వెన్నుం డింద్రియస్ఖలనంబు సేయక గోపికలతోడ రమించె. అని చెప్పిన, మునివరునకు భూవరుం డిట్లనియె. 1101

"ఈవిధముగా జితేంద్రియుడైన శ్రీకృష్ణుడు ఆశరత్కాలమునందు అలౌకిక రీతిలో గోపికలతో క్రీడించెను" అని చెప్పిన శుకయోగితో పరీక్షిన్మహారాజు ఇట్లనెను.

మత్తకోకిలము. ధర్మకర్తయు ధర్మభర్తయు ధర్మమూర్తియునైన స
త్కర్మ(డీశుఁడు ధర్మశిక్షయు ధర్మరక్షయుఁ జేయఁగా
నర్మిలిన్ ధరమీఁదఁ బుట్టి పరాంగనాజన సంగ మే
ధర్మ మంచుఁ దలంచి చేసె మదాత్తమానస చెప్పుమా! 1102

"మహాత్మా! శ్రీకృష్ణుడు (ఆ పరమాత్మ) ధర్మమును నిర్దేశించువాడు, ధర్మమును నడపువాడు, అంతేగాదు ధర్మస్వరూపుడు, సత్కర్మలను నెఱపుచుండువాడు, ధర్మమును బోధించుటకును, దానిని పరిరక్షించుటకును కారుణ్యముతో భూతలమున అవతరించినవాడు. అట్టి పరమపురుషుడు పరసతులతోగూడియాడుట ఏపాటిధర్మము? దయతో తెలుపుము.

వ. అనిన శుకుండిట్లనియె 1103

ఆ. సర్వభక్షుఁ డగ్ని సర్వంబు భక్షించి దోషి గానిపగిది దోషమైనఁ
జేసి దోషపదముఁ జెందరు తేజస్వు లగుటఁ జంద్రవాసవాదులధిప! 1104

క. ఈశ్వరుఁడు గానివాఁడు న,రేశ్వర! పరకాంతఁ దలఁచి యెట్లు బ్రతుకు గౌ
రీశ్వరుఁడు దక్క నన్యుఁడు, విశ్వభయద విషము మ్రింగి వెలయం గలఁడే. 1105

పిమ్మట శుకయోగి ఇట్లు వచించెను – "రాజా! సర్వభక్షకుడైన అగ్ని అన్నింటిని భక్షించుచున్నను (కాల్చివేయుచున్నను) అతడు దోషిగా పరిగణింపబడడు. తేజోమూర్తులైన చంద్రుడు, ఇంద్రుడు మొదలగువారు దోషకృత్యములు ఒనర్చినను లోకము వారిని దోషులుగా ఎంచదు. మహారాజా! సర్వశక్తిమంతుడైన భగవంతుడు దప్ప ఇతరులు పరకాంతలను స్పృశించి బ్రతుకజాలరు. ఈశ్వరుడు దప్ప ఇతరుడెవ్వడును లోకభయంకరమైన హాలాహలమును మ్రింగి జీవించియుండగలడా?

క. సత్యము ప్రభువులవచనము, నిత్యముఁ దద్వచనవీధి నిలుతురు పెద్దల్
సత్యాసత్యము కావున, సత్యమనుచుఁ జనరు వారిచరితమున నృపా! 1106

రాజా! సర్వతంత్ర స్వతంత్రులైన ప్రభువులవచనమును పెద్దలు సత్యముగా తలంతురు. అందువలన వారు ఆ ప్రభువులమాటప్రకారము నడచుకొందురు. కాని ఆ ప్రభువుల ప్రవర్తన పామరులకు సత్యము (ధర్మము)గాను, మేధావులకు (అందలి అంతర్యమునుబట్టి) అసత్యము (అధర్మము)గాను తోచును. కావున విజ్ఞులైన వారు వారి చరితమును అనుసరింపరు.

మ. ఘనులై యెవ్వనిపాదపంకజ పరాగ ధ్యానసంప్రాప్తయో
గ నిరూఢత్వముచే మునీంద్రులు మహాకర్మంబులం బాసి బం
ధ నిరోధంబులులేక విచ్చలవిడిన్ దర్పింతురాదివ్యశో
భనుఁ డెట్లుండిన నుండెఁ గాక కలవే బంధంబులుర్వీశ్వరా! 1107

మహారాజా! మహాత్ములైన సనకసనందనాది మహామునులు ఆ శ్రీహరి (శ్రీకృష్ణుని) యొక్క పాదపద్మముల రేణువులను ధ్యానించుటవలన లభించిన యోగశక్తిప్రభావముచే బంధకారకములైన కర్మలను మాని, బంధవిముక్తులగుచుందురు. పిదప వారు లౌకికమైన వ్యవహారములకు అతీతులై మసలుకొందురు. తన పాదరేణుస్పర్శచేతనే

మహాయోగులకు ముక్తిని ప్రసాదించునట్టివాడు, అప్రాకృత (దివ్య) దేహముతో అవతరించినవాడుఐన ఆ ప్రభువు ఎట్లు ప్రవర్తించినను ఆయనకు ఎట్టి దోషములును అంటవు. అసలు ఆ పరమపురుషునకు బంధమూలే లేవుగదా!

ఆ. గోపజనములందు గోపికలందును సకల జంతులందు సంచరించు
నా మహాత్మునకుఁ బరాంగనలెవ్వరు సర్వమయుఁడు లీల సలిపెఁ గాక. 1108

ఆ పరమేశ్వరుడు అంతరాత్మరూపమున గోపాలురయందును, గోపికలలోను, అంతేగాదు సకలప్రాణులయందును విరాజిల్లుచుండును. అట్టి పరమాత్మునకు పరకాంతలెవ్వరు? ఆ స్వామి సర్వమయుడు. (అందఱిలోను, అంతటను వ్యాపించియుండువాడు) గోపికలతో జరిపిన విహారములన్నియును ఆయన లీలలే".

వ. అని చెప్పి, శుకుం డిట్లనియె. నంత బ్రాహ్మముహూర్తంబునం గృష్ణు వీడ్కొని గోపికలిచ్ఛలేకయు నిండ్లకడ కేఁగినం, గృష్ణ మాయా మోహితులై, గోపకులు వారలం గోపింప నేరరైరివ్విధంబున. 1109

అని చెప్పి ఆ మహర్షి ఇంకను ఇట్లు వివరింపసాగెను. (రాత్రియంతయు శ్రీకృష్ణునితో రాసక్రీడలు నెఱపిన పిమ్మట) గోపకాంతలు బ్రాహ్మీముహూర్తమున (తెల్లవాఱుజామున) ఎట్టకేలకు కృష్ణుని వీడ్కొని తమ తమ ఇండ్లకు చేరిరి. శ్రీకృష్ణుని మాయాప్రభావమున గోపాలురును తమ తమ సతులను ఏమాత్రమూ కోపింపరైరి.

ఇంద్రవజ్రము. గోపాల కృష్ణుండును గోపకాంతల్ ప్రాపించి క్రీడించిన భంగులెల్లన్
రూపించి వర్ణించి నరుండు హృత్సంతాపంబులన్ బాయును దత్కృపశక్తిన్ 1110

గోపాలకృష్ణుడును, గోపకాంతలును నెఱపిన రాసక్రీడావిలాసములను పూర్తిగా కీర్తించినవారు, ఆ స్వామి అనుగ్రహముతో మానసిక (సమస్త) తాపములనుండియు విముక్తులగుదురు.

## సర్పరూపియగు సుదర్శనుండను గంధర్వునకు శాపవిమోచనము

వ. అంత నొక్కనాఁడు నందాదులైన గోపకులంబికావనంబునకు శకటంబులెక్కి జాతరకుం జని, సరస్వతీ నదీజలంబుల స్నానంబులు సేసి, యుమామహేశ్వరుల నర్చించి, కానికలిచ్చి, బ్రాహ్మణులకు గోహిరణ్య వస్త్రాన్న దానంబులొసంగి జలప్రాశనంబు సేసి, నియమంబుననుండ, దైవయోగంబున నాఁకొని యొక్క మహోరగంబు, నిదురవోయిన నందునిం గఱచి, మ్రింగ నగ్గలింప, నతండు కృష్ణ! కృష్ణేతి' వచనంబులం దన్ను విడిపింపుమని మొఱ యిడిన, విని. 1111

పిమ్మట ఒకానొకనాడు నందుడు మొదలగు గోపాలురు బండ్లపై అంబికావనమునందు జరిగెడి జాతరకు వెళ్లిరి. అచట సరస్వతీనదీజలములలో స్నానములొనర్చి ఉమామహేశ్వరులకు కానుకలను సమర్పించిరి. అనంతరము బ్రాహ్మణులకు గోవులు, బంగారములు, వస్త్రములు మున్నగువానిని దానమొనర్చి, భూరిభోజనములతో వారినందఱిని సంతృప్తిపఱచి, జలప్రాశనములతో (నీళ్లను మాత్రమే ఆహారముగా గొని దీక్షతో (నియమములను పాటించుచు) ఉండిరి. ఇంతలో విధివశమున బాగుగా ఆకలిగొనియున్న ఒక మహాసర్పము నిదురించుచున్న నందుని కఱచి, మ్రింగబోవుచుండెను. అప్పుడు నందుడు 'కృష్ణా! కృష్ణా! రక్షింపుము, రక్షింపుము' అను మొఱలిడసాగెను.

క. గోపకులందఱు మేల్కొని, కోపముతోఁ బెద్దగుదెలఁ గొఱవుల మొత్తం
దాపము నొందియు వదలక, పాపపుఁ బెనుబాము నందుఁ బట్టె నృపాలా! 1112

రాజా! ఆ పలుకులు చెవులబడినంతనే గోపకులందఱును మేల్కొనిరి. పిమ్మట వారు ఆ దృశ్యమును గాంచి,

కుపితులై పెద్దపెద్ద కట్టెలతో, కొరవులతో మోదిరి. అంతట ఆ క్రూర సర్పము ఆ దెబ్బలకు మిగుల బాధ కలుగుచున్నను నందుని విడిచిపెట్టక పట్టుకొనియే యుండెను.

వ. ఆ య్యవసరంబునఁ గృష్ణుండు దర్పించి, పాదతాడనంబు సేసి త్రొక్కిన, సర్పంబు సర్పరూపంబు విడిచి, విద్యాధరేంద్రరూపంబు దాల్చి, హరికి మ్రొక్కిన నతనికి హరి యిట్లనియె. 1113

వెంటనే శ్రీకృష్ణుడు విజృంభించి, పాదములతో ఆ విషసర్పమును త్రొక్కెను. అంతట అది తన సర్పరూపమును విడిచి, విద్యాధరుడుగా మాఱి, ఆ ప్రభువునకు ప్రణమిల్లెను. అప్పుడు శ్రీహరి (కృష్ణుడు) అతనితో ఇట్లనెను.

ఉ. మండితమూర్తితోఁ గనకమాలికతో శుభలక్షణుండవై
యుండెడు నీకుఁగష్టపు మహోరగ దేహమిదేల వచ్చెనె
వ్వండవు నామ మెయ్యది భవంబునకెద్ది మిషంబు నాకు నొం
డొండ యెఱుంగఁ జెప్పుము బుధోత్తమ నీపని చోద్యమయ్యెడిన్. 1114

దివిజోత్తమా! నీవు నిరంతరము బంగారు ఆభరణములతో, శుభలక్షణములతో సుందరమూర్తివై ఒప్పుచుండెడివాడవు. నీకు నికృష్టమైన ఈ పెనుసర్పరూపము ఎట్లు వచ్చెను? ఇంతకును నీవు ఎవరు? నీ పేరేమి? ఈ జన్మకు కారణమేమి? ఈ విషయములను అన్నింటిని విశదపఱచుము. నీవు చేసిన ఈ పని వింత గొలుపుచున్నది.

వ. అనిన వాఁడిట్లనియె. దేవా! యేను సుదర్శనుండను విద్యాధరుండ, విమానారూఢుండనై, రూపసంప ద్గర్వంబులం జొక్కి, దిక్కుల జరించుచు, నొక్క యెడ నాంగిరసులైన ఋషులం గురూపులైన వారలం గని నగిన, వారును, నీవు రూపదర్పంబునం మమ్ము నగితివి గావున మహాసర్పంబవై యుండుమని శపించి పిదప నే వేఁడుకొనిన నిట్లనిరి. 1115

అంతట అతడు ఇట్లు విన్నవించుకొనెను. "దేవా! నేను సుదర్శనుడను పేరుగల విద్యాధరుడను నేను విమానమునెక్కి, రూపసంపద గర్వముతో మంచిచెడ్డలు మఱచి, ఆకాశమునందు అంతటను సంచరింపసాగితిని. కురూపులైయున్న ఆంగిరసమహర్షులను ఒకచోట జూచి హేళనగా నవ్వితిని. అంతట వారు 'నీవు మమ్ముజూచి, రూపగర్వముచే పరిహసించితివి. కావున నీవు ఒక మహాసర్పరూపమును పొంది, పడియుండుము' అని నన్ను శపించిరి. పిదప నా ప్రార్థనపై వారు (ఆ దయానిధులు) నన్ను అనుగ్రహించుచు ఇట్లనిరి.

చ. యదుకులమందు భక్తులభయంబు హరించుటకున్ జనార్దనుం
డుదయము నొంది యీ యడవి నొక్కదినంబున రాఁ గలండు త
త్పదమున నీవు తన్నఁబడి పన్నగ దేహముతోడఁ బాసి నీ
మొదలిటి మేను గాంచెదవు మూఢుడ! పొమ్మనిరాదయానిధుల్! 1116

'మూఢుడా! రాక్షసులను పరిమార్చి, భక్తుల భయములను తొలగించుటకై శ్రీమహావిష్ణువు యదువంశమున శ్రీకృష్ణుడై జన్మించును. ఆ ప్రభువు ఒకనాడు ఈ అడవికి రాగలడు. ఆ స్వామి తన పాదముతో నిన్ను తన్నగా (మహిమాన్వితమైన ఆ ఆస్వామియొక్క పాదస్పర్శతో) నీవు ఆ సర్పరూపమునుండి విముక్తుడవై నీ విద్యాధరరూపమును పొందెదవు. ఇక వెళ్లుము'.

మ. నినుఁ జింతించిన విన్నఁ బేరుకొనినన్ నిర్మూలమై క్రుస్సి పా
పనికాయంబు వినష్టమౌ నఁట భవత్పాదంబు నామీఁదఁబె

ట్టినఁ దద్ర్బాహ్మణ శాపసంజనిత కౌటిల్యంబు తా నిల్చునే
వనజాతేక్షణ! నేఁడు పాసె నురగత్వంబెల్ల నేఁబోయెదన్. 1117

కమలనయనా! నిన్ను స్మరించినను, నీ పవిత్రగాథలను వినినను, నీ నామమును కీర్తించినను ఎంతటి పాపములైనను పటాపంచలైపోవునట. ఇక పునీతమైన నీ పాదము నాకు తాకిన పిమ్మట, ఆ మహర్షులశాపమువలన ఏర్పడిన వికృతమైన రూపము నిలిచియుండగలదా? నేడు నా సర్పరూపము తొలగిపోయినది. ఇంక నేను వెళ్లివచ్చెదను. సెలవిమ్ము".

వ. అని విన్నవించి, హరికిఁ బ్రదక్షిణంబు వచ్చి, మ్రొక్కి, సుదర్శనుండు దివంబునకుం జనియె. సర్పంబువలన నందుండు విముక్తుండయ్యెఁ దద్ర్పకారంబు విని, వెఱఁగుపడి, గోపకులు దేవతామహోత్సవంబు సమాప్తి నొందించి, శ్రీకృష్ణకీర్తనంబు సేయుచు, మరల మందకుం జనిరంత. 1118

ఇట్లు సుదర్శనుడు విన్నవించుకొని, శ్రీహరికి (కృష్ణునకు) ప్రదక్షిణపూర్వకముగా ప్రణమిల్లి, స్వర్గమునకు వెళ్లెను. నందుడు సర్పబాధనుండి విముక్తుడయ్యెను. ఈ విషయములను అన్నింటిని వినిన పిమ్మట గోపాలురు మిక్కిలి ఆశ్చర్యపడి, దేవతామహోత్సవములను పూర్తిచేసికొని, శ్రీకృష్ణునిమహిమలను కీర్తించుచు మఱల తమ గొల్లపల్లెకు చేరిరి.

## శ్రీకృష్ణుడు కుబేరభటుడైన శంఖచూడుండను యక్షుని సంహరించుట

చ. మఱియొకనాఁటిరాత్రి బలమాధవులుజ్జ్వల వస్త్ర మాలికా
ధరులును లేపనాభరణధారులునై చని మల్లికాది పు
ష్పరస నిమగ్న మత్త మధుపంబులగీతము వించుఁ దద్వనాం
తరమున వెన్నెలన్ వ్రజనితంబినులుండఁగఁ బాడిరింపుగన్. 1119

మఱియొక వెన్నెలరాత్రివేళ బలరామకృష్ణులు ఒక వనమధ్యమునకు వెళ్లిరి. వారు ధగధగలాడుచున్న వస్త్రములను, మాలికలను ధరించియుండిరి. సుగంధాది లేపనములతో, చక్కని ఆభరణములతో శోభిల్లుచుండిరి. వ్రజభామినులు అందఱును వారిచుట్టు చేరియుండిరి. అంతట మల్లెలు, మొల్లలు మొదలైన పూల మకరందములను తనివిదీర ఆస్వాదించి, మత్తిల్లియున్న తుమ్మెదల యొక్క ఝుంకారములను వినుచు వారు ఒక చక్కని గీతమును మధురముగా ఆలపించిరి.

క. ఆ పాట చెవుల సోఁకిన నేపాటియు దేహలతల నెఱుఁగక దృగ్వా
చా పాటవములు చెడి పడి, రా పాటలగంధులెల్ల నటవీవీథిన్ 1120

కమ్మని ఆ పాట చెవుల సోకినంతనే అచటనున్న ఆ గోపకాంతలు తీగలవలె సుకుమారమైన తమ దేహముల స్పృహను కోల్పోయిరి. అంతట వారి అందమైన చూపులకదలికలు ఆగిపోయెను, గొంతులు మూగపోయెను. (వారు నిశ్చేష్టులైపోయిరి.)

వ. ఇట్లు సకల భూతసమ్మోహనంబగు గానంబు సేయుచు, నిచ్ఛావర్తనంబులం బ్రమత్తులచందంబున రామకృష్ణులు క్రీడింపఁ, గుబేరభటుండు శంఖచూడుండను వాఁడు, రామకృష్ణరక్షితలగు గోపికలం దన యోగబలంబున నుత్తరపు దిక్కునకుం గొనిపోవ, న య్యోషిజ్జనంబులు 'రామ! కృష్ణేతి' భాషణంబులం జీరి పులికి నగపడిన మొదవులక్రియ మొఱలిడిన విని. 1121

ఈవిధముగా రామకృష్ణులు సకలప్రాణులు పరవశించిపోవునట్లుగా గానములను ఆలపించుచు, మిగుల మత్తిల్లియున్నవారివలె ఇష్టము వచ్చినరీతిగా విహరింపసాగిరి. ఇంతలో 'శంఖచూడుడు' అను పేరుగల ఒక కుబేరుని

భటుడు రామకృష్ణులరక్షణలోనున్న గోపయువతులను తన యోగబలముచే ఉత్తరదిక్కునకు తీసికొనిపోయెను. అంతట ఆ తరుణీమణులు 'బలరామా! శ్రీకృష్ణా!' అని పల్కుచు పులిబాఱిన పడిన ఆవులవలె మొఱలిడసాగిరి.

ఉ. గ్రద్దన సాలవృక్షములు గైకొని బల్లిదులన్నదమ్ము లా
యిద్దఱుఁ గాలమృత్యువులయేపున వే చని యోడకుండుఁడో
ముద్దియలార! యంచుఁ దనుముట్టినఁ జూచి కలంగి గుహ్యకుం
డుద్దవడిం దగం బఱచె నుత్తరమింతుల డించి భీతుఁడై. 1122

వారి ఆక్రందనలు వినబడినంతనే బలశాలురు, సోదరులు ఐన రామకృష్ణులు ఇరువురును మద్దిచెట్లను గైకొని, 'గోపికలారా! భయపడకుడు' అని అభయవచనములను పలుకుచు, కాలప్రేరితలైన మృత్యుదేవతలవలె ఆశంఖచూడుని వెంటాడిరి. అంతట ఆ యక్షుడు భయపడి, స్త్రీలను విడిచిపెట్టి, ఉత్తరదిశగా పిక్కబలము చూపెను.

వ. ఇట్లు గుహ్యకునిచేత విడివడిన గోపికల రక్షించుకొని యుండుమని, బలభద్రునిఁబలికి. 1123

శా. ఓరీ! గుహ్యక! పోకు పోకుమని రోషోక్తిన్ బకారాతి వాఁ
డే రూపంబున నెందుఁ జొచ్చె నెటఁ బోయెం దోడఁ దా నేఁగి దు
ర్వారోదంచితముష్టి వానితలఁ ద్రెవ్వంబట్టి తద్వీరు కో
టీర భ్రాజిత రత్నముం గొనియె దండిన్ గోపికల్ సూడఁగన్. 1124

అప్పుడు శ్రీకృష్ణుడు 'అన్నా! యక్షునిబాఱినుండి విముక్తలైన ఈ గోపికలను రక్షించుచుండుము' అని పలికి వారిరక్షణబాధ్యతను బలరామునకు అప్పగించెను. పిమ్మట దుష్టసంహారకుడైన శ్రీకృష్ణుడు "ఓరీ! యక్షుడా! పాఱిపోకుము, పాఱిపోకుము' అని రోషోక్తులు పలుకుచు వాని వెంటబడెను. అంతట ఆ శంఖచూడుడు ఎన్నెన్ని రూపములను ధరించి, ఎటు పాఱిపోవుచున్నను విడిచిపెట్టక, ఆ స్వామి వానిని వెంటాడి తిరుగులేని తన బలమైన పిడికిలిపోటుతో వానితలను ముక్కలుగావించెను. పిదప ఆ ప్రభువు వానిజటాజూటమునందు విరాజిల్లుచున్న రత్నమును తీసికొనెను. అప్పుడు శ్రీకృష్ణుడు పరాక్రమించినతీరును, యక్షుని హతమార్చిన విధమును గోపికలు, బలరాముడు కాంచిరి.

వ. ఇట్లు శంఖచూడునిం జంపి, వానిశిరోరత్నంబు దెచ్చి, బలభద్రునకిచ్చి మెప్పించె మఱియు, నొక్కదినంబునం గృష్ణుండు వనంబునకుం జనిన, నతనిలీలలు పాడుచు నిండ్లకడఁ దద్విరహవేదనానలభరంబు సహింపక, గోపికలు తమలో నిట్లనిరి. 1125

ఈవిధముగా శ్రీకృష్ణుడు శంఖచూడుని చంపి, వానిశిరోరత్నమును తీసికొనివచ్చి, దానిని బలరామునకు ఇచ్చి, అయనను మెప్పించెను. మఱియొకనాడు గోవులను మేపుటకై యశోదాతనయుడు వనములకు వెళ్లెను. అంతట తమ ఇండ్లలోనున్న గోపికలు ఆ స్వామిలీలలను గానము చేయసాగిరి. మఱియు వారు ఆ ప్రభువుయొక్క ఎడబాటునకు తట్టుకొనలేక తమలో తాము ఇట్లనుకొనిరి.

శా. భ్రూవిక్షేపముతోడ దాపలి భుజంబుం జెక్కుఁ గీలించి కె
మ్మోవిన్ వేణువుఁ గూర్చి సుస్వరముగా మ్రోయించుచున్నంగుళీ
ప్రావీణ్యంబు విభుండు సూపఁ గని సప్రాణేశలై యుండియున్
నీవీబంధములూడఁ జొక్కుదురు వో నింగిన్ నిలింపాంగనల్. 1126

"కృష్ణప్రభువు తనకనుబొమలను మనోహరముగా కదలించుచు తన చెక్కిలిని ఎడమభుజమునకు ఆనించి,

పిల్లనగ్రోవిని కెమ్మోవిపై (ఎఱ్ఱని తన అధరముపై) చేర్చి, వ్రేళ్లను వేణురంధ్రములపై ఉంచి, నేర్పుగా మ్రోగించుచు మధురస్వరములను పలికించుచుండెడివాడు. అప్పుడు తమపతులతో సహా ఆకాశమునందున్న దివ్యాంగనలు ఆ స్వామియొక్క గానమాధుర్యమునకు చొక్కి సోలిపోవుచుండెడివారు. అంతట వారు తమభర్తలు ప్రక్కనే ఉన్నప్పటికిని కోకలముడులు సడలిపోవుచున్న విషయమును గమనింపకయుండెడివారు.

మ. నవమాధుర్యము గల్గు కృష్ణమురళీనాదామృత స్యందముల్
సెవులం జొచ్చి హృదంతరాళముల భాసిల్లన్ సవత్సంబులై
యువిదా! మేపులకుం దొఱంగి మృగ గోయూథంబులుత్కంఠతో
దివికిం గంఠములెత్తి లోపదలుఁ బో దేహేంద్రియ వ్యాప్తులన్. 1127

చెలియా! కృష్ణునియొక్క అమృతతుల్యములైన వేణునాదపరంపరలలో ఎప్పటికప్పుడు వినూత్నములైన మధురిమలు బలుకుచుండగా తనివిదీర ఆస్వాదించుచున్న (చెవులార ఆలకించుచున్న) గోవులకును, దూడలకును ఆనందముతో హృదయములు ఉప్పొంగుచుండెడివి. అంతట ఆ ఆవులసమూహములు, లేళ్లు, ఉత్కంఠతో (తహ తహపాటుతో) ఆకాశమువైపు మోరలు పైకెత్తి, దేహేంద్రియ వ్యాపారములను మాని (స్పృహలేక) పరవశించి పోవుచుండెడివి సుమా!

శా. ఓ కంజేక్షణ! కృష్ణుఁడుజ్జ్వలిత హారోద్దాముఁడై గానవి
ద్యా కౌతూహలతన్ మనోజ్ఞ మురళీధ్వానంబుఁ గావింపఁగా
నాకర్ణించి సశంపమై మొరయు నీలాభ్రంబుగాఁ జూచుచుం
గేకారావములిచ్చుచున్ మురియుఁ బో కేకీంద్ర సంఘాతముల్. 1128

పద్మాక్షీ! మిఱుమిట్లుగొలుపుచున్న హారములతో విరాజిల్లుచు శ్రీకృష్ణుడు గానవిద్యయందలి కౌతుకముతో మనోహరమైన మురళీనాదములను వినిపించుచుండెడి వాడు. వాటిని ఆలకించిన నెమళ్లగుంపులు ఆ స్వామిని, మెఱుపులతో ఒప్పుచు గర్జించుచున్న నీలమేఘముగా భావించి, క్రేంకారములు సలుపుచు, మురిసిపోవుచు నృత్యములు చేయుచుండెడివి.

మ. లలనా! యేటికిఁ దెల్ల వాఱె రవి యేలా తోఁచెఁ బూర్వాద్రిపైఁ
గలకాలంబు నహంబు గాక నిసిగాఁ గల్పింపఁడాబ్రహ్మతా
వలతేఁడుం గృపలేఁడు కీరములు దుర్వారంబులెట్లో కదే
కలదే మాపటివేళయుం గలుగునే గంజాక్షు సంభోగముల్. 1129

లలనా! ఎందులకు తెల్లవాఱెను? (రాత్రివేళయే మిగిలియుండిన బాగుండెడిది.) సూర్యుడు తూర్పుకొండపై ఉదయించుట ఎందులకు? ఆ బ్రహ్మదేవుడు పగటివేళను కల్పింపక ఎల్లప్పుడు రాత్రివేళయే ఉండునట్లు చేసినచో హాయిగా ఉండెడిది. మన్మథునకు దయలేదు. (శ్రీకృష్ణుని ఎడబాటునకు లోనైన మనలను మన్మథుడు తెగవేధించుచున్నాడు.) చిలుకల కలవరములకు తట్టుకొనలేకున్నాము. ఇక మనగతియేమి? రాత్రివేళయందైనను ఆ శ్రీకృష్ణ ప్రభువుతో మనకు సుఖములు ప్రాప్తించునా?

ఉ. ఎప్పుడు ప్రొద్దు గ్రుంకు హరి యెప్పుడు గోవులమేపి వచ్చు నా
కెప్పుడు తన్ముఖాంబుజ సమీక్షణమబ్బు నతండు వచ్చి న
న్నెప్పుడు గారవించుఁ దుది యెప్పుడు మద్విరహాగ్ని రాశికిం
జెప్పఁ గదమ్మ! బోటి! మరుచేఁతలనుల్లము తల్లడిల్లెడిన్ 1130

చెలియా! సూర్యుడు ఎప్పుడు అస్తమించనోగదా! కృష్ణుడు గోవులను మేపుకొని, ఎప్పుడు వచ్చునో ఏమో? అతని ముఖారవిందమును దర్శించెడి భాగ్యము నాకు ఎప్పుడు కల్గునో! ఆ స్వామి నన్ను దఱిజేరి ఎప్పుడు ఆదరించునోగదా! ఈ విరహతాపము ఎప్పుడు చల్లారునోగదా! వీటిని అన్నింటిని నాకు తెలియజెప్పుము. ఇప్పుడు మన్మథుడు పెట్టెడి బాధలకు నా హృదయము తల్లడిల్లుచున్నది.

మ. చెలియా! కృష్ణుఁడు నన్నుఁ బాసి వనముం జేరంగ నయ్యాక్షణం
బులు నాకన్నియునుండనుండఁగడునా పూర్ణంబులై సాఁగి లో
పలఁ దోఁచుం బ్రహరంబులై దినములై పక్షస్వరూపంబులై
నెలలై యబ్దములై మహాయుగములై నిండారు కల్పంబులై. 1131

చెలీ! శ్రీకృష్ణప్రభువు నన్ను విడిచి వనమునకు వెళ్లినది మొదలు క్షణములు అన్నియును (ప్రతిక్షణము) క్రమక్రమముగా దీర్ఘములై సాగి, నాకు జాములుగా, దినములుగా, పక్షములుగా, నెలలుగా సంవత్సరములుగా మహాయుగములుగా, కల్పములుగా తోచుచున్నవి".

వ. అని మఱియుఁ, గృష్ణవిరహదుఃఖంబున బహువిధంబులఁ బశ్చాత్తాపంబునొందుచు గోపికలోపికలులేక, యెట్టకేలకు దినంబు గడిపి, దినాంతసమయంబునందు. 1132

ఈవిధముగా గోపికలు కృష్ణునిఎడబాటువలన కలిగిన దుఃఖముతో పెక్కువిధములుగా పరితపించిరి. ఓపిక పట్టలేక వారు ఎట్టకేలకు పగటి సమయమును గడపిరి. ఇంతలో సాయంకాలమయ్యెను.

మ. అదె భానుండపరాద్రిఁ జేరె నిదె సాయంకాలమేతెంచె న
ల్లదె గోపాదపరాగమొప్పెసఁగె బృందారణ్య మార్గంబునం
దిదె వీతెంచె వృషేంద్రఘోషము ప్రియుండేతెంచె రండంచుఁదా
మెదురేతెంతురు మాపు కృష్ణునికి నయ్యింతుల్ పరిభ్రాంతలై. 1133

వ. ఇట్లు తన కెదురువచ్చిన మచ్చికనచ్చెలువలనచ్యుతుం డిచ్ఛానువర్తనంబుల గారవించె. నంతనొక్కనాఁడు, 1134

అదిగో! సూర్యుడు అస్తాద్రిపై చేరెను. (అస్తమింపబోవుచున్నాడు) ఇదిగో! సాయంకాలమైనది. అదిగో బృందావనమార్గమున గోవులపాదధూళులు పైకి లేచుచు కనబడుచున్నవి. ఇదిగో! ఎద్దులఅంకెలు వినవచ్చుచున్నవి. మనప్రాణములకు ప్రాణమైన కృష్ణప్రభువు రానేవచ్చుచున్నాడు. 'రండమ్మా! రండు' అనుచు ఆ గోపికలు సంభ్రమముతో సాయంకాల సమయములయందు శ్రీకృష్ణునకు ఎదురుగా వెళ్లుచుందురు. అప్పుడు శ్రీకృష్ణుడు తనకు ఎదురుగా వచ్చిన ఆ వనితలను సాదరముగా స్వేచ్ఛావిహారములతో గౌరవించుచుండును. అంతట ఒకానొకనాడు ఒక సంఘటన సంభవించెను.

## వృషభాసురసంహారము

సీ. ఎవ్వనిమూఁపురమీక్షించి మేఘంబులద్రిశృంగంబని యాశ్రయించు
నెవ్వనిఱంకె కర్ణేంద్రియంబులు సోఁక గర్భపాతంబగు గర్భిణులకు
నెవ్వనిపదహతి నెగయు పరాగంబులంధకారారాతి నావరించు
నెవ్వఁడు కొమ్ముల నెదిరించి చిమ్మినఁ బృథ్వీధరంబులు పెల్లగిల్లు

తే. నట్టి వృషభాసురేంద్రుఁ డహంకరించి వాలలత యెత్తి పెనుఱంకె వైచి నేలఁ
గాలు ద్రవ్వుచు నిశితశృంగములు సాఁచి మంద బెగడంగఁ గవిసె నమంతగతిని. 1135

అరిష్టుడను రాక్షసుడు వృషభాకారమును దాల్చి మిక్కిలి భయంకరముగా నుండెను. ఆ వృషభాసురుని మూపురమును జూచి మేఘములు పర్వతశిఖరమని భావించి, దాని చుట్టును చేరుచుండును. అతనిఱంకెలు చెవులకు సోకినంతనే గర్భవతులకు గర్భస్రావమగుచుండును. అతనిపాదముల తాకిడికి చెలరేగెడి దుమ్ములు సూర్యమండలమును ఆవరించుచుండును. అతడు విజృంభించి కొమ్ములతో క్రుమ్మినప్పుడు కొండలు బ్రద్దలగుచుండును. అట్టి వృషభాసురుడు ఒకనాడు అహంకారముతో తీగవలె విలసిల్లుచున్న (తన) తోకను పైకెత్తి, పెద్దగా అంకెలు వేయుచు నేలను కాళ్లతో (గిట్టలతో) త్రవ్వుచు, వాడియైన (తన) కొమ్ములను నిగిడించి, గొల్లపల్లె వాసులందఱును భీతిల్లునట్లుగా వారిపైకి విజృంభించెను.

వ. ఇట్లు వృషభాకారంబున నరిష్టుండు, హరికి నరిష్టంబు సేయందలంచి, పైకురికిన. 1136

ఉ. క్రేవులుపాఱె గోవులకుఁ గ్రేవులు గోవులు గో వృషంబులం
బైపడె వత్సధేనువృషభంబులు గోపకులందుఁ జొచ్చెనా
గోపకులావృషేంద్రములు గోవులు లేఁగలు విచ్చి పాఱఁగా
గోపచమూవిభుండు కనె గోవృష దైత్యుఁడు వెంట నంటఁగన్ 1137

ఈవిధముగా అరిష్టాసురుడు కృష్ణునకు హాని తలపెట్టి వృషభాకారముతో ఆయనమీదికి పరుగెత్తెను. అట్టి స్థితిలో దూడలు మిగుల భీతిల్లి గోవులకడకేగెను. పిదప ఆ ఆవులును దూడలును, ఎద్దులను జేరెను. పిమ్మట ఆ దూడలు, ఆవులు ఎద్దులు అన్నియును తమ రక్షణకై గోపాలురను ఆశ్రయించెను. అంతట ఆ గోవులును, దూడలును, ఎద్దులును, గోపాలురును ఆందోళన పడుచు పరుగిడసాగిరి. అంతట వృషభాసురుడు గోపాలాదులు వెంటాడుటను శ్రీకృష్ణుడు గమనించెను.

వ. ఇట్లు భయభ్రాంతులై, కాంతలుం దారును గృష్ణ!కృష్ణ! రక్షింపు రక్షింపుమనియెడు గోపకులకు నడ్డంబు వచ్చి, దీనజన రక్షకుండైన పుండరీకాక్షుండిట్లనియె. 1138

ఈవిధముగా భయముతో దిక్కుతోచకయున్న గోపికలు, గోపాలురు 'కృష్ణా! కృష్ణా! రక్షింపుము, రక్షింపుము' అని మొఱపెట్టుకొనసాగిరి. అంతట దీనజనులకు రక్షకుడైన శ్రీకృష్ణుడు వారిమొఱలను ఆలకించి, వెంటనే గోపాలురకు అండగా జేరి, ఆ రాక్షసుని హెచ్చరించుచు ఇట్లు నుడివెను.

ఉ. బాలుర నింతులం బసులఁ బాఱఁగఁదోలుట బంటుపంతమే
చాలు వృషాసురేంద్ర బలసంపదఁ జూపఁగ నెల్లబోఁటి గో
పాలుర మందగాదు చనుపైఁబడితేనిఁ బ్రచండ కృష్ణ శా
ర్దూలము నేఁడు నీ గళముఁ ద్రుంపక చంపక పోవనిచ్చునే. 1139

ఆ. అనుచు ధిక్కరించి హస్తతలంబులఁ జప్పళించి నగుచుఁ జలము మీఱఁ
బన్నగేంద్రభయద బాహుదండము సాఁచి దండిమెఱసి దనుజుదండ నిలిచె. 1140

"వృషభాసురా! బాలురను, స్త్రీలను, పశువులను పాఱద్రోలుట నిజమైన వీరునియొక్క లక్షణముగాదు. ఇంక నీ ప్రతాపమును చాలింపుము. నీ పరాక్రమమును జూచి పాఱిపోవుటకు నేను గోపగోపీజనులమందనుగాను. ఇంతటనైనను

బుద్ధి తెచ్చుకొని వెనుదిరుగుము" అట్లుగాక నీవు నా మీదికి వచ్చినచో తిరుగులేని బలపరాక్రమములుగల కృష్ణుడనెడి ఈ పెద్దపులి నేడు నీ కంఠమును చీల్చివైచును, నిన్ను చంపకుండా పోనియ్యదు!" అని ధిక్కారస్వరముతో పలుకుచు శ్రీకృష్ణుడు భుజములను చఱచుచు (కవ్వించుచు) నవ్వుచు (గేలిసేయుచు) మహాసర్పమువలె భయంకరముగానున్న తన బాహుదండమును చాచి, ధైర్యసాహసములను ప్రకటించుచు ఆ దైత్యుని సమీపమున నిలిచెను.

వ. అప్పుడు. 1141

చ. ఖురముల నేలఁ ద్రవ్వుచు నకుంఠిత వాలసమీరణంబులన్
విరవిరఁ బోయి మేఘములు విచ్చ విషాణము లొడ్డికొంచు దు
స్తరతరమూర్తి యై వృషభదైత్యుఁడు కన్నుల నిప్పులొల్కఁగా
దురదుర వచ్చి తాఁకె రిపుదుర్మద మోచనుఁ బద్మలోచనున్. 1142

అంతట వృషభాసురుడు పౌరుషసూచకముగా తన గిట్టలతో నేలను త్రవ్వుచు తిరుగులేని (ఎదిరింపశక్యముగాని) తన తోకను నిటారుగా జేసి గిరగిరత్రిప్పుచు దానిగాలులకు మేఘములు విచ్చిపోవునట్లు చేయుచుండెను. మొనదేలియున్న తన కొమ్ములతో మోహరించెను. అట్లు భయంకర విగ్రహుడైయున్న ఆ వృషభదైత్యుడు కన్నులనుండి నిప్పులను గ్రక్కుచు చకచక వచ్చి, శత్రువులను తునుమాడుటలో మేటియైన కృష్ణప్రభువుపై విఱుచుకొని పడెను.

ఉ. యాదవకుంజరుండు వృషభాసురుకొమ్ములు రెండుఁ బట్టియ
ష్టాదశ పాదమాత్రము గజంబు గజంబును ద్రొబ్బుకై వడిన్
భేదిల ద్రొబ్బ న య్యసుర బిమ్మిటి నొంది చెమర్చి మ్రొగ్గి దు
ర్మాదముతోడ డీకొనెఁ బ్రమత్త విమర్దను నా జనార్దనున్. 1143

యాదవశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు వృషభాసురుని యొక్క రెండు కొమ్ములను పట్టుకొని, ఒక ఏనుగు మఱియొక ఏనుగును నెట్టి వేయునట్లుగా, ఆ రాక్షసుడు పదునెనిమిది అడుగులదూరమున పడునట్లు అతనిని త్రోసివేసెను. అంతట ఆ అసురునకు దిమ్మదిరిగిపోయెను. పిమ్మట అతడు ఒడలంతయు చెమర్చుచుండగా, సోలుచు ఉన్మత్తుడై, దుష్టసంహారకుడైన శ్రీకృష్ణుని డీకొనెను.

ఆ. అంత గోపసింహుఁ డసుర కొమ్ములువట్టి ధరణి ద్రొబ్బి త్రొక్కి దైత్యభటుల
కొమ్ము వీఁగ సురల కొమ్ము వర్ధిల వాని కొమ్ము పెఱికి మొత్తి కూల్చె నధిప! 1144

మహారాజా! అంతట శ్రీకృష్ణప్రభువు ఆ రాక్షసునికొమ్ములు పట్టుకొని, నేలపై పడవేసి, కాళ్లతో త్రొక్కిపట్టెను, పిదప ఆ స్వామి వాని కొమ్ములను విఱిచి వాటితోడనే అతనిని చావగొట్టెను. అప్పుడు రాక్షసపక్షమువారి ఉత్సాహము నీరుగారిపోయెను. దేవతలల్లో ఉత్సాహము పొంగిపొరలెను.

క. ఉక్కు సెడి రొఁజి నెత్తురు, ముక్కున వాతను స్రవింప మూత్ర శకృత్తుల్
మిక్కిలి విడుచుచుఁ బసరపు, రక్కసుఁ డని సమసెఁ బ్రజకు రాగంబమరన్. 1145

అప్పుడు రాక్షసునిబలము క్షీణింపగా అతడు రొప్పుచు, నోటినుండియు, ముక్కునుండియు నెత్తురుగ్రక్కెను. పిమ్మట మలమూత్రములను విడుచుచు అతడు అసువులుబాసెను. అంతట ప్రజలు అందఱును ఎంతయు సంబరపడిరి.

వ. ఇట్లు వృషభాసురుం జంపిన, నిలింపులు గుంపులుగొని, విరులు వర్షింప గోపకులు హర్షింప, గోపసతు లుత్కర్షింప, బలభద్రుండు, దానును, గోవిందుండు పరమానందంబున మందకుం జనియె నంత, 1146

ఈవిధముగా వృషభాసురుడు శ్రీకృష్ణునిచే నేలపాలుకాగా దేవతలు ఎల్లరును గుంపులు గుంపులుగా జేరి ఆ ప్రభువుపై పూలవానలను కురిపించిరి, గోపాలురు మిగుల సంతోషించిరి. గోపికలఆనందము మిన్నుముట్టెను. అనంతరము శ్రీకృష్ణుడు బలరామునితోగూడి పరమానందముతో వ్రేపల్లెకు చేరెను.

## నారదుడు బలరామకృష్ణుల జన్మవృత్తాంతమునుగూర్చి కంసునకు తెలుపుట

చ. ఘనుఁడొకనాఁడు నారదుఁడు కంసునితోఁడ యశోదకూఁతుఁ దాఁ
గనుటయుఁ జక్రి దేవకికి గర్భజుఁడౌటయు మున్ను రోహిణీ
తనయుఁడు రాముఁడౌటయును దద్విభులిద్దఱు మందనున్న వా
రని యెఱుఁగంగఁ జెప్పిన మహాద్భుతమంచుఁ జలించి కిన్కతోన్. 1147

కాలక్రమమున నారదుడు కంసునికడకు వచ్చెను. ఆ మహాత్ముడు తిన్నగా యశోదాదేవి కుమార్తెను (యోగమాయను) కనుట, దేవకీదేవికి శ్రీహరి పుత్రుడుగా అవతరించుట, అంతకుముందే రోహిణీదేవి గర్భమున బలరాముడు ఉద్భవించుట, క్రమముగా ఆ బలరామకృష్ణులు వ్రేపల్లెలో పెఱుగుచుండుట మున్నగు విషయములను కంసునకు విశదపఱచెను. అంతట ఆ కంసుడు మిగుల ఆశ్చర్యపడుచు, క్రోధావేశముతో చలించిపోయెను.

చ. కొడుకుల మందలోననిడి గొంటుతనంబున మోసపుచ్చె నీ
బడుగును బట్టి చంపుటిది భావ్యమటంచుఁ గృపాణపాణియై
పడి వసుదేవునిం దునుమవచ్చిన కంసునిఁ జూచి నారదుం
డుడుగుము చంపఁ బోలదని యోడక మానిచి పోయె మింటికిన్ 1148

అంతట అతడు 'ఈ వసుదేవుడు మిగుల వంచకుడు. ఇతడు నన్ను మోసపుచ్చి (నా తెలియకుండ) తన కుమారులను వ్రేపల్లెలో దాచిపెట్టినాడు. కనుక ఈ పనికిమాలిన వానిని చంపుట యుక్తమే' అని తలంచి, కంసుడు ఖడ్గమును చేబూని, వసుదేవుని వధించుటకై సిద్ధమయ్యెను. అప్పుడు నారదుడు 'నీ ప్రయత్నమును విరమింపుము. నీవు ఇతనిని చంపుట ఏమాత్రమును తగదు' అని జంకులేక పలికి, అతనిని ఆ ప్రయత్నమునుండి నివారించి, దేవలోకమునకు వెళ్ళెను.

వ. మఱియు నలుకదీఱక కంసుడు, దేవకీవసుదేవుల లోహపాశబద్ధులం జేసి, కేశి యనువానిం బిలిచి, రామకేశవులం జంపుమని పంపి, మంత్రి భట గజారోహక చాణూర ముష్టిక సాల్వ కోసల ప్రముఖుల రావించి యిట్లనియె. 1149

ఐనను అతనికోపము చల్లారకుండెను. పిమ్మట అతడు దేవకీవసుదేవులకు ఇనుపసంకెళ్ళు వేయించెను. పిదప బలరామకృష్ణులను చంపుటకై 'కేశి' అను వానిని పంపెను. అనంతరము మంత్రులను, భటులను, గజారోహకులను (మావటివాండ్రను) చాణూరుడు, ముష్టికుడు అను మల్లయోధులను, సాల్వుడు, కోసలుడు మొదలగు ప్రముఖులను పిలిపించి ఇట్లు నుడివెను.

శా. ఎందున్ నన్నెదిరించి పోవుటకు దేవేంద్రాదులుం జాలరీ
బృందారణ్యముఘమందనిప్పుడు మదాభీరార్భకుల్ రామగో
విందుల్ వర్ధిలుచున్నవారఁట రణోర్విం గంసునింద్రుంతుమం
చుచ్ దర్పంబులు పల్కుచుందురఁట యీ చోద్యంబులన్ వింటిరే 1150

"మిత్రులారా! దేవేంద్రుడు మొదలగువారు సైతము ఏవిధముగను నన్ను ఎదిరింపజాలరు. ప్రస్తుతము బృందావనమునందెలి గొల్లపల్లెలో 'రామకృష్ణులు' అను గోపాలకులు పెరుగుచున్నారట. గర్వితులైయున్న ఆ అర్భకులు (పిల్లలు) 'రణరంగమునందు కంసుని వధింతుము' అని ప్రలాపములాడుచున్నారట. చోద్యములైన ఈ మాటలను మీరును వినియున్నారా?

క. పట్టణజనములు చూతురు, దట్టంబుగ మల్లరంగతలపార్శ్వములం
బెట్టింపుఁడు తమకంబులు, పుట్టింపుఁడు వీట మల్లుపోరనుమాటన్. 1151

వెంటనే మీరు మల్లయుద్ధరంగమునకు (కుస్తీపోటీలు జరుగు ప్రదేశమునకు) నలువైపుల మంచెలను (గ్యాలరీలను) ఏర్పఱచుడు. ఈ మల్లులపోరు (మల్లయుద్ధము) జరుగబోవుచున్నట్లు నగరమున ప్రచారము చేయుడు. నగరవాసులు అందఱును వచ్చి ఆ దృశ్యములను తిలకింతురు.

శా. విన్నాణంబులఁ బోర నేర్తురు మహావీర్య ప్రతాపాది సం
పన్నుల్ మీరలు మేటి మల్లుగములం బ్రఖ్యాతులై పెంపుతో
మన్నారాబలకృష్ణులం బెనఁకువన్ మర్దించి మత్ప్రీతి కా
సన్నుల్ గండు పురీజనుల్ పొగడనో చాణూర! యో ముష్టికా! 1152

చాణూర, ముష్టికులారా! మీరు మిగుల శౌర్యసాహసములు, బలపరాక్రమములు గలవారు. మల్లయుద్ధములలో ఆఱితేఱినవారు. ప్రసిద్ధులైన జెట్టీలుగా వాసికెక్కి, గౌరవాదరములను పొందినవారు.పట్టణప్రజలు మెచ్చుకొనునట్లుగామల్లయుద్ధమునందు ఆ బలరామకృష్ణులను దెబ్బతీయుడు. అట్లొనర్చి మీరు నా ప్రేమకు పాత్రులు కండు.

శా. రారా! హస్తిపకేంద్ర! గండ మదధారా గంధలోభాంధ గం
భీరాళివ్రజమైన మత్కువలయాపీడ ద్విపేంద్రంబుమ
ద్ద్వారోదంచిత దేహళీ పరిసర స్తంభంబు డాయంగ నా
భీరుల్ రానదలించి డీకొలుపు నీ బీరంబు తోరంబుగన్. 1153

మేటిమావటీ! ఇటు రమ్ము. మనయొద్ద 'కువలయాపీడము' అను మదపుటేనుగుగలదు. దాని గండస్థలములయందలి మదధారలపరిమళములచే ఆకర్షింపబడిన తుమ్మెదలగుంపులు ఆ మదగజముపై మూగియుండును. దానిని నా భవనముఖద్వారముయొక్క కడప సమీపమునగల స్తంభమునకు కట్టివేయుడు. ఆ గొల్లపిల్లలు (బలరామకృష్ణులు) అచటికిరాగానే నీ శక్తికొలది ఆ కువలయాపీడమును (మదపుటేనుగును) వారిమీదికి ఉసికొలుపుము.

క. పశువిశసనములు సేయుఁడు, పశుపతికిం బ్రియముగాఁగ భావించి చతు
ర్దశినాఁడు ధనుర్యాగము, విశదంబుగఁజేయవలయు విజయము కొఱకున్ 1154

మల్లయుద్ధమునందు వారిని జయించుటకై (మనకు విజయము ప్రాప్తించుటకై) విధివిధానముగా చతుర్దశినాడు 'ధనుర్యాగము' చేయవలసియున్నది. ముందుగా శివుని ప్రీతికొఱకై పశువులను బలియిండు".

## కంసుడు బలరామకృష్ణులకడకు అక్రూరుని పంపుట

వ. అని తనవారి నందఱనయ్యై పనులకు నియమించి యదుశ్రేష్ఠుండగు నక్రూరునిం బిలిచి, చెట్టవట్టికొని, యిట్లనియె. 1155

కంసుడు ఈవిధముగా పలికి తన అనుయాయులను అందఱిని ఆయా పనులకు నియమించెను. పిమ్మట అతడు యాదవులలో ప్రముఖుడైన అక్రూరుని పిలిపించి, అతని చేయి పట్టుకొని ఇట్లనెను.

శా. అక్రూరత్వముతోడ నీవు మనఁగా నక్రూరనామంబు ని
ర్వక్రత్వంబునఁ జెల్లె మైత్రి సలుపన్ వచ్చున్ నినుం జేరి నీ
వక్రోధుండవు మందలోన బలకృష్ణాభీరులస్మద్వినా
శక్రీడారతులై చరింతురఁట యోజం దెచ్చి యొప్పింపవే. 1156

అక్రూరా! నీవు మిగుల సౌమ్యస్వభావముగలవాడవు. కనుక నీకు అక్రూరుడు (క్రూరత్వములేనివాడు) అను పేరు అన్నివిధములుగా సార్థకమయ్యెను. కావున నీతో మైత్రి సల్పుట ఎంతయు సముచితము. (స్నేహముచేయుటకు తగినవాడవు) యాదవులైన బలరామకృష్ణులు నన్ను చంపుటకై కంకణముకట్టుకొనియున్నారట. ఎట్టి క్రూరత్వములేనివాడవైన నీవు (నీ సౌమ్యత్వమువలన) యాదవులందఱిలో మేటివి. కాబట్టి నీవు గొల్లపల్లెకు వెళ్ళి, నేర్పుతో వారిని తీసికొనివచ్చి నాకు సంతోషమును గూర్పుము.

ఆ. నాకు వెఱచి సురలు నారాయణుని వేడికొనిన నతఁడు వచ్చి గోపకులము
నందుఁ గృష్ణమూర్తి యానకదుందుభికుదితుఁడయ్యె ననఁగ నొకటి వింటి. 1157

వ. కావున నీవు గోపకులచేతవరులు గొని, ధనుర్యాగంబుఁ జూడరండని, వారలఁ దోడ్కొనిరమ్ము.
వచ్చిన, 1158

దేవతలు నాకు భయపడి తమను రక్షించుటకై శ్రీమన్నారాయణుని శరణుజొచ్చినారట. అంతట ఆ స్వామి వారికి అభయమిచ్చినాడట. పిదప ఆ ప్రభువు యదువంశమునందు వసుదేవునకు సుతుడై అవతరించి, 'కృష్ణుడు' అను పేరుతో మసలుకొనుచున్నాడని వింటిని. కనుక అచటికి వెళ్ళి, గోపాలురను ధనుర్యాగమునకు ఆహ్వానింపుము. కప్పములను తీసికొని రావలసినదిగా గుర్తుచేయుము. అంతేగాక వారిని ఒప్పించి బలరామకృష్ణులను తోడ్కొనిరమ్ము.

శా. కొండల్ గూలఁగఁద్రొబ్బు కొమ్ముల తుదిం గోపించి కోరాడుచో
దండిన్ దండి నధఃకరించు నొక వేదండంబు నా యింట బ్ర
హ్మాండంబైనఁ గదల్పనోపు బలకృష్ణాభీరులం బోరిలో
ఖండింపన్ దడవెంత దాని కదియుం గాదేని నక్రూరకా! 1159

శా. చాణూరుండును ముష్టికుండును సభాసంఖ్యాతమల్లుల్ జగ
త్ప్రాణున్ మెచ్చరు సత్త్వసంపదల బాహాబాహి సంగ్రామ పా
రీణుల్ వారలు రామకృష్ణులబలోద్రేకంబు సైరింతురే
క్షీణప్రాణులఁజేసి చంపుదురు సూ సిద్ధంబు యుద్ధంబునన్ 1160

అక్రూరా! నాకడ ఒక మదపుటేనుగుగలదు. అది కొండలను సైతము కూలద్రోయగలదు. అది మిగుల కోపము వహించి తన రెండు కోఱల (దంతముల) కొనలతో రుద్దినచో, దాని ధాటికి యముడు (మృత్యువు) సైతము దిగదుడుపే. అది బ్రహ్మాండమునుగూడ కదిలింపగలదు. యాదవమాత్రులైన బలరామకృష్ణులు వచ్చినచో వారిని పోరులో ఖండించి (వధించి) వేయుటకు దానికి ఎంతోసేపు పట్టదు. అట్లుగానిచో నా దగ్గఱ చాణూరుడు, ముష్టికుడు అను గొప్ప మల్లురు గలరు. వారు పెక్కు కుస్తీ పోటీలలో నెగ్గి ఖ్యాతి వహించినవారు. బలసంపదలో వాయుదేవుడును వారి ముందు తీసికట్టే.

వారు ద్వంద్వయుద్ధములలో ఆఱితేఱినవారు. రామకృష్ణులు ఎంతటి బలవంతులైనను వారివిజృంభణను నా మల్లులు తిరస్కరింతురు. యుద్ధరంగమున ఆ చాణూరముష్టికులు వారిప్రాణములన్నుబట్టునట్లుగా జేసి చంపివేయుదురు. ఇది ముమ్మాటికిని నిజము.

సీ. ఆ రామకేశవులంతరించిన వసుదేవముఖ్యులఁ జంపి తెగువ మెఱసి
వృష్ణిభోజ దశార్హవీరులఁ దెగటార్చి ముదుకఁడు రాజ్యకాముకుఁడు ఖలుఁడు
నగు నుగ్రసేను మాయయ్య గీటడఁగించి పినతండ్రి దేవకుఁ బిలుకుమార్చి
మఱియు వైరులనెల్ల మర్దించి నే జరాసంధ నరక బాణ శంబరాది
ఆ. సఖులతోడ భూమిచక్ర మేలెదఁ బొమ్ము తెమ్ము వేగమ వసుదేవసుతుల
మఖము పేరు సెప్పి మంత్రభేదము సేయ వలయు బెంపఁజనదు వైరిజనుల. 1161

అక్రూరా! ఆ రామకృష్ణులను హతమార్చిన పిమ్మట వసుదేవుడు మున్నగు ప్రముఖులను రూపుమాపెదను. పిమ్మట మిగుల సాహసముతో వృష్ణి, భోజ, దశార్హవంశములకు చెందిన వీరులను తునుమాడెదను. నా తండ్రియగు ఉగ్రసేనుడు ముసలివాడు, అంతులేని రాజ్యకాంక్షగలవాడు. అంతేగాదు కటిక దుర్మార్గుడు. అతని గర్వమును అణచివేసెదను. నా పినతండ్రియగు దేవకుని హతమార్చెదను. ఇంకను మిగిలియున్న శత్రువులను అందఱిని తుదముట్టించెదను. జరాసంధుడు, నరకుడు, బాణుడు, శంబరుడు మొదలగు నా మిత్రులయొక్క అండదండలతో ఈ భూమండలమును ఏలెదను. నీవు ఇప్పుడే గొల్లపల్లెకు వెల్లుము. 'ధనుర్యాగము' నెపముతో వసుదేవుని సుతులైన బలరామకృష్ణులను వెంటనే తీసికొనిరమ్ము. శత్రువులను నమ్మించి దెబ్బతీయవలెను. వారిని పైకి రానీయరాదు.

వ. అనిన నక్రూరుండిట్లనియె. 1162

ఉ. పంపినఁ బోనివాఁడనె నృపాలక! మానవు లెన్నఁదమ్ము నూ
హింపరు దైవయోగముల నించుక గానరు తోఁచినట్లు వి
ష్కంపగతిం జరింతురది గాదనవచ్చునె యీశ్వరేచ్ఛంద
ప్పింపఁగరాదు నీ పగతుబిడ్డలఁ దెచ్చెదఁ బోయివచ్చెదన్ 1163

అంతట అక్రూరుడు ఆ కంసునితో ఇట్లనెను. "కంసరాజా! నీవు ఆజ్ఞాపించిన పిదప నేను ఎట్లు వెళ్లకయుందును. మానవులు తమ శక్తియుక్తులపరిమితులనుగూర్చి తెలిసికొనలేరు. విధినిర్ణయముల గూర్చి ఇంచుకయు ఎఱుంగరు. వారు తమకు తోచినరీతిగా కఠినముగా (దయాదాక్షిణ్యములను మాని) మసలుకొందురు. ఈ లోకరీతిని ఎవరును మార్చజాలరు. ఐనను ఈశ్వరేచ్ఛను (విధినిర్ణయమును) తప్పించుకొనుటకు ఎవ్వరికిని సాధ్యముకాదు. కావున నీకు శత్రువులైన బలరామకృష్ణులను తీసికొనివత్తును. ఇక నేను వెళ్లి వచ్చెదను".

## శ్రీకృష్ణుండు కేశివ్యోమాసురులను సంహరించుట

వ. అని పలికి, రథంబెక్కి, యక్రూరుండు సనిన, సకలజనులను వీడుకొలిపి, కంసుండంతిపురంబునకుం జనియె. నంతఁ గంసప్రేరితుండై. 1164

సీ. ఖురపుటాహతిఁ దూలి కుంభినీచక్రంబు ఫణిరాజఫణులకు బరువు సేయ
భీషణ హేషా విభీషితులై మింట నమృతాంధులొండొరునంద గొనఁగఁ
జటుల చంచల సటాచ్ఛటలగాడ్పుల మేఘములు విమానములపై ముసుఁగు పడఁగ
వివృతాస్య గహ్వర విపుల దంతంబులు ప్రళయాగ్నికీలలపగిది మెఱయఁ

ఆ. గాలపాశలీలగా వాలమేపార వాహమగుచు గంధవాహగతుల
విజిత శక్రపాశి వీర్యపయోరాశి కేశి వచ్చె మంద క్లేశమంద. 1165

ఇట్లు పలికిన పిదప అక్రూరుడు రథముపై ఎక్కి వెళ్లిపోయెను. అంతట కంసుడు తన సహచరులను అందఱిని పంపివేసి, తన అంతఃపురమునకు చేరెను. పిమ్మట కంసునిచే ఆజ్ఞాపింపబడిన 'కేశి' అనువాడు (అశ్వాకారముతో) గోకులమునకు వచ్చెను. గుఱ్ఱపు ఆకారముననున్న ఆ కేశి రాక్షసుడు ఇంద్రుని, వరుణుని సైతము జయించినవాడు, అంతులేని శౌర్యసాహసములు గలవాడు. (శౌర్యమునకు సముద్రమువంటివాడు) అతనియొక్క బలమైన గిట్టలధాటికి భూమండలము కంపింపగా ఆ భూభారమును వహించుచున్న ఆదిశేషునిపడగలు ఆ బరువును మోయలేకుండెను. ఆకాశమునందుగల దేవతలు భయంకరమైన అతని సకిలింపులకు భీతిల్లి వణకిపోవుచు ఒకరిని మఱియొకరు పట్టుకొనిరి. తీవ్రముగా అటునిటు కదలుచున్న అతని (ఆ గుఱ్ఱముయొక్క) జూలుయొక్క గాలులకు మేఘములు చెల్లాచెదరై అచటి విమానములపై వ్యాపించెను. అతడు తననోఱు తెఱచినప్పుడు అది ఒక గుహవలె భయంకరముగా ఉండెను. అట్టి నోటియందలి పెద్దపెద్ద దంతములకాంతులు ప్రళయాగ్నిజ్వాలలను తలపింపజేయుచుండెను. అతడు వాయువేగముగా విజృంభించుచురాగా గొల్లపల్లెలోనివారు అందఱును అగచాట్లపాలైరి.

క. భీషణ ఘోటక దానవ, హేషానిర్ఘోష భిన్న హృదయ నిఖిల గో
యోషా పురుషార్భకమై, ఘోషము హరి సూడ దైన్య ఘోషంబయ్యెన్. 1166

భయంకరమైన అశ్వాసురుని (కేశి) సకిలింపులగర్జనలకు (చెవులు చిల్లులు పడునట్లు ఒప్పుచున్న ఆ భీకరధ్వనులకు) ఆ గొల్లపల్లెయందలి గోవులు, గోపికలు, గోపాలురు, బాలురు మున్నగువారిగుండెలు అవిసిపోయెను. దిక్కుతోచని స్థితిలోనున్న ఆ పల్లెవాసులగగ్గోలులను శ్రీకృష్ణుడు గమనించెను.

వ. ఆ య్యవసరంబున. 1167

ఉ. పేదల ఘోషగోపకుల బిట్టదలించుట వీరధర్మమా
కాదు వ్రజంబులో దనుజఘస్మరుఁ డేఁడని తన్ను రోయు క్ర
వ్యాదునిఁ జూచి గోపకులకడ్డము వచ్చి నిశాట! యింకఁబో
రాదని శౌరి సీరె మృగరాజుక్రియన్నెదిరించె దైత్యుఁడున్. 1168

ఇంతలో ఆ అశ్వాసురుడు (కేశి) 'పేదలైన (బలహీనులైన) ఈ పల్లెలోని గోపాలురను పాఱద్రోలుట వీర ధర్మము గాదు' అని తలంచుచు, 'ఈ గోకులమునందు (రాక్షసులను చంపిన) ఆ శ్రీకృష్ణుడు ఎక్కడ' అని తనకొఱకు వెదకుచున్న ఆ రాక్షసుని ఆ స్వామి చూచెను. వెంటనే ఆ ప్రభువు గోపాలురకు అండగా నిలిచి, "ఓరీ! నిశాచరా! ఇంక నానుండి తప్పించుకొనజాలవు" అని వానిని హెచ్చరించెను. అంతట ఆ కేశిరాక్షసుడు సింహమువలె ఆ స్వామిని ఎదిరించెను.

ఆ. నిష్ఠురోగ్ర సింహవినదంబుతో నింగి మ్రింగుభంగి నోరు మిగులఁ దెఱచి
కఱవరాఁగ నతఁడు కాటు దప్పించినఁ దన్నె నెగసి తురగదానవుండు. 1169

చెవులు చిల్లులు పడునట్లుగా భయంకరమైన సింహనాదములను గావించుచు, ఆ అశ్వాసురుడు ఆకాశమును మ్రింగబోవుచున్నట్లుగా నోరు తెఱచి, శ్రీకృష్ణుని నమలివేయుటకై సిద్ధపడెను. అంతట ఆ స్వామి అతని ప్రయత్నమును వమ్మొనర్చెను. అప్పుడు ఆ దానవుడు విజృంభించి తన్నెను.

ఉ. తన్నిన తన్నునం బడక దానవహంత సమీకరంతరయై
కన్నులఁ గెంపు పెంపెనయ గ్రక్కున ఘోటనిశాటుపాదముల్
వన్నె పెడంగఁ బట్టి పడివైచె ధనుశ్శతమాత్రదూరముం
బన్నగడింభమున్ విసరి పాఱఁగ వైచు ఖగేంద్రుకైవడిన్. 1170

అంతట ఆ ప్రభువు వానితన్నునకు చిక్కక యుద్ధావేశముతో కన్నులెఱ్ఱజేసెను, వెంటనే ఒడుపుతో ఆ అశ్వాసురునిపాదములను (అవి దెబ్బతినునట్లుగా) పట్టుకొని, గరుత్మంతుడు ఒక చిన్నపామును విసరివేయునట్లుగా, వానిని నూఱుబాఱలదూరమున పడునట్లు పాఱవైచెను.

ఉ. వైచిన మ్రొగ్గి లేచి వెస వాజినిశాటుఁడు హుంకరించి సం
కోచములేక పైఁబడిన గోపకులేంద్రుఁడు దిగ్గజేంద్రశుం
డా చటులప్రభా బలవిడంబకమైన భుజార్గళంబు దో
షాచరునోటిలో నిడియె జండఫణిన్ గుహనుంచుకైవడిన్. 1171

శ్రీకృష్ణుడు విసరివేయగా ఆ కేశి రాక్షసుడు (అశ్వాసురుడు) క్రింద పడిలేచి, నిలద్రొక్కుకొని, హుంకారము చేయుచు జంకుగొంకులులేక ఆ కృష్ణప్రభువుమీదికి విజృంభించెను. అంతట గోపాలురలో శ్రేష్ఠుడైన ఆ స్వామి మేలైన దిగ్గజముయొక్క తొండమువలె బలిష్ఠమై కాంతులీనుచున్న తనబాహుదండమును, ఒక గుహలో మహాసర్పమును ప్రవేశపెట్టినట్లు ఆ రాక్షసునినోటిలోనికి జొనిపెను.

శా. దంభోళిప్రతిమాన కర్కశ మహోద్య ద్వామ దోఃస్తంభమున్
శుంభల్లీల నఘారి వాని రదముల్ చూర్ణంబులై రాలఁగా
గంభీరంబుగఁ గుక్షిలోఁ జొనిపి వీఁకన్ వృద్ధిఁ బొందించుచున్
గుంభించెం బవనంబు పిక్కటిలఁ దత్కుక్షిన్ నరేంద్రోత్తమా! 1172

పరీక్షిన్మహారాజా! పిదప ఆ ప్రభువు వజ్రాయుధమువలె కఠినాతికఠినమై, స్తంభమువలె ఒప్పారుచున్న తన ఎడమచేతిని పైకెత్తి ఆ రాక్షసునినోటిలో పెట్టుటతో దానిధాటికి అతనిదంతములు పిండి పిండియై రాలిపోయెను. ఇంకను ఆ స్వామి ఆ హస్తమును వాని కడుపులోనికి జొనిపి అంతకంతకును లావుగా పెంచుచు వానికి ఊపిరి సలుపకుండ జేసెను.

క. వాయువు వెడలక నిలిచినఁ గాయంబు సెమర్పఁ గన్నుఁగవ వెలికుఱుకన్
మాయపెడి తన్నుకొనుచును, గూయుచు నశ్వాసురుండు కూలెన్ నేలన్. 1173

ఆ. ఘోటకాసురేంద్రుకుక్షిలోఁ గృష్ణునిబాహువధికమైనఁ బట్టలేమిఁ
బగిలి దోసపండుపగిదిఁ దద్దేహంబు వసుమతీశ! రెండు వ్రయ్యలయ్యె. 1174

అంతట అతనిప్రాణవాయువులు బయటికి రాక (శ్వాస) ఆగిపోవుటతో, శరీరమునందు అంతటను చెమటలు పట్టెను. అతడు కండ్లు తేలవేసెను. తనమాయలు పనిచేయకపోవుటతో గిలగిలలాడసాగెను. అంతట ఆ కేశి రాక్షసుడు పెద్దగా కేకలుపెట్టుచు నేలగూలెను. రాజా! శ్రీకృష్ణునిబాహువు ఆ అశ్వాసురుని (కేశి) యొక్క కుక్షిలోనికి పోయిన పిమ్మట, అది లావై, బలమైపోవుటతో ఆ రాక్షసుని పొట్ట దోసపండువలె పగిలి రెండు ముక్కలయ్యెను.

క. నళినాక్షుఁడు లీలాగతి, విలయముఁ బొందించె నిట్లు వీరావేశిం
బలలాశిన్ జగదభినవ, బలరాశిన్ విజిత శక్రపాశిన్ గేశిన్ 1175

సహజముగా మాంసభక్షకుడైన కేశి వీరావేశము గలవాడు, ఈ లోకమున కనివిని యెఱుగని బలశాలి, ఇంద్రుని, వరుణుని ఓటమిపాలు చేసినవాడు. అట్టి అశ్వాసురుని శ్రీకృష్ణుడు ఇట్లు అవలీలగా రూపుమాపెను.

వ. ఆ సమయంబునం బుష్పవర్షంబులు కురియించి, సురలు వినుతించి రంత హరిభక్తి విశారదుం డైన నారదుండు వచ్చి, గోవిందుని సందర్శించి రహస్యంబున నిట్లనియె. 1176

అప్పుడు దేవతలు అందఱును కృష్ణప్రభువుపై పుష్పవర్షమును కురిపించి, ప్రస్తుతించిరి. అంతట విష్ణుభక్తులలో ప్రముఖుడైన నారదమహర్షి అచటికి విచ్చేసి, గోవిందుని దర్శించి రహస్యముగా (ఏకాంతమున) ఇట్లు పలికెను.

సీ. జగతీశ! యోగీశ!సర్వ భూతాధార! సకలసంపూర్ణ! యీశ్వర! మహాత్మ
కాష్ఠగత జ్యోతికైవడి నిఖిల భూతములందు నొకఁడవై తనరుదీవు
సద్గూఢుఁడవు గుహాశయుఁడవు సాక్షివి నీయంతవాఁడవై నీవు మాయఁ
గూడి కల్పింతువు గుణముల వానిచేఁ బుట్టించి రక్షించి పొలియఁజేయు

ఆ. దీప్రపంచమెల్ల నిట్టి నీవిప్పుడు రాజమూర్తు లయిన రాక్షసులను
సంహరించి భూమిచక్రంబు రక్షింప నవతరించినాఁడవయ్య! కృష్ణ. 1177

"ప్రభూ! నీవు సమస్త జగత్తునకును ప్రభుడవు. యోగులలోకెల్లను గొప్పవాడవైన మహాయోగివి. సకలప్రాణులకును ఆధారమైనవాడవు. స్థావరజంగమాత్మకమైన ఈ ప్రపంచమునందు అంతటను నిండియుండువాడవు. సకలలోకములను శాసించువాడవు. పరమాత్ముడవు. కట్టెలలో అగ్నివలె సకలప్రాణులలో అంతరాత్మవై విరాజిల్లుచుండెడివాడవు. సత్పురుషులహృదయములయందు నివసించుచుండువాడవు. బుద్ధితత్త్వమునకును అందనివాడవు. సకల చరాచరప్రాణుల క్రియాకలాపములకు సాక్షిభూతుడవై యుండువాడవు. నీకు సమానుడు మఱియొకడు లేడు. అట్టి నీవు మూలప్రకృతితో (యోగమాయతో) గూడి సత్త్వరజస్తమోగుణములను గల్పింతువు. త్రిగుణాత్మకమైన సమస్త ప్రపంచమును సృష్టించి, రక్షించి, లయింపజేయుచుండువాడవు. అట్టి నీవు రాజ్యాధికారములచే గర్వితులై యున్న రాక్షసులను సంహరించి ఈ భూమండలమును రక్షించుటకై శ్రీకృష్ణుడుగా అవతరించిన భగవంతుడవేగాని యాదవమాత్రుడవుగావు.

వ. దేవా! నీచేతనింకఁ జాణూర, ముష్టిక, గజ, కంస, శంఖ, యవన, ముర, నరక, పౌండ్రక, శిశుపాల, దంతవక్త్ర సాల్వ ప్రముఖులు మడిసెదరు, పారిజాతంబపహృతంబయ్యెడిని. నృగుండు శాపవిముక్తుండగు. స్యమంతకమణి[1] సంగ్రహంబగు. మృత బ్రాహ్మణపుత్ర ప్రదానంబు సిద్ధించు. అర్జునసారథివై యనేకాక్షౌహిణీబలంబుల వధియించెదవు. మఱియును 1178

దేవదేవా! ఇక ముమ్మందు చాణూరముష్టికులు - అనుమల్లురను, 'కువలయాపీడము' అను గజమును, కంసుని, శంఖుని, కాలయవనుని, మురాసురుని, నరకాసురుని, పౌండ్రకుని, శిశుపాల దంతవక్త్రులను సాల్వుని, తదితర ప్రముఖదుష్టులను తుదముట్టించెదవు. దేవలోకమునుండి (నందనవనమునుండి) పారిజాతవృక్షమును తీసికొనివత్తువు. నృగమహారాజు నీవలన శాపవిముక్తుడగును. శమంతకమణిని తీసికొనివచ్చి, సత్రాజిత్తునకు అప్పగించెదవు. మృతుడైన బ్రాహ్మణ (సాందీపని) సుతుని బ్రతికించి, ఆ విప్రునకు అప్పగించెదవు. కురుక్షేత్ర యుద్ధమునందు అర్జుననకు రథసారథివై పెక్కు అక్షౌహిణీబలములను సంహరింపజేసెదవు.

1. స్యమంతకము - శమంతకము అను రూపములు రెండును గలవు.

శా. కృష్ణా! నీవొనరించు కార్యములు లెక్కింపన్ సమర్థుండె వ
ర్ధిష్ణుండైన విధాత మూఁడు గుణముల్ దీపించు లోపించు రో
చిష్ణుత్వంబుననుండు నీవలన నిస్సీమంబు నీ రూపు నిన్
విష్ణున్ జిష్ణు సహిష్ణు నీశు నమితున్ విశ్వేశ్వరున్ మ్రొక్కెదన్. 1179

కృష్ణా! నీ అనుగ్రహమున వర్ధిల్లుచుండెడి బ్రహ్మయు నీవు గావించెడి కార్యములను లెక్కించుటకు సమర్థుడు కాజాలడు. సత్త్వరజస్తమోగుణములు మూడును నీ నుండియే ఉత్పన్నములగును. నీలోనే లయమగును. నీ వలననే వృద్ధిపొందును. నీ రూపము అవధులు లేనిది (అనంతము.) నీవు సర్వవ్యాపకుడవు, జయశీలుడవు, దుష్టులపాపకృత్యములు పరిపక్వములగువఱకు వాటిని సహించుచుండువాడవు. సర్వేశ్వరుడవు. వివిధ ప్రమాణములకు అతీతుడవు. సమస్త జగత్తును నియంత్రించువాడవు. అట్టి నీకు ప్రణమిల్లెదను.

వ. అని వినుతించి, వీడుకొని, నారదుండరిగె, నంత నొక్కనాఁడు కృష్ణసహితులయిన, గోపకుమారులడవికిం జని, పసుల మేపుచు, నొక్కకొండదండ నిలాయనక్రీడలు సేసిరందు. 1180

క. కొందఱు గొఱియలమంచును, గొందఱు పాలకులమంచుఁ గుటిలత్వమునం
గొందఱు దొంగలమనుచును, జెంది కుమారకులు క్రీడసేసిరి తమలోన్. 1181

నారదమహర్షి కృష్ణప్రభువును ఈ విధముగా స్తుతించి, వీడ్కొని వెళ్లిపోయెను. పిమ్మట ఒకానొకనాడు గోపాలకులు శ్రీకృష్ణునితోగూడి అడవికిపోయిరి. వారు అక్కడ గోవులను మేపుచు, ఒక పర్వతసమీపమున నిలాయనక్రీడలను (మేకలఆటలను లేక దాగుడుమూతలాటలను) ఆడిరి. ఆ ఆటలలో భాగముగా కొందఱు గొఱ్ఱెలుగాను, కొందఱు గొఱ్ఱెలకాపరులుగను, మఱికొందఱు ఆఱితేఱిన దొంగలుగాను నటించుచు ఆ గోపాలకులు తమలోతాము క్రీడలు సలిపిరి.

శా. ఆలో దొంగలలో మయాసురసుతుం డాద్యుండు వ్యోముండు గో
పాలుండై చని మేషకల్పనలతో భాసిల్లి క్రీడించు త
ద్బాలవ్రాతమునెల్ల మెల్లన చతుః పంచావశిష్టంబుగా
శైలాంతర్గుహలోనికిం గొని చనెం జౌర్యంబవార్యంబుగన్. 1182

ఆటలు కొనసాగుచుండగా మయూరాసురుని కొడుకులలో పెద్దవాడైన వ్యోమాసురుడు గోపాలునిరూపముతో వారిలో చేరెను. పిమ్మట అతడు మేకలుగా నటించుచున్న ఆ గోపాలురసమూహములో దొంగతనముగా నలుగురైదుగురిని తప్ప తక్కినవారిని అందఱిని వరుసగా ఒక పర్వతగుహలోనికి తీసికొనివెళ్లి దాచెను.

వ. ఇట్లు కొండగుహలోనఁ గ్రమక్రమంబున గోపకుమారులనిడి, యొక్క పెనుఱాతఁ దద్ద్వారంబుఁ గప్పి, యొప్పటియట్ల వచ్చిన 1183

ఈవిధముగా ఆ వ్యోమాసురుడు ఆ గోపబాలురను క్రమక్రమముగా ఒక కొండ గుహలోనికి చేర్చిన పిమ్మట ఆ గుహద్వారమునకు ఒక పెద్దబండను అడ్డముగాపెట్టి (ఆ ద్వారమును మూసివేసి), ఏమియు ఎఱుగనివానివలె అతడు ఎప్పటియట్లు క్రీడాస్థలమునకు విచ్చేసెను.

ఉ. వీరుఁడు మాధవుండఖిలవేది నిశాచరభేది నవ్వుతో
నోరి! నిశాట! దొంగతనమచ్చుపడెన్ నెఱదొంగవాడువా

భీరులనెల్ల శైలగుహఁ బెట్టితి చిక్కినవారిఁ బెట్టరా
రార! యటంచుఁ బట్టె మృగరాజు వృకాఖ్యముఁ బట్టుకైవడిన్. 1184

మహావీరుడైన శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు గదా! అంతట రాక్షససంహారకుడైన ఆ ప్రభువు "ఓరీ! నిశాచరా! నీ దొంగతనము బయటపడెను. నీవు గజదొంగవైనట్లున్నది. గోపాలురను అందఱిని కొండగుహలో దాచిపెట్టితివి. అది సరే! నీకు చేతనైనచో మిగిలినవారినిగూడ దాచిపెట్టుము. చూచెదనుగాక – రారా!' అని పల్కుచు, తోడేలును సింహమువలె అతనిని పట్టుకొనెను.

ఉ. పంకజలోచనుండొడిసి పట్టిన శైలనిభాసురాకృతిన్
బింకముతోడఁ బొంగి విడిపించుకొనంగ బలంబు లేమి లో
శంకిలి బిట్టు తన్నుకొనఁ జక్కన నా రణభీము వ్యోమునిం
గొంకక కూల్చె న విభుఁడు గోయని మింట సుపర్వు లార్వఁగన్. 1185

కమలనయనుడైన శ్రీకృష్ణుడు నేర్పుతో గట్టిగా పట్టుకొనిన పిదప, ఆ వ్యోమాసురుడు తనకు సహజమైన రాక్షసాకారమునుదాల్చి, దానిని కొండంతగా జేసెను. పిమ్మట బింకముతో ఉబ్బియు, ఆ స్వామియొక్క పట్టునుండి విడిపించుకొనలేక పోయెను. తగినంత బలములేక, ఆ రాక్షసుడు తాను ఇక గెలువలేనని భావించి, ఎంతయు గిలగిలలాడసాగెను. అప్పుడు ఆ ప్రభువు రణశూరుడైన ఆ వ్యోమాసురుని అవలీలగా (నిర్భయముగా) కూల్చివేసెను. అంతట దేవతలు ఆకాశమంతయును ప్రతిధ్వనించునట్లుగా ఆ స్వామికి జేజేలు పలికిరి.

ఆ. ఘోరదనుజు నేలఁ గూల్చి పర్వతగుహవాతనున్న ఱాయి వ్రయ్యఁ దన్ని
గుహఁ జరించుచున్న గోపాలకులఁ గొంచు బల్లిదుండు గొల్లపల్లెకరిగె. 1186

మిక్కిలి బలపరాక్రమములుగల ఆ కృష్ణప్రభువు భయంకరుడైన వ్యోమాసురుని చంపిన పిదప పర్వతగుహకడకు ఏగి, ద్వారమునకు అడ్డముగానున్న ఆ పెద్దబండను ఒక్క తన్నుతో ముక్కలు ముక్కలు గావించెను. అనంతరము ఆ స్వామి గుహలోనున్న ఆ గోపాలురను అందఱిని తీసికొని గోకులమునకు చేరెను.

## కంసుని ఆజ్ఞపై అక్రూరుండు బృందావనమునకుఁ జనుదెంచుట

వ. అంత నా రాత్రి మధురానగరంబున నక్రూరుండు వసియించి, మఱునాఁడు రేపకడ లేచి నిత్యకృత్యంబు లాచరించి రథంబెక్కి కదలి,నందగోకులంబునకుం బోవుచుం, దెరువునఁదనలో నిట్లనియె. 1187

అంతట అక్రూరుడు ఆ రాత్రికి మధురానగరమునందే నివసించి, మఱునాడు వేకువజాముననే మేల్కొని, నిత్యకృత్యములను ఆచరించెను. పిదప అతడు రథమునెక్కి, ప్రయాణమై గోకులమునకు వెళ్లుచు మార్గమునందు తనలో ఇట్లనుకొనెను.

ఉ. ఎట్టి తపంబు సేయఁబడె నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో
యెట్టిధనంబులర్హులకు నీఁబడెనో తొలిబామునందు నా
యట్టి వివేక హీనునకునాదిమునీంద్రులు యోగదృష్టులం
బట్టఁగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిఁ జూడఁగల్గెడిన్. 1188

"నేను పూర్వజన్మలో ఎంతటి తపస్సును ఆచరించితినోగదా! ఎట్టి సత్ప్రవర్తనను కలిగియుంటినో? అర్హులైన వారికి ఎట్టి ధనదానాదులను చేసియుంటినో? లేనిచో నా వంటి అజ్ఞానికి (పామరునకు) బ్రహ్మస్వరూపుడైన

(పరమాత్మయైన) శ్రీకృష్ణునిదర్శనము కలుగబోవునా? ఆర్యులైన మహర్షులు తమ యోగదృష్టితోగూడ ఆ పరమేశ్వరుని చూడజాలరు. అట్టి పురుషోత్తముని దర్శింపగల్గుట నా మహాభాగ్యఫలమే.

ఉ. సూరులు తొల్లి యే విభుని శోభిత పాదనఖ ప్రభావళిం
జేరి భవాంధకారములఁ జిక్కక దాఁటుదురట్టి దేవునిన్
వైరముతోడ నైనఁ బిలువన్ ననుఁబంచి శుభంబు సేసె ని
ష్కారణ మైన ప్రేమనిదె కంసునిఁ బోలు సఖుండు కల్గునే. 1189

పూర్వకాలమున జ్ఞానులు ఆ శ్రీహరి యొక్క పవిత్రములైన పాదములనఖకాంతులను సేవించి, జననమరణరూపమైన తమ భవబంధములనెడి చీకట్లను ఛేదించుకొని తరించిరి. అట్టి దేవదేవునియెడ వైరభావము కలిగియున్నను, కంసుడు ఆ ప్రభువును తీసికొనివచ్చుటకై నన్ను పంపి నాకు మేలే చేసెను. ఇది నాపై ఆ కంసుడు చూపిన నిష్కారణమైన ప్రేమయే - కావున కంసునివంటి మిత్రుడు నాకు దొరకడు.

మ. ఇతఁడా కంసునిచేతఁ బంపువడినన్ హింసింప నేతెంచినాఁ
డతిదుష్టుండని చూచునో సకల భూతాంతర్బహిర్మధ్య సం
గతుఁ డౌటం దలపోసి నన్ను సుజనుంగాఁ జూచునో యెట్టి యు
న్నతి గావించునొ యేక్రియం బలుకునో నాభాగ్యమెట్లున్నదో 1190

నేను కృష్ణప్రభువుసన్నిధికి చేరినప్పుడు ఆ స్వామి నన్ను గూర్చి 'ఈ అక్రూరుడు ఆ కంసుడు పంపగా నన్ను హింసించుటకై వచ్చిన దుష్టుడు' అనుకొనునో? లేక - సకల ప్రాణులయొక్క లోపల, వెలుపల, నడుమ విరాజిల్లుచుండెడి[1] ఆ దేవదేవుడు నన్ను ఆత్మీయునిగా భావించునో? ఎట్లు ఆదరించునో? ఏవిధముగా సంభాషించునో?' ఇంతకును నా అదృష్టము ఎట్లున్నదోగదా!'

వ. అని మఱియును. 1191

మ. అలకభ్రాజితమై సుధాంశునిభమై హాసప్రభోద్దామమై
జలజాక్షంబయి కర్ణకుండల విరాజద్గండమై యున్న యా
జలజాతాక్షుముఖంబు సూడఁ గలుగున్ సత్యంబు వో నాకు నా
వల దిక్కేఁగుచునున్నవీవనమృగవ్రాతంబులీత్రోవలన్. 1192

అని అనుకొనుచు ఇంకను ఆ అక్రూరుడు ఇట్లు తలపోసెను. ఆ స్వామియొక్క ముఖము ముంగురుల శోభలతో విలసిల్లుచుండును, చంద్రునివలె ఆహ్లాదకరముగా నుండును. చిఱునవ్వుల సింగారములతో హొయలొలుకుచుండును. కన్నులు పద్మములవలె అలరారుచుండును. చెవులకుండములకాంతులు చెక్కిళ్ళపై మిలమిలలాడుచుండును. మొత్తముమీద నాకు ఆ పరమపురుషుని దర్శనము అబ్బుట తథ్యము. ఈ వనమునందలి ఈ (నేను వెళ్లుచున్న) త్రోవలకు ఇటునటుగల మృగములన్నియును నన్ను బాధింపక దూరముగా తప్పుకొనిపోవుచుండుటయే అందులకు ప్రబలనిదర్శనము.

ఉ. మాపటివేళ నేను జని మాధవుపాదసమీపమందు దం
డాపతితుండనైన నతఁ డాశుగ కాలభుజంగ వేగ సం
తాపిత భక్తలోక భయ దారణమైన కరాబ్జమౌదలన్
మోపి హసించి నాకభయముం గృపతోడుత నీయకుండునే. 1193

1. అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః - అనునది శ్రుతిప్రమాణము.

నేను సాయంసమయమునకు శ్రీకృష్ణసన్నిధికి చేరి, సాష్టాంగముగా నమస్కరించి ఆ ప్రభుపాదములకు ప్రణమిల్లెదను. అప్పుడు ఆ పురుషోత్తముడు తన అమృతహస్తమును కృపతో నా శిరస్సుపైనుంచి నవ్వుచు నాకు తప్పక అభయమును ఇచ్చును. ఏలనన ఆ స్వామియొక్క దివ్యహస్తము వేగముగా సాగుచు వెంటాడుచుండెడి మృత్యువు అనెడి సర్పముధాటికి తపించుచుండెడి భక్తులయొక్క భయమును తొలగించెడిది గదా!"

వ. అని మఱియు నక్రూరుండనేకవిధంబుల గోవిందసందర్శనంబు గోరుచు నమందగమన సుందర స్యందనారూఢుండై చని చని. 1194

ఇట్లు భావించిన పిదప ఆ అక్రూరుడు గోవిందుని దర్శించు విషయమున పరిపరి విధముల ఆలోచించుచు, చూడముచ్చటగొలిపెడి రథముపై ఎక్కి, త్వరత్వరగా ముందునకు సాగెను.

క. ముందటఁ గనె ఘనచందన, కుంద కుటజ తాలసాల కురవక వట మా
కందన్ నందిత బల గో, విందన్ వికచారుణారవిందన్ బృందన్. 1195

ఇట్లు కొంతదూరము పయనించిన పిదప అక్రూరునకు బృందావనము కనపడెను. అది దివ్యములైన చందనవృక్షములు, మల్లెలు, మొల్లలు, తాటి, మద్ది, గోరంట, మఱ్ఱి, మామిడి మున్నగు చెట్లతో మనోజ్ఞముగా విరాజిల్లుచుండెను. వికసించిన ఎఱ్ఱదామరల శోభలతో అది మనోహరముగా ఉండెను. అట్టి ఆ బృందావనము బలరామకృష్ణులకు ఆనందధామమై అలరారుచుండెను.

వ. కని, బృందావనంబు దరియంజొచ్చి, యందు సాయంకాలంబున నడవికి నెఱిగల మేఁతల వెంబడిం దిగంబడి రాకచిక్కిన కుఱ్ఱికోడె పడ్డ తండంబుల గానక పొద, యిఱుము, మిఱ్ఱు పల్లంబనక, తూఱి, పాఱి, వెదకి, కానక చీరెడు గోపకుల యాహ్వాన శబ్దంబు లాకర్ణించుచుఁ, గోమల ఘాసఖాదన కుతూహలంబులం జిక్కి, మక్కువం గ్రేపులం దలంచి, తలారింపక, తమకంబులం దమ తమయంత నంభారవంబులు సేయుచు, నూధంబులు స్రవింపఁ బరుపులిడు ధేనువులను, ధేనువులకు నోసరించుచు, సద్యోజాతంబులగు తర్ణకంబుల వహించి, నవసూతికలు వెనుతగులుటవలన దామహస్తులై చను వల్లవుల మెల్లన విలోకించుచు, మంద యిరుగెలంకులం గలంక రహితులై, పులి, సివంగి, వేఁగిలోనగు వాలుమెకంబుల మొత్తంబుల వలన నప్రమత్తులై, కుఠార కుంత శరాసన ప్రముఖాయుధంబులు ధరియించి, కావలి తిరుగు వ్రేలం గడచి, నానావిధ సరస తృణకబళ ఖాదనగరిష్ఠలై గోష్ఠంబులు ప్రవేశించి, రోమంథ లీలాలసలయియున్న ధేనువులును, జన్నులు గుడిచి తల్లుల మ్రోలఁ బెల్లు రేఁగి క్రేళ్ళుఱుకు లేఁగలును, నెదలైన మొదవులం బైకొని, పరస్పర విరుద్ధంబులై డీకొని, కొమ్ముల యుద్ధంబులు సలుపు వృషభంబులును, నకుంఠిత బలంబులం గంఠరజ్జువులం దెంచుకొని, పాదలుఱికి, దాఁటి తల్లులం దూఁటి, కుడుచు తఱిపి దూడల థట్టించి పట్టనోపక, గ్రద్దనఁ బెద్దలం జీరు గోపకుమారులును, గొడుకుల, మగల మామల, మఱఁదుల వంచించి, పంచాయుధభల్ల భగ్నహృదయలై గృహకృత్యంబులు మఱచి, శంకిలక, సంకేత స్థలంబులఁ గృష్ణాగమ తత్పరలైయున్న గోపకామినులును, గోష్ఠప్రదేశంబుల గోవులకుం గ్రేపుల విడిచి, యొడ్డుచు, మఱలం గట్టుచు నీడ్చుచుం గ్రీడించు గోపకులును, గోఖుర సముద్ధూత కరీష పరాగ పటలంబులవలన మల్లారి, దులదులనై, ధేనుదోహనవేళా వికీర్ణపయోబిందు సందోహ పరంపరా సంపాదిత పంకంబులును, దోహన సమయ గోపకరాకృష్ట గోస్తననిర్గతంబులయి కలశంబు లందుఁ బడియెడు క్షీరధారల చప్పుళ్ళును, మహోక్ష కంఠ సమ్మర్దన స్నిగ్ధంబులైన మందిరద్వార దారు స్తంభంబులపొంతలనుండి యులికిపడి నలుదిక్కులు గనుంగొని మాతనజన విలోకన కుపితంబులై కరాళించు

సారమేయంబులునుం గలిగి, బల కృష్ణ బాహు దండ ప్రాకార రక్షావిశేష భూషంబైన ఘోషంబు బ్రవేశించి యందు. 1196

క్రమముగా అక్రూరుడు బృందావనసమీపమునకు చేరి గొల్లపల్లెలో ప్రవేశించెను. అప్పుడు ఆయనకు వివిధములగు దృశ్యములు గోచరించెను. అందు సాయంకాలమున అడవికి వెళ్లి, పచ్చికలను మేయుటలో మునిగిపోయిన పాడియావులు, కోడెదూడలు, తొలిచూలు ఆవులు ఎంతకును తిరిగిరాకుండెను. వాటికొఱకై గోపాలురు పొదలను, మఱుగు ప్రదేశములను మిట్టపల్లములను పట్టించుకొనక వాటిలోదూరి, పరుగులుదీయుచు వెదకినను అవి కనబడకపోయెను. అంతట ఆ ఆలకాపరులు ఎలుగెత్తి ఒకరిని మఱియొకరు పిలుచుకొనుచుండిరి. వారి సవ్వడులు అక్రూరునకు వినబడుచుండెను. మెత్తమెత్తని గడ్డిపోచలను తినుటలో ఆసక్తిగల ధేనువులు ప్రేమతో లేగలను తలంచుకొనుచు నిలువజాలక మమకారముతో తమంతట తామే 'అంబా' అని అఱచుచు, పొదుగులనుండి పాలు స్రవించుచుండగా పఱుగులు దీయుచుండుట అతడు గమనించెను. గోపాలురు ధేనువులకు అడ్డములేకుండ, అప్పుడే పుట్టిన పసిదూడలను ఎత్తుకొని పోవుచుండిరి. అప్పుడే ఈనిన బాలింతగోవులు వెంబడింపగా వారు వాటి పలుపులను పట్టుకొని తిన్నగా వెళ్లుచుండిరి. ఆ దృశ్యము అక్రూరునకు గోచరించెను. చిఱుతపులులు, సివంగులు, పెద్దపులులు మొదలగు క్రూరమృగములబారిన పడకుండ ఆవులమందలను కాపాడుటకై గోపాలురు గొడ్డళ్లు, బల్లెములు, విల్లంబులు మొదలగు ఆయుధములను చేబూని, ఆవులకు ఇరుప్రక్కలనుండి కావలి కాయుచుండిరి. ఆ సమయమున ధేనువులు వారిరక్షణలో ముందునకు సాగుచు, పసిమి గలిగియున్న వివిధములగు గడ్డిపరకలను కడుపార తినుటవలన బలిసి, కొట్టములకు చేరి, అలసిపోయి నెమరు వేయుచుండెను. అక్రూరుడు ఆ దృశ్యమునుగూడ కాంచెను. లేగదూడలు. తమతల్లులకడ తనివిదీర పాలుద్రాగి, మిగుల సంతోషముతో గంతులు వేయుచుండెను. వృషభములు ఎదైన ఆవులపై ఎక్కుటకై పోటీపడుచు ఒకదానితో మఱియొకదానికి పడక ఢీకొని కొమ్ములతో కుమ్ముకొనుచు పోట్లాడుకొనుచుండెను. తఱపిదూడలు బలముకొలది మెడలపలుపులను త్రెంచుకొని పొదలమీదుగా ఎగురుచు, తల్లులకడకు చేరి పొదుగులను క్రుమ్ముచు పాలు త్రాగుచుండెను. అంతట గోపబాలురు ఆ దూడలను బయటికి లాగలేక వెంటనే పెద్దలను పిలుచుచుండిరి. శ్రీకృష్ణునిపై మరులుగొనిన గోపభామినులు ఆయనఎడబాటునకు తాళజాలక, గృహకృత్యములమాటయే మఱచి, తమకొడుకులకును, పతులకును, మామలకును, మఱదులకును తెలియకుండా వెనుకముందాడక సంకేతస్థలంబులకు చేరి, ఆ ప్రభువురాకకై నిరీక్షించుచుండిరి. గోపాలురు కొట్టములలోనున్న గోవులకడకు వాటిదూడలను పాలు త్రాగుటకై విడిచిపెట్టుచు, మఱల కట్టివేయుచు, తల్లులనుండి ఇవతలకు రాని లేగలను ఈడ్చుచు క్రీడించుచుండిరి. ఆవుల గిట్టలక్రింద నలిగి, పొడిపొడియై, వాటి తాకిడికి పైకి లేచిన ఎండుపేడల దుమ్ములు క్రిందబడి అందంతటను వ్యాపించుచుండెను. ఆవులపాలను పిదుకునప్పుడు, అటునిటు చిమ్మిన పాలకు తడిసి అవి బురదగా మాఱుచుండెను. పాలను పితికెడి సమయములందు గోపాలురు ఆవుల స్తనములను గట్టిగా పిండుచుండిరి. అప్పుడు ఆ పాలధారలు కలశములలో పడుచుండగా 'జుంయ్‌జుంయ్' మను శబ్దములు వినబడుచుండెను. బలమైన వృషభములు తమ దురద తీర్చుకొనుటకై భవనములద్వారముల చెక్కస్తంభములకు రుద్దుకొనుటచే అవి నునుపుదేలియుండెను. ఆ స్తంభములసమీపమునందుగల శునకములు క్రొత్తగా వచ్చిన జనులనుజూచి, ఉలికిపడి బెచ్చిపోయి మొఱుగుచుండెను. అక్రూరుడు ఈ దృశ్యములను అన్నింటిని ఆశ్చర్యముతో గాంచుచు గోకులమునందు ప్రవేశించెను. ఆ వ్రేపల్లె బలరామకృష్ణుల బాహుదండములచే (దుష్టులబారినుండి) సర్వదా రక్షింపబడుచుండెను.

క. జలజాంకుశాది రేఖలు, గల హరిపాదములచొప్పుఁ గని మోదముతోఁ
బులకించి రథము డిగి యు, త్కలికన్ సంతోషబాష్పకలితాక్షుండై. 1197

అంతట అక్రూరుడు పద్మ-అంకుశాది రేఖలుగల శ్రీకృష్ణునిపాదముద్రలను గాంచి సంతోషముతో పులకించిపోయెను. వెంటనే అతడు రథమునుండి క్రిందికి దిగెను. శ్రీకృష్ణదర్శనమునకై తహతహపడుచున్న ఆయనకన్నులనుండి ఆనందబాష్పములు ధారలుగట్టెను.

మ. కనె నక్రూరుఁడు పద్మనేత్రులను రంగద్గాత్రులన్ ధేను దో
హనవాటీ గతులన్నలంకృతుల నుద్యద్వాసులం బీత నీ
ల నవీనోజ్జ్వల వాసులం గుసుమమాలా ధారులన్ ధీరులన్
వనితాకాములఁ గృష్ణరాముల జగద్వంద్య క్రమోద్దాములన్. 1198

అనంతరము అక్రూరుడు సాటిలేని ధైర్యసాహసములుగల బలరామకృష్ణులను గాంచెను. వారినేత్రములు పద్మశోభలను విరజిమ్ముచుండెను. వారిదేహములు మనోహరముగా కాంతులీనుచుండెను. చక్కని ఆభరణములను ధరించి వారు ధగధగ మెఱయుచుండిరి. దివ్యములైన పూలదండలను దాల్చియున్న ఆ ప్రభువులు మిఱుమిట్లు గొలుపుచున్న పట్టుపీతాంబరములతో, నీలవస్త్రములతో విరాజిల్లుచుండిరి. జగద్వంద్యములైన ఆ మహాత్ముల పాదములు వినూత్న శోభలతో రంజిల్లుచుండెను. వనితల పాలిటి మన్మథులైన ఆ మహాపురుషులు ఇద్దఱును పాలు పితికెడి వేళలో గోవాటికలో (గోశాలలో) సంచరించుచుండిరి.

క. కని వారలపాదములకు, వినయంబున మ్రొక్కె భక్తివశుండగుచుం
దనువునఁ బులకాంకురములు, మొనయఁగ నానందబాష్పములు జడి గురియన్. 1199

హరిని దర్శించినంతనే అక్రూరుడు భక్తిపరవశుడై, మేను పులకరించుచుండగా, సంతతధారగా ఆనందబాష్పములను రాల్చుచు ఆ పరమపురుషునిపాదములకు వినయముతో ప్రణమిల్లెను.

వ. తదనంతరంబ. 1200

క. అక్రూరులైన జనుల నవక్రగతిం గాచు భక్తవత్సలుఁ డంత
న్నక్రూరుఁ గౌఁగిలించెను, జక్రాంకిత హస్తతలముఁ జాఁచి నరేంద్రా! 1201

పరీక్షిన్మహారాజా! తదనంతరము శ్రీకృష్ణప్రభువు చక్రాయుధరేఖలతో విలసిల్లుచున్న తన బాహువులను చాచి, అక్రూరుని తనహృదయమునకు హత్తుకొనెను. భక్తవత్సలుడైన ఆ మహాత్ముడు అవ్యాజమైన కృపతో సజ్జనులను రక్షించుచుండెడివాడుగదా!

వ. మఱియు, నక్రూరుండు బలభద్రునికిం బ్రణతుండైన నతండు గౌఁగిలించి, చెట్టపట్టుకొని, కృష్ణసహితుం డై, గృహంబునకుం గొనిపోయి, మేలడిగి, గద్దియయిడి, పాదప్రక్షాళనంబు సేసి, మధుపర్కంబు సమర్పించి, గోవునిచ్చి, యాదరంబున రసవదన్నంబు వెట్టించి, తాంబూల గంధమాల్యంబులొసంగె నయ్యవసరంబున నందుండుపవిష్టుండై యక్రూరుని సత్కరించి యిట్లనియె. 1202

పిమ్మట అక్రూరుడు బలభద్రునకు మ్రొక్కులిడెను. అప్పుడు అతడు అక్రూరుని తన అక్కున జేర్చుకొని, చేయి పట్టుకొని కృష్ణునితోగూడి తమ భవనమునకు తీసికొనిపోయెను, యోగక్షేమములను విచారించెను. అతనిని సుఖాసీనుని గావించి, అర్ఘ్యపాద్యములను, మధుపర్కమును సమర్పించెను. ఆదరముతో గోదానమొనర్చి, షడ్రసోపేతమైన భోజనమును పెట్టించెను. తాంబూలములను, సుగంధములను, చక్కని హారములను ఇచ్చి గౌరవించెను. ఆ సమయమున నందుడుగూడ అచటికి వచ్చి, ఆసీనుడై అక్రూరునకు సత్కారములను నెఱపి ఇట్లు నుడివెను.

క. చెలియలు మొఱయిడ నల్లుర, ఖలుఁడై పొరిగొనిన యట్టి కంసుఁడు బ్రదుకం
గలదే మనికి దశార్హుల, కిలపై మీ సేమమింక నేమని యడుగన్. 1203

వ. అని పలికె, నంత నక్రూరుండొక పర్యంకంబున సుఖోపవిష్టుండై యుండ హరి యిట్లనియె. 1204

"అక్రూరా! తనకు చెల్లెలైన దేవకీదేవి ఎంతగా మొఱపెట్టుకొనినను ఆలకింపక, దుష్టుడైన కంసుడు తన మేనల్లుండ్లను వధించెను. అట్టి క్రూరుడు బ్రతికియున్నంతవఱకును, దశార్హవంశమున పుట్టిన మీకు ఇలపై జీవించియుండుట అసాధ్యము. కనుక మీ క్షేమసమాచారములను గూర్చి ఏమని అడుగను?" అనంతరము అక్రూరుడు ఒక శయ్యపై హాయిగా కూర్చొనియుండగా శ్రీకృష్ణుడు ఆయనతో ఇట్లు వచించెను.

మ. శుభమే నీకుఁ బ్రమోదమే సఖులకుం జుట్టాలకున్ సేమమే
యభయంబే ప్రజకెల్ల గోత్రజులకాత్మానందమే మామ ము
క్తభయుండే వసుదేవదేవకులు తత్కారాగృహంబందు మ
త్ప్రభవవ్యాజ నిబద్ధులై బ్రతికిరే ప్రాణానిలోపేతులై. 1205

"మహాత్మా! నీవు సుఖముగా ఉన్నావా? మిత్రులందఱును హాయిగా ఉన్నారు గదా! చుట్టాలకు క్షేమమేనా? ప్రజలెల్లరును ఎట్టి భయములేకుండా జీవించుచున్నారుగదా! మీ వంశమువారు అందఱును ఆనందముగా మసలుకొనుచున్నారు గదా! మా మామయగు కంసునకు, భయము తొలగియున్నదా? నన్ను కన్నారన్న నెపముతో చెఱసాలపాలైన దేవకీవసుదేవులు ప్రాణాలతో మిగిలి ఉన్నారు గదా!

మ. నెఱి నేఁ డిక్కడ నీవు రాఁగ వగతో నీతోడ నేమైన నా
కెఱుఁగం జెప్పుమటంచుఁ జెప్పరుగదా యే మందురా వార్త యే
తెఱఁగున్ లేదని డప్పిరో వగచిరో దీనత్వముం జెందిరో
వెఱతో నా తలిదండ్రులెట్లు వడిరో విన్పింపుమక్రూరకా! 1206

అక్రూరా! నిండు ప్రేమాదరములతో నీవు మా కడకు వచ్చునప్పుడు నా తలిదండ్రులు (దేవకీవసుదేవులు) తమ విచారగాథలను నాకు తెలుపుమనుచు ఏమైనను చెప్పినారా? వారిచెఱసాలజీవితమును గూర్చి ఎవరు ఏమనుకొనుచున్నారు? 'ఈ కారాగృహవాసమునకు అంతూపొంతూ లేకున్నది' అని విచారపడుచు వారు కృశించి, దైన్యమునకు లోనైయున్నారా? కంసునిభయమున వారు ఎట్టి కష్టములను అనుభవించుచున్నారో? వివరింపుము.

వ. మఱియు, నీవేమికారణంబున వచ్చితని, హరి యడిగిన, నతండు కంసునికి నారదుండు వచ్చి చెప్పిన వైరానుబంధ ప్రకారంబును, గంసుండు దేవకీవసుదేవుల వధియింపన్ గమకించి, మానిన తెఱంగును, ధనుర్యాగంబు పేరుసెప్పి పుత్తెంచిన ప్రకారంబును నెఱింగించిన, రామకృష్ణులు నగి తమ్ముం బరివేష్టించిన నందాది గోపకులం జూచి, కృష్ణుండిట్లనియె. 1207

'అది సరే! ఇంతకును నీవు ఇచటికి వచ్చిన కారణమేమి?' అని శ్రీకృష్ణుడు అడిగెను. అంతట అక్రూరుడు ఆ ప్రభువుతో ఇట్లు చెప్పెను – "ఒకనాడు నారదుడు మధురకు వచ్చి, నీ జన్మవృత్తాంతమును గూర్చి కంసునకు తెలిపెను. అంతట కంసుడు యాదవులపై వైరభావమును వహించి, దేవకీవసుదేవులను చంపుటకు సిద్ధపడెను. ఆ దేవర్షి మాటలను ఆలకించి, అతడు ఆ ప్రయత్నమును విరమించుకొనెను, ధనుర్యాగనెపముతో మిమ్ములను తీసికొనిరమ్మని అతడు నన్ను ఇచటికి పంపినాడు". అక్రూరుని మాటలకు రామకృష్ణులు నవ్వుకొనిరి. పిమ్మట శ్రీకృష్ణుడు తమ చుట్టును చేరియున్న నందుడు మొదలగు యాదవులతో ఇట్లనెను.

శా. భూనాథుండు మఖంబుఁ జూడఁ బిలువం బుత్తెంచినాఁడ వ్విభుం
గానం బోవలెఁ బాలు నెయ్యి పెరుఁగుల్ కట్నంబులుం గానికల్
మీ నేర్పొప్పఁగఁ గూడఁ బెట్టుఁడు తగన్ మీ మీ నివాసంబులన్
యానంబుల్ గొని రండు పొండు మథురాయాత్రాభిముఖ్యంబుగన్. 1208

వ. అని నియమించె నంత నక్రూరుండు మధురకు హరిం గొంపోయెడినని యెఱింగి, వ్రేతలు కలంగి.
1209

"అయ్యలారా! మధురకు పాలకుడైన కంసుడు ధనుర్యాగమును చూచుటకై, మనలను తీసికొనివచ్చుటకు ఇతనిని పంపినాడు. కనుక ఆ ప్రభువును దర్శించుటకై మనము అచటికి వెళ్లవలయును. కావున మీరు పాలు, నెయ్యి, పెఱుగు, కట్నములు, కానుకలు మొదలగువాటిని మీ శక్తికొలది యథోచితముగా మీ మీ ఇండ్లలో సిద్ధపఱచుకొనుడు. మధురాప్రయాణమునకు సన్నద్ధులై వాహనములను తీసికొనిరండు. ఇక మీరు మీ మీ ఇండ్లకు వెళ్లవచ్చును" అని ఆ స్వామి ప్రకటించెను. అంతట శ్రీకృష్ణుని మధురకు కొనిపోవుటకై అక్రూరుడు వచ్చినట్లు వినినంతనే గోపికలు మిగుల కలతచెందిరి.

మ. హరినవ్వుల్ హరిమాటలున్ హరి మనోజ్ఞాలాపముల్ లీలలున్
హరివేడ్కల్ హరిమన్ననల్ హరికరాబ్జాలంబనాహ్వానముల్
హరిణీలోచన లందఱున్ మఱియుపాయంబెట్లొకో యంచు లో
నెరియన్ ముచ్చటలాడిరంత గములై యేకాంతగేహంబులన్. 1210

పిదప ఆ గోపకాంతలు శ్రీకృష్ణుని చిఱునవ్వులను, మధురములైన ఆయనమాటలను, వీనులకు విందుగావించెడి ఆ స్వామి యొక్క సరసాలాపములను, వింత గొలుపులీలలను, వేడుకలను, ఆదరాభిమానములను, ఆ ప్రభువు తమ చేతులను పట్టుకొని లాగుచు, ఆహ్వానించుటలను స్మరించుకొనుచు, 'ఆ నందనందనుడు మధురకు వెళ్లినచో ఇకమీదట ఇవి మనకు దూరమగునుగదా' అని బాధపడిరి. 'మధురకు పోనీయకుండా ఆ ప్రభువును ఆపుట ఎట్లు?' అని ఉపాయములను ఆలోచించుచు వారు ఏకాంతగృహములలో గుమిగూడి వగచుచు ముచ్చటించుకొనసాగిరి.

వ. మఱియుఁ దమలో నిట్లనిరి. 1211

ఉ. మేటి గృహస్థు బ్రహ్మ యని మిక్కిలి నమ్మితిమమ్మ! చూడ నే
పాటియు లేదు మాకుఁ బరిపాలకుఁడైన సరోజనేత్రు ని
చ్చోట వసింపనీక నొక చోటికిఁబో విధియించి పిన్న బి
డ్డాటలు చేసె నీ దుడుకులక్కట! భారతి కైనఁ జెప్పరే. 1212

ఇంకను వారు ఇట్లు తలపోసిరి. "అమ్మలారా! 'బ్రహ్మదేవుడు ఉత్తముడైన గృహస్థుడు' అని ఇంతవఱకును నమ్ముకొనుచుంటిమి. ఆలోచించి చూచినచో అది అసత్యముగా (ఆయనలో ఏమాత్రమూ ధర్మబుద్ధి లేనట్లుగా) తోచుచున్నది. కానిచో మన అందఱికిని ప్రభువైన ఈ కృష్ణుని ఈ వ్రేపల్లెలో ఉండనీయక వేఱొకచోటికి పోవునట్లుగా ఆ బ్రహ్మ విధించెను. ఇవి అన్నియును చిన్నపిల్లల ఆటలవలె కనబడుచున్నవి. ఆయనయొక్క ఈ దుడుకుచేష్టలను గూర్చి ఆయనభార్యయగు 'భారతీదేవికైనను విన్నవించుకొందము.

వ. అని విధిం దూఱుచు, మదనతాపాయత్త చిత్తలై. 1213

ఉ. రమ్మని చీరినంతన పురంబున కేఁగెడుఁ గాని నన్ను నీ
కొమ్మలు నమ్మినారు మరు కోలల కగ్గము సేసి పోవఁగా
ముమ్మరమైన తాపమున మ్రొగ్గుదురో యనఁ డంబుజాక్షుఁడా
యమ్మలుగోపవృద్ధులుఁ బ్రయాణము వల్దనరైరి చెల్లరే 1214

అని బ్రహ్మదేవుని దూసిపోయుచు, మన్మథతాపములకు గుఱియై వారు ఎంతయుమథనపడుచు ఇంకను ఇట్లనుకొనిరి. అయ్యయ్యో! అక్రూరుడు రమ్మని పిలిచిననంతనే ఈ కమలాక్షుడు (కృష్ణుడు) మధురకు వెళ్లుటకు సిద్ధమయ్యనాడు. 'ఈ గోపభామినులు నన్నే నమ్ముకొనియున్నారు. వీరిని మన్మథ బాణములకు గుఱిచేసి వెళ్లినచో ఈ కాంతలు అంతులేని తాపముతో కుమిలిపోవుదురు' అని కొంచెముగూడ ఆలోచింపలేదు. 'ఇప్పుడు మధురకు వెళ్లవలదు' అని వృద్ధులైన గోపాలురును, గోపకాంతలును శ్రీకృష్ణునకు నచ్చజెప్పవచ్చునుగదా!

శా. అక్రూరుండని పేరు పెట్టుకొని నేఁ డస్మన్మనోవల్లభుం
జక్రిన్ మాకడఁ బాపికొంచు నరుగం జర్చించి యేతెంచి నాఁ
డక్రూరుం డఁట క్రూరుఁడీతఁడు నిజం బక్రూరుఁడౌనేని వి
ర్వక్రత్వంబునఁ గృష్ణుఁ బెట్టి తనత్రోవం బో విచారింపఁడే. 1215

'అక్రూరుడు' (క్రూరత్వము లేనివాడు / దయగలవాడు) అని పేరుపెట్టుకొని వచ్చిన ఇతడు మనమనోనాథుడైన (మన హృదయములను దోచుకొనిన) ఈ కృష్ణుని మనకు దూరము చేయుచు తీసికొని పోవుటకై ఏతెంచినట్లున్నది. ఇతడు పేరునకు మాత్రమే అక్రూరుడుగాని, నిజముగా క్రూరుడే సుమా! యథార్థముగా ఇతడు అక్రూరుడే ఐనచో (కపట (వక్ర)బుద్ధిలేనివాడే ఐనచో) శ్రీకృష్ణప్రభువును ఇచటనే ఉంచి, తన త్రోవన తాను వెళ్లుటకు నిర్ణయించుకొనెడివాడే గదా!

ఉ. ఫుల్లసరోజలోచనలు పూర్ణ సుధాంశుముఖుల్ పురాంగనల్
మెల్లనె యెల్లి పట్టణముమేడలనుండి సువర్ణలాజముల్
చల్లఁగ వారిఁ జూచి హరి సంగతి సేయఁదలంచుఁ గాక ప్రే
పల్లె వసించు ముద్దియలపైఁ బడనేల తలంచు నక్కటా! 1216

చెలులారా! మధురాపురమునందలి తరుణీమణులముఖములు నిండుచంద్రునివలె ఆహ్లాదకరములు, వారి నేత్రములు వికసించిన కమలములవలె మనోహరములు. శ్రీకృష్ణుడు మధురలో ప్రవేశించినప్పుడు ఆ సుందరీమణులు రేపు మేడలపై చేరి, ఆ ప్రభువుపై బంగారులాజలు (సువర్ణాక్షతలు) చల్లెదరు. అయ్యో! మన స్వామివారి అందచందములకు ముగ్ధులై వారి సాంగత్యమునకు సిద్ధపడునో ఏమో! అప్పుడు పల్లెపడుచులమైన మనయొక్క పొందును ఏలకోరుకొనును?

క. పురసతులవిలోకనములు, సరసాలాపములు నర్మ సంభోగములున్
మరగి హరి మనల నొల్లఁడు, నరవరులోయమ్మ! నూతన ప్రియులు గదే. 1217

పట్టణయువతులయొక్క ఓరచూపులకును, వారిసరసాలాపములకును, సల్లాపములతో గూడిన కలయికలకును మోహమున మునిగిన పిమ్మట ఆ స్వామి మనలను ఇష్టపడకపోవచ్చును. అమ్మలారా! రాజులు క్రొత్తక్రొత్త రుచులపై (క్రొత్త ప్రియులపై) మోజుపడుచుందురుగదా!

క. పుట్టిన్నఁడు హరి నెఱుఁగని, పట్టణసుందరులకితనిఁ బతిఁజేసి కడున్
దట్టపు విరహాగ్నులకును, గట్టిఁడి దైవంబు ఘోషకాంతల నెదకెన్. 1218

పుట్టినప్పటినుండియు మధురానగరములోని సుందరీమణులు శ్రీకృష్ణుని చూచియుండలేదుగా! (చూచి ఎఱుగరుగదా!) అట్టి కాంతారత్నములకు కృష్ణప్రభువును పతిగా చేయనున్నాడు ఆ విధి - ఆ క్రూరదైవము ఈవిధముగా వ్రేపల్లెలో ఉన్న గోపకాంతలను (మనలను) తీరని విరహాగ్నికి గుఱిచేయబోవుచున్నాడు (ఇట్లు వేధించుటకు మఱి ఏ వనితలును కనబడలేదో ఏమో? ఆ విధిదృష్టి మనమీద పడినది.)

మ. హరినేలా కొనిపోయెదంచు మనమాయక్రూరుఁ బ్రార్థింతమా
హరిఁ బోనీకుఁడు నిల్పరే యనుచు నేఁడర్చింతమా వేల్పులన్
హరిపాదంబులకడ్డముల్ వడుదమా హా దైవమా! యంచు నా
తరుణుల్ మేనులుఁ జీరలన్ మఱచి కందర్పజ్వరభ్రాంతలై. 1219

ఇప్పుడు మనము 'మా కృష్ణుని ఎందులకు తీసికొనిపోదలచితివి. ఇది నీకు న్యాయము గాదు' అని ఆ అక్రూరునే ప్రార్థించుదమా? లేక 'ఈ నందనందనుని మధురకు పోనీయవలదు. ఈ వ్రేపల్లెలోనే నిలుపుడు' అని దేవతలను ఆరాధించుదమా? అట్లుగాక 'స్వామీ! మా పాలిటిదైవమా! నీవు ఈ గోకులమును విడిచి వెళ్లనేవెళ్లవద్దు' అని వేడుకొనుచు, ఆ ప్రభువును పోనీయక ఆయన కాళ్లకు అడ్డముగా పడిపోదమా!' అని అనుకొనుచు వారు మన్మథతాపములకు లోనై తమమేనులనే మఱచిరి. ఆ స్థితిలో వారు తమవస్త్రములు సడలిన సంగతినే తెలిసికొనలేకుండిరి.

మ. ఉవిదల్ సిగ్గులు మాని కన్గవల నీ రొండొండ వర్షింపఁగా
వివశత్వంబులతోఁ గపోలతట సంవిన్యస్త హస్తాబ్జలై
పవనోద్ధూత లతాభలై మముఁ గృపం బాలింపు గోవింద! మా
ధవ! దామోదర! యంచు నేడ్చిరి సుజాతంబైన గీతంబులన్. 1220

అప్పుడు కృష్ణ ప్రేమలో వివశలైయున్న ఆ గోపికలకనులనుండి అశ్రువులు సంతతధారగా స్రవింపసాగెను. కమలములవలె సుకుమారములైన చేతులను దుఃఖముతో చెక్కిళ్లపై చేర్చుకొనియున్న ఆ వనితలు గాలికి ఎగురగొట్టబడిన తీవలవలె ఒప్పుచుండిరి. అంతట వారు 'గోవిందా! మాధవా! దామోదరా! మమ్ము అనుగ్రహింపుము' అనుచు మధురములైన గీతములతో సిగ్గుపడక[1] (సంకోచింపక) ఏడువసాగిరి.

వ. అంత మఱునాఁడు సూర్యోదయకాలంబునం గృష్ణుండు తనతోడఁ బయనంబునకు గమకించి నడుచు గోపికలను, మరలి వత్తు నని దూతికాముఖంబున నివర్తించి, శకటంబులందుఁ గానికలు, గోరసంబు నిడికొని, నందాదులైన గోపకులు వెనుతగుల నక్రూరచోదితంబయిన రథంబెక్కి, మథురాభిముఖుండై చను సమయంబున. 1221

ఆ మఱునాడు సూర్యోదయసమయమున శ్రీకృష్ణుడు మధురకు పయనమగుచుండగా గోపికలును ఆయన వెనుక తత్తరపడుచు నడచుచుండిరి. ఆ విషయమును గమనించిన ఆ ప్రభువు నేను మఱల ఇచటికి తిరిగివత్తును' అని పలికి

1. గోపికలు వివాహితలు – వారు తమపతులయెదుటనే పదిమందిలో శ్రీకృష్ణుని (పరపురుషుని) తమ మనోనాథునిగా పేర్కొనుచు ఏడ్చుచు దుఃఖింపసాగిరి. ఇట్లు చేయుటకు వారు సిగ్గుపడవలెను. ఇది లోకసహజమైన ధోరణి. కాని శ్రీకృష్ణుడు లోకకల్యాణార్థమై భూతలమున అవతరించిన శ్రీమహావిష్ణువు. ఆ స్వామిని సేవించి తరించుటకై మహర్షులు గోపికలుగా జన్మించిరి. కనుక ఇచట సిగ్గులకు తావేలేదు.

ఒక దూతికద్వారా వారిని మరలింపజేసెను. పిదప నందుడు మొదలగు గోపాలురు కానుకలను, పాలు, పెఱుగు, వెన్న, మజ్జిగ మున్నగు పదార్థములను బండ్లలో చేర్చుకొని, వెంట వచ్చుచుండగా, శ్రీకృష్ణుడు రథముపై ఎక్కి, అక్రూరుని సారథ్యమున మధురామార్గమునందు పయనించుచుండెను.

చ. అదె చనుచున్నవాఁడు ప్రియుఁడల్లదె తేరదె వైజయంతి య
ల్లదె రథఘోటకాంఘ్రిరజమాదెస మార్గము చూడుఁడంచులో
నాదవెడి మక్కువన్ హరిరథోన్ముఖలై గములై వ్రజాంగనల్
గదలక నిల్చి చూచిరటు కన్నులకబ్బినయంత దూరమున్. 1222

ఆ సమయమున వ్రజాంగనలు 'అదిగో మనకు ప్రాణతుల్యుడైన శ్రీకృష్ణుడు వెళ్లుచున్నాడు. ఆయన కూర్చున్న రథము అదిగో! ఆ కనబడుచున్నదే రథధ్వజము (ధ్వజపతాకము). రథాశ్వములగిట్టలతాకిడికి దుమ్ములు పైకి లేచుచున్నవి అవిగో! శ్రీకృష్ణుడు వెళ్లుచున్న ఆ మార్గమును గమనింపుడు' అని తమలో తాము అనుకొనుచుండిరి. ఇంకను వారు గుమిగూడి, కదలక తమకు కనబడుచున్నంతవఱకు శ్రీకృష్ణుని రథమార్గమును ఱెప్పలార్పక చూచుచునే నిలబడియుండిరి.

వ. ఇట్లు బలభద్రాక్రూరసహితుండై చని 1223

క. అవలోకించెను గృష్ణుడు, ప్రవిమల కల్లోలపవన భాసిత జన్య
న్నవసన్నపాపసైన్యం, గవిజనమాన్యం గళిందకన్యన్ ధన్యన్. 1224

ఇట్లు బలరామునితో, అక్రూరునితో గూడి ప్రయాణించుచుండగా శ్రీకృష్ణునకు యమునానది కనులకు గట్టెను. నిర్మలములైన ఆ నదీజలతరంగముల మీదుగా వీచుచున్న చల్లని గాలులు ఎంతయు హాయిని గొల్పుచుండెను. ఆ నది తన జలములలో స్నానములొనర్చిన వారియొక్క సకలపాపములను నశింపజేయును. ప్రతిభామూర్తులైన మహాకవుల ప్రశంసలను అందుకొనిన ఆ కాళింది ఎంతయు ధన్యురాలు. (కాళింది. కళిందకన్య. కళిందము ఒక మహాపర్వతము. కళిందకన్య = కళిందగిరి నుండి జాలువారినది. యమున)

వ. కని తత్కాళిందియందుఁ బరిక్షుణ్ణ మణిగణ సముజ్జ్వలంబులగు జలంబులు ద్రావి, తరుసమూహ సమీపంబున రామసహితుండై కృష్ణుండు రథంబు ప్రవేశించె నంత నక్రూరుండు వారలకు మ్రొక్కి, వీడ్కొని, కాళిందీహ్రదంబు సొచ్చి, విధి పూర్వకంబుగ వేదమంత్రంబుల జపించుచు. 1225

ఆ నదీజలములు స్వచ్ఛములై సానలు దీఱిన జాతిరత్నములవలె మెఱయుచుండెను. అంతట బలరామకృష్ణులు ఆ నదీజలములను గ్రోలి, తిరిగివచ్చి, చెట్లమధ్యలోనున్న రథమునందు కూర్చుండిరి. పిదప అక్రూరుడు ఆ ప్రభువులకు మ్రొక్కి, వారి అనుమతి గైకొని, యమునానది మడుగులోనికి దిగి, విధ్యుక్తముగా వేద మంత్రములను (అఘమర్షణ సూక్తమును) జపించుచుండెను.

## అక్రూరుండు యమునలో రామకృష్ణులను దర్శించి నుతించుట

ఉ. స్నానము సేసి చేసినదిచల్లనినీటను రామకృష్ణులన్
మానుగఁ జూచి వేరు రథమధ్యమునన్ వసియించి యున్నవా
రీ నది నీరిలోపలికి నెప్పుడు వచ్చిరటంచు లేచి మే
ధానిధి సూచె వారిని రథస్థుల భక్త మనోరథస్థులన్. 1226

మేధానిధియైన అక్రూరుడు యమునానదిజలములలో తనివిదీర స్నానము చేయుచుండగా ఆ మహాత్మునకు నీటిలో బలరామకృష్ణులు కనబడిరి. అంతట ఆశ్చర్యపడుచు 'వీరు ఇంతకుముందు రథమునందే ఉన్నారుగదా! ఈ నదీజలములలోనికి ఎప్పుడు వచ్చిరి?' అని అనుకొనుచు లేచి చూడగా భక్తులమనోరథములను దీర్చెడి ఆ రామకృష్ణులు అతనికి రథమునను కనబడిరి.

వ. చూచి వెఱఁగుపడి. 1227

శా. కంటిన్ మున్ను రథంబుపై జలములోఁ గంటిన్ దుదిం గ్రమ్మఱం
గంటిం దొంటి రథంబుమీఁద నిదె యీ కళ్యాణచారిత్రులే
వెంటన్ దోఁచిరి రెండుదిక్కుల మనోవిభ్రాంతియో నీరిలో
నుంటాశ్చర్యము చూతునంచు మఱియున్మూహించి మగ్నాంగుఁడై. 1228

అప్పుడు అతడు మిక్కిలి ఆశ్చర్యమున లోనై ఇట్లనుకొనెను. 'ఇంతకుముందు ఆ పరమపురుషులను రథమునందు చూచితిని. పిదప నదీజలములలో దర్శించితిని. మఱల ఆ రథమునందును వారిని దర్శించితిని. లోకకల్యాణాదాయకులైన ఈ పురుషోత్తములు ఒకే సమయమునందు రెండుచోట్లను (నదియందును, రథమునందును) ఎట్లు కనబడిరి. ఇది నా చిత్తభ్రాంతియేమో? రథములో నదీజలములలో కన్పట్టుట ఆశ్చర్యముగదా! మఱియొకమాఱు చూచెదనుగాక" అని అనుకొనుచు తిరిగి నదినీటిలో మునిగెను.

ఉ. పోషితబాంధవుండు యదుపుంగవుఁడా జలమందుఁ గాంచె స
ద్భాషు సహస్రమస్తక విభాసితభూషు నహీశు భూమి భృ
ద్వేషుఁ గృపాభిలాషుఁ బ్రతివీర చమూవిజిగీషు నిత్య సం
తోషునరోషు నిర్దళితదోషు ననేకవిశేషు శేషునిన్. 1229

వ. మఱియు నీలాంబర సంయుతుండును, సిద్ధోరగాది సన్నుతుండునునై యొప్పు నప్పాఁపతేనిం దప్పక కనుంగొని. 1230

బంధువులకు అందఱికిని ఆత్మీయుడును, యాదవులలో ప్రముఖుడును ఐన అక్రూరుడు అందు ఆదిశేషుని గాంచెను. ఆ నాగరాజు పలుకులు యుక్తియుక్తములు. ఆయనయొక్క వేయిపడగలమీదనుగల మణులు మిలమిలమెఱయుచుండెను. అతడు భూభారము వహించుచుండెడి మహాప్రభువు. మిగుల దయార్ద్రహృదయుడు, శత్రుసేనలను జయించుటయందు నిరుపమానమైన ఉత్సాహముగలవాడు. కోపములేనివాడు. నిరంతరము సంతోషముగా ఉండెడివాడు. దోషులను గట్టిగా శిక్షించుచుండువాడు. అతడు తిరుగులేని బలశాలి. మఱియు ఆ ఆదిశేషుడు నీలాంబరములను ధరించియుండెను. సిద్ధులు, నాగులు మొదలగువారు ఆ మహాత్ముని స్తుతించుచుండిరి. అట్టి సర్పరాజును అక్రూరుడు కనులార దర్శించెను.

సీ. ఆ భోగి భోగ పర్యంకమధ్యంబున వలనొప్పు పచ్చని వలువవాని
మేఘంబుపై నున్న మెఱుఁగుచందంబున నురమున శ్రీదేవి యొప్పువాని
ముసరు తేఁటులు విప్పు ముఖచతుష్కముగల తనయుఁ డాడెడి బొడ్డుఁ దమ్మి వానిఁ
గదలిన బహు పదక్రమ విశేషంబుల రవముసూపెడి నూపురముల వాని
ఆ. జలజగర్భ రుద్ర సనక సనందన సద్ద్విజామర ప్రశస్యమాన
చరితుఁడైనవాని సౌందర్య ఖనియైనవాని నొక్కపురుషవర్యుఁ గాంచె 1231

పిమ్మట అక్రూరుడు ఆ ఆదిశేషునిశరీరమును పాన్పుగా జేసికొని అందు శయనించియున్న శ్రీమహావిష్ణువును దర్శించెను. ఆ పురుషోత్తముడు పట్టుపీతాంబరములతో విరాజిల్లుచుండెను. వక్షస్థలమునందు శ్రీదేవిని ధరించియున్న ఆ నీలమేఘశ్యాముడు విద్యుత్కాంతులతో శోభిల్లుచున్న మేఘము చందమున అలరారుచుండెను. ఆ పురుషోత్తమునినాభికమలమునందు ముసరుకొనియున్న తుమ్మెదలగుంపులను పాఱద్రోలుచు అందుండి ఉదయించిన చతుర్ముఖ బ్రహ్మ అచట ఆడుకొనుచుండెను. (ఆ ప్రభువు సృష్టికర్తయైన చతుర్ముఖ బ్రహ్మదేవునకు జన్మనిచ్చిన తండ్రి) లోకకల్యాణమునకై అటునిటు కదలునప్పుడు ఆ స్వామియొక్క అందెలరవళులు వినసొంపుగా బహురీతుల మ్రోగుచుండెను. (ఆ పరమపురుషునికాలియందెలరవళులు వేదనాదములను తలపింపజేయుచుండెను.) సౌందర్యనిధియైన (అందములకు నెలవైన) ఆ శ్రీమహావిష్ణువుయొక్క వైభవమును బ్రహ్మ, శివుడు, సనకసనందనాదియోగులు, ద్విజోత్తములు, దేవతలు వేనోళ్ల ప్రస్తుతించుచుండిరి.

వ. మఱియును జారులక్షణలక్షిత నఖ పాద గుల్ఫ జాను జంఘోరు కటి నాభి మధ్యోదరుండును, సాదరుండును, శ్రీవత్స కౌస్తుభ వనమాలికా విరాజిత విశాల వక్షుండును, బుండరీకాక్షుండును, శంఖ చక్రగదాపద్మ హస్తుండును, సత్త్వగుణ ప్రశస్తుండును, బ్రహ్మసూత్ర కటిసూత్ర హార కేయూర కటక కంకణ మకర కుండల కిరీటాది విభూషణుండును, భక్తజనపోషణుండును, సుందర కపోలఫాల నాసాధర వదన కర్ణుండును, నీలనీరదవర్ణుండును, గంబుకంధరుండును, గరుణాగుణ బంధురుండును, బ్రహ్లాద నారద సునంద నంద ప్రముఖ సంభావితుండును, శ్రీపుష్టి తుష్టి కీర్తికాంతీ లోర్జా విద్యావిద్యా శక్తి మాయాది సేవితుండును నై యొప్పు న ప్పరమేశ్వరునకు మ్రొక్కి, భక్తిసంభ్రమంబులగ్గలంబుగ గద్గద కంఠుండై, దిగ్గనం గరంబులు ముకుళించి, యిట్లని వినుతించె. 1232

ఆ పరమేశ్వరునియొక్క నఖములు, పాదములు, గుల్ఫములు (చీలమండలు) జానువులు (మోకాళ్లు) జంఘలు (పిక్కలు) ఊరువులు (తొడలు) కటిప్రదేశము, నాభి (బొడ్డు) నడుము, కడుపు మొదలగు అంగములన్నియును రమ్యములై సకలశుభలక్షణములతో విరాజిల్లుచుండెను. ఆ ప్రభువు భక్తులను ఆదుకొనుచుండువాడు, ఆ స్వామియొక్క విశాలమైన వక్షస్థలమునందు శ్రీవత్సచిహ్నము, కౌస్తుభమణి వనమాలలు దివ్యతేజస్సులతో శోభిల్లుచుండెను. నేత్రములు పద్మములవలె మనోహరములు. హస్తములయందు పాంచజన్యశంఖము, సుదర్శన చక్రము, కౌమోదకీగద, నవనిధులకు నెలవైన పద్మము తేజరిల్లుచుండెను. ఆ దేవదేవుడు శుద్ధసత్త్వగుణ సంపన్నుడు. ఆ జగన్నాథుడు దివ్యయజ్ఞోపవీతము, కటిసూత్రము (మొలనూలు) హారములు, భుజ.కీర్తులు, దండకడియములు, కంకణములు, మకరకుండలములు, దివ్యకిరీటము మొదలగు అద్భుతములైన ఆభరణములతో వెలుగొందుచుండెను. తనను భక్తితో సేవించెడివారిని రక్షించుచుండు ఆ లోకేశునియొక్క చెక్కిళ్లు, నొసలు, నాసిక, పెదవులు, ముఖము, చెవులు పరమసుందరములు. అతడు నీలమేఘశ్యాముడు. కంఠము శంఖమువలె నునుపై చూడముచ్చటగొలుపుచుండెను. కరుణకు ఆలవాలములైన ఆ వైకుంఠుని గుణములు వర్ణనాతీతములు. ప్రహ్లాదుడు, నారదుడు, సునందుడు, నందుడు మున్నగు పరమభక్తులు ఆ స్వామిని నిరంతరము ఆరాధించుచుందురు. లక్ష్మి, పుష్టి, తుష్టి, కీర్తి, కాంతి, ఇళ, ఊర్జ, విద్య, అవిద్య శక్తి, మాయ మొదలగు తేజోమూర్తులు ఆ పరమాత్ముని నిత్యము సేవించుచుందురు. అక్రూరుడు అట్టి దేవదేవునకు ప్రణమిల్లెను. అంతట అతడు భక్తిపూర్ణములైన సంభ్రమాశ్చర్యములతో గద్గదకంఠుడై, డిగ్గన చేతులు జోడించి, ఆ స్వామిని ఇట్లు ప్రస్తుతించెను.

దండకము. శ్రీమానినీమానచోరా! శుభాకార! వీరా! జగద్ధేతుహేతుప్రకారా! సమస్తంబునస్తంగతంబై, మహాలోల కల్లోలమాలాకులాభీల పాథోనిధిం గూలఁగా బాలకేళీగతిం దేలి, నారాయణాఖ్యం బటుఖ్యాతి శోభిల్లు నీ నాభికంజంబులో లోకపుంజంబులం బన్ను విన్నాణియై మన్న యా బమ్మ యుత్పన్నుఁ డయ్యెం గదా, పావ

కాకాశ వాతావనీ వార్యహంకార మాయా మహామానసాదుల్ హృషీకాదులున్ లోకముల్ లోకబీజంబులున్ నిత్యసందోహమై, నీ మహాదేహమందుల్లసించున్ వసించున్ నశించున్ జడత్వంబులేకాత్మమై యొప్పు నీ యొప్పిదంబెల్ల నోచెల్ల! చెల్లన్ విచారింపఁ దారెంత వారెంతవారైన మాయాదులామాయతోఁ గూడి క్రీడించు లోకానుసంధాత యా ధాత నిర్ణేతయే, నీ కళారాశికిం గొందఱంభోజగర్భాదులధ్యాత్మలందున్న శేషాది భూతంబులందున్ననేకాధిదైవంబులందున్ సదా సాక్షివై యుందువంచుం, దదంతర్గత జ్యోతివీశుండ వంచుం ద్రయీపద్ధతిం గొందఱింద్రాదిదేవాభిధానంబులన్ నిక్కుచొక్కుండవంచున్, మఱిం గొందఱారూఢకర్మంబులం ద్రుంచి, సంసారముండ్రెంచి, సన్యస్తులై మించి విజ్ఞానచక్షుండవంచున్, మఱిం బాంచరాత్రానుసారంబుగాఁ దన్మయత్వంబుతోఁ గొందఱీవాత్మవంచున్, మఱిం గొందఱావాసుదేవాది భేదంబులన్ నల్వురై చెల్వు వాటింతువంచున్, మఱిన్ నీవు నారాయణాఖ్యుండవంచున్, శివాఖ్యుండవంచున్ మఱిన్ బెక్కు మార్గంబులన్ నిన్ను నగ్గింతురెగ్గేమి యేఱుల్ పయోరాశినే రాసులై కూడు క్రీడన్, విశేషంబు లెల్లన్న శేషంబులై డింది, నీ యందనూనంబు లీనంబులౌ, నేకరాకేందుబింబంబు కుంభాంతరం భంబులం బింబితంబైన వేఱున్నదే, యెన్ననేలా ఘటాంతర్గతాకాశముల్ దద్ఘటాంతంబులందేకమౌరేఖ లోకావధిన్ వీఁక నే పోకలం బోక యేకాకి వై యుండుదీశా! కృశానుండు నెమ్మోము, సోముండు భానుండు కన్నుల్, దిశల్ కర్ణముల్, భూమి పాదంబు, లంభోనిధుల్ గుక్షి, శల్యంబులద్రుల్, లతాసాలముల్ రోమముల్, గాలి ప్రాణంబు, బాహుల్ సురేంద్రుల్, ఘనంబుల్ కచంబుల్ నభోవీథి నాభిప్రదేశంబు, రేలుం బగళ్ళున్ నిమేషంబు, లంభోజగర్భుండు గుహ్యంబు, వర్షంబు వీర్యంబు, నాకంబు మూర్ధంబుగానేకమై యున్న నీ మేనిదండంబయోజాతగర్భాండముల్ మండితోదుంబరానోకహానేక శాఖా ఫలాపూరితానంత జంతుప్రకాండంబు లీలం, బ్రసిద్ధోదరాశిష్ట జంతుప్రకారంబుగా నిండియుండున్, మహారూప! నీ రూపముల్ వెగ్గలంబుగ్గడింపన్ లయాంభోధిలో మీనుమేనన్ విరోధిన్ నిరోధించి, సాధించి, మున్ వేధకున్ వేదరాశిం బ్రసాదింపవే, ద్రుంపవే కైటభశ్రీ మధుం జక్రి వై మొత్తవే, యెత్తవే మందరాగంబు, రాగంబుతోఁ గూర్మలీలా పరిష్పందివై, పంది వై, మేదినిన్ మీఁదికిం ద్రోచి, దోషాచరుం గొమ్ములన్ నెమ్ములం జిమ్ముచున్ గ్రువ్వవే, త్రెవ్వవే, ఘోరవైరిన్ నృసింహుండవై, దండి వైరోచనిం జూచి యాచింపవే, పెంపవే మేను బ్రహ్మాండము న్నిండఁ బాఱుండవై, రాజకోటిన్ విపాటింపవే, రాజువై రాజబింబాస్యకై దుర్మదారిన్ విదారింపవే, నొంపవే క్రూరులన్ వాసుదేవాది రూపంబులన్, శుద్ధబుద్ధుండవై వైరిదారాంతరంగంబులన్నంతరంగంబులుం గాఁ గరంగింపవే, పెంపు దీపింపవే, కల్కిమూర్తిం బ్రవర్తించి నిన్నెన్న నే నెవ్వఁడన్, నన్ను మాయావిపన్నున్, విషణ్ణుం, బ్రపన్నుం, బ్రసన్నుండవై, ఖిన్నతం బాపి, మన్నింపవే, పన్నగాధీశతల్పా! కృపాకల్ప! వందారుకల్పా! నమస్తే, నమస్తే, నమః 1233

శ్రీహరీ! నీవు లక్ష్మీదేవిమనస్సును దోచుకొనినవాడవు. నీ ఆకారము మనోహరము. నీవు వీరాధివీరుడవు. జగత్సృష్టికి కారణమైన మూలప్రకృతికి నీవే ఆధారము. మహాప్రళయకాలమున ఉవ్వెత్తుగా ఎగసిపడుచున్న తరంగపరంపరలకు అల్లకల్లోలమైన సముద్రమునందు సమస్తలోకములును లయమైపోగా నీవు చిన్నారివై నారాయణుడను పేరుతో విశ్వవిఖ్యాతితో శోభిల్లుచుందువు. స్వామీ! సకలలోకములను సృష్టించుటలో సమర్థుడైన బ్రహ్మదేవుడు నీ నాభికమలమునుండియే ఉదయించెను గదా! అగ్ని, ఆకాశము, వాయువు, భూమి, నీరు, అహంకారము, మాయ, మహత్తత్త్వము, మనస్సు మొదలగునవియు, సమస్త ఇంద్రియములును, ఇంద్రియార్థములైన శబ్ద, స్పర్శ, రూప, రసగంధములును, లోకములు అన్నియును లోకములకు కారణభూతులైన త్రిమూర్తులును సచ్చిదానంద నిర్మలపరిపూర్ణమైన నీ విరాట్స్వరూపమునందు పుట్టుచు, వర్ధిల్లుచు, లయించుచుండుట నిత్యసత్యము గదా! నిత్య చైతన్య స్వరూపుడవైన

నీ మహత్త్వమును 'ఓరా! ఇంతటిది' అని వర్ణించుటకు ఎంతటివారైనను చాలరు. మూలప్రకృతి మొదలగునవియు, మాయతోగూడి, లోకములను సృష్టించుచు వినోదించుచుండెడి బ్రహ్మయు నీ చిద్విలాసములను నిర్ణయింపజాలరు. నీ చిత్కళాసమూహములో కొందరైన బ్రహ్మాదులు చతుర్దశేంద్రియములందును, ఇంద్రియ విషయములైన శబ్దాదులయందును, ఇంద్రియములకు అధిదేవతలైన చంద్ర, బ్రహ్మ, జీవ రుద్రాదుల యందును సదా సాక్షివై (వారలకు అతీతుడవై) విలసిల్లుచుందువని అందురు. మఱికొందఱు ఆ అధ్యాత్మాదులందు జ్యోతిస్స్వరూపుడవై ప్రకాశించుచుండెడి పరమేశ్వరుడవని అందురు. మఱికొందఱు 'వేదమార్గమున ఇంద్రాదిదేవతల పేర్లతో విరాజిల్లుచుండెడి సర్వేశ్వరుడవు నీవే' అని యందురు. ఇంకను కొందఱు పరంపరగా సాగుచుండెడి ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మములను ఛేదించుకొని, సాంసారికములైన కామక్రోధాదుల సంబంధమును, దారాపుత్రాదులసాంగత్యమును పరిత్యజించి సన్న్యసించిన విరాగులు నిన్ను అపరోక్షానుభూతితో తెలిసికొనదగినవానినిగా పేర్కొందురు. పాంచరాత్ర ఆగమమును అనుసరించి తన్మయత్వముతో (భగవత్స్వరూపస్వభావముతో) నీవే ప్రత్యగాత్మవై విరాజిల్లుచుందువని కొందఱు అందురు. ఇంకను కొందఱు ప్రసిద్ధమైన వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధ వ్యూహభేదముల చేత నలుగురుగా చెలువొందుచుందురని పేర్కొనుచుందురు. నీవు నారాయణుడవు అని కొందఱు, శివుడవు అని కొందఱు, తదితర నామరూపభేదములతో విలసిల్లుచుండువాడవు అని మఱికొందఱు నిన్ను ప్రస్తుతించుచుందురు. నామరూపభేదములతో ఎవరెవరు నిన్ను ఎట్లు స్తుతించినను నీవు వారివారి కోర్కెలను అన్నింటిని తీర్చుచుందువు. వారు అట్లు నుతించుట తప్పుగాదు. వేర్వేఱు పేర్లతో ప్రసిద్ధికెక్కిన నదులన్నియును సముద్రమును జేరి ఒక్కటియైనట్లు, వేర్వేఱుగా కనబడు సకలప్రాణులును నీలో పూర్తిగా లీనమై తమ నామభేదములకు దూరమగును. ఒకే ఒక్క నిండుచంద్రబింబము వేర్వేఱు పాత్రలలోని నీటియందు ప్రతిబింబించుచున్నట్లు నీవు సమస్త ప్రాణులలో అంతరాత్మవై భాసిల్లుచుందువు (సకలజీవరాసులలోని ఆత్మలన్నియును పరమాత్మవైన నీ ప్రతిబింబములే) అని కొందఱందరురు. దేవా! నీవు ఘటముల (పాత్రల)లోని ఆకాశములు, ఆ ఘటములు విచ్ఛిన్నములైన పిమ్మట ఏకమైనట్లు (మహాకాశములో లీనమైనట్లు) లోకములన్నియును అంతరించినప్పుడు (ప్రళయకాలమునందు) పూనికతో ఏ కృత్యములయందును (సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహములు అను పంచకృత్యములయందును) ప్రవర్తిల్లక అద్వితీయుడవై వెలుగొందుచుందువు. సర్వేశ్వరా! అగ్నియే నీ ముఖము, సూర్యచంద్రులు నీ కన్నులు, దిక్కులు నీ కర్ణములు, భూమియే నీ పాదములు. సముద్రములు నీ ఉదరము. పర్వతములు నీ ఎముకలు. తీగెలు, వృక్షములు నీ రోమములు. వాయువు నీ ప్రాణము. ఇంద్రాదిదేవతలు నీ బాహువులు. మేఘములు నీ కేశములు. ఆకాశము నీ నాభిప్రదేశము. రాత్రియు, పగలు నీ ఱెప్పపాట్లు. బ్రహ్మదేవుడు నీ జననేంద్రియము. వర్షము నీ వీర్యము. స్వర్గము నీ శిరస్సు. దేవా! ఇట్టి నీ విరాట్ శరీరమునందు బ్రహ్మాండములు చక్కని మేడిచెట్టుయొక్క కొమ్మలయందుగల పండ్లలోని ప్రాణులసమూహములవలెను, ప్రసిద్ధమైన మహాసముద్రమునందలి జలజంతువులరీతిగను అలరారుచుండును.

విరాట్స్వరూపా! నీ రూపమును వర్ణించుట అసాధ్యము. దేవా! నీవు ప్రళయ సముద్రమునందు మత్స్యావతారమున చరించుచు, విరోధియైన సోమకాసురుని చంపి, వాడు అపహరించిన వేదములను తీసికొనివచ్చి బ్రహ్మదేవునకు ఇచ్చితివి. హయగ్రీవుడుగా అవతరించి, చక్రధారివై మధు, కైటభ రాక్షసులను వధించితివి. కూర్మావతారమున దేవతలపైగల అనురాగముతో మందరపర్వతమును అవలీలగా ఉద్ధరించితివి. వరాహావతారమున భూదేవిని ఉద్ధరించి నీ కోరలతో హిరణ్యాక్షుని తునుమాడితివి. నృసింహుడవై అవతరించి, హిరణ్యకశిపుని సంహరించి పరమభక్తుడైన ప్రహ్లాదుని, సకలలోకములను కాపాడితివి. వామనావతారమున ధైర్యముతో బలిని మూడడుగుల నేలను యాచించి, త్రివిక్రముడవై నీ దివ్యరూపముతో బ్రహ్మాండమును నింపితివి. పరశురామావతారమున గర్వితులైన రాజులను నిర్మూలించితివి. శ్రీరామప్రభుడవై సీతాదేవి నిమిత్తముగా లోకకంటకుడైన రావణాసురుని సంహరించితివి. వాసుదేవ, సంకర్షణాది

రూపములలో క్రూరరాక్షసులను పరిమార్చితివి. నిర్మల జ్ఞానస్వరూపమున (బుద్ధావతారమున) శత్రువులభార్యల హృదయములను ద్రవింపజేసితివి. కల్క్యవతారమున నీ పరాక్రమమును చూపి మ్లేచ్ఛులను పరిమార్చితివి. కృష్ణా! నీ మహత్త్వమును ప్రకటించుటకు నేను ఎంతటివాడను? నేను మాయలోమునిగి ఆపదలపాలై యుంటిని, విషాదగ్రస్తుడను. 'నీవే దిక్కు' అని నిన్ను శరణుజొచ్చినవాడను. నా యెడ ప్రసన్నుండవై నా ఖేదమును తొలగింపుము. నన్ను మన్నింపుము. శేషతల్పశయనా! కృపానిధీ! వినమ్రతతో ఆశ్రయించినవారికి కల్పవృక్షమువలె కోర్కెలను అన్నింటిని తీర్చుచుండెడి పరమపురుషా! నీకు అనంతకోటి నమస్కారములు.

మ. కలలం బోలెడి పుత్ర మిత్ర వనితాగారాది సంయోగముల్
జలవాంఛారతి నెండమావులకు నాసల్ సేయు చందంబునం
దలఁతున్ సత్యములంచు మూఢుఁడ వృథా తత్త్వజ్ఞుఁడన్ నాకు నీ
విలసత్పాదయుగంబు సూపి కరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ! 1234

శ్రీహరీ (కృష్ణా!) దారాపుత్రులు, మిత్రులు, గృహములు మొదలగువాటి సంబంధములు అన్నియును స్వప్న సదృశములు. (అశాశ్వతములు) నీటికొఱకు ఎండమావులవెంటబడినట్లు ఇవి అన్నియును (దారాపుత్రాది సంబంధములన్నియును) సత్యములు (శాశ్వతములు) అని భావించుచున్న మూర్ఖుడను నేను. విపరీతజ్ఞానముతో కూడినవాడను, (వ్యర్థ విషయములను సార్థకములని భావించువాడను.) దేవా! నన్ను అనుగ్రహించి (నాపై కనికరము చూపి) మహిమాన్వితములైన నీ పాదములను సేవించెడి భాగ్యమును నాకు ప్రసాదింపుము.

వ. అని మఱియును వినుతింప నక్రూరునికి యమునాజలంబులలోనతన మొదలిమేను సూపి, చాలించి, నటునికైవడిం దిరోహితుండైన, నక్రూరుండు నీరు వెడలి వెఱంగుపడుచు వచ్చి, రథారోహణంబు సేసిన, హరి యిట్లనియె. 1235

అని అక్రూరుడు తనను ఇంకను స్తుతించిన పిమ్మట శ్రీకృష్ణుడు అతనికి యమునాజలములలో తన పూర్వరూపమున దర్శనమిచ్చి, నటునివలె అంతర్ధానమయ్యెను. అంతట అక్రూరుడు నీళ్లలోనుండి బయటికివచ్చి, ఆశ్చర్యపడుచు రథముపై జేరెను. అప్పుడు శ్రీహరి (కృష్ణుడు) అతనితో ఇట్లు నుడివెను.

క. జలములు చేరువనున్నవి, తలపోయఁగ నీవు పోయి తడవయ్యె నదీ
జలమున నభమున ధరణిం, గలుగని చోద్యములు నీకుఁ గానంబడెనే. 1236

మిత్రమా! నదీజలములు మిక్కిలి సమీపముననే ఉన్నవి గదా! కాని నీవు స్నానమునకు వెళ్లి చాలాసేపైనది. ఆకాశమునందును, భూతలమునను జరుగని చోద్యములు ఏవైనను ఆ నదీజలములలో నీకు కనబడెనా?

వ. అనిననతండిట్లనియె. 1237

క. నీలోన లేని చోద్యము, లే లోకములందుఁ జెప్పరీశ్వర! నీటన్
నేలన్ నింగిని నున్నవె, నీలోఁ జోద్యంబు లెల్ల నెగడె మహాత్మా! 1238

శ్రీకృష్ణుడు ఇట్లు అడిగిన పిమ్మట అక్రూరుడు ఇట్లు వచించెను. "మహాత్మా! నీలో లేని అద్భుతములు ఏ లోకమునందును ఉండవు' అని పెద్దలు నుడువుచుందురు. ఇంక నీటిలోను, భూమిపైనను, ఆకాశమునందును ఎట్లుండును? అన్ని వింతలును నీలోనే ఉండును గదా!"

వ. అని పలికి, సాయంకాలంబునకు నక్రూరుండు మధురానగరంబు సేర రథంబు గడపె నంతనటమున్న చని
నందాదులు పురోపవనంబున విడిసియుండ, వారలం గూడికొని, కృష్ణుండక్రూరునిం జూచి, నీవు రథంబు
గొనుచు నగరంబునకుం జనుము. మేము వెనుక వచ్చెదమనిన నతండిట్లనియె. 1239

ఇట్లు పలికిన పిమ్మట అక్రూరుడు రథమును వేగముగా నడపి సాయంసమయమునకు మధురానగరమునకు చేర్చెను. నందుడు మొదలగు యాదవులు అంతకుముందే మధురకుచేరి, నగరమునకు వెలుపలగల ఉపవనమునందు విడిసియుండిరి. వారితో కలిసిన పిమ్మట శ్రీకృష్ణుడు 'అక్రూరా! నీవు రథమును దీసికొని నగరములోనికి వెళ్లుము. మేము తరువాత నెమ్మదిగా వచ్చెదము" అని వచించెను. అప్పుడు అక్రూరుడు ఆ స్వామితో ఇట్లనెను.

క. నా యింటికి విచ్చేయుము, నీ యంఘ్రిసరోజ రేణునికరము సోఁకన్
నా యిల్లు పవిత్రంబగు, శ్రీయుత! నీ భటునిఁ బెద్ద సేయం దగదే. 1240

వ. అని మఱియుం బ్రార్థించిన, హరియిట్లనియె. 1241

"మహాప్రభూ! మా యింటికి ఇప్పుడే విచ్చేయుము. నీ పాదపద్మముల ధూళి సోకినంతనే మా గృహము పవిత్రమగును. నీ సేవకుడనైన నన్ను ఈ మాత్రము ఆదరింపరాదా?" అని, ఇంకను ఆ స్వామికి పలురీతుల విన్నవించుకొనెను. అంతట కృష్ణప్రభువు అతనితో ఈవిధముగా పలికెను.

క. యదుకుల విద్వేషణుఁడై, మదమున వర్తించు కంసు మర్దించి భవ
త్సదనంబుఁ జూడ వచ్చెదఁ బొద యీస్యందనముఁ గొనుచుఁ బురమునకనఘా. 1242

"పుణ్యాపురుషా! మిగుల గర్వితుడైయున్న ఆ కంసుడు మా యదువంశముపై నిప్పులు గ్రక్కుచున్నాడట. కనుక అతనిని మర్దించిన పిదప మీ గృహమునకు విచ్చేసెదను. ఇక నీవు రథమును దీసికొని పురమునకు వెళ్లవచ్చును".

## శ్రీకృష్ణుఁడు మధురానగర ప్రవేశము సేయుట

వ. అని పలికిననక్రూరుండు పురంబునకుం జని, రామకృష్ణులు వచ్చిరని, కంసునకెఱింగించి, తన గృహంబునకుం
జనియె నంత నపరాహ్ణంబున బలభద్రగోపాలసహితుండయి, కృష్ణుండు, 1243

ఆ స్వామి ఇట్లు పలికిన పిమ్మట అక్రూరుడు నగరములోనికి వెళ్లి, బలరామకృష్ణులు వచ్చిన విషయమును కంసునకు తెలిపి తన గృహమునకు వెళ్లెను. బలరామకృష్ణులు ఆ ఉపవనమునందే ఆ రాత్రిని గడపి, మఱునాడు మధ్యాహ్నసమయమున మధురానగరమున ప్రవేశించిరి.

మ. పరిఖల్ కోటలుఁ గొమ్మలుం బడగలుం బ్రాసాదముల్ వీథులున్
హరులుం దేరులు వీరులున్ గజములున్ హర్మ్యంబులున్ వాద్యముల్
తరుణుల్ ధాన్యములున్ ధనంబులు మహోద్యానంబులున్ దీర్ఘికల్
గర మాశ్చర్యరుచిం దనర్చు మథురన్ గాంచెన్ విభుండంతటన్. 1244

పిదప బలరామసహితుడైన శ్రీకృష్ణుడు అగడ్తలు, కోటలు, కోటబురుజులు, ధ్వజపతాకములు, ఉన్నతములైన మేడలు, వీథులు, వాద్యములు, తరుణులు, ధనధాన్యములు, అందమైన విశాలమగు ఉద్యానవనములు, దిగుడుబావులు గలిగి, ఆశ్చర్యమును గొలుపుచున్న ఆ మధురానగరమును కలయజూచెను.

వ. కని యప్పురంబు ప్రవేశించి, వచ్చుసమయంబున, 1245

ఉ. నంద తపఃఫలంబు సుగుణంబులపుంజము గోపకామినీ
బృందమునోముపంట సిరివిందు దయాంబుధి యోగిబృందముల్
డెందములందుఁ గోరెడు కడింది నిధానము సేరవచ్చెనో
సుందరులార! రండు చని చూతము కన్నులకోర్కె దీఱఁగన్. 1246

ఇట్లు ఆ ప్రభువు నగరమును దర్శించుచు వచ్చుచున్న సమయమున ఆయనను తిలకించి, పురస్త్రీలు ఇట్లనుకొనిరి. "సుందరులారా! ఇతడు యశోదానందులతపఃఫలము. సుగుణములరాశి, సమస్త గోపికలయొక్క నోములపంట, లక్ష్మీదేవికి సంతోషమును గూర్చెడి ఆ శ్రీహరియే ఇతడు. యోగీశ్వరులు ఎల్లరును తమహృదయములయందు ఈ మహాత్మునిదర్శనముకొఱకు నిరంతరము తహతహపడుచుందురు. వారిపాలిటి పెన్నిధియైన ఈ కరుణాసముద్రుడు మనకడకు విచ్చేసెను. మీరు అందఱును రండు రండు. మనము అందఱము కన్నులార దర్శింతము".

వ. అని మఱియు, గోవిందసందర్శనకుతూహలంబులఁ బౌరసుందరులు పరస్పరాహూయమానలై, భుంజాన లై భోజనభాజనంబులు దలంగఁద్రోచియు, శయానలై లేచియు, నభ్యజ్యమానలై జలంబులాడకయు, గురుజన శిక్ష్యమాణలై యోడకయు, గృహకార్య ప్రవర్తమానలై పరిభ్రమింపకయు, రమణరమమాణలై రమింపకయు, శిశుజనబిభ్రాణలై డించియు, నలంకుర్వాణలై యన్యోన్య వస్త్రాభరణ మాల్యాను లేపనంబులు వీడ్వడ ధరించియు నరిగి, 1247

అని పలుకుచు, ఆనందనందనుని దర్శించు కుతూహలము పెల్లుబుకుచుండగా వారు ఒకరిని మఱియొకరు పిలుచుకొనుచుండిరి. అంతట భుజించుచున్నవారు తమ భోజనపాత్రలను ప్రక్కనబెట్టియు, పండుకొనియున్నవారు శయ్యపైనుండి లేచియు, తలంటుకొనుచున్నవారు స్నానములు చేయకయు ఆ స్వామిని దర్శించుటకై విచ్చేసిరి. అట్లే పెద్దలచే దండింపబడుచున్నవారు వారికి భయపడకయు, ఇండ్లపనులలో మునిగియున్నవారు వాటిని ఆపివేసియు వచ్చిరి. పతులతోగూడి ఆనందించుచున్నవారు తమ సరసములను చాలించియు, ఎత్తుకొనియున్న పసిపిల్లలను దించియు, అలంకరించుకొనుచున్నవారు ఒకరి వస్త్రాభరణములను, హారములను, లేపనములను మఱియొకరు గబగబ (పైపైన) ధరించియు, ఆ ప్రభువుయొక్క సౌందర్యవైభవములను గాంచుటకై పరుగుపరుగున విచ్చేసిరి.

క. వీటఁ గల చేడెలెల్లను, హాటక మణి ఘటిత తుంగ హర్మ్యాగ్రములం
గూటువలు గొనుచుఁ జూచిరి, పాటించి విశాలవక్షుఁ బద్మదళాక్షున్. 1248

ఆ నగరములోని కాంతలు ఎల్లరును మణులతో చెక్కబడి, మిక్కిలి ఎత్తుగానున్న బంగారుమేడలపై గుంపులు గుంపులుగా చేరి, విశాలమైన వక్షఃస్థలముగల ఆ కమలనయనుని (శ్రీకృష్ణుని) తనివిదీర కన్నులప్పగించి చూచుచు ఇట్లనుకొనిరి.

సీ. వీడఁటే! రక్కసి విగతజీవఁగఁ జన్నుఁ బాలు ద్రావిన మేటి బాలకుండు
వీడఁటే! నందునివెలఁదికి జగమెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
వీడఁటే! మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాఁపరీఁడు
వీడఁటే! యెలయించి వ్రేతలమానంబు సూఱలాడిన లోకసుందరుండు
తే. వీఁడు లేకున్న పురమటవీస్థలంబు వీనిఁ బొందని జన్మంబు విగతఫలము
వీనిఁ బలుకని వచనంబు విహగరుతము వీనిఁజూడని చూడ్కులు వృథలు వృథలు. 1249

"అయ్యారే! పూతనరాక్షసియొక్క చనుబాలు త్రాగుచు, దాని ప్రాణములనుగూడ పీల్చివేసిన అద్భుతబాలుడు ఇతడేనా? ముద్దులొలుకుచు నందునిభార్యయైన యశోదాదేవికి తన నోటిలో సకలలోకములను చూపిన చిన్నారి ఇతడేనా? వ్రేపల్లెలోని ఇండ్లలో వెన్నలను కాజేసి, నిర్భయముగా మెక్కిన అల్లరిబాలుడు ఇతడేనా? గోపయువతుల వస్త్రాభరణములను అపహరించి, వారి ప్రేమాభిమానములను చూరగొనిన అతిలోకసుందరుడు ఈ ఘనుడేనా? ఇతడు లేకున్నచో అదెంత గొప్ప పట్టణమైనను అడవితో సమానమే. ఇతనిని (ఈ మహాత్ముని పదమును = పరంధామమును) పొందని జన్మ వ్యర్థము. ఈయనను మెచ్చుకొనుచు (ప్రస్తుతించుచు) పలుకని పలుకులు పక్షుల కూతలే., ఈయనను దర్శింపని కన్నులు నిజముగా నిరర్థకములు.

మ. చెలియా గోపికలీకుమారతిలకుం జింతించుచుం బాడుచుం
గలయం బల్కుచు నంటుచున్ నగుచు నాకర్షించుచున్ హస్తగా
మలకక్రీడకుఁ దెచ్చి నిచ్చలును సమ్మానంబులం బొందఁగాఁ
దొలిజన్మంబుల నేమి నోఁచిరొ కదే దుర్గప్రదేశంబులన్ 1250

నెచ్చెలీ! పరమసుందరుడైన శ్రీకృష్ణుడు ఆ గోపికలకు కరతలామలకమువలె లభించినాడు. వారు తమకు తోచినప్పుడు తోచినరీతిగా స్మరించుచు, కీర్తించుచు, ఆపాదమస్తకము తదేకదృష్టితో చూచుచు, సరససల్లాపములాడుచు, స్పృశించుచు (నిమురుచు) అనురాగము చిందునట్లుగా నవ్వుచు, తమకడకు లాగికొనుచు నిరంతరము మిక్కిలి ఆనందింపగల్గుచున్నారు. అనవరతము నందనందనునినుండి ప్రేమాదరములను పొందగల్గుచున్నారు. వారు తమ పూర్వజన్మలలో చొరరాని అరణ్యములలో ఎంతటి తపస్సులు చేసినారో? ఎన్నెన్ని నోములు నోచినారో? గదా! భాగ్యమనగా వారిదే భాగ్యము.

క. అని మఱియుఁ బౌరకాంతలు, మునుకొని హరిరూపు నేత్రముల వెంటను లోఁ
గొని తాల్చిరి హృదయములను, జనిత ప్రమదమున విరులు సల్లుచునధిపా! 1251

రాజా! ఇట్లనుకొనుచు ఆ పురకాంతలు అహమహమికతో ముందునకు చొచ్చుకొని వచ్చుచు చూపులద్వారా ఆ స్వామి మనోహరరూపమును తమ హృదయములలో నిల్పుకొని, పొరలికొనివచ్చుచున్న సంతోషముతో ఆ స్వామిపై పూవులను వర్షించిరి.

వ. మఱియును. 1252

క. నానావిధ గంధములుఁ బ్ర, సూన ఫలాదులును హరిత శుభ లాజములుం
గానికలిచ్చుచు విప్రులు, మానుగఁ బూజించిరాకుమారోత్తములన్. 1253

ఇది ఇట్లుండగా మధురలోని బ్రాహ్మణులు వివిధములగు సుగంధములను, పుష్పములు, ఫలములు మొదలగువానిని, శుభకరములైన పచ్చని అక్షతలను కానుకలుగా సమర్పించి, ఆ బలరామకృష్ణులను సముచితముగా పూజించిరి.

## శ్రీకృష్ణుండు రజకునిఁ జంపుట - వాయక సుదాములొసంగిన పూజలనంగీకరించుట

వ. ఆ సమయంబున నగరద్వారంబుననుండి వచ్చు రాగకారుండగు నొక రజకుంగాంచి హరి యిట్లనియె.

ఉ. విందులమై నరేశ్వరునివీటికి వచ్చితిమేము మాకు మా
మందలలోనఁ గట్టికొన మంచిపటంబులు లేవు నీ ముడిన్
సుందర ధౌతచేలములు శోభిలుచున్నవి తెమ్ము నిన్ను మే
లందెదునిమ్ము రాజుదెసనల్లురమో రజకాన్వయాగ్రణీ! 1255

వ. అనిన రోషించి వాఁడి ట్లనియె. 1256

ఆ సమయమున నగరద్వారమునుండి వచ్చుచున్న గర్వితుడగు ఒక చాకలిని చూచి, శ్రీకృష్ణుడు అతనితో ఇట్లనెను. "రజక ప్రముఖుడా! మేము మీ కంసరాజునకు మేనల్లురము. మీ ప్రభువులపట్టణమైన ఈ మధురకు బంధుభావముతో వచ్చితిమి. మేము ధరించుటకు మా వ్రేపల్లెలో మంచి మంచి వస్త్రములు లేవు. నీ మూటలో శుభ్రముగానున్న రంగురంగుల వస్త్రములు చక్కగా కనబడుచున్నవి. నీ మూట విప్పి వాటిని మాకు ఇమ్ము. నీకు మేలు కలుగును". ఆ స్వామి మాటలకు కుపితుడై రజకుడు ఇట్లనెను.

శా. ఎట్టెట్టా మనుజేంద్రుచేలములు మీకీఁ బాడియే మీరలుం
గట్టం బోలుదురే పయో ఘృత దధి గ్రాసంబులన్ మత్తులై
యి ట్టాడం జనెఁ గాక గొల్లలకు మీకెబ్బంగి నోరాడెడిన్
గట్టా! ప్రాణముఁ గోలుపోయెదు సుమీ కంసోద్ధతిన్ బాలకా! 1257

క. మా రాజు సొమ్ముఁ గైకొన, నే రాజులు వెఱతురింత యెల్లిదమే నీ
కీ రాజరాజ గృహమున, నీ రాజసమేల గొల్ల యేగుము తలఁగన్ 1258

"బాలుడా! ఏమేమీ! మా మహారాజుగారివస్త్రములను మీకు ఇయ్యదగునా? మీరు ఈ వస్త్రములను ధరించుటకు ఏవిధముగను అర్హులుకారు. పాలు, నేయి, పెఱుగు మొదలగువానిని మెక్కి, మదించి ఇట్లు మాట్లాడగల్గుచున్నారు? గొల్లలైన మీకు ఇట్లు పల్కుటకు నోరెట్లు వచ్చినది. అయ్యయ్యో! కంసప్రభువుయొక్క ఆగ్రహమునకు గుఱియైనచో మీ ప్రాణములు పోవుట తథ్యము. మా రాజుగారిసొమ్మును (వస్త్రాదులను) తీసికొనుట ఎంతటి మహారాజులైనను వణకిపోవుదురు. మా ప్రభువు మీకు ఇంత చులకన ఐనాడా? రాజులకే రాజైన మా కంసునియొక్క రాజ్యమున మీకు ఇంత గర్వమా? దూరముగా తొలగిపొండు".

వ. అనిన విని రోషించి. 1259

క. ఘోర కరాగ్రతలంబున, ధీరుఁడు కృష్ణుండు శిరము దెగిపడఁ గొట్టెం
బౌరుల గుండెలు వగులఁగ, వీరోద్రేకిన్ మదావివేకిన్ జాకిన్ 1260

ఆ రజకునిమాటలకు శ్రీకృష్ణుడు మిగుల కుపితుడయ్యెను. మదించియున్న మూర్ఖుడు కన్నుమిన్ను గానక ఉద్రేకమునకు లోనైనవాడు అగు ఆ చాకలియొక్క శిరస్సు తెగిపడునట్లుగా ధీరుడైన శ్రీకృష్ణుడు మిగుల బలమైన తన అఱచేతితో కొట్టెను. ఆ దృశ్యమును చూచిన పౌరులయొక్క గుండెలు దడదడలాడెను.

వ. ఇట్లు భగ్నుం డైన రజకునిం జూచి, వానివారలు పటంబులు డించి, వెఱచి, పఱచిన, రామకృష్ణులు వలసిన వస్త్రంబులు ధరియించి, కొన్ని గోపకులకొసంగి, చనుచుండ. 1261

ఇట్లు చచ్చిపడియున్న ఆ చాకలిని గాంచి, తోడి రజకులు వస్త్రముల మూటలను అక్కడనే విడిచిపెట్టి భయముతో పాఱిపోయిరి. పిమ్మట రామకృష్ణులు వాటిలో తమకు కావలసిన వస్త్రములను ధరించి, కొన్నింటిని తోడిగోపాలురకు ఒసంగి ముందునకు సాగిరి.

క. అంతట నొక వాయకుఁడా, క్రంతన్ వసుదేవసుతులఁ గని బహువర్ణా
త్యంత మృదు పటాభరణము, లెంతయు సంతసముతోడ నిచ్చెన్ మెచ్చన్. 1262

పిమ్మట ఒక వాయకుడు (నేతనేయువాడు) ఆ రాజవీథిలో ముందునకు నడచుచున్న బలరామకృష్ణులను జూచి, రంగురంగుల మెత్తని వస్త్రములను, ఆభరణములను సంతోషముతో వారికి ఇచ్చెను. అప్పుడు వారు అతని ఎంతయు మెచ్చుకొనిరి.

శా. కారుణ్యంబున వానిఁ గై కొని యలంకారంబు గావించి శృం
గారోదంచిత దిగ్గజేంద్ర కలభాకారంబులం బొల్చిరా
శూరుల్ మాధవుఁ డంత వాయకుని శుశ్రూషన్ మహాప్రీతుఁడై
సారూప్యంబును లక్ష్మియున్నొసఁగెనైశ్వర్యాది సంధాయియై. 1263

వ. అంతనారామకృష్ణులు, సుదాముండను మాలాకారు గృహంబునకుఁ జనిన నతండు కని లేచి గ్రక్కున మ్రొక్కి, చక్కన యర్ఘ్యపాద్యాదికంబులాచరించి, సానుచరులైన వారలకుఁ దాంబూల కుసుమ గంధంబు లొసంగి, యిట్లనియె. 1264

శూరులైన రామకృష్ణులు వాటిని ప్రేమతో స్వీకరించి, అలంకరించుకొనిరి. అంతట వారు అలంకృతములైన దిగ్గజములగున్నలవలె శోభిల్లిరి. పిమ్మట శ్రీకృష్ణుడు ఆ నేతపనివానిసేవామర్యాదలకు ఎంతయు ప్రీతుడై సకలసంపదలను, ఐశ్వర్యములను వానికి అనుగ్రహించెను, అంతేగాక అతనిని సారూప్యమోక్షమునకు అర్హునిగా చేసెను. పిమ్మట రామకృష్ణులు సుదాముడను మాలాకారుని ఇంటికి చనిరి. అతడు వారిరాకను గమనించి లేచి వారికి ప్రణమిల్లెను. వెంటనే అతడు వారికి భక్తిప్రపత్తులతో, అర్ఘ్యపాద్యాదులతో అతిథిసత్కారములను గావించెను. వారి వెంట వచ్చిన గోపాలురకును పూవులను, సుగంధములను సమర్పించి, అతడు ఆ బలరామకృష్ణులతో ఇట్లు నుడివెను.

ఉ. పావనమయ్యె నా కులము పండెఁ దపంబు గృహంబు లక్ష్మికిన్
సేవితమయ్యె నిష్టములు సేకుఱె విశ్వనిదానమూర్తులై
భూవలయంబు గావనిటు పుట్టిన మీరలు రాకఁజేసి నే
నేనిధమాచరింతుఁ బనులెయ్యవి బంటనెఱుంగఁ జెప్పరే. 1265

వ. అని పలికి. 1266

"అయ్యలారా! మీ రాకతో మా వంశమే పవిత్రమైనది. నా తపస్సు ఫలించినది. మా గృహము సంపదలతో కలకలలాడుచున్నది. నా కోరికలు అన్నియు తీరినవి. విశ్వకారణమూర్తులైన మీరు లోకరక్షణకై ఈ భూతలమున అవతరించిన మహానుభావులు. నేను మీ బంటును. నేను మీకు చేయవలసిన పనులు ఏమైనను ఉన్నచో విశదముగా తెల్పుడు" అని పలికెను.

క. దామోదరరాములకు, ద్దామ యశోహసిత తుహినధాములకు వధూ
కాములకుఁ దెచ్చి యిచ్చె సు, దాముఁడు ఘన సురభికుసుమదామములధిపా! 1267

రాజా! శ్రీకృష్ణబలరాములు తరుణీమణులపాలిటి నవమన్మథులు. స్వచ్ఛములైన వారి కీర్తికాంతులముందు చంద్రుని కాంతులును (వెన్నెలలును) వెలవెలబోవును. పిమ్మట సుదాముడు మిగుల సుగంధములను వెదజల్లుచున్న పూవులను, పూలదండలను ఆ మహాత్ములకు సమర్పించెను.

క. వారును మాలికుఁ డిచ్చిన, భూరి కుసుమదామములను భూషితులై నీ
కోరిన వరమిచ్చెదమనిఁ కారుణ్యము సేయ నతఁడు కని యిట్లనియెన్. 1268

అంతట బలరామకృష్ణులును ఆ మాలాకారుడు (సుదాముడు) సమర్పించిన పరిమళభరితములైన పూలమాలలను ధరించిరి. పిమ్మట వారు "సుదామా! నీవు కోరుకొనిన వరమును ఇచ్చెదము" అని పలికి అతనియెడ అనుగ్రహమును చూపిరి. అప్పుడు అతడు శ్రీకృష్ణునితో ఇట్లు నుడివెను.

క. నీ పాదకమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును, దాపసమందార! నాకు దయసేయఁగదే! 1269

వ. అని వేఁడికొనిన నిచ్చి, మఱియు, మాధవుండమ్మాలికునకు బలాయుః కాంతి కీర్తి సంపదలొసంగి, వాని గృహంబు వెడలి, రాజవీథిం జని చని 1270

"ప్రభూ! నీవు తాపసులకు కల్పవృక్షమువంటివాడవు. నీ పాదకమలములను సేవించుచుండెడి భాగ్యమును నాకు ప్రసాదింపుము. నిన్ను సేవించెడి భక్తులతో మైత్రిని అనుగ్రహింపుము. (నన్ను నీ దాసానుదాసునిగా ఆదరింపుము.) నాకు సకలప్రాణులయెడలను అపారమైన దయయుండునట్లుగా చూడుము". ఇట్లు వేడుకొనగా, అతడు కోరుకొనిన వరములను ప్రసాదించుటయేగాక శ్రీకృష్ణుడు అతనికి చక్కని బలమును, దీర్ఘాయుస్సును, ఘనమైన తేజస్సును, కీర్తిసంపదలను ఒసంగి, అతని గృహమునుండి బయలుదేఱి, రాజవీథిలో సాగిపోవుచుండెను.

## శ్రీకృష్ణుడు కుబ్జను అనుగ్రహించుట

క. ఆ నళినాక్షుఁడు కాంచెను, నానా లేపములభాజనము సేకొనుచుం
బూని చనుదెంచు దానిని, నానన రుచినిచయ వినమితాబ్జం గుబ్జన్ 1271

అంతట శ్రీకృష్ణుడు తనకు ఎదురుగా వచ్చుచున్న కుబ్జను గాంచెను. అప్పుడు ఆమె పద్మకాంతులను మించిన ముఖశోభలతో ఒప్పాఱుచు వివిధములగు లేపనములుగల (చందనము మొదలగు మైపూతలుగల) పాత్రను తీసికొని వచ్చుచుండెను.

వ. కని యిట్లనియె. 1272

క. ఎవ్వరిదానవు లేపము, లెవ్వరికిం గోరి కొనుచు నేఁగెదు నీ పే
రెవ్వతె మాకిమ్మన్నియు, నివ్వటిలెదు చక్కనగుచు నీరజనేత్రా. 1273

వ. అనినవయ్యబల యిట్లనియె. 1274

పిదప ఆ కృష్ణప్రభువు ఆమెతో ఇట్లనెను. "పద్మములవంటి కన్నులుగల ఓ వనితా! నీవు ఎవరు? నీ పేరేమి? ఈ మైపూతలను (అంగరాగములను) ఎవరికొఱకు తీసికొని వెళ్ళుచున్నావు? వీటిని అన్నింటిని మాకు ఇచ్చివేయుము. నీవు చక్కని సౌందర్యముతో విలసిల్లెదవు". అంతట ఆమె ఆ స్వామితో ఇట్లు నుడివెను.

ఉ. చక్కనివాఁడవౌదు సరసంబుల నొంపకుమెల్లవారికిన్
జక్కఁదనంబు లెక్కడివి చారుశరీర త్రివక్ర యండ్రు నే
నిక్కము కంసు దాసిని వినిర్మల లేపనవిద్యదాన నన్
మిక్కిలి రాజు మెచ్చుఁ దగ మీరు విలేపనముల్ ధరింపరే. 1275

"అందగాడా! నీవు ఎంతయు చక్కనివాడవే! నీ నర్మవచనములతో నన్ను నొప్పింకుము'. అందఱును అందముగా నుందురా? నన్ను 'త్రివక్ర' (కుబ్జ) అని పిలుతురు. నేను కంసుని దాసిని. ఇది నిజము. సుగంధాది మైపూతలను

నెఱపుటలో నేను నేర్పరిని. నన్ను మా రాజుగారు ఎంతగానో మెచ్చుకొందురు. మీరు ఈ సుగంధాది ద్రవ్యములను అలదుకొనుడు.

క. అని పలికి యా కుమారుల, తనువులు నగవులును వీక్షితమ్ములు మాటల్
తనచిత్తముఁ గరఁగించిన, ననులేపములిచ్చె వారికబల ప్రియముతోన్. 1276

ఇట్లు పలుకుచున్న కుబ్జయొక్క చిత్తమును, బలరామకృష్ణులతనుశోభలు, చిఱునవ్వులవిలాసములు, చూపులఅందచందములు, మాటలమధురిమలు దోచుకొనెను. పిమ్మట ఆ అబల వారికి ప్రేమతో ఆ విలేపన ద్రవ్యములను సమర్పించెను.

సీ. ఇ వ్విధంబునఁ గుబ్జ యిచ్చిన లేపంబులన్నియుఁ దాను దేహమున నలఁది
కొని ప్రసన్నత నొంది కుబ్జమువ్వంకల యొడలు సక్కఁగనొత్తియునుపఁదలఁచి
తత్పదంబులమీఁదఁ దనపదంబులు ద్రొక్కి హస్తాంగుళద్వయ మబల గౌ(ను)ద
క్రింద విప్పుగ నిడి కృష్ణుఁడు మీఁదికి నెత్తిన వక్రతలెల్ల మాని
ఆ. చక్కనైన చిత్తజన్మబాణముక్రియఁ గొమరు మిగిలి పిఱుఁదు కుచయుగంబు
సొంపుసేయఁ దరుణి సుందరమూర్తియై కమలనయనుఁ జూచి, కాంక్షతోడ. 1277

క. వేంచేయుము నా యింటికిఁ బంచశరాకార యనుచుఁ బైకొంగాక
ర్షించి హరిఁ దిగిచెఁ గామిని, పంచాశుగ బాణజాలభగ్నహృదయయై. 1278

ఈవిధముగా కుబ్జసుగంధాదులను అర్పించిన పిదప వారు ఆ లేపనములను దేహములకు అలదుకొని ఆమెయెడ ఎంతయు ప్రసన్నులైరి. అనంతరము శ్రీకృష్ణుడు ఆమెశరీరమును చక్కజేయదలచెను. వెంటనే ఆ స్వామి ఆమె పాదములపై తన పాదములనుంచి, తన చేతి రెండువ్రేళ్లను ఆమె గౌద (గడ్డము) క్రింద నేర్పుగా ఉంచి, ఆమె తలను మీదికి ఎత్తెను. అంతట ఆమెవంకరలు అన్నియును తొలగిపోయెను. అప్పుడు ఆమె తనువు మన్మథుని బాణమువలె మనోహరముగా రూపొందెను. కటిభాగము చక్కబడెను, వక్షస్థలము శోభలను నింపుకొనెను. ఆతరుణి జగదేకసుందరి అయ్యెను. పిమ్మట శ్రీకృష్ణునిగాంచినంతనే ఆమెలో కామవికారములు పెల్లుబుకగా, కోరికపడుచు 'ఓ మన్మథాకారా! నా గృహమునకు విచ్చేయుము' అనుచు ఆ ప్రభువుయొక్క ఉత్తరీయమును పట్టుకొని లాగెను.

క. కామిని తిగిచినఁ గృష్ణుఁడు, రాముని వీక్షించి నగుచు రాజానన! మ
త్కామితముఁ దీర్చి పిదపన్, నీ మందిరమునకు వత్తు నేఁడలుగకుమీ. 1279

వ. అని వీడుకొలిపి, కృష్ణుండు, విపణిమార్గంబునం జని చని, తాంబూల మాలికా గంధంబులును, బహువిధంబు లయిన కానికలును, బౌరు లిచ్చినఁ బరి గ్రహించుచు, ధనుశ్శాలకరిగియందు. 1280

ఆ సుందరి తన ఉత్తరీయపు కొంగును అట్లు లాగుచుండగా శ్రీకృష్ణుడు బలరామునివైపు జూచి నవ్వుచు 'చంద్రవదనా! నేను వచ్చిన పనిపూర్తియైన పిమ్మట నీ మందిరమునకు తప్పక వచ్చెదను. నీవు కినుక వహింపకుము' అని పలికి ఆమెను పంపివైచెను. అనంతరము ఆ స్వామి అంగళ్లవీధిలో వెళ్లుచుండెను. అప్పుడు పౌరులు అందఱును సమర్పించిన తాంబూలములను, పూలదండలను, సుగంధద్రవ్యములను తదితరములగు కానుకలను స్వీకరించుచు ఆ ప్రభువు ధనుశ్శాలకు చేరెను.

క. సురరాజువింటికైవడి, గురుతరమై భూరి వీరగుప్తంబయి దు
స్తర మయిన విల్లు బొడగని, నరులు వలదనంగ బిట్టు నగి వికసితుఁడై. 1281

శా. బంధుల్ మేలన వామహస్తమునఁజాపం బెత్తి మౌర్వీలతా
సంధానం బొనరించి కొంచెపుఁ దెగన్ శబ్దించుచున్ ధీరతా
సింధుండాహరి దాని ఖండితముగాఁ జేసెన్ జనుల్ చూడఁగా
గంధేభంబు రసాలదండమునొగిన్ ఖండించు చందంబునన్. 1282

అచట ఇంద్రధనుస్సువలె కాంతులీనుచున్న ఒక గొప్ప విల్లు విరాజిల్లుచుండెను. అది వీరభటుల రక్షణలో ఉండెను. సామాన్యులు దానిని ఎక్కుపెట్టుటయు అసాధ్యము. జనులెల్లరును వద్దనుచున్నను పెద్దగా నవ్వుచు శ్రీకృష్ణుడు జంకుగొంకులులేక దానిని సమీపించెను. సముద్రమువలె ధీరుడు, గంభీరుడు ఐన కృష్ణుడు బంధువులు అందఱును మెచ్చుకొనుచుండగా ఎడమచేతితో దానిని ఎత్తిపట్టుకొనెను. పిమ్మట ఆ ప్రభువు తీగవంటి అల్లెత్రాడును దానికి సంధించి ధనుష్టంకారముగావించెను. పిదప ఒక మదపుటేనుగు చెఱకుగడను విఱిచివేయునట్లుగా, అతడు అచటిజనుల సమక్షమున ఆ వింటిని అవలీలగా ఖండించివేసెను.

క. కోదండ భంగ నిర్గత, నాదము వీనులకు భీషణంబయి యాశా
రోదోంతరములు నిండుచు, భేదించెన్ భోజవిభునిబింకమునధిపా! 1283

మహారాజా! ఆ ధనుస్సు ఫెళ్లుమని విఱిగినప్పుడు బయలుదేఱిన మహాధ్వని దిక్కులను పిక్కటిల్లజేయుచు భయంకరమై పురజనుల చెవులకు దిమ్మెక్కించెను. ఆవిధముగా శ్రీకృష్ణుడు కంసునియొక్క ధైర్యమును బ్రద్దలుగావించెను.

వ. అప్పుడు, 1284

ఉ. అద్దిర! రాచవిల్ విఱిచె నర్భకుఁ డెంతయు శంకలేక నేఁ
డుద్దవిడిన్ సహింపఁదగ దుగ్రతఁబట్టుద మంచుఁగ్రుద్ధులై
గ్రద్దన లేచి తద్ధనువుకావలివారరుదేర వారి న
య్యిద్దఱుఁ గూడి పట్టి మడియించిరి కార్ముకఖండహస్తులై. 1285

వ. అట్లు రామకృష్ణులు మథురాపురంబున విహరించి వెడలి విడిదలకున్ జనిరంత 1286

అంతట "అరెరే! ఏమాశ్చర్యము! చూచుటకు ఇతడు బాలుడే అయ్యును, ఏమాత్రము తటపటాయింపులులేక కంసమహారాజుగారివింటిని ఖండించివేసెను. ఇంక వీనియొక్క ఈ దుడుకుచర్యను ఏవిధముగను సహింపరాదు. ఇప్పుడే ఇతనిని పట్టి బంధింతము" అనుచు అచటి రక్షకభటులు క్రుద్ధులై, తటాలున లేచి విజృంభించిరి. అంతట బలరామకృష్ణులు ఇద్దఱును అచటి ధనుస్సుముక్కలను చేతబట్టి వారిని పట్టకొని కొట్టి చంపిరి. ఆవిధముగా ధనుర్భంగమును గావించిన పిమ్మట బలరామకృష్ణులు మధురాపురమునందు అంతటను విహరించిరి. పిదప వారు తమ విడుదులకు చేరిరి.

## సూర్యాస్తమయచంద్రోదయములవర్ణనము

మ. గగనారణ్య చరాంధకారగజముం గాలాహ్వయ వ్యాధుఁడ
చ్చుగఁ బట్టన్ గమకించి మచ్చిడుటకై చూతాంకుర శ్రేణిచే
నొగిఁగల్పించిన కందుకంబనఁగ సూర్యుండంత వీక్షింపఁగాఁ
దగె మందప్రభతోడఁ బశ్చిమ మహాధాత్రీధరేంద్రంబునన్ 1287

కాలమనెడి కిరాతుడు ఆకాశమనెడి అరణ్యమునందు సంచరించుచున్న అంధకారము అనెడి ఏనుగును గట్టిగా పట్టుకొనుటకై పూనుకొని, దానిని (ఆ అంధకారగజమును) మచ్చిక చేసికొనుటకై మామిడి చిగుళ్లతో కల్పించిన బంతియా (ముద్దయా) అనునట్లు ఒప్పుచున్న సూర్యుడు తరిగిన కాంతితో పడమటి కొండపై చేరెను.

క. తరుణుఁడగు శీతకరునిన్, మరగి వియల్లక్ష్మి దన్ను మాని ముదుకఁడున్
ఖరకరుఁడు ననుచు ద్రొబ్బిన, కరణిన్ రవి పశ్చిమాద్రికడఁ గ్రుంకె నృపా! 1288

మహారాజా! ఆకాశమనెడి యువతి తారుణ్యమున (యౌవనమున) ఆహ్లాదకరుడుగా నున్న చంద్రునిపైగల వ్యామోహముతో, వృద్ధుడైన (అస్తమింపనున్న) ఖరకరుని (సూర్యుని) విడిచిపెట్టి, అతనిని దూరమునకు నెట్టివేసినదా? అనునట్లు ఆ భాస్కరుడు అస్తాద్రియందు క్రుంకెను.

ఆ. కళలు గలుగుఁగాక కమల తోడగుఁగాక శివునిమౌళిమీఁదఁ జేరుఁగాక
నన్యునొల్లఁ దపనుఁడైన మత్పతి యని సాధ్విభంగిఁ గమలజాతి మొగిడె. 1289

'చంద్రుడు కళలకు నిధియే గావచ్చును, లక్ష్మికి అతడు తోబుట్టువే గావచ్చును. అతడు శివుని శిరస్సుపై ధరింపబడువాడే కావచ్చును. కాని పరపురుషుడైన ఆ చంద్రుని మేము ఒల్లముగాక ఒల్లము. తపింపజేయువాడేయైనను సూర్యుడే మా పతి' అనుచు సాధ్వీమణులవలె కమలములు (కమలజాతి చంద్రునిపైగల విముఖతతో) ముడుచుకొనెను.

క. సుందర సాయంసంధ్యా, వందన విప్రార్ఘ్యతోయ వజ్రహతోద్య
న్మందేహాసుర రక్త, స్యందము క్రియఁ గెంపు సొంపెసఁగ నపరదిశన్. 1290

అందమైన (పవిత్రమైన) సంధ్యాసమయమునందు బ్రాహ్మణులు సంధ్యావందనమున అర్ఘ్యములను విడుతురు. వారు సమర్పించిన అర్ఘ్యజలమనెడి వజ్రాయుధము దెబ్బకు ఖండితులైన మందేహాది రాక్షసుల యొక్క రక్తస్రావమా? అనునట్లు ఎఱ్ఱని కాంతిపుంజము పడమటి దిశయందు అలరారెను.

ఆ. భూమినిండి మింటఁ బూర్ణమై కర్కట మకర మీనరాశి మహితమైన
హరియశస్సుధాబ్ధియందలి తుంపురులనఁగఁ జుక్కలొప్పె నాకసమున. 1291

కర్కటక, మకర, మీన అభినయముద్రలతో మహితమైనది విష్ణు యశస్సు. కర్కటక (ఎండ్రకాయలతో) మకర (మొసళ్లతో) మీన (చేపలతో) ఒప్పుచుండెడిది సముద్రము. భూమ్యాకాశములయందు అంతటను వ్యాపించి, కర్కటక, మకర, మీన – అభినయ ముద్రలతో సుప్రసిద్ధమైన విష్ణు యశస్సు అనెడి (కర్కటక, మకర, మీన సమూహములతో నిండిన) సముద్రముయొక్క నీటి తుంపరలాయనునట్లు ఆకాశమున నక్షత్రములమిలమిలలు అలరారెను.

క. ఎల్ల దిశలు నిండిన శ్రీ, వల్లభు గుణమహిమ బ్రహ్మ వాసించుటకై
చల్లిన మృగమదమనఁగా, వెల్లివిరిసెఁ దమము గగనవీథులనెల్లన్ 1292

సకలదిశలయందును వ్యాపించిన శ్రీహరిమహిమను పరిమళింపజేయుటకై బ్రహ్మదేవుడు చల్లిన కస్తూరియా? అనునట్లు గగన వీథులలో (ఆకాశమునందంతటను) చీకట్లు దట్టముగా అలముకొనెను.

క. ఆ చీఁకటి వెను తగిలినఁ, బ్రాచీదిశనుండి గంతుఁబరువున రవి భ
ర్మాచలము మలఁక ద్రోవను, వే చనియెం గాక నిలిచి విఱుగక యున్నే. 1293

చీకటి తరుముకొని వచ్చుచుండగా (వెంటాడుచుండగా) సూర్యుడు తూర్పుదిశనుండి పరుగుపరుగున (వేగముగా)

గంతులు వేయుచు, మెలికలబాటలలో తప్పించుకొనుచు మేరు పర్వతముకడకు చేరెను. అట్లుగాక నిలిచియున్నచో చీకటి చేతిలో ఓడిపోయియుండెడివాడు.

ఉ. మీకును వైరి యెప్పుడును మిక్కిలి మాకును వైరి రాజు దో
షాకరుఁడింక వచ్చు జలజాతములార! మదీయ బాలురం
జేకొనుఁడంచు బాలకులఁజీఁకటి దాఁచిన భంగిఁ జిక్కి రా
రాక వసించెఁ దుమ్మెదలు రాత్రి సరోరుహ కుట్మలంబులన్ 1294

"పద్మములారా! చంద్రుడు రాబోవుచున్నాడు అతడు మీకును, మాకును ప్రబలమైన శత్రువు. అతడు దోషాకరుడు (దోషములకు నెలవైనవాడు అనగా ఇతరులను బాధించువాడు. రాత్రిని కలుగజేయువాడు), కావున మా పిల్లలను చేరదీసి ఆదుకొనుడు" అనుచు చీకటి తన పిల్లలను దాచినరీతిగా ముడుచుకొనిపోయిన తామరపువ్వులలో చిక్కుకొనిన తుమ్మెదలు బయటికి రాజాలక ఆ రాత్రికి వాటియందే నివసించెను. (ఉండిపోయెను).

సీ. ప్రాచీదిశాంగనా ఫాలతలంబున దీపించు సిందూరతిలకమనఁగ
దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప దర్పకుండెత్తిన దాత్రమనఁగ
నలిగి కాలకిరాతుఁ డంధకారమృగంబు ఖండింప మెఱయించు ఖడ్గమనఁగ
గగన తమాల వృక్షము తూర్పు కొమ్మను లలితమై మెఱయు పల్లవమనంగ
ఆ. దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్లఁ గడలి మిన్నుముట్టి కడలుకొనఁగఁ
బొడిచె శీతకరుఁడు భూరి చకోరకప్రీతికరుఁడు జారభీతికరుఁడు. 1295

ఇంతలో చల్లని కిరణములుగల పూర్ణ(నిండు) చంద్రుడు ఉదయించెను. అప్పుడు తూర్పుదిక్కు అనెడి భామిని తన నొసటియందు తీర్చిదిద్దుకొనిన కుంకుమబొట్టు అనునట్లుగా అతడు భాసిల్లుచుండెను. గర్వితుడైన మన్మథుడు విరహావస్థలో నున్నవారి యొక్క ధైర్యమనెడి తీగెలను ఖండించుటకై పైకెత్తిన కొడవలియా? అనునట్లు అలరారుచుండెను. కాలపురుషుడు అనెడి కిరాతుడు మిగుల కుపితుడై చీకటి అనెడి మృగమును వధించుటకై చేబూనిన ఖడ్గమా? అనునట్లు ఒప్పుచుండెను. ఆకాశమనెడి కానుగ చెట్టుయొక్క తూర్పుదిక్కుకొమ్మపై మెఱయుచున్న మృదువైన చిగురుటాకు అనునట్లు భాసిల్లుచుండెను. ఆ చంద్రునిరాకతో కలువలు సంతోషముతో వికసించుచుండెను. దొంగలు భీతిల్లుచుండిరి. సముద్రతరంగములు ఆకాశమును తాకునంతగా ఎగసిపడుచుండెను. చకోరపక్షులగుంపులు సంతసించుచుండెను. విటులు భయపడసాగిరి.

క. దర్పిత తారాధిపపరి, సర్పిత కిరణౌఘ మిళిత సకల దివంబై
యేర్పడి కమలభవాండము, కర్పూరపుఁ గ్రోవిభంగిఁ గనుపట్టె నృపా! 1296

రాజా! వైభవోపేతుడై ఒప్పుచున్న చంద్రునియొక్క కిరణములు (వెన్నెలకాంతులు) ఆకాశమునందు అంతటను వ్యాపించెను. అప్పుడు బ్రహ్మాండము కర్పూరపు బరిణవలె కనబడెను.

క. ఆరేయి గోపయుతులై, క్షీరాన్నము గుడిచి రామకృష్ణులు మదిఁ గం
సారంభమెఱిఁగి యిష్ట, విహారంబుల నప్రమత్తులై యుండిరిటన్. 1297

ఆ రాత్రి బలరామకృష్ణులు గోపాలురతో గూడి పాయసములను ఆరగించిరి. వారిమనస్సులలో కంసుని విజృంభణవిషయము (ఆర్భాటము) మెదలుచునే యుండుటచే వారు తమకు ఇష్టమైన ఆటపాటలతో, ఆ వనమునందు జాగరూకులై యుండిరి.

క. తన పురికి రామకృష్ణులు, చనుదెంచి నిజానుచరులఁజంపుటయు మహా
ధనువుఁ గదిసి విఱుచుటయును, విని కంసుఁడునిద్రలేక విహ్వలమతియై. 1298

బలరామకృష్ణులు తన నగరమునకు (మధురకు) విచ్చేసి ధనుస్సును ముక్కలు చేసిన విషయమూ, క్రమముగా తన అనుచరులను వధించిన సంగతియు తెలిసినంతనే కంసునియొక్క మనస్సు ఎంతయు తత్తఱపాటునకు లోనయ్యెను. ఆ రాత్రి అతనికి నిద్రయే పట్టకుండెను.

సీ. కర్ణరంధ్రములు చేఁగప్పిన లోపలి ప్రాణఘోషము వినఁబడక డిందెఁ
దోయాదికములందుఁ దొంగిచూచినయంతఁ దల గానరాదయ్యెఁ దనువుమీఁదఁ
గరశాఖ నాసికాగ్రంబుపై నిడి చూడ గ్రహతారకలు రెండుగానగపడె
వెలుఁగున నిలుచుండి వీక్షింపఁగా మేనినీడ సరంధ్రమై నేలఁ దోఁచె
ఆ. నడుగుజాడ దృష్టమౌట లేదయ్యెను దరువులెల్ల హేమతరువు లగుచు
మెఱయుచుండెఁ గాలమృత్యువు దగ్గఱ బుద్ధి యెల్లఁ గలఁగె భోజపతికి. 1299

అంతట కంసుడు తన చేతులతో కర్ణరంధ్రములను కప్పికొనినప్పుడు లోపలి ప్రాణవాయువులశబ్దములు అతనికి వినబడకుండెను. నీళ్లలోను, అద్దములు మొదలగు వానియందును చూచుకొనినప్పుడు అతనికి తన శరీరముపై తల కనబడకుండెను. చేతివ్రేలిని ముక్కుచివర ఉంచి, ఆకాశమువైపు చూడగా గ్రహములు, నక్షత్రములు ఒక్కొక్కటి రెండుగా తోచెను. వెలుగులయందు నిలబడి తననీడను చూచుకొనగా అందులో రంధ్రములు కనబడెను. నేలపై అతని అడుగుజాడలు అతనికి కనబడకయుండెను. చెట్లన్నియును, బంగారువన్నెతో మెఱయుచు కన్పట్టెను. కాలమృత్యువు దరిజేరుచుండుటచే (అవసానదశదగ్గఱ పడుచుండుటచే) అతనిబుద్ధి కలవరపాటునకు లోనగుచుండెను.

క. గరళముఁ దినుటయుఁ బ్రేతముఁ బరిరంభించుటయు నగ్నభావుఁడవుటయున్
శిరమునఁ దైలము వడుటయు, ఖరపతి నెక్కుటయు నతఁడు కలలోఁ గనియెన్. 1300

వ. మఱియు రక్తకుసుమమాలికాధరుం డై, యొక్కరుండు నెక్కడేనియుం జనుచున్న వాఁడనని కలగాంచి, మరణ హేతుక భ్రాంతిం జింతాక్రాంతుండై నిద్రఁ జెందక వేగించుచున్న సమయంబున 1301

ఆ కంసునకు కలలో తాను విషమును తినినట్లుగను, శవమును కౌగిలించుకొనినట్లుగను, దిగంబరుడైనట్లుగను, శిరస్సుపై నూనె పడినట్లుగను, గాడిదను ఎక్కి తిరిగినట్లుగను కనబడసాగెను. ఇంకను తాను ఎఱ్ఱనిపూలదండలను ధరించి, ఒంటరిగా ఎక్కడెక్కడనో తిరుగుచున్నట్లుగా అతనికి కలలు వచ్చుచుండెను. ఈ కలలన్నియును తన మరణమును సూచించుచున్నట్లుగా భ్రమపడుచు, అతడు పరితాపములో మునిగి, నిద్రపట్టక ఆ రాత్రిని ఎట్లో గడపెను.

## సూర్యోదయవర్ణనము

క. అరుణ హరినఖర విదలిత, గురు తిమిరేభేంద్ర కుంభకూట వినిర్ము
క్త రుధిర మౌక్తికములక్రియ, సురపతిదిశఁ గెంపుతోడఁ జుక్కలు మెఱసెన్. 1302

సూర్యుడనెడి సింహము తనవాడియైన గోళ్లతో కటిక చీకటియనెడి మదపుటేనుగుయొక్క కుంభస్థలమును చీల్చివేయగా అందుండి వెలువడిన రక్తముతోగూడిన ముత్యములవలె తూర్పుదిక్కున ఎఱ్ఱబాఱిన (వెలవెలబోయిన) చుక్కలు అలరారెను.

సీ. పౌలోమి తనబాలుపొన్నుపైఁ గనుపట్టఁ బన్నిన పవడంపుబంతి యనఁగ
నాయురర్థముల వ్యయంబు లొత్తిలి చాటు కాలజాంఘికుచేతిఘంట యనఁగ
ఘన జంతుజీవిత కాలరాసుల విధి కొలువ నెత్తిన హేమకుంభమనఁగ
బశ్చిమ దిక్కాంత పరఁగఁగ్గైసేయుచో ముందట నిడుకొన్న ముకురమనఁగఁ
తే. గోక తాపోపశమ దివ్యఘుటిక యనఁగఁ బద్మినీకాంతనోములఫలమనంగ
మూఁడుమూర్తులసారంపు ముద్ద యనఁగ మిహిరమండలముదయాద్రిమీఁద నొప్పె. 1303

ఇంతలో తూర్పుకొండపై సూర్యబింబము విరాజిల్లెను. (సూర్యుడు ఉదయించెను.) ఆ బింబము శచీదేవి తన కుమారుడైన జయంతుని పొన్నుపై అందఱికిని స్పష్టముగా కనబడునట్లుగా చిలుకలపందిరియందు ఏర్పఱచిన పవడాల ముద్దయనునట్లుగా విలసిల్లుచుండెను. ఆయువు అనెడి సంపద తఱిగిపోవుచున్న తీరును నొక్కి చెప్పుచు, వేగముగా సాగిపోవుచున్న కాలపురుషునిచేతిలోని గంటయా? అనునట్లు ఒప్పుచుండెను. బ్రహ్మదేవుడు సకలప్రాణుల యొక్క జీవితకాలములనెడి ధాన్యరాసులను కొలుచుటకై చేతబట్టిన బంగారుకుండయా[1] అనునట్లు విరాజిల్లుచుండెను. పడమరదిక్కు అనెడి కాంత చక్కగా అలంకరించుకొనునప్పుడు తన ముందుంచుకొనిన అద్దమా? అనునట్లు భాసిల్లుచుండెను. చక్రవాకపక్షులతాపమును తొలగించునట్టి దివ్యమైన మందుగుళికయా? అనునట్లు అలరారుచుండెను. ఇంకను ఆ సూర్యబింబము పద్మములనెడి కాంతలయొక్క నోములఫలమా? అనునట్లుగను, (సూర్యుడు ఉదయించుచుండగనే పద్మములు వికసించుచుండును.) త్రిమూర్తుల (బ్రహ్మ విష్ణు మహేశ్వరుల) వెలుగులయొక్క సారపు ముద్దయా?[2] అనునట్లుగను అలరారుచుండెను.

క. వచ్చెం జల్లని గాడ్పులు, విచ్చెం గమలములు తమము విరిసి బిలంబుల్
చొచ్చెం బద్మమరందము, మెచ్చెం దుమ్మెదలు గ్రోలి మిహిరుఁడు పొడమన్. 1304

సూర్యోదయము అగుటతో చల్లనిగాలులు వీచెను. కమలములు వికసించెను. చీకట్లు పాఱిపోయి గుహలలో దాగికొనెను. తుమ్మెదలు పద్మములలోని మకరందములను గ్రోలి ఎంతయు ఆనందించెను.

క. సంకాశితోదయాచల, పంకజసఖ కిరణరాగ పరిపూర్ణంబై
పంకేరుహ గర్భాండము, కుంకుమసలిలంపుఁ గ్రోవికొమరున నొప్పెన్. 1305

తూర్పుకొండపై వెలుగులను నింపుచు ఉదయించిన సూర్యునియొక్క కిరణములు ప్రసరించుటచే ఎఱ్ఱని కాంతులతో నిండిన బ్రహ్మాండము కుంకుమజలములతో తడిసిన బరిణవలెను విరాజిల్లెను.

వ. తదనంతరంబున, 1306

సీ. పాషాణ వల్మీక పంకాది రహితంబు మృదుల కాంచననిభ మృణ్మయంబు
కమనీయ కస్తూరికాజల సిక్తంబు బద్ధ చందనదారు పరివృతంబు
మహనీయ కుసుమదామ ధ్వజతోరణ మండితోన్నత మంచ మధ్యమంబు
బ్రాహ్మణ క్షత్త్రాది పౌరకోలాహలంబశ్రాంతతూర్య త్రయాంచితంబు

1. పూర్వకాలమున ధాన్యరాసులను(ధాన్యములను) కుండలతో కొలుచుచుండెడివారు.
2. శ్లో॥ బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నే తు మహేశ్వరమ్ ।
సాయం ధ్యాయేత్ సదా విష్ణుమ్ త్రిమూర్తిశ్చ దివాకరః ॥

ఆ. నిర్మలంబు సమము నిష్కంటకంబునై పుణ్యపురుషుమనముఁ బోలి కంస
సైన్య తుంగమగుచు సంతుష్ట లోకాంత రంగ మైన మల్లరంగమొప్పె. 1307

సూర్యోదయానంతరము కంసుని ఆదేశముచే సిద్ధపఱచబడిన మల్లయుద్ధరంగము వైభవోపేతమై ఒప్పుచుండెను. ఆ ప్రదేశమున ఱాళ్లు, పుట్టలు, బురదలు లేకుండెను. అచటి నేలయంతయు బంగారమువలె మెఱయుచున్న మెత్తని మట్టితో అలరారుచుండెను. సువాసనలను వెదజల్లుచున్న కస్తూరీజలములతో (కలాపితో) తడుపఁబడియుండెను. దానిచుట్టును చక్కని శిల్పములతోగూడిన చందనస్తంభములు నిలుపబడియుండెను. దానిమధ్యలో ఎత్తైన మంచె ఏర్పఱచబడియుండెను. (మంచె = ఎత్తైనవేదిక) అది మేలైన పూలమాలలతోను, ధ్వజపతాకములతోడను అలంకరింపబడియుండెను. ఆ ప్రదేశమున బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలగు పౌరులయొక్క కోలాహలధ్వనులు చెలరేగుచుండెను. అచట నిరంతరము నృత్త, గీతవాద్యములు కనులపండువుగా, వీనులవిందుగా కొనసాగుచుండెను. ఆ రంగస్థలము పుణ్యాత్మునిమనస్సువలె నిర్మలమై యుండెను. (పుణ్యపురుషునిమనస్సు స్వచ్ఛమైనది, రాగద్వేషరహితమై ప్రశాంతమైనది) ఆ రంగస్థలము పరిశుభ్రముగా, ఒడుదొడుకులులేకుండా, ముళ్లు ముక్కలులేనిదై ఒప్పుచున్నది. బలిష్ఠమైన సైన్యము దానిని రక్షించుచుండెను. అచటివారికి అందటికిని ఆ రంగభూమి ఆహ్లాదమును గూర్చుచుండెను.

క. ఆ మల్లరంగ పరిసర, భూమి స్థిత మంచమందు భోజేంద్రుఁడు మా
న్యామాత్య సంయుతుండై, భూమీశులు కొలువనుండెఁ బొక్కుచు నధిపా! 1308

ఆ మల్లరంగమునకు సమీపమునగల ఒక ప్రదేశమందలి ఉన్నతాసనముపై కంసుడు ఆసీనుడై యుండెను. అతని చుట్టును మంత్రులును, సామంతరాజులును కొలువుదీరియుండిరి. అతడు విచారగ్రస్తుడై ఉండెను.

మ. సకలాంభోనిధి మేఖలావహనముం జాలించి యేతెంచు నా
గకులాగంబులభంగి నొప్పుచుఁ దగం గైసేసి చాణూర ము
ష్టికకూటుల్ శలతోశలుల్ గురువులన్ సేవించుచున్ రంగధా
త్రికి నేతెంచిరి తూర్య ఘోషముల నుద్రేకంబనేకంబుగన్. 1309

అంతట చాణూరుడు, ముష్టికుడు, కూటుడు, శలుడు, తోశలుడు అను మల్లురు చక్కగా అలంకృతులై, గురువులను సేవించుచు, వాద్యముల మహాధ్వనులకు ఆవేశపడుచు రంగభూమికి ఏతెంచిరి. అప్పుడు నాలుగువైపులయందును సముద్రములతో ఒప్పారుచున్న భూమండల భారమును మోయుటను ఆపివచ్చుచున్న దిగ్గజములవలెను, కులపర్వతములరీతిగను ఆ మల్లురు భాసిల్లుచుండిరి.

క. నందాదులైన గోపకు, లందఱుఁ జని కానుకలు సమర్పించి నృపున్
సందర్శించి తదనుమతిఁ, జెంది మహామంచముల వసించిరి వరుసన్. 1310

పిమ్మట నందుడు మొదలగు గోపాలురు అందఱును అచటికి విచ్చేసి, కంసుని సందర్శించి, అతనికి కానుకలను సమర్పించిరి. పిదప వారు అతనిఅనుమతితో వరుసగా ఉన్నతాసనములపై కూర్చుండిరి.

## శ్రీకృష్ణుండు కువలయాపీడమను గజంబును వధించుట

వ. అంత రామకృష్ణులు నలంకృతులై, మల్లదుందుభినినదంబు విని, సందర్శన కుతూహలంబున. 1311

క. ఓడక రంగద్వారము జాడం జని వారు కనిరి సమద కువలయా
పీడంబున్ భిన్నపరా, క్రీడంబుం బ్రమదకంటకితచూడంబున్ 1312

వ. కని, తత్కరిపాలక శ్రేష్ఠుండైన యంబష్ఠునికి మేఘనాద గంభీర భాషణంబుల రిపుభీషణుండగు హరి యిట్లనియె. 1313

అంతట బలరామకృష్ణులు తగు విధముగా అలంకృతులై, మల్లురపోరును సూచించెడి దుందుభిధ్వనులను విని, సందర్శనకుతూహలముతో రంగద్వారముకడకు నిర్భయముగా విచ్చేసిరి. అచటివారికి 'కువలయాపీడము' అను మదపుటేనుగు కనబడెను. మిక్కిలి మదించిన దానియొక్క కుంభస్థలము లోకులకెల్లరకును భీతిని గొల్పునట్టిది. అది శత్రుగజముల చీల్చి చెండాడునట్టిది. శత్రుభయంకరుడైన శ్రీహరి దానిని చూచినంతనే, మేఘము గర్జించినట్లు గంభీరములైన పలుకులతో మేటియగు మావటివానిని ఇట్లు హెచ్చరించెను.

శా. ఓరీ కుంజరపాల మా దెసకు నీ యుద్యన్మదేభేంద్రముం
ద్రోరేఁపం బనిలేదు త్రిప్పు మరలం బ్రేరేఁచినన్ నిన్ను గం
భీరోగ్రాశని తుల్య ముష్టిహతులన్ భేదించి నేఁడంతకుం
జేరం బుత్తు మహత్తరద్విపముతో సిద్ధంబు యుద్ధంబునన్. 1314

"ఓరీ! మావటీ! ఎగసిపడుచున్న ఈ మదపుటేనుగును తెచ్చగొట్టి నీవు మామీదికి పంపవలసిన పనిలేదు. దీనిని వెనుకకు మఱలింపుము. అట్లొనర్పక, దీనిని మా మీదికి ఉసిగొల్పినచో గంభీరమై, తీవ్రమైన వజ్రాయుధముతో సమానమగు నా ముష్టిఘాతములతో (పిడికిలి పోటులతో) నిన్నును, ఈ ఏనుగును యుద్ధమున ఖండించి మృత్యువు కడకు పంపెదను. ఇది ముమ్మాటికిని నిజము.

వ. అని పలికి. 1315

ఉ. మించిన కొప్పుఁ జక్కనిడి మేలనఁ బచ్చనిచీరకాసె బం
ధించి లలాట కుంతలతతిన్ మరలింపుచు సంగర క్రియా
చుంచుతఁ బేర్చి బాలకుఁడు చూచు జనంబులు దన్ను బాపురే!
యంచు నుతింప దగ్గఱియె హస్తిజితాగము గంధనాగమున్. 1316

ఇట్లు పలికిన పిమ్మట కృష్ణప్రభువు చిక్కగానున్న తన జుట్టుముడిని చక్కజేసికొనెను, మేలైన తన పట్టువస్త్రమును నడుమునకు బిగించెను. నొసట వ్రేలాడుచున్న ముంగురులను పైకి సవరించుకొనెను. రణోత్సాహముతో విజృంభించెను. అచటిజనులు అందఱును భళీ! భళీ! అనుచు తనను మెచ్చుకొనుచుండగా ఆ స్వామి, మహాపర్వతములను సైతము తన తొండముతో ఛిన్నాభిన్నమొనర్చెడి ఆ మదపుటేనుగును సమీపించెను.

క. అంజక బాలకుఁడనియును, గొంజక దయమాలి రాజకుంజర! యంతం
గుంజరమును డీకొలిపెను, గుంజరపాలకుఁడు గోపకుంజరుమీఁదన్. 1317

పరీక్షిన్మహారాజా! ఆ మావటివాడు 'ఇతడు (శ్రీకృష్ణుడు) బాలుడు' అని ఏమాత్రమూ సందేహింపక, (వెనుకాడక) దయావిహీనుడై, గోపశిరోమణియగు శ్రీకృష్ణునిమీదికి ఆ మదపుటేనుగును తెచ్చగొట్టెను.

వ. మఱియు, నయ్యనేకపంబనేకపపాలకప్రేరితంబయి మహావాత సంఘాత సముద్ధూతంబగు విలయకాల కీలికేళిని బిట్టు మిట్టిపడి, మృత్యుదేవత యెత్తునం, గాలుపోలిక, శమనుని గమనిక, నెదిరి, మదసలిల పరిమళ లుబ్ధ పరిభ్రమద్భ్రమరగాయక ఝుంకృతులహంకృతి సంపాదింపం, గులకుంభినీధరగుహాకుంభ గుంభనంబుగా ఘీంకరించి, రోషభీషణ శేషభోగిభోగభయంకరంబగు కరంబున శౌరిం జీరి, చీరికిం గొనక పట్టీయ, నందుపట్టి

యట్టిట్టు గెంటి విధుంతుదవదన గహ్వరంబువలన విడివడి యుఱుకు తరణికరణి దర్పించి కుప్పించి పాదమధ్యంబునకు నసాధ్యుండై దూఁటి దాఁటి, మాటుపడినం, గ్రోధబంధురంబై, సింధురంబు మహార్ణవమథ్య మంథాయమాన మందరమహీధరంబు కైవడి, జిఱజిఱం దిరిగి కానక, భయానకంబై, కాలివెరవునం గని పొంగి, చెంగటం బ్రలయదండి దండ ప్రశస్తంబగు హస్తంబు వంచి వంచించి, చుట్టి పట్టి, పడవ్రేయం గమకించినం, జలింపక, తెంపున హరి కరిపిటిందికుటికి, మహారాహు వాలవల్లికాకర్ష ణోదీర్ణుండగు సుపర్ణుతెఱంగున నెగిరి, శుండాలంబు వాలంబులీలం గేల నొడిసిపట్టి, జళిపించి, పంచవింశతి బాణాసనప్రమాణ దూరంబు బీరంబునం ద్రిప్పివైవ, న వ్వారణంబు దుర్నివారణంబై, రణంబున కోహటింపక, సవ్యాపసవ్య పరిక్రమణంబుల నవక్రంబై, కవిసిన, నపసవ్య సవ్య క్రమణంబులం దప్పించి, రొప్పి, కుప్పించి, యెదుర్కొని గర్కశుండై, మేచకాచలతుంగశృంగ నిభంబగు కుంభికుంభంబు చక్కటి వ్రక్కలై, చెక్కలెగయ, దురంత కల్పాంత జీమూత ప్రభూత నిర్ఘాత నిష్ఠురంబగు ముష్టి సారించి, యూఁచి, పొడచినం, దద్వికీర్ణ పూర్ణ రక్తసిక్త మౌక్తికంబులు వసుంధరకు సంధ్యారాగ రక్తతారకాచ్ఛన్నంబగు మిన్ను చెన్నలవరింప, నిలువరింపక, మ్రొగ్గి, మోఁకరిలి, మ్రొగ్గక దిగ్గన నగ్గజంబు లేచి చూచి త్రోచి నడచి సంహారసమయ సముద్రసంఘాత సంభూత సముత్తుంగ భంగ సంఘట్టితంబగు కులాచలంబుక్రియం గ్రమ్మఱ నమ్మహాభుజుని భుజాదండంబులవలన ఘట్టితంబై, కట్టలుక ముట్టి, నెట్టుకొను, ముమ్మరంబుగం గొమ్ములం జిమ్మిన, న మ్మేటి చేసూటి మెఱసి, హస్తాహస్తి సంగరంబునఁ గరం బొప్పి, దప్పిం బడనొప్పించిన, నకుంఠిత కాలకంఠ కఠోర భల్ల భగ్నంబగు పురంబు పగిది, జలధిం జటులఝుంఝానిల వికలంబగు కలంబుకైవడి, నమ్మదకలంబు బలంబు దక్కి, చిక్కి, స్రుక్కివడి, లోభి కరంబునుం బోలె దాన సలిలధారా విరహితంబై, విరహితలంపునుం బోలె నిరంతర చిత్తజాతజనకవిగ్రహంబై, గ్రహణకాలంబునుం బోలెఁ బరాధీన ఖరకరంబై, ఖరకరోద యంబునుం బోలె భిన్న పుష్కరంబై, పుష్కరవైరి విలసనంబునుం బోలెనభాసిత పద్మకంబై యున్న సమయంబున.
1318

అంతట ఆ మావటివానిచే ఉసికొలుపబడిన ఆ కువలయాపీడము (మదపుటేనుగు) పలువిధములగు పెనుగాలులచే ఎగురగొట్టబడిన (పెనుగాలులతాకిడికి చెలరేగిన) ప్రళయకాలాగ్నివలె ఎంతయు మిడిసిపడుచు, మృత్యుదేవతవలె, కాలపురుషునిరీతిగా, యమునిచందంబున కృష్ణునిమీదికి విజృంభించెను. అది తన మదజలముల సువాసనలకు ఆశపడి చుట్టునుజేరిన తుమ్మెదలనెడి గాయకులయొక్క ఝుంకారములకు అహంకరించి, కులపర్వతములయొక్క గుహలయందు అంతటను ప్రతిధ్వనించునట్లుగా ఘీంకరించెను. అంతులేని రోషముతో ఆదిశేషుని పడగవలె భీకరమైన తన తొండముతో ఆ ఏనుగు శ్రీకృష్ణుని తాకి లక్ష్యపెట్టక (భీతిల్లక) పట్టుకొనెను. పిమ్మట ఆ ప్రభువు అటునిటు పెనగి, రాహువుయొక్క ముఖమనెడి గుహనుండి బయటపడిన సూర్యునివలె విజృంభించి, ఎగిరి, దానికి చిక్కకుండా ఆ ఏనుగుయొక్క కాళ్లమధ్య దూరి, రివ్వున ఎగిరి చాటున ఉండెను. అప్పుడు క్రోధముతో ఊగిపోవుచు ఆ గజము మహాసముద్రముమధ్యన కవ్వమువలె మథించుచున్న మందరపర్వతమురీతిగా గిరగిర తిరుగుచు చూచెను. ఐనను కృష్ణుడు కనబడకుండుటచే తిన్నగా అది భయంకరరూపమును దాల్చినదై, కాలిస్పర్శతో ఆయన తనకు సమీపముననే ఉన్నట్లు గుర్తించెను. అంతట అది ప్రళయకాలయమునిదండమువలె భీకరముగా ఉన్న తన తొండమును క్రిందికి వంచి, వంచించి, దానితో పట్టుకొని విసరివేయుటకు ప్రయత్నించెను. అప్పుడు శ్రీహరి ఏమాత్రము చలింపక సాహసించి, గబగబ ఏనుగునకు వెనుకభాగమునజేరి, మహారాహువుయొక్క వాలమనెడి తీగెను లాగుటలో సమర్థుడైన గరుత్మంతునివలె ఎగిరి, ఆ ఏనుగుతోకను ఒడుపుతో అవలీలగా చేతబట్టుకొని, ఇటునటు ఆడించి, గిరగిర త్రిప్పి, ఇఱువదిఐదుబారల దూరమున విసరివేసెను.

అంతట ఆ ఏనుగు నివారింపరానిదై, పోరునకు వెఱవక, ఎడమవైపునుండి కుడివైపునకు పరిభ్రమించుచు (తిరుగుచు) తిరుగులేని రీతిగా కృష్ణునిమీదికి వచ్చుచుండెను. అప్పుడు శ్రీహరి కుడివైపునుండి ఎడమవైపునకు పరిభ్రమించుచు దానికి చిక్కక, లంఘించి ఎదుర్కొనెను. పిమ్మట అతడు క్రుద్ధుడై (దయ చూపనివాడై) నల్లని కొండయొక్క ఎత్తైన శిఖరమును బోలియున్న ఏనుగుయొక్క కుంభస్థలము ముక్కలు చెక్కలగునట్లుగా, అనంతమైన ప్రళయకాలమునందలి మేఘమునుండి బయలుదేఱిన పిడుగువలె మిగుల కఠినమైన పిడికిలిని చాపి, ఊపి (పైకెత్తి) బలముగా కొట్టెను. అంతట దానికుంభస్థలము బ్రద్దలుకాగా అందుండి రక్తసిక్తములైన ముత్యములు నేలపై రాలెను. అప్పుడు భూమి సంధ్యాకాలమునందలి కాంతులచే ఎఱ్ఱబాఱిన నక్షత్రములతో గూడియున్న ఆకాశమును బోలియుండెను. పిదప ఏనుగు నిలువజాలక మ్రొగ్గి, ముందఱికి వంగియు, త్రిప్పుకొని తటాలున లేచెను. అనంతరము అది అటునిటు చూచి, నిలద్రొక్కుకొని, ఎట్టకేలకు ముందుకు నడచెను. అనంతరము అది ప్రళయకాలమునందు సముద్రములలో ఏర్పడిన ఎత్తైన అలలయొక్క తాకిడికి గుఱియైన కులపర్వతమువలె విచ్చేసెను. ఇంతలో ఆజానుబాహువైన ఆ మహాత్ముడు తన భుజాదండముతో దానిని తీవ్రముగా కొట్టెను. అంతట అది ఱెట్టించిన కోపముతో విజృంభించి, తన బలమైన దంతములతో ఆయనను చిమ్మివేసెను. అప్పుడు ఆ పరాక్రమశాలి తన చేతితో గుఱిపెట్టి, తొండముతో పెనగులాడి, ఆ ఏనుగు బడలిపోవునట్లు (అలసిపోవునట్లు) దానిపై దెబ్బతీసెను.

అప్పుడు ఆ మదపుటేనుగు ఈశ్వరునియొక్క మొక్కవోని (తిరుగులేని) పదునైన బాణముచే ఛిన్నాభిన్నమైన త్రిపురాసురుల పట్టణమువలెను, సముద్రమునందు తీవ్రమైన జడివాన ధాటికి దెబ్బతినిన పడవరీతిగను, దుర్బలమై, స్పృహతప్పిపడిపోయెను.

అంతట అది లోభిహస్తమువలె దానజలధారలు లేనిదై ఒప్పుచుండెను. (మదజల ధారలు లేనిది ఏనుగు, ఇతరులకు దానములు చేయనట్టిది లోభిహస్తము) ఇంకను అది విరహబాధకు లోనైనవానియొక్క మనస్సువలె నిరంతరము చిత్తజాతజనక విగ్రహమై విలసిల్లెను. (చిత్తజాతుడు = మన్మథుడు, అతని జనకుడు శ్రీహరి (కృష్ణుడు) అతని చేతిలో భంగపడినది ఏనుగు - మన్మథ తాపమునకు లోనై పరితపించుచున్నది విరహిమనస్సు) మఱియు అది గ్రహణకాలమువలె పరాధీనఖరకరంబై ఒప్పుచుండెను. (శ్రీకృష్ణునకు అధీనమై, బలమైన తొండముగలది ఏనుగు. ఖరకరుడు = సూర్యుడు గ్రహణకాలమున అతడు రాహువు చేతిలో చిక్కియుండును). ఇంకను అది సూర్యోదయమువలె భిన్నపుష్కరమై విలసిల్లుచుండెను. (పుష్కరము = కమలము, భిన్నము = వికసించినది, కమలములను వికసింపజేసినది సూర్యోదయము, పుష్కరము = ఏనుగు తొండముయొక్క చివరిభాగము, భిన్నము = చీల్చబడినది. కృష్ణునిచేతిలో చీల్చబడిన తొండముగలది ఏనుగు.) మఱియు ఆ ఏనుగు చంద్రోదయమువలె అభాసిత పద్మకమై అలరారుచుండెను. (పుష్కరము = పద్మము, పుష్కరవైరి = చంద్రుడు, పుష్కరవైరి విలసనము = చంద్రోదయము. చంద్రోదయము ఐనంతనే పద్మములు ముడుచుకొని పోయి కాంతిహీనములు అగును. పద్మకము = ఏనుగు ముఖమునందుగల బొట్ల సమూహము, శ్రీకృష్ణునిచే చిన్నాభిన్నమైన ఏనుగు ముఖమునందలి బొట్లు కాంతిహీనములు అయ్యెను.)

ఉ. కాలం ద్రొక్కి సలీలుఁడై నగవుతోఁ గంఠీరవేంద్రాకృతిం
గేలన్ భీషణదంతముల్ వెఱికి సంక్షీణంబుగా మొత్తి గో
పాలగ్రామణి వీరమౌళిమణియై ప్రాణంబులం బాపె నా
శైలేంద్రాభముఁ బ్రాణలోభము నుదంచత్స్వార గంధేభమున్. 1319

వ. మఱియు, దంతి దంతతాడనంబుల దంతావళ పాలకులం గాలుఁబ్రోలికనిపి తత్ప్రదేశంబు పాసి. 1320

అంతట సింహమువలె భయంకరరూపుడైన, ఆ గోపాలశ్రేష్ఠుడు మహాపర్వతముతో సమానమై, మిగుల శక్తివంతమై ప్రాణములను దక్కించుకొనుటకై పోరాడుచున్న ఆ మదపుటేనుగును కాలితో త్రొక్కిపట్టి, దరహాసము సేయుచు అవలీలగా దానిభీకరదంతములను ఊడబెఱికెను. వెంటనే ఆ స్వామి దానిబలమంతయు క్షీణించునట్లుగా (అది తిరిగి లేవకుండునట్లుగా) దెబ్బతీసి, దానిప్రాణములను హరించి, మహావీరులకును తలమానికమై విరాజిల్లెను. ఇంకను ఆ ప్రభువు ఆ ఏనుగు దంతములతోడనే మావటివాండ్రను చావగొట్టి, వారిని మృత్యుముఖమున చేర్చెను, పిదప ఆ ప్రదేశమును వీడెను.

మ. కరిదంతంబులు మూఁపులందు మెఱయన్ ఘర్మాంబువుల్ మోములన్
నెరయం గోపకులంతనంత మలయన్ నిత్యాహవస్థేములా
హరిరాముల్ సనుదెంచి కాంచిరి మహోగ్రాడంబరాపూరితా
మరమర్త్యాది జనాంతరంగము లసన్మల్లావనీరంగమున్. 1321

తిరుగులేని యుద్ధములలో రాటుదేలియున్న బలరామకృష్ణులు ఏనుగుదంతములను బుజములపై దాల్చి, ముఖములు చెమర్చియుండగా, గోపాలురు అందఱును తమను అనుసరించి, వచ్చుచుండగా ముందునకు సాగుచు బాగుగా అలంకృతమైయున్న మల్లయుద్ధభూమిని గాంచిరి. అప్పుడు అది మల్లురయొక్క ఉగ్రస్వరూపములతోడను, వారిఆర్భాటములతోడను ఒప్పుచు దేవతలు, మానవులు మున్నగువారియొక్క మనస్సులను కలవరపఱచుచుండెను.

సీ. మహిత రౌద్రంబున మల్లురకశనియై నరులకద్భుతముగ నాథుఁడగుచు
శృంగారమునఁ బురస్త్రీలకుఁ గాముఁడై నిజమృత్యువై కంసునికి భయముగ
మూఢులు బీభత్సమును బొంద వికటుఁడై తండ్రికి దయరాఁగఁ దనయుఁడగుచు
ఖలులకు విరసంబుగా దండియై గోపకులకు హాస్యంబుగాఁ గులజుఁడగుచు
ఆ. బాంధవులకుఁ బ్రేమ భాసిల్ల వేలుపై శాంతమొనర యోగిజనులకెల్లఁ
బరమతత్త్వమగుచు భాసిల్లె బలునితో మాధవుండు రంగమధ్యమందు. 1322

మల్లరంగమునందు బలరామసహితుడైయున్న శ్రీకృష్ణుడు మిగుల రౌద్రాకారముతో మల్లురకు పిడుగువలె భీకరముగా తోచుచుండెను. సామాన్యజనులకు ఒక మహారాజువలె అద్భుతముగా కన్పట్టుచుండెను. పురస్త్రీలకు నవమన్మథునివలె శృంగారపురుషుడై భాసిల్లుచుండెను. కంసునకు మృత్యుదేవతవలె భయానకముగా గోచరించుచుండెను. విరాట్పురుషునివలె మూర్ఖులను కలవరపఱచుచుండెను. తల్లిదండ్రులలో వాత్సల్యభావమును నింపుచుండెను. దుర్మార్గులకు యమునివలె భంగపాటును గల్గించుచుండెను. గోపవంశజుడగుటచే తోడివారికి ఆనందమును గూర్చుచుండెను. బాంధవులపాలిటి దైవమై వారిలో ప్రేమభావమును నింపుచుండెను. శాంతస్వరూపుడై యోగీశ్వరులకు పరతత్త్వముగా భాసిల్లుచుండెను.(1)

---

1. ఇచట పోతనమహాకవి మూలమునకు మెఱుగులను గూర్చుచు అద్భుతముగా తీర్చిదిద్దిన మధురపద్యమిది -

శ్లో॥ మల్లానామ్ అశనిః, నృణాం నరవరః, స్త్రీణాం స్మరో మూర్తిమాన్;
గోపానాం స్వజనో,ఽసతాం క్షితిభుజాం శాస్తా, స్వపిత్రోః శిశుః,
మృత్యుర్భోజపతేః, విరాడవిదుషాం, తత్త్వం పరం యోగినామ్,
వృష్ణీనాం పరదేవతేతి, విదితోఽరంగం గతః సాగ్రజః ॥ 43వ అధ్యాయం, 17వ శ్లోకము.

మల్లయుద్ధరంగమున అడుగిడిన శ్రీకృష్ణప్రభువు మల్లురకు పిడుగుగను, జనులకు ప్రభువుగను, స్త్రీలకు మూర్తీభవించిన మన్మథునిగాను, గోపాలురకు ఆత్మీయుడుగను, కుటిలురైన రాజులకు నియంతగను, తల్లిదండ్రులకు సుతునిగను, కంసునకు మృత్యువుగను, అజ్ఞానులకు (మూర్ఖులకు) విరాట్పురుషునిగను, యోగులకు పరతత్త్వముగను, వృష్ణివంశజులకు పరదేవతవలెను గోచరించెను.

వ. అప్పుడు. 1323

క. చచ్చిన కుంభీంద్రంబును, వచ్చిన బలమాధవులను వరుసం గని తా
నొచ్చిన చిత్తముతోడుతఁ, జెచ్చెరఁ గడు వెఱచె భోజసింహుండధిపా! 1324

మహారాజా! ఆ సమయమున మృత్యువుపాలైన తన కువలయాపీడమును (మదపుటేనుగును) విజేతలై మల్లయుద్ధరంగమున ప్రవేశించిన బలరామకృష్ణులను గాంచి ఆ కంసరాజు ఎంతయు కలతచెందెను. అంతేగాక అతని గుండెనిండ భయము ఆవరించెను.

ఉ. ధీరుల వస్త్రమాల్యమణిదీప్త విభూషణ ధారులన్ మహా
కారుల సర్వలోక శుభకారుల మానవ మానినీమనో
హారుల రంగభూతల విహారుల గోపకుమారులన్ మహా
వీరులఁ జూచి చూచి తనివిం దుదిముట్టక లోకులందఱున్. 1325

మహాధీరులైన బలరామకృష్ణులు వస్త్రములతో, పూలమాలలతో, మణులు పొదిగిన ఆభరణములతో చక్కగా విరాజిల్లుచుండిరి. వారి ఆకారములు దివ్యములు, వారు సకలలోకములకును శుభములను ప్రసాదించునట్టి మహానుభావులు, మానవకాంతలయొక్క మనస్సులను దోచుకొనిన మహితాత్ములు, మల్లరంగమునందు నిర్భయముగా విహరించుచున్న నిరుపమానవీరులు. అట్టి గోపకుమారులను ఎంతగా దర్శించుచున్నను అచటివారికి తనివిదీరకుండెను.

ఉ. సన్నుత రామకృష్ణ ముఖచంద్ర మయూఖ సుధారసంబులం
గన్నులఁ ద్రావుచందమునఁ గాంచుచు జిహ్వలనంటి చూచు లీ
లన్నుతిసేయుచుం గరములం బరిరంభము సేయుభంగి న
త్యున్నతిఁ జూపుచుం దగిలి యొండొరుతోడ రహస్యభాషలన్. 1326

మధురలో ప్రవేశించినది మొదలుకొని విజయపరంపరతో (దుష్టులను హతమార్చుచు) ముందడుగు వేయుచున్న బలరామకృష్ణులను అక్కడనున్న జనులు వేనోళ్ల ప్రశంసించుచుండిరి. ఇంకను వారు ఆ దివ్యపురుషుల ముఖమనెడి చంద్రునియొక్క కిరణములనుండి జాలువారుచున్న అమృతమును కన్నులతో గ్రోలుచున్న రీతిగా ఱెప్పవాల్చక చూచుచుండిరి. వారిని నాలుకలతో చవిచూచుచున్నట్లుగా మధుర భావములతో నుతిసేయుచుండిరి. చేతులతో కౌగిలించుచున్నట్లు పరమానందమును అనుభవించుచుండిరి. ఇంకను వారు ఆ మహాత్ములను గూర్చి తమలో తాము ఇట్లనుకొనుచుండిరి.

క. వసుదేవునివాసంబున, వసుధన్ రక్షింప వీరు వైష్ణవతేజో
లసనమునఁ బుట్టినారఁట, పసిబిడ్డలనంగఁ జనదు పరదేవతలన్. 1327

"ఈ పరమపురుషులు లోకములను రక్షించుటకై దివ్యమైన విష్ణుతేజస్సుతో వసుదేవుని ఇంట అవతరించినారట. యథార్థముగా పరదేవతలైన వీరిని పసిబిడ్డలనుట ఏమాత్రమూ తగదు.

---

సామాన్యజనులకు అద్భుత ప్రభువు, స్త్రీలకు శృంగారమూర్తి, కంసునకు నిజ మృత్యువు, తండ్రికి అనురాగ తనయుడు, ఖలులకు విరసంబుగా దండియై బాంధవులకు ప్రేమభాసిల్ల దేవతయై, మున్నగురీతిలో సహజ పండితుని గంటమున విశిష్టముగా జాలువాఱినది ఇచటి రచన – ఈ మహాకవి పదములకు విశిష్టతను, రసములకు పుష్టిని చేకూర్చినాడు. మూలమున ప్రత్యేకముగా శృంగారాది రసముల ప్రస్తావనలేదు. ఇందలి రౌద్రము, అద్భుతము, శృంగారము, బీభత్సము, హాస్యము, శాంతము మున్నగు పదముల ప్రయోగములతో సందర్భమునకు పరిపుష్టిని, సహృదయ పాఠకులకు సంతుష్టిని గూర్చుచున్నది. ఈ విధముగా శృంగారాది నవరసప్రస్తావన జరుగుట నిజముగా ఆనందదాయకము. బమ్మెరపోతన మహాకవి సహజపండితుడు గదా!

సీ. చంపె రక్కసిఁ బట్టి చక్రవాకునిఁ గూల్చెఁ బడఁద్రొబ్బె మద్దుల బకునిఁ జీరె
నఘదైత్యుఁ బొరిగొనె నడరి వత్సకుఁ ద్రుంచె గిరియెత్తె దేవేంద్రుఁ గ్రిందుపఱిచెఁ
గాళియు మర్దించె గహనానలముఁ ద్రావెఁ గేశినంతకు పురి క్రేవకనిచె
మయుపుత్త్రుఁ బరిమార్చె మఱియును దానవభటుల మర్దించి గోపకులఁ గాచె
తే. గోపకాంతలమనములఁ గోర్కిఁ దీర్చె నీ సరోరుహలోచనుండీ శుభాంగుఁ
డీ మహామహుఁడీ దిగ్గజేంద్ర నిభుఁడు మనుజమాత్రుఁడె తలపోయ మాధవుండు. 1328

దివ్యతేజోమూర్తియైన ఈ శ్రీకృష్ణుడు రక్కసియైన పూతనను చంపెను. తృణావర్తుని పరిమార్చెను. మద్దిచెట్లను నేలగూల్చి నలకూబర, మణిగ్రీవులకు శాపవిముక్తిని ప్రసాదించెను. బకాసురుని చెండాడెను. అఘాసురుని మసిజేసెను. వత్సాసురుని హతమార్చెను. గోవర్ధనగిరిని ఎత్తి గోవులను, గోపాలకులను కాపాడి, ఇంద్రునిగర్వమణచెను. కాళియసర్పమును మర్దించెను. దావానలమునుమ్రింగి, గోపాలురను రక్షించెను. కేశి రాక్షసుని అంతమొందించెను. మయునికుమారుడైన వ్యోమాసురుని అంతరింపజేసెను. ఇంకను పెక్కుమంది దానవులను సంహరించి గోకులమును ఆదుకొనెను. మఱియు స్ఫురద్రూపియైన ఈ కమలనయనుడు గోపికలమనోరథములను ఈడేర్చి, వారిని రంజింపచేసెను. దిగ్గజేంద్రమువలె మహోన్నతుడైన ఈ ప్రభువును మానవమాత్రునిగా తలపోయరాదు.

## శ్రీకృష్ణబలరాములు చాణూరముష్టికులను వధించుట

వ. అని పలుకుచు, బౌరజనులు సూచుచుండ రామకృష్ణులకుఁ జాణూరుండిట్లనియె, 1329

ఈవిధముగా పౌరులు పరస్పరము సంభాషించుకొనుచు చూచుచుండగా 'చాణూరుడు' అను మల్లుడు రామకృష్ణులతో ఇట్లనెను.

మ. వనమార్గంబున గోపబాలకులతో వత్సంబులన్ మేపుచున్
బెనఁగన్ మిక్కిలి నేర్చినారనుచు నీ పృథ్వీజనుల్ సెప్ప మా
మనుజేంద్రుండిట మిమ్ముఁ జీరఁ బనిచెన్ మల్లాహవక్రీడకుం
జనదే కొంత పరాక్రమింప మనకున్ సభ్యుల్ విలోకింపఁగన్. 1330

"గోపాలకులారా! గొల్లపిల్లలతో గూడి అడవులలో ఆవుదూడలను మేపుచు మీరు కుస్తీపట్లు బాగుగా నేర్చుకొన్నట్లు ఈ ప్రజలు చెప్పగా విని, మా కంసమహారాజు మిమ్ములను మల్లయుద్ధక్రీడకై ఇచటికి పిలిపించెను. ఇచట ఉన్నవారు అందఱును చూచుచుండగా శక్తిసామర్థ్యములను ప్రదర్శించుచు మనము కొంతతడవు మల్లయుద్ధమును చేసినచో బాగుండునుగదా!

మ. జవసత్త్వంబులు మేలె సాము గలదే సత్రాణమే మేను భూ
ప్రవరుం బోసనమిమ్మనంగవలెనే పాళీలభీష్టంబులే
పవివో కాక కృతాంత దండకమవో ఫాలాక్షునేత్రాగ్నివో
నవనీతంబులముద్ద గాదు మెసఁగన్ నాముష్టి గోపార్భకా! 1331

యాదవబాలుడా! (కృష్ణా!) నీకు తగినంతగా తేజోబలములు (శక్తిసామర్థ్యములు) గలవా? సాము నేర్చితివా? ఒంటిలో (ఒంట్లో) ఓపిక ఉన్నదా? పాలు తెప్పింపుమని మహారాజును అడుగవలెనా? పాళీలు (లోడీలు) ఇష్టమేనా? (పాళీ = మల్లయోధులు సాధన చేయుటకై త్రిప్పెడి పరికరము) (పందెములు పెట్టి కుస్తీపట్టుట నీకు సమ్మతమేనా?) నీవు

వజ్రాయుధతుల్యుడవా? యమునిదండము వంటివాడవా? ముక్కంటినేత్రాగ్నివా? లేనిచో నా పిడికిలి పోటునకు నిలువజాలవు సుమా! తినుటకు నా ముష్టిఘాతము వెన్నముద్దగాదు.

క. జనములు నేర్చిన విద్యలు, జననాథునికొఱకుఁ గాదె జననాథుఁడు నీ
జనములు మెచ్చఁగ యుద్ధం, బున మనముం గొంత ప్రొద్దు పుత్తమె కృష్ణా! 1332

కృష్ణా! ప్రజలు నేర్చిన విద్యలన్నియును ప్రభువులముందు ప్రదర్శించి, వారిని మెప్పించుటకొఱకే గదా! కంసమహారాజు, ఈ జనులు మెచ్చుకొనునట్లుగా మనము కొంతసేపు మల్లయుద్ధమును చేయుదము".

వ. అనిన విని, హరి యిట్లనియె. 1333

ఉ. సాములు లేవు పిన్నలము సత్త్వము గల్దనరాదు మల్లసం
గ్రామ విశారదుల్ కులిశకర్కశదేహులు మీరు మీకడ
న్నేము చరించు టెట్లు ధరణీపతి వేడ్కలు సేయువారముం
గాము వినోదముల్ సలుపఁ గాదనవచ్చునె యొక్కమాటికిన్ 1334

చాణూరుడు ఇట్లు నుడివిన పిమ్మట శ్రీహరి (కృష్ణుడు) ఇట్లు పలికెను – "చాణూరా! మేము సాముగరిడీలను నేర్వలేదు. పసిపిల్లలము. మాకు గట్టిబలము కలదని చెప్పుటకును వీలులేదు. ఇక మీరు మాత్రము మల్లయుద్ధములో ఆరితేరినవారు. మీ దేహములు వజ్రాయుధమువలె బలిష్ఠములు (మిగుల దృఢమైనవి) మల్లయుద్ధములో పాల్గొనుటకు మీముందు మేము ఎంతవారము? రాజుగారి వేడ్కలనుతీర్చగల వారమూ కాము. కానీ! వినోదము కొఱకు మల్లయుద్ధమునకు పిలిచినచో ఎప్పుడైనను కాదనరాదుగదా!

క. నీతోడుత నేఁ బెనఁగెదఁ, బ్రీతిన్ ముష్టికునితోడఁ బెనఁగెడి బలుఁ డు
గ్రాతత మల్లాహవమున, భూతలనాథునికి మెచ్చుఁ బుట్టింతు సభన్. 1335

ఈ సభలో నీతో నేను పోటీకి దిగెదను. ముష్టికునితో మా అన్నయగు బలరాముడు తలపడును. నిర్విరామముగా తీవ్రముగా జరిగెడి మల్లయుద్ధమున మహారాజునకు మెప్పును గూర్చెదను".

వ. అనిన విని, చాణూరుండిట్లనియె. 1336

శా. నాతోఁ బోరఁగ నెంతవాఁడవిసిరో నా సాటియే నీవు వి
ఖ్యాతుండంగులజుండ సద్గుణుఁడ సత్కర్మ స్వభావుండ నీ
కేతాదృ గ్విభవంబులెల్లఁ గలవే యీ వీటఁ బోరాడుటల్
ప్రేతల్ సూడఁగఁ గుప్పిగంతులిడుటే వీక్షింపు గోపార్భకా! 1337

శ్రీకృష్ణుని మాటలను వినిన పిదప చాణూరుడు ఇట్లు నుడివెను– "గొల్లపిల్లవాడా? చాలు చాలు. నాతో పోరాడుటకు నీవెంత? నీ బలమెంత? నీవు నాతో ఎన్నటికిని సమానుడవు కాజాలవు. నేను మల్లయుద్ధమున మిగుల ఖ్యాతికెక్కినవాడను. ఉత్తమవంశమున పుట్టినవాడను. మంచిగుణములుగలవాడను. మంచి పనులను చేయుచుండుట నా లక్షణము. నీలో ఈ గొప్ప లక్షణములు అన్నియును కలవా? ఈ మధురలో మల్లయుద్ధమొనర్చుట గోపికలముందు కుప్పిగంతులు వేయుట కాదు సుమా! ముందువెనుకలు ఆలోచించుకొనుము.

శా. స్థాణున్ మెచ్చఁడు బ్రహ్మఁ గైకొనఁడు విష్వక్సేను నవ్వున్ జగ
త్ప్రాణున్ రమ్మనఁడీడుగాఁడని మహా బాహాబల ప్రౌఢి న
క్షీణుండాజికి నెల్లి నేఁడనఁడు వైచిత్రిన్ వినోదించు ని
చ్చాణూరుండొక గోపబాలుపనికిన్ శక్తుండు గాకుండునే. 1338

ఈ చాణూరుడు యుద్ధకౌశలమున పరమశివుని సైతము మెచ్చుకొనడు. బ్రహ్మను ఏమాత్రమూ పరిగణింపడు. విష్ణువును గేలిసేయును. సకల లోకములకును ఊపిరియైన వాయుదేవుడు రణరంగమున తనతో సమానుడు కాడని అతనిని పోరునకు పిలువడు. గొప్ప బాహుబలముయొక్క దిట్టతనమునందు తిరుగులేనివాడు. యుద్ధమునకు ఎంతటివారితోనైనను ఎల్లప్పుడును సిద్ధముగా ఉండును. చిత్ర విచిత్రముగా యుద్ధము చేయుట అనిన ఇతనికి వినోదక్రీడ. ఇట్టి మహావీరుడనైన నేను ఒక బాలునకు బుద్ధిచెప్పలేనా?

క. ప్రల్లదమేటికి గోపక, బల్లిదుఁడను లోకమందుఁ బ్రఖ్యాతుఁడ నా
చల్లడముక్రిందఁ దూఱని, మల్లురు లేరెందు ధరణి మండలమందున్. 1339

ఓ పసులకాపరీ! ప్రగల్భాలతో పనియేమి? నేను ఎంతయు బలవంతుడను. మల్లయుద్ధమునందు జగత్ప్రసిద్ధుడను. ఈ భూమండలమునగల మల్లురలో నాచేతిలో ఓడిపోయి, నా కాలి (దట్టీ) క్రింద దూఱిపోనివాడే లేడు. (ఇంత ఎందులకు నీవును నా ముందు నిలువజాలవు గాన ఓటమిని అంగీకరింపుము.)

సీ. చలమున నను డాసి జలరాశిఁ జొరరాదు నిగిడి గోత్రముదండ నిలువరాదు
కేడించి కుంభిని క్రిందికిఁ బోరాదు మనుజసింహుండనని మలయరాదు
చేరినఁ బడవైతుఁ జెయి సాఁపగారాదు బెరసి నాముందటఁ బెరుఁగరాదు
భూనాథహింసకుఁ బోరాదు నను మీఱి శోధింతుఁ గానలఁ జొరఁగరాదు
ఆ. ప్రబలమూర్తిననుచు భాసిల్లఁగారాదు ధరఁ బ్రబుద్ధుఁడనని తలంపరాదు
కల్కితనము చూపి గర్వింపఁగా రాదు తరముగాదు కృష్ణ! తలఁగు తలఁగు. 1340

కృష్ణా! పట్టుదలకుపోయి, నాతో పోటీకి దిగినచో సముద్రములో తలదాచుకొనుటకును నీకు అవకాశము ఉండదు. (మత్స్యావతారమును గుర్తుచేయుచు గేలిసేయుట) గర్వించి నన్ను ఎదిరించినచో పర్వతము క్రిందగూడ నీకు రక్షణ ఉండదు. (కూర్మావతారము) ఇటనుండి తొలగిపోనిచో నీవు భూమిక్రింద గూడ దాగికొనలేవు. (వరాహావతారము) 'నేను నరసింహుడను' (పురుషోత్తముడను) అని తలపోయుచు ఇక నా ముందు తిరుగజాలవు (నరసింహావతారము). నీవు నా యెదుట చేయి ఎత్తరాదు (చేయిచాపరాదు) అంతేగాదు ఇష్టము వచ్చినట్లుగా నీవు పెచ్చుపెఱగరాదు. అట్లు చేసినచో నీవు బిచ్చము ఎత్తుకొనుటకు గాని, నీ త్రివిక్రమస్ఫూర్తికిగాని చోటే ఉండదు. నన్ను మీఱి (మా కంసమహారాజు వంటి) రాజులను (రాజప్రతినిధినైన నన్నును) హింసించుటకు ఆలోచననే  చేయరాదు. అట్లు చేసినచో నీకు భంగపాటు తప్పదు. (పరశురామావతారము) నన్ను తప్పించుకొని, వనములలో రక్షణ పొందవచ్చునని నీవు తలంతువేమో. అదియును వృథా. అక్కడగూడ శోధించి నేను నిన్ను వెంటాడుదును. (రామావతారము). ప్రబలమైన విగ్రహము (శరీరము) కలవాడనని విఱ్ఱవీగవలదు. నా ఎదుట అది పనిచేయదు (బలరామావతారము). ఈ భూతలమున నేను గొప్పజ్ఞానిని' అని భావింపకుము. అట్లౌనర్చుట కొఱగాని పనే అగును (బుద్ధావతారము). 'తెలివితేటలుగలవాడను' అని తలంచుచు గర్వపడకుము. నా కడ వాటికి శక్తిచాలదు (కల్కి అవతారము). ఇప్పుడు నీవు ఏ వేషమును వేసికొని వచ్చినను నీకు నన్ను ఎదిరింప తరముకాదు. కనుక నీవు దూరముగా తొలగిపొమ్ము.

వ. అదిగాక నీవు శ్రీహరినంటేని. 1341

సీ. మహిమతోనుండంగ మధురాపురము గాని పొలుపార వైకుంఠపురము గాదు
గర్వంబుతోనుండ ( గంసునిసభ గాని సంసారరహితులసభయుఁ గాదు
ప్రకటించి వినఁగ నా బాహునాదము గాని నారదువీణాస్వనంబు గాదు
చదురులాడఁగ మల్లజనవిగ్రహముగాని రమతోడి ప్రణయవిగ్రహము గాదు
తే. వెలసి తిరుగంగ వేదాంతవీథి గాదు మొఱఁగి పో మునిమనములమూల గాదు
సాఁగి నడవంగ భక్తులజాడ గాదు శౌరి! నామ్రోల నీవెందుఁ జనియెదింక. 1342

అట్లు చేయక 'నేను శ్రీహరిని' అని నీవు ధీమాకు పోయినచో, మహిమలను చూపుచు కాలము గడపుటకు ఇది వైకుంఠపురముగాదు. మధురాపురము సుమా! గర్వముతో మిడిసిపడుటకు ఇది సన్న్యాసులసమావేశముగాదు. కంసుని సభ. హాయిగా వినుచు మసలుకొనుటకు ఇది నారదునివీణానాదముగాదు. నా భుజాస్ఫాలన ధ్వని. సరసములాడుటకు లక్ష్మీదేవితో ప్రణయకలహము సలుపుట కానేకాదు. ఇది మల్లయోధులతో యుద్ధమొనర్చుట. ఇది స్వేచ్ఛగా తిరుగుటకు వేదాంతవీధిగాదు. దాగికొనుటకు ఇది మునీశ్వరుల హృదయముగాదు. ముందునకు సాగిపోవుటకు ఇది భక్తులమార్గము కానేకాదు. కృష్ణా! ఇంక నానుండి తప్పించుకొని నీవు ఎచ్చటికి పోగలవు?"

వ. అని పలికి. 1343

సీ. రోషాగ్ని ధూమప్రరోహంబుకైవడి శిరమున సన్నపుశిఖ వెలుంగ
నాశామదేభేంద్ర హస్తసన్నిభములై బాహుదండంబులు భయదములుగ
లయసమయాంతకోల్లసిత దంష్ట్రలభంగిఁ జాఁగిన కోఱమీసములు మెఱయ
నల్లని తెగగల నడగొండచాడ్పున నాభీల నీలదేహంబు మెఱయ
ఆ. జరణహతుల ధరణి సంచలింపఁగ నభో మండలంబు నిండ మల్ల సఱచి
శౌరిదెసకు నడచెఁ జాణూరమల్లుండు పౌరలోక హృదయభల్లుఁ డగుచు. 1344

ఇట్లు పలికిన పిమ్మట ఆ చాణూరుడు పౌరులగుండెలు అవియునట్లుగా శ్రీకృష్ణునిమీది విజృంభించెను. అప్పుడు అతనిశిరమునగల సన్నని శిఖ (జుట్టు) రోషాగ్నినుండి వెల్లుబుకుచున్న పొగలవలె ఒప్పుచుండెను. భయంకరములైన అతనిబాహుదండములు దిగ్గజేంద్రములయొక్క తొండములవలె విలసిల్లుచుండెను. మెఱయుచున్న అతని కోఱమీసములు ప్రళయకాలమునందలి యమునియొక్క పదునైన కోఱలవలె అలరారుచుండెను. భీతిని గొలుపునట్టి అతనియొక్క నల్లని దేహము ఎత్తై నడచుచున్న కాటుక కొండవలె భాసిల్లుచుండెను. అతనిపాదములతాకిడికి భూమి దద్దరిల్లుచుండెను. అతనిభుజాస్ఫాలనధ్వని అంతరిక్షమునందు అంతటను మాఱుమ్రోగుచుండెను.

వ. ఇట్టగ్గలంబగు నగ్గలిక డగ్గఱిన మల్లునిం గని, మెల్లన మొల్లంబగు బీరంబు వెల్లి గొన, వల్లవ వల్లభుండుల్లసిల్లి బాహునాదంబున రోదోంతరాళంబు పూరించి, మించి, కవిసె. ఇట్లిద్దఱు నుద్దవిడి నున్నతవిషమంబులగు తాణలిడి, కరి కరియును, హరి హరియును, గిరి గిరియునుం దాఁకువీఁకం దలపడి, యితరేతర హేతిహింసితంబులగు దవానలంబులతెఱంగునఁ బరస్పర దీర్ఘనిర్ఘాత ఘట్టితంబులగు మహాభ్రంబుల విభ్రమంబున, నన్యోన్య తుంగ తరంగతాడితంబులగు కల్పాంతకాల సముద్రంబులరౌద్రంబున, నొండొరుల ముష్టిఘట్టనంబుల ఘట్టితశరీరులై, దద్దరిలక, డగ్గఱి, గ్రద్దన నయ్యిద్దఱుం దిరుగునెడ, హరి సొచ్చి, పేర్చి, యార్చి, జెట్టింబట్టి, పడందిగిచి, పాదంబుల జాడించి సముల్లాసంబున నెసకంబునకు వచ్చిన, మెచ్చి, నొచ్చి,

యచ్చపలుండు మీఁటి, మోర సారించి, తెరలక, పొరలం(దొబ్బిన, నబ్బలానుజుండుబ్బి, గొబ్బున మేను వర్ధిల్ల, నర్ధాంగకంబుననుండి, జానువుల నొత్తుచు, నురవడిం గరవడంబున నున్న, నా దుర్నయుండును బాల! మేలు మేలని, లీలం గాలు సారనిచ్చి, త్రోచినంజూచి, యేచి ఖేచరులగ్గించి యుగ్గడింప, న గ్గోపకుమారుండు, పాటవంబున రాటవంబునకుం జని, వెన్నెక్కి, నిక్కిన, నక్కంసభటుండు, మదజలలేఖాబంధురంబగు గంధసింధురంబుచందంబునఁ బదంబును బదంబునం, గరంబును గరంబునం గ్రహించి సహించి వహించి, నైపుణంబున లోపలం దిరిగి, యట్టిట్టు దట్టించిన, దిట్టతనంబునం దిటవు దప్పక, యప్పద్మలోచనుండు కేడించి యేచి సమరతలంబున నైచి ప్రచండంబగు వానిపిచండంబు వాఁగించి కాలం గాలు గీలించి డొక్కరంబు గొనిన నయ్యభ్యాసి సభ్యులు సన్ను తింపం గ్రమ్మతించి జడ్డనం గా లడ్డగించి రక్షించుకొనిన నా రక్షోవైరి వానికటిచేలంబు పట్టి యెత్తి యొత్తి నడుమ రాగెయిడి సందువెట్టి నవ్విన నవ్విరోధి కాలు కాలితో నిడి వేధించిన నిరోధించిన నిరోధంబుఁ బాసి తిరిగి వసుదేవుపట్టి పట్టిసంబు గొని దట్టించిన నుబ్బరిక చేసి చాణూరుండు హరికరంబు వట్టి హుమ్మని నెమ్మొగంబునం గాలిడి మీఁదైనం గేళిబాలకుండు కాలిం గాల నివారించి మీఁదై నెగడి యుండనీక దుర్వార బలంబున విదలించి లేచి గృహీత పరిపంథిచరణుండై, విపక్షునివక్షంబు వజ్రివజ్రసన్నిభంబగు పిడికిటం బొడిచిన వాఁడు వాఁడి చెడక విజృంభించి యంభోరాశి మధ్యంబునం దిరుగు శైలంబుపోలిక, నేల జిఱజిఱం దిరిగి తన్నిన వెన్నుండు కుప్పించి యుప్పరం బెగసి మీఁద నుఱికిన నతండు, కృష్ణపాదసంధిపరిక్షిప్తపాదుండై, యెగసి, లేచి సముద్ధతుండయ్యె. నయ్యెడ,

1345

ఇట్లు మిక్కిలి ఉత్సాహముతో తన సమీపమునకు వచ్చుచున్న చాణూరుని శ్రీకృష్ణుడు గాంచెను. వెంటనే ఆ ప్రభువు తిరుగులేని తనపరాక్రమము ప్రకటితమగునట్లుగా ఒప్పుచు భూమ్యాకాశములమధ్య ప్రదేశమునందు అంతటను ప్రతిధ్వనించునట్లు భుజాస్ఫాలనముగావించి, అతనిమీదికి విజృంభించెను. ఈ విధముగా ఇద్దఱును మిక్కిలి పరాక్రమము చూపుచు మిట్టపల్లములతో ఉన్న ప్రదేశములయందు నిలిచి, కృష్ణుడును, చాణూరుడును రెండు ఏనుగులవలెను, రెండు సింహములరీతిగను, రెండు కొండలవలెను ఢీకొనుచు పోరు సల్పుచుండిరి. వారు రెండు కార్చిచ్చులు తమ తమ మంటలచే పరస్పరము హింసించుకొనుచున్నట్లుగను, రెండు మహామేఘములు ఒకదానిపై నొకటి పిడుగులు రాల్చుకొనుచున్నట్లుగను, రెండు సముద్రములు ప్రళయకాలమునందు ఉవ్వెత్తు తరంగములతో అన్యోన్యము కొట్టుకొనుచున్నట్లుగను వీరావేశములతో ముష్టిఘాతములతో పోరు సల్పుచుండిరి. వారు దృఢమైన శరీరములుగలవారగుటచే భయపడక, చేరువయై ఎత్తుగడలతో మల్లయుద్ధరంగమున అంతటను తిరుగసాగిరి.

అంతట శ్రీకృష్ణుడు ముందునకు దూసికొనివచ్చి, హుంకరించుచు ఆ మల్లుని పట్టుకొని, పడునట్లుగా లాగెను. పిదప ఆ ప్రభువు పాదములను జాడించుచు, ఉత్సాహముతో విజృంభించుచు రాగా అందులకు చాణూరుడు మెచ్చుకొనెను. ఆ స్వామి ధాటికి నొచ్చుకొనియు, అతడు వెనుదిరగక, తన ముఖమును పైకెత్తి ఆ గోపాలుడు క్రిందపడునట్లుగా నెట్టెను. వెంటనే శ్రీకృష్ణుడు పైకి లేచి, క్షణములో శరీరమును పెంచి అర్ధాంగమునమండి (మోకాళ్లపై కూర్చొని) వానిని తన మోకాళ్లతో నొక్కుచు వేగముగా 'గరవడము' (అను మల్లబంధములో నుండెను. అంతట నీతిమాలిన ఆ చాణూరుడు 'బాలుడా! మేలు మేలు' అనుచు క్షణములో ఒడుపుచూపి ఆయన కాళ్లమధ్య తన కాలిని జొనిపి కృష్ణుని పడద్రోసెను. అప్పుడు గోపాలశిరోమణి దానిని గమనించి విజృంభించి, ఆకాశమునందలి దేవతలప్రశంసలను అందుకొనుచు, నైపుణ్యముతో రాటవంబునకు (మల్లస్థాన విశేషమునకు) చేరి, ఆ మల్లుని వీపుపైఎక్కి నిటారున నిల్చెను. పిదప ఆ కంసయోధుడు మదధారలు స్రవించుచున్న మదపుటేనుగువలె పాదములతో పాదములను, చేతులతో చేతులను ప్లైనవైచి,

ఆ ప్రభుడు ఒడుపునకు తట్టుకొని నిలిచి, నేర్పుతో రంగస్థలమునందంతటను తిరుగసాగెను. అంతట ఏ మాత్రమూ చలింపక శ్రీకృష్ణుడు బలముగా అతనిని నెట్టుచు సమతలంబున పడద్రోసి, బిగువైన అతని పొట్టపైదెబ్బతీసెను. ఇంకను ఆ స్వామి తనకాలితో అతని కాలిని పెనవైచి, 'డొక్కరము'(1) అను మల్లబంధమును ప్రదర్శించెను.

పిమ్మట మల్లయుద్ధమున ఒడుపుగల చాణూరుడు సదస్యులు మెచ్చుకొనుచుండగా వెంటనే త్రిప్పుకొని, కాలు అడ్డముగా పెట్టి తనను తాను రక్షించుకొనెను. అంతట శ్రీకృష్ణుడు ఆ మల్లునినడుమునకు గల,దట్టీని గట్టిగా పట్టుకొని పైకెత్తి 'రాగె' అను మల్ల క్రీడాకౌశలమును చూపి పరిహాస సూచకముగా నవ్వెను. పిదప మల్లుడు తన కాలును స్వామికాలుతో కీలించి, వేధించుచు కృష్ణుని పొకడను ఎదుర్కొనెను. అంతలో శ్రీకృష్ణుడు అతని అడ్డును తొలగించుకొని, తిరిగి పలకవాటు ఇనుపగుదియను తీసికొని వానిని అదలించెను. అప్పుడు చాణూరుడు పైకెగిరి, కృష్ణుని చేతిని పట్టుకొని, ఆ స్వామియొక్క అందమైన ముఖమున కాలిడి, పైకి లేచెను. వెంటనే లీలాకృష్ణుడు తన కాలితో చాణూరునికాలిని అడ్డగించి, వానివిజృంభణమును అణచివైచి, తిరుగులేని పరాక్రమముతో విదలించి లేచెను. పిదప ఆ ప్రభువు ఆ మల్లుని కాళ్లను ఒడిసిపట్టుకొని, ఇంద్రునివజ్రాయుధమువలె దృఢమైన తన పిడికిలితో వానివక్షస్థలముపై పొడిచెను. ఆమల్లుడును తేజస్సును వీడక విజృంభించి, సముద్రముయొక్క నడుమ తిరుగు మందరపర్వతమువలె నేలపై గిరగిర తిరిగి ఆయనను తన్నుటకు ప్రయత్నించెను. అంతట శ్రీకృష్ణుడు కుప్పించి, ఆకాశమునకు ఎగిరి, వానిమీదికి ఉటికెను. అనంతరము ఆ చాణూరుడు కృష్ణునిపాదముల ధాటికి తన కీళ్లు పట్టుదప్పగా ఎగిరి పైకిలేచి, విజృంభించి, ధీమాతో నిలబడెను.

క. బలభద్రుఁడు ముష్టికుఁడును, బలములు మెఱయంగఁ జేసి బాహాబాహిం
బ్రళయాగ్నుల క్రియఁ బోరిరి, వెలయఁగ బహువిధములైన విన్నాణములన్. 1346

అదే సమయమునందు బలరాముడును, ముష్టికుడు అను మల్లుడును తమ శక్తియుక్తులను ప్రదర్శించుచు ప్రళయకాలపు అగ్నులవలె,మిగుల భయంకరముగా పలువిధములైన విన్యాసములతో నేర్పులతో 'బాహాబాహి' పోరాడిరి.

వ. ఇవ్విధంబున. 1347

క. వల్లవులు పెనఁగిరున్నత, గల్లులతో భిన్న దిగిభ కరవల్లులతో
మల్లులతో రిపుమానస, భల్లులతో భీతగోపవల్లులతోడన్. 1348

ఈవిధముగా పోరాడుచున్న చాణూర ముష్టికులచెక్కిళ్లు ఎంతయు ఎత్తుగా నుండెను. సహజముగా దిగ్గజముల తొండములవంటి వారి చేతులు పోరునందు దెబ్బతినుటచే తీగెలవలె ఒప్పుచుండెను. వారు శత్రువులమనస్సుల పాలిటి బల్లెములు. వారి విజృంభణములకు అచటి గోపాలురు మిక్కిలి భీతిల్లుచుండిరి. అట్టి మల్లురతో బలరామకృష్ణులు తీవ్రముగా పెనగిరి. (పోరాడిరి).

వ. ఆ సమయంబున బౌరకాంతలు మూఁకలు గట్టి, వెచ్చ నూర్చుచు, ముచ్చటలకుం జొచ్చి, తమలో నిట్లనిరి. 1349

ఆ సమయమునందు మధురానగరవనితలు అందఱును గుంపులుగూడి, వేడి నిట్టూర్పులు విడుచుచు తమలో తాము ఇట్లు ముచ్చటించుకొనిరి.

ఉ. మంచి కుమారులం గుసుమ మంజుశరీరులఁ దెచ్చి చెల్లరే!
యంచిత వజ్రసారులు మహాద్రి కఠోరులునైన మల్లురం

1. డొక్కరము = మూపుమీద మోకాళ్లను మోపి చేతులతో అణచిపట్టుట.

గ్రించుల( బెట్టి రాజు పెన(గించుచు( జూచుచునున్నవా(డు మే
లించుక లేదు మానుమన(డిట్టి దురాత్ముని మున్ను వింటిమే! 1350

ఈ గోపబాలురు ముద్దులు మూట గట్టుచున్నారు. వీరి శరీరము లేతలేత పూవులవలె ఎంతయు సుతిమెత్తనివి, మనోహరమైనవి. మల్లయోధులుమాత్రము వజ్రాయుధమువలె మిగుల బలవంతులు, వారిశరీరములు మహాపర్వతములవలె మిక్కిలి కఠినములైనవి. కంసరాజు బలరామకృష్ణులను రప్పించి, వారిని దుష్టులైన మల్లురతో పోరునకు దింపి వినోదించుచున్నాడు. ఇతనిలో మంచిలక్షణములు ఏమాత్రము కనబడుటలేదు. ఇట్లు ఘోరముగా పోరు జరుగుచున్నను 'ఆపుము' అని అననే అనడు. ఇంతకుముందు కంసునివంటి దుర్మార్గుని కని విని ఎఱుగము.

క. చూచెదరు గాని సభికులు, నీ చిన్న కుమారకులకు నీ మల్లురకున్
ఓ చెల్లి! యీడుగాదని, సూచింపరు పతికిఁ దమకు శోకము కాదే. 1351

అయ్యయ్యయ్యో!! ఈ సభలో ఉన్నవారు అందఱును ఈ ఘోరదృశ్యములను కన్నులప్పగించి చూచుచున్నారు. అంతేగాని 'మల్లురు ఈ చిన్ని బాలురతో పోరాడుట ఎంతమాత్రమూ తగదు' అని ఎవ్వరును పెదవి విప్పుటలేదు. ఇట్లు జరుగుట తమకును, తమ రాజునకును అనర్థదాయకమే అగును.

సీ. వేణునాళములమై వెలసిన మాధవుండధ రామృతములిచ్చి యాదరించు(
బింఛదామములమై పెరి(గిన వెన్నుండు మస్తకంబున( దాల్చి మైత్రి నెఱపు(
బీతాంబరములమై బెరసిన గోవిందు(డంసభాగమున( బాయక ధరించు
వైజయంతికలమై వాలిన( గమలాక్షు(డతికుతూహలమున నఱుత( దాల్చు(
తే. దనరు బృందావనంబున( దరులమైన గృష్ణు(డానందమున( జేరి క్రీడ సల్పు
నెట్టి నోముల నయిన మున్నిట్టి విధములేల కామైతిమోయమ్మ! యింక నెట్లు! 1352

అమ్మలారా! మనము వేణునాళములమై (పిల్లనగ్రోవులమై) జన్మించియున్నచో శ్రీకృష్ణుడు మనకు తన అధరామృతమును ఇచ్చి ఆదరించెడివాడు. నెమలిపింఛములమై (కన్నయ్యకు మేలి ఆభరణములైన నెమలి పింఛములమై) పుట్టి పెఱిగియున్నచో ఆ స్వామి మనలను ప్రేమతో తననెత్తిన పెట్టుకొనియుండెడివాడు. పట్టు పీతాంబరములమై చేరియున్నచో ఈ ప్రభువు మనలను తన బుజములపై ధరించెడివాడు. విష్ణువు ధరించెడి మాలలమై (వనమాలలమై) ఈ ప్రభువు ముందు నిల్చినచో ఈ కమలనయనుడు మిక్కిలి కుతూహలముతో మనలను తన మెడలో ధరించెడివాడు. చూడముచ్చటగొల్పు బృందావనమునందు వృక్షములమై యున్నచో, కృష్ణుడు ఆనందమున మన సమీపమునజేరి క్రీడించెడివాడు. ఈ జన్మలో అట్టి అదృష్టము పట్టుటకు తగిన నోములను మనము మన పూర్వజన్మలలో నోచుకొనలేదో ఏమో? ఇప్పుడు ఇట్లు చింతించినందువలను ఏమి లాభము?

ఉ. పాపపు బ్రహ్మ! గోపకుల పల్లెలలోన సృజింపరాదె ము
న్నీపురిలోపలన్ మనలనేల సృజించె నటైన నిచ్చలుం
జేపడుఁ గాదె యీ సుభగుఁ జెందెడి భాగ్యము సంతతంబు నీ
గోపకుమారుఁ బొంద మును గోపకుమారికలేమి నోఁచిరో. 1353

పాపాత్ముడైన బ్రహ్మదేవుడు ముందుగా మనలను ఆ వ్రేపల్లెలో గోపికలుగా సృజించియున్నచో ఎంత బాగుండెడిది? ఈ మధురానగరమునందు ఇట్లు ఏల సృష్టించెను? మనలను గోపికలుగానే పుట్టించి ఉన్నచో, అనవరతము ఈ

సుందరాంగుని పొందెడి భాగ్యము లభించి ఉండెడిది గదా! ఈ గోపకుమారుని పొందెడి అదృష్టమునకై గోపికలు మునుపు ఎట్టి నోములను నోచుకొనిరో గదా! (1)

క. గోపాలకృష్ణుతోడను, గోపాలన వేళలందుఁ గూడి తిరుగు నా
గోపాలురెంతధన్యులో, గోపాలురకైననిట్టి గురురుచి గలదే. 1354

గోవులను మేపెడి సమయమున, ఈ గోపాలకృష్ణునితో కలసిమెలసి మసలుచున్న ఆ గోపాలురు ఎంతటి ధన్యాత్ములోగదా! నిజముగా ఎంతటి మహారాజులకైనను ఇంతటి గొప్ప అదృష్టము అబ్బునా? (ఇంద్రాదిదేవతలకు సైతము ఇట్టి భాగ్యము కలుగునా?)

క. శ్రమజలకణసిక్తంబై, కమలదళేక్షణునివదనకమలము మెఱసెన్
హిమజలకణసిక్తంబై, కమనీయంబగుచునున్న కమలముభంగిన్. 1355

మల్లురతో పోరు సల్పుటచే స్వేదబిందువులతో (చెమట బిందువులతో) ఒప్పుచున్న ఈ కమలనయనుని ముఖారవిందము మంచు బిందువులతోగూడి మనోహరముగా ఉన్న కమలమువలె మనోజ్ఞముగా శోభిల్లుచున్నది.

ఆ. సభకుఁ బోవరాదు సభవారిదోషంబు నెఱిఁగి యూరకున్న నెఱుఁగకున్న
నెఱిఁగియుండియైన నిట్టట్టు పలికినఁ బ్రాజ్ఞుఁడైనఁ బొందుఁబాపచయము. 1356

విజ్ఞులు నలుగురుచేరిన చోటికి వెళ్లకుండుటయే సముచితము. ఒకవేళ వెళ్లినచో అచట జరుగుచున్న దోషములను ఎఱిగియు ఉపేక్ష వహించి మౌనముగా ఉండుట ఎంతయు దోషము. ఆ దోషములు తనకు తెలియకున్నను లేక తెలిసియున్నను, 'తప్పును ఒప్పుగను, ఒప్పును తప్పుగను పేర్కొనుట ఇంకను మహాదోషము. ఈ దోషములకు పాల్పడినవారు ఎంతటి విజ్ఞులైనను వారికి పాపములు అంటి తీరును".

వ. అని పెక్కండ్రు పెక్కు విధంబులం బలుకుచుండ దద్బాహుయుద్ధంబున. 1357

క. ధృతిసెడి లోఁబడె మల్లుం, డతులిత భవ జలధితరికి హతరిపుపురికిన్
హితకరికిన్ ధృతగిరికిం, దతహరిరవభరితశిఖరిదరికిన్ హరికిన్. 1358

ఇట్లు పౌరకాంతలు పలురీతుల అనుకొనుచుండిరి. ఆ ద్వంద్వయుద్ధము కొనసాగుచునే యుండెను. శ్రీకృష్ణుని విజృంభణ అద్భుతముగా ఉండెను. ఆ ప్రభువు శత్రు పురములను రూపుమాపినవాడు. మకరిబాధనుండి గజేంద్రుని రక్షించి, అతనిని ఉద్ధరించినవాడు. గోవర్ధనగిరిని ఎత్తి ఇంద్రుని గర్వమును అణచినవాడు, తన అద్భుతమైన సింహగర్జనలతో పర్వతప్రాంతములను మార్మ్రోగించినవాడు, అంతేగాదు అపారమైన సంసారసముద్రమునుండి భక్తులను తరింపజేసెడి మహితాత్ముడు. అట్టి శ్రీహరి (కృష్ణుని) ధాటికి తట్టుకొనలేక చాణూరుడు ధైర్యమును కోల్పోయి ఆ ప్రభువునకు లోబడెను.

1. వ్రేపల్లెలో శ్రీకృష్ణునిధ్యాసలో ధన్యతను పొందిన గోపికల అదృష్టమును గూర్చి మధురానగర స్త్రీల ప్రస్తావనలు సంస్కృత మహాభాగవతములో ఇట్లున్నవి.

శ్లో॥ యా దోహనేఽవహననే మథనోపలేప ప్రేంఖేంఖనార్భరుదితోక్షణ మార్జనాదౌ ।
గాయంతి చైనమనురక్తధియోఽశ్రుకంఠ్యో ధన్యావ్రజస్త్రియ ఉరుక్రమ చిత్తయానాః ॥

స్కంధము – 10 (పూ.భా.) అధ్యాయము. 44, శ్లో. 15

వ్రేపల్లెయందలి గోపికలు పాలు పితుకుచును, ధాన్యాదులను దంచునప్పుడును, పెఱుగు చిలుకునప్పుడును, ఇండ్లను అలుకుచును, చిన్నారులను నిద్రపుచ్చుటకై ఉయ్యాలలను ఊపుచును, ఏడ్చుచున్న పిల్లలను జోకొట్టునప్పుడును (సముదాయించుచును) ఇండ్లముందు ఊడ్చుచున్నప్పుడును, కల్లాపి చల్లుచున్నప్పుడును శ్రీకృష్ణ ప్రభువునందే తమ చిత్తములను లగ్నమొనర్చి, ఆర్ద్రహృదయములతో ఆనందపరవశలై ఆ స్వామిని కీర్తించుచుందురు. వారు ఎంతయో ధన్యురాండ్రు.

క. హరికినిలోఁబడి బెగడక, హరియురము మహోగ్ర ముష్టినహితుఁడు పొడువన్
హరి కుసుమమాలికాహత కరిభంగిఁ బరాక్రమించెఁ గలహోద్ధతుఁడై 1359

క. శౌరి నెటేఁ జొచ్చి కరములు, క్రూరగతిన్ బట్టి త్రిప్పి కుంభిని వైచెన్
శూరుం గలహగభీరున్, వీరుం జాణూరు ఘోరు వితతాకారున్. 1360

క. శోణితము నోర నొలుకఁగఁ, జాణూరుండట్లుష్ణ సంభ్రామణ
సంక్షీణుండై క్షోణిం బడి, ప్రాణంబులు విడిచెఁ గంసుప్రాణము కలఁగన్. 1361

ఐనను భీతిల్లక ఆ మల్లుడు తన కఱకైన పిడికిలితో శ్రీకృష్ణుని వక్షస్థలముపై బలముగా కొట్టెను. శ్రీకృష్ణునకు ఆ ముష్టిఘాతము ఏనుగునకు పూలమాల తగిలినట్లు అనిపించెను. వెంటనే ఆస్వామి రణవిజృంభణతో ఆమల్లునిపై పరాక్రమించెను. పిదప శౌరి (శ్రీకృష్ణుడు) వేగముగా ముందునకు దూసికొనిపోయి, ఒడుపుతో ఆ మల్లునిచేతులను పట్టుకొని, గిరగిర త్రిప్పి, బలముగా నేలకేసి కొట్టెను. సహజముగా యుద్ధమున ముందునకు ఉరుకుచుండెడి చాణూరుడు శూరుడు, వీరుడు, విస్తృతాకారముతో భయంకరుడే అయినప్పటికిని ఆ ప్రభువు దెబ్బకు నిలుపజాలక నోటరక్తము గ్రక్కుచు నేలపైబడి ప్రాణములను విడిచెను. చాణూరుడు నేలగూలుట చూచినంతనే కంసునిప్రాణములు విలవిలలాడెను.

క. బలభద్రుండును లోకులు, బలభద్రుండనఁగఁ బెనఁగి పటుబాహుగతిన్
బలభేది మెచ్చఁద్రిప్పెను, బలవన్ముష్టికునిఁ గంసుబలములు బెగడన్. 1362

ఆ. త్రిప్పి నేలవైవ దిగ్గన రక్తంబు వదనగహ్వరమున వఱదవాఱ
ముష్టికుండు ఘోరముష్టి సత్త్వము సెడి కూలె గాలిఁ దరువు గూలినట్లు. 1363

పిమ్మట బలరాముడు మిగుల బలవంతుడైన ముష్టికుని పట్టుకొని తన బాహుపరాక్రమములకొలది అతనిని గిరగిర త్రిప్పసాగెను. ఆ దృశ్యమును జూచి ఇంద్రుడు ఎంతయు మెచ్చుకొనెను. అంతేగాదు జనులు అందఱును 'బలరాముడు నిజముగా పేరునకు తగిన పరాక్రమశాలి' అని వేనోళ్ల ప్రశంసింపసాగిరి. కంసునిసేనలు భీతితో గడగడలాడుచుండెను. అట్లు బలభద్రుడు గిరగిర త్రిప్పి అతని నేలకేసి కొట్టెను. అంతట ముష్టికుడు తిరుగులేని తన బాహుబలమును కోల్పోయెను. విశాలమైన అతనినోటినుండి చిమ్ముకొని వచ్చుచున్న రక్తము వరదలై పాఱుచుండగా, ఆ మల్లుడు గాలిదెబ్బకు వృక్షమువలె నేలపాలయ్యెను.

క. పాటవమునఁ బలుపిడికిట, సూటిం బడఁబొడిచె బలుఁడు శోషిత ఘన బా
హాటోప నృపకిరీటుం, గూటున్ వాచాటు నధిక ఘోరలలాటున్, 1364

చాణూరముష్టికులు హతులగుటవలన కంసుడు శారీరకముగా, మానసికముగా క్రుంగిపోయెను. అతనికి కుడిభుజముగానున్న 'కూటుడు' అను మల్లుడు బలరాముని ముందునకు వచ్చి ప్రగల్భములాడసాగెను. అంతట ఆ బలభద్రుడు రాటుదేలిన తన పిడికిలితో భయంకరమైన నొసలుగల ఆ కూటుని సూటిగా బలముకొలది పొడిచి చంపెను.

వ. అంతనద్దనుజాంతకుండు, చరణప్రహరణంబుల భిన్నమస్తకులం జేసి, వానిచెలులనంతకాంతికంబున కనిచిన. 1365

అనంతరము రాక్షసాంతకుడైన శ్రీకృష్ణుడు కూటునిమిత్రులైన తోశలుని, శలుని తన కాళ్లతో తన్నుటతో వారి తలలు పగిలిపోయెను. ఆ విధముగా ఆ ప్రభువు వారిని మృత్యువు పాలుచేసెను.

క. వల్లవబాలకులని మన, మల్లవరులు పెనఁగి నేఁడు మడిసిరి వీరల్
బల్లిదులు తలఁడు, తలఁ డని చెల్లాచెదరైరి పాఱి చిక్కిన మల్లుల్. 1366

"మనముందు ఈ గోపబాలురు ఎంత? అని చులకనచేసి మల్లురలో అగ్రేసరులైన మన చాణూరాదులు వీరితో పెనగి మృత్యులైరి. ఈ బలరామకృష్ణులు మిగుల బలశాలురు. ఇక్కడ ఒక్క క్షణకాలము ఉన్నను మనకును ప్రమాదము తప్పదు. తొలగుడు, తొలగుడు" అని అనుకొనుచు తక్కిన మల్లురు చెల్లాచెదరై పాఱిపోయిరి.

ఉ. మల్లురఁ జంపి గోపకసమాజములో మృగరాజురేఖ శో
భిల్లఁగఁ బాదపద్మములఁ బెల్లుగ నందెలు మ్రోయ వచ్చు నా
వల్లవరాజనందనుల వారక చూచి మహీసురాదుల
ల్లల్లన సంస్తుతించిరి ప్రియంబుగఁ గంసుఁడు దక్కనందఱున్. 1367

వ. అని పలుకు సమయంబున. 1368

మల్లురను చంపిన పిమ్మట నందరాజకుమారులైన బలరామకృష్ణులు గోపాలురలో సింహమువలె శోభిల్లుచు పద్మములవంటి తమపాదములఅందెలు ఘల్లుఘల్లున మ్రోగుచుండగా సభామధ్యమునకు విచ్చేసిరి. అప్పుడు కంసుడు దప్ప బ్రాహ్మణులు మున్నగువారు అందఱును వారిని ఱెప్పలార్పక చూచుచు సంతోషముతో తిన్నగా (నెమ్మదినెమ్మదిగా) ప్రశంసించిరి. ఈవిధముగా సభలో కలకలము చెలరేగెను.

## శ్రీకృష్ణుండు కంసుని వధించుట

వ. అంత సభాజనంబుల కలకలంబు నివారించి, మంత్రులం జూచి, కంసుండిట్లనియె. 1369

ఉ. వల్లవబాలురన్ నగరివాకిటికిన్ వెడలంగ ద్రొబ్బుఁడీ
గొల్లల ముట్టికోల్ గొనుఁడు క్రూరుని నందునిఁ గట్టుఁడుర్వికిం
దెల్లముగాఁగ నేఁడు వసుదేవునిఁ జంపుఁడు తండ్రి కాఁడు వీఁ
డెల్ల విధంబులం బరుల కిష్టుఁడు కావకుఁడుగ్రసేనునిన్. 1370

బలరామకృష్ణులు సభలో ప్రవేశించుచుండగా సదస్యులనుండి కలకలము బయలుదేఱెను. అప్పుడు కంసుడు ఆ కోలాహలమును నివారించి మంత్రులతో ఇట్లు పలికెను - "సచివులారా! సభలో ప్రవేశించిన ఈ గోపబాలురను (బలరామకృష్ణులను) ఈ రాజ (సభా) భవనద్వారమునుండి బయటికి వెళ్లగొట్టుడు. యాదవులను అందఱిని నిర్బంధింపుడు. క్రూరుడైన నందుని కట్టివేయుడు. ఎల్లరకును తెలిసివచ్చునట్లుగా నేడే వసుదేవుని చంపివేయుడు. ఈ ఉగ్రసేనుడు నాకు తండ్రి కానేకాడు. ఏవిధముగ చూచినను ఇతడు పరులకే (పగవారికే) ఇష్టుడు కావున ఇతనిని రక్షింపవలదు".

శా. జంఘాలత్వముతో నగోపరిచర త్పారంగహింసేచ్ఛ న
ల్లంఘింపం గమకించు సింహముక్రియన్ లక్షించి పౌరప్రజా
సంఘాతంబులు తల్లడిల్ల హరి కంసప్రాణహింసార్థి యై
లంఘించెన్ దమగంబు మీఁదికి రణోల్లాసంబు భాసిల్లఁగన్ 1371

కంసుడు ఇట్లు నుడువుచుండగా పర్వతముమీద సంచరించుచున్న ఏనుగుపై దెబ్బతీయుటకు అతివేగముగా లంఘించుటకై పూనుకొనిన సింహమువలె, శ్రీహరి (కృష్ణుడు) కంసునిప్రాణములను తీయదలచినవాడై, రణోత్సాహమును

వెల్లివిరియ జేయుచు అతని సింహాసనముమీదికి దూకెను. అప్పుడు మధురాపుర ప్రజలెల్లరును ఆ దృశ్యమును గాంచి తల్లడిల్లసాగిరి.

క. తమగమునకెగురు యదుసత్తమగణ్యునిఁ జూచి ఖడ్గధరుఁడై యెదిరెం
దమగమివారలు వీరో, త్తమగణ విభుఁడనఁగఁ గంసధరణీపతియున్. 1372

గోపాలురలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు తన సింహాసనముమీదికి లంఘించి వచ్చుచుండుట కంసరాజు గమనించెను. వెంటనే అతడు ఖడ్గమును చేబూని, ఆ ప్రభువును ఎదిరించెను. అప్పుడు అతని (కంసుని) పక్షము వారందఱును 'మన మహారాజు వీరాగ్రేసరుడే' అని మెచ్చుకొనిరి.

శా. పక్షీంద్రుండురగంబుఁ బట్టువిధమొప్పం గేశబంధంబు లో
కక్షోభంబుగఁ బట్టి మౌళిమణులాకల్పాంతవేళా పత
న్నక్షత్రంబులభంగి రాల రణసంరంభంబు డిందించి రం
గక్షోణిం బడఁద్రొబ్బెఁ గృష్ణుఁడు వెసం గంసున్ నృపోత్తంసునిన్. 1373

అంతట గరుత్మంతుడు సర్పమును పట్టుకొను విధముగా, శ్రీకృష్ణుడు కంసుని జుట్టు పట్టుకొని, అతని రణ విజృంభణను నీరుగార్చుచు, మల్లరంగమునందు పడద్రోసెను. అప్పుడు ఆ కంసమహారాజు యొక్క కిరీటమునందలి మణులు, ప్రళయసమయమున నక్షత్రములు పడిపోవుచున్నట్లుగా, జలజలరాలి నేలపై పడెను. అప్పుడు సభలోని వారు అందఱును క్షోభపడిరి.

శా. మంచాగ్రంబుననుండి రంగధరణీమధ్యంబునం గూలి యే
సంచారంబునులేక చిక్కి, జనులాశ్చర్యంబునుం బొందఁగాఁ
బంచత్వంబును బొందియున్న విమతుం బద్మాక్షుఁ డీడ్చెన్ వడిన్
బంచాస్యంబు గజంబు నీడ్చు పగిదిన్ బాహాబలోల్లాసియై. 1374

కంసుడు సింహాసనముమీదినుండి మల్లభూమినడుమ పడినంతనే చేష్టలుడిగి అసువులను కోల్పోయెను.(1) పిమ్మట శ్రీకృష్ణుడు బాహుబలముతో తన ఉల్లాసమును ప్రకటించుచు, సింహము గజమునువలె వేగముగా ఆ దుష్టుని ఈడ్చెను.

క. రోష ప్రమోద నిద్రా, భాషాశన పానగతులఁ బాయక చక్రిన్
దోషరతిఁ జూచియైన విశేష రుచిం గంసుఁడతనిఁ జెందె నరేంద్రా! 1375

పరీక్షిన్మహారాజా! కంసుడు రోషముననను, సంతోషముననను, నిద్రలోను, సంభాషించునపుడును భుజించు సమయముననను, పానీయాదులను త్రాగుచుండెడివేళలలోను అనుక్షణము దోషబుద్ధితోనైనను (శత్రుభావముతోనైనను) శ్రీకృష్ణునే స్మరించుచున్నందున అతడు జ్యోతిస్స్వరూపముతో ఆ కృష్ణభగవానునియందే లీనమయ్యెను.

వ. ఆ సమయంబున. 1376

క. గోపాలుఁడొక్కఁ డద్దిర! భూపాలకుఁ జంపె వీనిఁ బొదువుండేత
ద్రూపాలస్యములేలని, తాపాలఘురోషులగుచు దర్పోద్ధతులై. 1377

1. కంసునకు దశదిశలయందును, రాత్రింబవళ్లు శ్రీకృష్ణునిరూపమే గోచరించుచుండుటవలన అతడు మిక్కిలి భయభ్రాంతులకు లోనై ఇంతకుముందే సగము చచ్చియుండెను. ఈ దెబ్బతో అతడు పూర్తిగా మృత్యువుపాలయ్యెను.

శా. న్యగ్రోధుండును గహ్వుఁడున్ మొదలుగా నానాయుధానీకసా
మగ్రిం గంసునిసోదరుల్ గవియుడున్ మాద్యద్గజేంద్రాభుఁడై
యుగ్రుండై పరిఘాయుధోల్లసితుఁడై యొండొండ చెండాడి కా
లాగ్రక్షోణికిఁ బుచ్చె రాముఁడు గరీయస్స్త్రైముఁడై వారలన్. 1378

ఆ సమయమున కంసునిసోదరులైన న్యగ్రోధుడు, గహ్వుడు మొదలగువారు "ఈ గోపాలుడు ఒక్కడే మన కంసమహారాజును చంపివేసెను. ఔరా! ఎంత ఆశ్చర్యము! ఈ విధముగా ఇంకను ఆలస్యము చేయరాదు. వీనిపై విజృంభింపుడు" అని పల్కుచు, మిగుల పరితాపముతో తీవ్రముగా రోషమును ప్రకటించుచు, గర్వితమతులై, వివిధములగు ఆయుధములతో ఆ కృష్ణునిమీదికి ఎగసిరి. మదగజేంద్రమువలె ఒప్పుచున్నవాడు మిక్కిలి తేజోమూర్తియు ఐన బలరాముడు ఉగ్రుడై వెంటనే పరిఘాయుధమును (ఇనుపకట్ల గుదియను) చేబూని, ఆ కంససోదరులను వరుసగా చీల్చిచెండాడి మృత్యుముఖమునకు చేర్చెను.

వ. అయ్యవసరంబున. 1379

క. చేతులఁ దాళములొత్తుచుఁ, జేతోమోదంబుతోడ సిగముడి వీడం
బాతరలాడుచు మింటను, గీతము నారదుఁడు పాడెఁ గృష్ణా యనుచున్. 1380

ఆ సమయమున ఆకసమునుండి ఆ దృశ్యమును చూచుచున్న నారదుడు మిగుల సంతోషముతో చేతులతో తాళములు వేయుచు, 'కృష్ణా! కృష్ణా!' అని గీతములను ఆలపింపసాగెను. అతడు తన సిగముడి వీడిపోవుచున్నను పట్టించుకొనక ఆనందముతో నృత్యమొనర్చెను.

క. వారిజభవరుద్రాదులు, భూరి కుసుమవృష్టిఁ గురిసి పొగడిరి కృష్ణున్
భేరులు మ్రోసెను నిర్జర, నారులు దివినాడిరధిక నటనముల నృపా! 1381

మహారాజా! అప్పుడు ఆకాశమునుండి బ్రహ్మ, ఈశ్వరుడు మొదలగు దేవతలు పుష్పవృష్టిని కురిపించుచు శ్రీకృష్ణుని కొనియాడిరి. దేవదుందుభులు మ్రోగెను. దివ్యభామినులు వివిధరీతులుగా ఆడిరి, పాటలు పాడిరి.

వ. అంతటఁ గంసాదులకాంతలు, భర్తృమరణదుఃఖాక్రాంతలై, కరంబుల శిరంబులు మోఁదుకొనుచు, వశ్రుసలిలధారా పరిషిక్త వదనలై, సదనంబులు వెలువడి వచ్చి వీరశయ్యా నిద్రితులైన విభులం గౌఁగిలించుకొని, సుస్వరంబుల విలపించి రందుఁ గంసభార్యలిట్లనిరి. 1382

పిమ్మట కంసుడు మొదలగువారిభార్యలు తమపతులు మరణించుటవలన ఎంతయు దురపిల్లిరి. వారు తమ చేతులతో తలలు బాదుకొనుచు, కన్నీరుమున్నీరుగా లబలబలాడుచు ఇండ్లువదలి అచటికి వచ్చిరి. పిదప వారు వీరశయ్యలపై నిద్రించుచున్నట్లుగా పడియున్న తమ భర్తలను కౌగిలించుకొని, గద్గదస్వరములతో విలపించిరి. పిమ్మట కంసునిభార్యలు ఇట్లనిరి.

సీ. గోపాలసింహంబు కోపించి వెల్వడి నిను గజేంద్రముభంగి నేఁడు గూల్చె
యాదవేంద్రానిలమాభీలజవమున నిను మహీజముమాడ్కి నేల వ్రాల్చె
వాసుదేవాంభోధివారి యుద్వేలమై నిను దీవి కైవడి నేఁడు ముంచె
దేవకీసుతవజ్రి దేవతలలరంగ నినుఁ గొండక్రియ నేఁడు విహతుఁ జేసె

తే. హా మనోనాథ! హా వీర! హా మహాత్మ! హా మహారాజ! నీ విట్లు హతుఁడవయిన
మనుచునున్నారమక్కట! మమ్ముఁ బోలు కఠినహృదయులు జగతిపైఁ గలరె యెందు 1383

"అయ్యో! మనోహరా! శ్రీకృష్ణుడనెడి సింహము కోపించి మదపుటేనుగువలె ఒప్పుచున్న నిన్ను కూల్చివేసెను. అయ్యయ్యో! మహావీరా! యాదవశ్రేష్ఠుడైన శౌరి అనెడి మహావాయువు భయంకరమైన వేగముతో నిన్ను ఒక మహావృక్షమునువలె నేలపాలుగావించెను. వాసుదేవుడు అనెడి సముద్రజలము ఎల్లలుదాటి పరవళ్ళుద్రొక్కుచు, నిన్ను ఒక దీవినివలె ముంచివేసెను. దేవకీసుతుడనెడి ఇంద్రుడు దేవతలు సంతోషముతో పొంగిపోవునట్లుగా నిన్ను ఒక కొండనువలె కూల్చివేసెను. హా! మహాత్మా! మహారాజా! నీవు అసువులను కోల్పోయినను ఇంకను మేము జీవించియే యుంటిమి. అక్కటా! మావలె కఠినహృదయములు గలవారు ఎచ్చటను ఉండరుగదా!

క. భూతములకెగ్గు సేసిన, భూతంబులు నీకునెగ్గు పుట్టించె వృథా
భూతమగు మనికి యెల్లను, భూతద్రోహికిని శుభము పొందదధీశా! 1384

కంసరాజా! నీవు సకలప్రాణులకును 'కీడు గావించితివి. అందువలన అవి అన్నియును నీకు హానిని చేకూర్చెను. ప్రాణులయెడ ద్రోహబుద్ధిగలవానికి శుభములు కలుగనే కలుగవు. అంతేగాదు వానిబ్రతుకే వ్యర్థము.

క. గోపాలకృష్ణుతోడను, భూపాలక! మున్ను తొడరి పొలసినవారిన్
నీపాలబుధులు సెప్పరె, కోపాలస్యములు విడిచి కొలువం దగదే. 1385

కంసభూపాలా! ఇంతకుముందు గోపాలకృష్ణుని ఎదిరించి ఎందఱో మట్టిపాలైరి. వారినిగూర్చి నీయొద్దగల పండితులు నీకు చెప్పలేదా! కోపమును, అజ్ఞానమును వీడి, ఆ కృష్ణప్రభువును సేవించినచో ఎంత బాగుండెడిది?"

వ. అని విలపించుచున్న రాజవల్లభలనూరార్చి, జగద్వల్లభుండైన హరి కంసాదులకుం బరలోక సంస్కారంబులు సేయం బనిచి, దేవకీవసుదేవులబంధనంబు విడిపించి, బలభద్రసహితుండయి, వారలకుం బ్రణామంబులు సేసిన, 1386

అంతట జగన్నాథుడైన శ్రీహరి (కృష్ణుడు) ఆవిధముగా విలపించుచున్న కంసరాజపత్నులను ఓదార్చెను. పిమ్మట కంసుడు మొదలగువారికి పరలోకసంస్కారములను జరుపుటకై ఆజ్ఞాపించెను. దేవకీవసుదేవులకు బంధవిముక్తి కల్గించెను. బలరామునితోగూడి ఆ స్వామి వారిపాదములకు ప్రణమిల్లెను.

## శ్రీకృష్ణుండు దేవకీవసుదేవులచెఱ మాన్పి యుగ్రసేనునికిఁబట్టంబుగట్టుట

మ. కని లోకేశులు గాని వీరు కొడుకుల్ గారంచుఁ జిత్తంబులన్
జనయిత్రీజనకుల్ విచారపరులై శంకింపఁ గృష్ణుండు తా
జనసమ్మోహినియైన మాయఁ దదభిజ్ఞానంబు వారించి యి
ట్లనియెన్ సాగ్రజుఁడై మహావినతుఁడై యానందసంధాయియై, 1387

అంతట దేవకీవసుదేవులు తమకు ప్రణమిల్లిన బలరామకృష్ణులను చూచుచు 'వీరు లోకకల్యాణముకొఱకు అవతరించిన పరమపురుషులేగాని మన పుత్రులుగారు' (సామాన్య మానవులుగారు) అని సంశయించుచుండిరి. అంతట శ్రీకృష్ణుడు లోకములను సమ్మోహపఱచునట్టి తన మాయచే వారిభ్రమను తొలగించెను. పిదప ఆ ప్రభువు బలరామసహితుడై, సవినయముగా వారికి ఆనందమును గూర్చుచు ఇట్లు నుడివెను.

సీ. మమ్ముఁ గంటిరిఁ గాని మా బాల్య పౌగండ కైశోరవయసులఁ గదిసి మీర
లెత్తుచు దించుచు నెలమి మన్నించుచునుండు సౌభాగ్యంబునొందరైతి
రాకాంక్ష గలిగియునది దైవయోగంబు తల్లిదండ్రులయొద్దఁ దనయులుండి
యే యవసరమున నెబ్బంగి లాలితులగుచు వర్ధిల్లుదురట్టి మహిమ
తే. మాకు నిన్నాళ్ళు లేదయ్యె మఱియు వినుఁడు నిఖిల పురుషార్థ హేతువై నెగడుచున్న
మేనికె వ్వారలాఢ్యులు మీర కారె యా ఋణము దీర్ప నూతేండ్ల కైనఁ జనదు. 1388

క. చెల్లుబడి గలిగి యెవ్వఁడు, తల్లికిఁ దండ్రికిని దేహధనములవృత్తుల్
చెల్లింపఁ డట్టి కష్టుఁడు, ప్రల్లదుఁడామీఁద నాత్మపలలాశి యగున్. 1389

"తల్లిదండ్రులారా! మేము మీ పుత్రులమే! ఐనను మా బాల్య, పౌగండ, కైశోర వయస్సులలో[1] మమ్ము మీరు చేరదీసి, ఎత్తుకొనుచు, దించుచు, లాలించుచు, పాలించుచు ఆనందించెడి భాగ్యమునకు నోచుకొనరైతిరి. మా మాతాపితలైన మీకు ఆ కోరిక ప్రబలముగా ఉన్నను దైవయోగమువలన అది నెఱవేఱలేదు. అట్లే తల్లిదండ్రుల ఒడిలో చేరి, వారి ప్రేమాదరములలో ఆడుచు పాడుచు పెఱిగెడి అదృష్టము మాకును ఇంతవఱకు అబ్బలేదు. ధర్మార్థకామమోక్షములనెడి పురుషార్థములకు సాధనమైన ఈ శరీరమును ప్రసాదించినది మీరేగదా! ఈ మాతాపితృఋణమును తీర్చుకొనుటకు నూతేండ్లైనను చాలవు. శక్తియుండియు తన దేహముద్వారా, ధనాదులచేతను, వినయ విధేయతలతోడను, తల్లిదండ్రులను సేవింపనివాడు, భక్తిశ్రద్ధలతో ఆదరింపనివాడు, ఆదుకొననివాడు ఎంతయు నికృష్టుడో (నీచుడు). అట్టి దుష్టుడు మృతుడైన పిమ్మట (మఱుజన్మలో) తన మాంసమును తానే భుజించువాడగును.

క. జననీజనకుల వృద్ధులఁ దనయుల గురువిప్ర సాధు దారాదుల నే
జనుఁడు ఘనుఁడయ్యుఁ బ్రోవక, వనరును జీవన్మృతుండు వాఁడు ధరిత్రిన్. 1390

సమర్థుడయ్యును జననీజనకులను, వయోవృద్ధులను, కొడుకులను, కుమార్తెలను, గురువులను, బ్రాహ్మణులను, సాధువులను, భార్య మొదలగు బంధువులను సాదరముగా ఆదుకొనక (కాపాడక) దైన్యవచనములతో తప్పించుకొనజూచునో అట్టివాడు ఈ లోకములో బ్రతికియుండియు చచ్చినవానితో సమానుడే.

వ. అదియునుం గాక. 1391

శా. కారాశాలల మానిమిత్తము మిముం గంసుండు కారింపఁగా
వారింపంగ సమర్థతల్ గలిగియున్ వారింపఁగా రాక ని
ష్కారుణ్యాత్ములమైన క్రూరుల మహాకౌటిల్య సంచారులన్
సారాతిక్షములార! మమ్ముఁ గొఱఁతల్ సైరించి రక్షింపరే 1392

అంతేగాదు, మాతాపితలారా! కంసుడు మా కారణముగా మిమ్ములను చెఱసాలలో బంధించి బాధించెను. అట్టి స్థితికి గుఱియైన మీయొక్క కష్టములను తొలగించుటకు సామర్థ్యముగలవారమైనను వాటిని నివారింపకుంటిమి. మేము నిజముగా దయలేనివారము, క్రూరులము, కపటముతో ప్రవర్తించినవారము. మీరు ఎంతయును సహనమూర్తులు. మా తప్పులను మన్నించి మమ్ము రక్షింపుడు".

1. 1. బాల్యము 1-5, పౌగండము 5-10, కైశోరము 10-15 సంవత్సరముల వయస్సులు.